# ప్రాచీన భారతదేశ చరిత్ర & సంస్కృతి

## (సింధూ నాగరికత నుండి క్రీ.శ. 13వ శతాబ్దం వరకు)

### బి.ఏ. - చరిత్ర :: మొదటి సంవత్సరం - సెమిస్టర్ 1


రచయితలు

**డా॥ డి. వెంకటేశ్వర రెడ్డి,** ఎం.ఏ., పి.హెచ్.డి.
అసిస్టెంట్ ప్రొఫెసర్, చరిత్ర & పురావస్తు శాఖ,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం,
నాగార్జున నగర్, గుంటూరు,
గుంటూరు జిల్లా, ఆం.ప్ర.

**డా॥ S.K. రమీ బేగం** ఎం.ఏ., పి.హెచ్.డి.
ఫ్యాకల్టీ, చరిత్ర మరియు పురావస్తు శాఖ,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం,
నాగార్జున నగర్, గుంటూరు,
గుంటూరు జిల్లా, ఆం.ప్ర.

**డా॥ కె. శ్రీనివాసులు,** ఎం.ఏ., పి.హెచ్.డి.
(రిటైర్డ్)
C.S.R. శర్మ కాలేజి, ఒంగోలు,
ప్రకాశం జిల్లా, ఆం.ప్ర.

**డా॥ బాలినేని వాణి,** ఎం.ఏ., పి.హెచ్.డి.
ఫ్యాకల్టీ, చరిత్ర శాఖ,
శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజి, పొదిలి,
ప్రకాశం జిల్లా, ఆ.ప్ర.

**డా॥ జె. కృష్ణప్రసాద్ బాబు,** ఎం.ఏ., పి.హెచ్.డి.
అసోసియేట్ ప్రొఫెసర్, చరిత్ర శాఖ,
D.K.W. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు,
S.P.S. నెల్లూరు జిల్లా, ఆ.ప్ర.

సంపాదకులు

**డా॥ డి. వెంకటేశ్వరరెడ్డి,** ఎం.ఏ., పి.హెచ్.డి.
అసిస్టెంట్ ప్రొఫెసర్, చరిత్ర & పురావస్తు శాఖ,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్, గుంటూరు,
గుంటూరు జిల్లా, ఆం.ప్ర.

సమన్వయ కర్త

**ప్రొఫెసర్ యస్. మురళీ మోహన్,** ఎం.ఏ., పి.హెచ్.డి.
Head, Department of History & Archaeology,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం,
నాగార్జున నగర్, గుంటూరు,
గుంటూరు జిల్లా, ఆం.ప్ర.

Director
**Dr. NAGARAJU BATTU**
M.B.A., M.H.R.M., L.L.M., M.Sc. (Phy), M.A. (Soc.), M.Ed., M.Phil., Ph.D.
Dept. of HRM



## దూర విద్యా కేంద్రము

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.
Ph: 0863-2293299, 2293356 (08645), 211023, 211024 (Study Material)
Cell : 98482 85518
E-mail : Info@anucde.ac.in
Website: www.anucde.ac.in (or) www.anucde.info

**M.A. History : Ancient Indian History & Culture (From Indus Valley Civilization to 13th Cen. A.D.)**

Edition: 2021

No. of Copies: 246

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Printed at:

**Romith Technologies**

Guntur.

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయణిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని, దేశంలోనే ఒక ప్రముఖ విశ్వ విద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు, ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి. మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూరవిద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి, మున్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.

ఉప కులపతి (FAC)

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం.

ACHARYA NAGARJUNA UNIVERSITY

DEPARTMENT OF HISTORY AND ARCHAEOLOGY

B.A. : I$^{st}$ Year - I$^{ST}$ SEMESTER SYLLABUS

PAPER - I A/H 1.1 (COMMON FOR HISTORY AND ARCHAEOLOGY)

ANCIENT INDIAN HISTORY & CULTURE (From Indus Valley Civilization to 13$^{th}$ Cen. A.D.)

Unit I : Ancient Indian Civilization (from Circa 3000 B.C. to 6th B.C.) Indus Valley Civilization - Salient Features, Vedic Age - Society, Polity, Economy, Culture during early and later Vedic Period.

Unit II : Ancient Indian History & Culture (6$^{th}$ Century B.C. to 2$^{nd}$ Century A.D.) Doctrines and Impact of Jainism and Buddhism: Mauryan Administration, Society, Economy & Culture - Ashoka's Dhamma; Kanishka's contribution to Indian Culture.

Unit III : History & Culture of South India (2$^{nd}$ Century B.C. to 8$^{th}$ Century A.D.): Sangam Age, Administration, Society, Economy and Culture under Satavahanas, Cultural Contribution of Pallavas.

Unit IV : India From 3rd Century A.D. to 8$^{th}$ Century A.D.: Administration, Society, Economy, Religion, Art, Literature and Science & Technology under Guptas - Samudragupta, Cultural cpntribution of Harsha, Arab Conquest of Sind and It's Impact.

Unit V : History and Culture of South India (9$^{th}$ Century A.D. to 13$^{th}$ Century A.D.): Local Self Government of Cholas, Administration, Society, Economy and Culture under Kakatiyas - Rudrama Devi.

**References:**


1. A.L. Basham, The Wonder That Was India.
2. D.N. Jha, Ancient India.
3. D. D. Kosambi, An Introduction to the study of Indian History.
4. D. P. Chattopadhyay, Science and Society in Ancient India.
5. B. N. Mukherjee, The Rise and Fall of the Kushana Empire.
6. K. A. Nilkantha Shastri, A History of South India.
7. R. C. Majumdar, K. K. Dutta & H. C. Roy Chowdhuri (ed.), Advanced History of India.
8. Kumkum Roy, The Emergence of Monarchy in North India, Eighth to fourth centuries B.C.
9. Romila Thapar (et. al.) India: Historical Beginnings and the Concept of the Aryan.
10. M. L.K. Murthy, Pre-and Protohistoric Andhra Pradesh upto 500 B.C., New Delhi, 2003.
11. K. Sathyanarayana, A study of the History and Culture of Andhras.

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| **యూనిట్ 1** | | **ప్రాచీన భారతదేశ నాగరికత (క్రీ.పూ. 3000 నుండి క్రీ.పూ. 6వ శతాబ్దం వరకు)** | **1** |
| పాఠం | 1. | సింధు నాగరికత ముఖ్య లక్షణాలు | 1.1 - 1.9 |
| పాఠం | 2. | ఋగ్వేద ఆర్యులు | 2.1 - 2.8 |
| పాఠం | 3. | మలివేద ఆర్యులు | 3.1 - 3.7 |
| **యూనిట్ 2** | | **ప్రాచీన భారతదేశ చరిత్ర & సంస్కృతి** | 1 |
| పాఠం | 1. | క్రీ.పూ. 6వ శతాబ్దం ప్రాముఖ్యం | 1.1 - 1.6 |
| పాఠం | 2. | జైన మతం - బౌద్ధ మతం | 2.1 - 2.9 |
| పాఠం | 3. | మౌర్య సామ్రాజ్యం | 3.1 - 3.7 |
| పాఠం | 4. | అశోకుడు | 4.1 - 4.8 |
| పాఠం | 5. | కడపటి మౌర్యులు | 5.1 - 5.5 |
| పాఠం | 6. | మౌర్యుల పరిపాలన | 6.1 - 6.11 |
| పాఠం | 7. | విదేశీయుల దాడులు కనిష్కుడి సేవ | 7.1 - 7.9 |
| **యూనిట్ 3** | | **దక్షిణ భారతదేశ చరిత్ర & సంస్కృతి** | 1 |
| పాఠం | 1. | సంగం యుగం | 1.1 - 1.5 |
| పాఠం | 2. | శాతవాహనుల రాజకీయ చరిత్ర | 2.1 - 2.5 |
| పాఠం | 3. | శాతవాహనుల పరిపాలన - సంస్కృతి | 3.1 - 3.8 |
| పాఠం | 4. | పల్లవులు | 4.1 - 4.5 |
| పాఠం | 5. | పల్లవుల సాంస్కృతిక సేవ | 5.1 - 5.8 |
| **యూనిట్ 4** | | **భారతదేశం** | 1 |
| పాఠం | 1. | గుప్త సామ్రాజ్యం | 1.1 - 1.9 |
| పాఠం | 2. | గుప్తుల పరిపాలన | 2.1 - 2.4 |
| పాఠం | 3. | గుప్తుల కాలం నాటి సాంఘీక - ఆర్థిక - మత పరిస్థితులు | 3.1 - 3.6 |
| పాఠం | 4. | గుప్తులు విద్య - సాహిత్యం - శాస్త్ర సాంకేతిక వికాసం | 4.1 - 4.8 |
| పాఠం | 5. | హర్షవర్ధనుడు | 5.1 - 5.4 |
| పాఠం | 6. | అరబ్బు దండయాత్రలు | 6.1 - 6.7 |
| **యూనిట్ 5** | | **భారతదేశ చరిత్ర & సంస్కృతి** | 1 |
| పాఠం | 1. | చోళులు | 1.1 - 1.4 |
| పాఠం | 2. | చోళుల పరిపాలన | 2.1 - 2.6 |
| పాఠం | 3. | చోళుల కాలం నాటి సాంఘీక - ఆర్థిక - మత - సాంస్కృతిక పరిస్థితులు | 3.1 - 3.7 |
| పాఠం | 4. | కాకతీయులు | 4.1 - 4.8 |
| పాఠం | 5. | కాకతీయ యుగ సంస్కృతి | 5.1 - 5.11 |


-----

## UNIT - I

**ప్రాచీన భారతదేశ నాగరికత**
**(క్రీ.పూ. 3000 నుండి క్రీ.పూ. 6వ శతాబ్దం వరకు)**

**పరిచయం:**

భారతదేశ చరిత్ర చారిత్రక యుగం క్రీ.పూ. 3000 సంవత్సరాలకు సింధూ నాగరికతతో ప్రారంభమైనా, చారిత్రక పూర్వ యుగమును పరిశీలిస్తే క్రీ.పూ. 4,00,000 క్రితం ప్రాచీన శిలా యుగం నుండి భారతదేశ చరిత్ర ప్రారంభమైనట్లు ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. ప్రాచీన శిలా యుగ మానవుడు వాడిన పనిముట్లు రాజస్థాన్, గుజరాత్, బీహార్, దక్షిణ భారతదేశంలో లభించాయి. బెలుచిస్తాన్, దిగువ సింధూ ప్రాంతాల్లో నవీన శిలా యుగ ప్రజల నివాస స్థలాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీరు ఎగువ బెలుచిస్తాన్, దిగువ సింధు, మక్రాన్ తీర ప్రాంతాలలో వ్యవసాయం చేసినట్లు ఆధారాలు దొరికాయి.

రాతి యుగం తరువాత ప్రారంభమైన లోహ యుగంలో మొదటిది రాగి యుగం. సింధు ప్రజలు ప్రారంభ దశలో రాగి + రాయి (Copper + Stone), తామ్ర శిలా యుగం (Chalicothic Age) జీవనాన్ని ప్రారంభించారు. క్రమేపీ రాగి + తగరం (Copper + Lead) కంచు లోహాలను తయారు చేసుకుని జీవించిన వీరు, సప్త సింధు (నేటి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్) ప్రాంతంలో జీవించారు. ఈ ప్రాంతం వ్యవసాయానికి అంతగా అనుకూలమైనది కాకపోవటం వల్ల వీరు వ్యాపారాల పై దృష్టి కేంద్రీకరించి, అభివృద్ధి చేసుకొని మెసపటోమియాతో అంతర్జాతీయ వ్యాపారం చేశారు. కాబట్టి పట్టణాలు, నగరాలు అభివృద్ధి చెంది, వీరి నాగరికత పట్టణ నాగరికతగా పేరు గాంచినది. సింధు నాగరికత పతనం పై అనేక వాదోపవాదాలు ఉన్నాయి. వీరు క్రీ.పూ. 1750లో పతనమైనట్లు తెలుస్తుంది.

సింధు ప్రజల పతనానంతరము మధ్య ఆసియా ప్రాంతం నుండి బయలుదేరిన ఇండో-ఆర్యులు భారతదేశంలో సప్త సింధు ప్రాంతంలో సంచరించారు. వీరు గుంపులు గుంపులుగా భారతదేశానికి వచ్చి, పశు పోషణ ముఖ్య వృత్తిగా చేసుకొని జీవించారు. వీరినే ఋగ్వేద ఆర్యులు (క్రీ.పూ. 1500 - 1000)గా పేర్కొంటారు. వీరి తరువాత కాలంలో (క్రీ.పూ. 1000 - 600) తూర్పు దిశగా బయలుదేరి ఆర్యావర్తము లేక గంగా-మైదాన ప్రాంతంలో వ్యవసాయాన్ని ముఖ్య వృత్తిగా చేసుకొని స్థిర నివాసాలు ఏర్పరచుకొని 16 మహా జనపద రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ఈ కాలాన్ని మలి వేద కాలం, వేద అనంతర కాలంగా పేర్కొనవచ్చు. క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి భారతదేశంలో రాజ్యాలు అవతరించి, రాజరిక, గణతంత్ర పరిపాలనములు ప్రారంభమైనాయి.

---------

## యూనిట్ - 1

# ప్రాచీన భారతదేశ నాగరికత

## (క్రీ.పూ. 3000 నుండి క్రీ.పూ. 6వ శతాబ్దం వరకు)

## పాఠం - 1

# సింధు నాగరికత - ముఖ్య లక్షణాలు

### 1.0 లక్ష్యం:

* సింధు నాగరికతకు సంబంధించిన పుట్టుక, వ్యాప్తిని తెలిసికొనుట.
* నాగరికత నిర్మాణ రీతులను అర్థం చేసుకొనుట.
* సింధు నాగరికత ముఖ్య లక్షణాలను తెలుసుకొనుట.

### పాఠ్య నిర్మాణ క్రమం:


1.1 పరిచయం
1.2 సింధు నాగరికత పూర్వ సంస్కృతులు
1.3 సింధు నాగరికత
1.4 కాల నిర్ణయం
1.5 సింధు నాగరికత - భౌగోళిక విస్తరణ
1.6 ప్రధాన ప్రాంతాలు
1.7 సింధు నాగరికత ముఖ్య లక్షణాలు
1.7.1 ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం
1.7.2 భవన నిర్మాణాలు
1.7.3 స్నాన వాటిక
1.7.4 మురుగు నీటి పారుదల సౌకర్యాలు
1.7.5 ధాన్యాగారము
1.7.6 రేవు పట్టణం
1.8 సింధు ప్రాంతాల సాంస్కృతిక ఏకరూపకత
1.9 సంగ్రహంగా
1.10 మాదిరి ప్రశ్నలు
1.11 ఉపయుక్త గ్రంథాలు


### 1.1 పరిచయం:

ప్రాచీన భారతదేశ చరిత్ర క్రీ.పూ. 4,00,000 - 2,00,000ల సంవత్సరాల శిలాయుగానికి విస్తరించింది. భారతదేశంలోని ప్రాచీన మానవులను ప్రాచీన శిలాయుగం, నవీన శిలాయుగం మానవులుగా విభజించవచ్చు. ప్రాచీన శిలాయుగ మానవుడు కొండలు, గుట్టలలో నివసిస్తూ, వేటకు, స్వీయ రక్షణకు రాతి పనిముట్లను ఉపయోగించాడు. ప్రాచీన శిలాయుగ మానవుడు ఉపయోగించిన పనిముట్లు రాజస్థాన్, గుజరాత్, బీహార్, దక్షిణ

భారతదేశాల్లో లభించాయి. నవీన శిలాయుగ మానవుడి పనిముట్లు భారతదేశం అంతటా లభించాయి. నవీన శిలాయుగ మానవుడు ప్రాచీన శిలాయుగ మానవుడి కంటే అభివృద్ధి చెందాడు. ఈ శిలాయుగంలో ప్రజలు వ్యవసాయం చేయడం, జంతువులను మచ్చిక చేసుకోవడం వంటివి చేశారు. వారు కుండలను తయారు చేసుకోవడంతోపాటు, నిప్పును ఉపయోగించారు. గుహల్లో నివసిస్తూ వాటిని చిత్రకళతో అలంకరించుకున్నారు.

## 1.2 సింధు నాగరికత పూర్వ సంస్కృతులు:

బెలుచిస్థాన్, దిగువ సింధు ప్రాంతాల్లో నవీన శిలాయుగ ప్రజల నివాస స్థానాలను పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ కాలంలో అక్కడ అరణ్యాలు ఉండేవి. నేటిలాగా కాకుండా బెలుచిస్థాన్ చిన్న చిన్న నదులతో ఉండేది. ఎగువ బెలుచిస్థాన్, దిగువ సింధు, మక్రాన్ తీర ప్రాంతాల్లో వ్యవసాయం చేసినట్లు వెల్లడైంది. వాటికి ప్రత్యేక సంస్కృతులు ఉండేవి. దిగువన రాతి కట్టు, ఎగువన మట్టి గోడలతో వారు నివాస గృహాలను నిర్మించుకున్నారు. చక్కటి కుండలను తయారు చేసి వాటిపై రంగుల అలంకరణలు చేసేవారు. కొన్ని రాగి పరికరాలు బయటపడటం వల్ల వారికి లోహాన్ని గురించిన పరిజ్ఞానం ఉండేదని తెలుస్తుంది. దక్షిణ ప్రాంతంలోని మక్రాన్ తీరంలోని సంస్కృతుల్లో చనిపోయిన వారిని దహనం చేసే ఆచారం పాటించారు. అయితే ఉత్తర ప్రాంతంలోని నాల్ సంస్కృతిలో మృత దేహాలను పాతి పెట్టినారు. వీరు మృతదేహాలను ఆరాధించేవారు. జోబ్ సంస్కృతిలో రాతి మీద కొన్ని గుర్తులు బయటపడ్డాయి. వీరు మాతృ దేవతలతోపాటు, వృషభాలను ఆరాధించేవారు. ఉత్పత్తిని వృద్ధి చేయడం కోసం కర్మకాండలు చేసేవారు. కుల్లీ సంస్కృతి ప్రజలు చిన్న చిన్న రాతి పెట్టెలను చేసి పైన రేఖలతో అలంకరించేవారు. ఈ పెట్టెలు కొన్ని మెసపటోమియాలో బయల్పడ్డాయి. బహుశా ఈ పెట్టెల్లో పరిమళ ద్రవ్యాలను ఉంచి కుల్లీ ప్రజలు మెసపటోమియాకు ఎగుమతి చేసే వారని భావించవచ్చు. కుల్లీ - మెసపటోమియాల మధ్య సముద్ర జల మార్గం ద్వారా వాణిజ్యం జరిగింది.


## 1.3 సింధు నాగరికత:

భారతీయ సంస్కృతి, నాగరికత ఆర్యులరాకతోనే ప్రారంభమైనదని 1922 సంవత్సరం వరకు అనేక మంది చరిత్రకారులు విశ్వసించారు. కాని 1922 సంవత్సరం సర్‌జాన్ మార్షల్, R.D. బెనర్జీ, దయారాం సహానీల నేతృత్వంలో జరిగిన త్రవ్వకాల వలన భారత నాగరికత ఆర్యుల కంటే ముందే "సింధు నది ప్రాంతమున ప్రారంభమైనదని", దీనిని హరప్పా, మొహంజోదారో నాగరికత అని పిలవడం జరిగింది. సర్‌జాన్ మార్షల్ "నిజమైన భారతదేశ చరిత్ర ఆర్యుల రాకతోకాక, హరప్పా, మొహంజోదారో నాగరికతలతో ప్రారంభమైనది'' పేర్కొన్నాడు. ప్రాచీన నాగరికతలకు కేంద్ర స్థానములైన ఈజిప్టు, బాబిలోన్, చైనా నాగరికతలు విలసిల్లిన కాలంలో ఈ నాగరికత విరాజిల్లినట్లు తెలుస్తుంది. ఈ సింధు త్రవ్వకాలు భారతదేశంలోని వివిధ ప్రదేశాలలో కూడా బయల్పడంతో దీనిని "ప్రాచీన భారతీయ నాగరికత'' అని పిలవడం సమంజసం అని దీక్షితుని పండితుని అభిప్రాయం. సింధు నాగరికత నిర్మాతలు ద్రావిడులని, ఆర్యులని రకరకాలైన అభిప్రాయాలున్నప్పటికీ అనేక పరిశోధనల అనంతరం ఈ నాగరికత నిర్మాతలు ఏ ఒక్క జాతికి చెందినవారు కాదని, భిన్న జాతుల సంగమం ఈ సింధు నాగరికత అని తెలుస్తుంది.

## 1.4 కాల నిర్ణయం:

ఈ నాగరికత అధ్యయనం సరళతరం చేయుటకు వీలుగా దీన్ని మూడు దశలుగా విభజించారు. మొదటి తొలి దశ (క్రీ.పూ. 3,500 - 2,600), రెండవ దశ వికాస దశ (క్రీ.పూ. 2,600 - 1900), మూడవ దశ క్షీణ దశ (క్రీ.పూ. 1900 - 1400)గా గుర్తించడం జరిగింది. తొలి దశలో మట్టి ఆనవాళ్ళు ఆధారంగా పట్టణ నాగరికత, కళలు, హస్తకళలు, వాణిజ్యం గురించి అధ్యయనం చేశారు. రెండవ దశలో బాగా అభివృద్ధి చేసిన టౌన్ ప్లానింగ్, కాల్చిన ఇటుకల వాడకం, గృహ నిర్మాణంలో నాణ్యత, విదేశీ వర్తకంను అధ్యయనం చేయగా, మూడో దశ అయిన క్షీణ దశలో ఓ గొప్ప నాగరికత క్రమేణా అంతరించడం, వాటి కారణాలను అన్వేషించడం జరిగింది. రాగి లోహకం

వాడకమే కాదు, కంచును కూడా వినియోగించిన ఆనవాళ్ళు ఆధారంగా ఇది ముమ్మాటికీ పట్టణ నాగరికత అని ధృవీకరించటం జరిగింది. ఈ నాగరికతను 'తామ్ర శిలాయుగ' నాగరికతగా పరిగణిస్తారు.




## 1.5 సింధు నాగరికత - భౌగోళిక విస్తరణ:

ఈ నాగరికత కేవలం పాకిస్తాన్‌లో పంజాబ్ ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. సింధు, బెలుచిస్థాన్, గుజరాత్, రాజస్థాన్, దక్షిణ ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల వరకు నాగరికత విస్తరించింది. హరప్పా త్రవ్వకాలలో బయల్పడిన వాటిలో ముఖ్య ప్రాంతంగా మొహంజోదారో ప్రాంతమును పురాతత్త్వ శాస్త్రవేత్తలు గుర్తించటం జరిగింది. త్రవ్వకాలు జరిగిన హరప్పా ప్రాంతానికి సుమారు 480 కి.మీ. దూరంలో ఉంది. 1947లో దేశ విభజన అనంతరం హరప్పా త్రవ్వకాలు జరిపిన ప్రాంతాలు మొహంజోదారో, హరప్పా, చన్హుదారో, రూపార్‌లు అన్ని పాకిస్తాన్‌కి చెందాయి. కొన్ని ప్రాంతాలైన పంజాబ్‌లో గల సట్లెజ్ పరీవాహ ప్రాంతమైన రూపార్ దగ్గర కోట్ల, నిహంగభాన్, ఖతియావార్‌లో గల భాదర్‌లు మాత్రమే భారతదేశంలోకి వచ్చాయి.



## 1.6 ప్రధాన ప్రాంతాలు:

పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో ఉన్న హరప్పా, సింధులోని మొహంజోదారోలు రెండు ప్రధానమైన నగరాలు. పాకిస్తాన్‌లో ఉన్న ఈ రెండు నగరాల మధ్య దూరం 483 కి.మీ., మూడవ నగరం మొహంజోదారోకు 130 కి.మీ. దూరంలోని చన్హుదారో, నాల్గవది గుజరాత్‌లోని లోథాల్ కాగా, ఐదవ నగరం ఉత్తర రాజస్థాన్‌లోని కాలీబంగన్ నగరం (కాలీబంగన్ అంటే నల్ల గాజులు), ఆరవది బనవలి, హర్యానాలోని హిస్సార్ జిల్లాలో ఉంది.


## 1.7 సింధు నాగరికత ముఖ్య లక్షణాలు:

హరప్పా, మొహంజోదారోల వద్ద జరిగిన త్రవ్వకాల మూలంగా చాలా వరకు సింధు నాగరికత గురించి మనకు తెలుస్తుంది. విభిన్న ప్రదేశాలలో బయల్పడిన వాటిలో ప్రముఖంగా ఆ నగరాలను మాత్రం ఆ నాగరికతకు ప్రతిరూపాలుగా గుర్తించవచ్చు. హరప్పా, మొహంజోదారో, చన్హుదారో, బనవలి, కాలీబంగన్, లోథాల్ మొదలగు నగరాలు సింధు నాగరికత లక్షణాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇవి నిర్దిష్టమైన నగర ప్రణాళికలు, పారిశుద్ధ్య వసతులు, ఉత్పత్తుల ప్రామాణీకరణ, అన్ని కట్టడాలలో ఉపయోగించిన కాల్చిన ఇటుకలు, లెక్కలేనన్ని ప్రజా నివాస భవనాలున్న దుర్గ ప్రాసాదం, లోతట్టు నగరంలో సాధారణ ప్రజలు నివసించే ఇళ్ళు, చిత్రలిపిని ఉపయోగించడం మొదలైనవి ముఖ్య లక్షణాలు:

1. ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణము
2. భవన నిర్మాణాలు
3. ప్రజాహిత నిర్మాణాలు
4. ధాన్యాగారం
5. మురుగు నీటి పారుదల సౌకర్యాలు
6. రేవు పట్టణ నిర్మాణం

**1.7.1 ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం:** సింధు నాగరికతలో మనకు ప్రధానంగా కనిపించే గొప్ప గుణం ఏకత. ఈ ఏకత నగర ప్రణాళికలలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. వీధులు విశాలంగా, సరళంగా తీర్చిదిద్దబడి, ఇరువైపులా భవనాలు బారులు తీరినవి. హరప్పా, మొహంజోదారో, కాలిబంగన్ లాంటి ప్రాంతాలను మనం పరిశీలిస్తే పట్టణ నిర్మాణ ప్రణాళికను రెండు భాగాలుగా విభజించినట్లు అర్థం చేసుకోవచ్చు. దుర్గాలు, పరిపాలన నిర్వహణ, ఆచార్య వ్యవహారాలకి సంబంధించిన నిర్మాణాలను ఎత్తైన ప్రదేశాలలో, పశ్చిమ దిక్కులో, ప్రజల ఆవాసాలను పట్టణ క్రింద ప్రాంతాలలో తూర్పు దిశలో నిర్మించారు. వీధుల నిర్మాణాలను $90^0$లో నిర్మిస్తూ కూడలి వచ్చేటట్లుగా క్రిస్-క్రాస్ (X) నమూనాలో నిర్మించారు. ఈ పద్ధతిలో నిర్మించడం వల్ల నగరాన్ని సులభంగా ఆవాసయోగ్య సమూహాలుగా సులువుగా విభజించారు. వాటితోపాటు తెరిచిన ద్వారాలను నిర్మించారు. ఈ వీధులన్నీ ప్రధాన రహదారులతో అనుసంధించబడినాయి. పట్టణమునకు రక్షణగా చుట్టూ గోడ, దాని చుట్టూ ఎల్లప్పుడూ నీరు నిలువ నుండు కందకం, కోటకు అక్కడక్కడ రక్షణ ద్వారాలు కలవు.

నగర నిర్మాణం




**1.7.2 భవన నిర్మాణాలు:** సింధు నగరములందు వసతి నిర్మాణ భవనములు అనేక రకములుగా కలవు. భవనాలు చతురస్రాకారపు ప్రహరీ నిర్మాణంతో ఉన్నవి. గృహములను కాల్చిన ఇటుకలతోను, సున్నపు గచ్చుతో నిర్మించిరి. గృహములకు అందమైన ద్వారములు, కిటికీలు, గుండ్రని ఆర్చీలు ఏర్పాటు చేయబడినవి. కొన్ని గృహములు 2 లేక 3 అంతస్థులు కలిగి ఉండి, ప్రత్యేక వంటశాల, స్నానపు గది, ధాన్యపు గది, భోజన గది, పడక గది, పని వారి గది మొదలగు అనేక గదులతో ధనవంతుల ఇళ్ళు నిర్మించబడగా, ఒకటి, రెండు గదులతో పేదల గృహాలు నిర్మించబడినవి. గృహముల నుండి నీరు బయటకు వచ్చుటకు మురుగునీటి కాలువలు ఉండేవి. భవనముల పై కప్పుల నిర్మాణమునకు కలప విశేషముగా వాడబడెను. ఇంటి ప్రధాన ద్వారము మధ్యలోకాక ఒక చివరగా ఉండినది. పై కప్పులో అక్కడక్కడ గాలి, వెలుతురు వచ్చేటందుకు గవాక్షాలు (కంతలు) ఉండేవి. ప్రతి ఇంటి నందు వెంటిలేటర్లు ఉండేవి. ఇంటి పై కప్పును పలుచన చదరపు ఇటుక బిళ్ళలతో అమర్చబడి ఉండేవి. ఇవి ఇంటికి చల్లదనాన్నియిచ్చేవి. కాల్చిన ఇటుకలతో భవన నిర్మాణాలు చేపట్టడం సింధు ప్రజల ఇంజనీరింగ్ కౌశల్యానికి నిదర్శనము.

**1.7.3 స్నాన వాటిక:** ప్రజాహిత నిర్మాణములందు సింధు ప్రజల అపూర్వ నిర్మాణ నైపుణ్యమునకు తార్కాణము మొహంజోదారోలో బయల్పడిన స్నానవాటిక. ఇది నగరం మధ్యలో నిర్మింపబడినది. ఈ స్నానవాటిక దీర్ఘచతురస్రాకారపు ఆకారంలో 39 అడుగుల పొడవు, 23 అడుగుల వెడల్పు, 8 అడుగుల లోతుతో నిర్మించబడినది. ఇది పూర్తిగా ఇటుకలతో నిర్మించబడినది. దీనిలోనికి దిగేటందుకు నలువైపులా మెట్ల నిర్మాణం కూడా ఉన్నది. స్నానవాటికలో నీటిని మార్చేందుకు అనువుగా కొలను క్రింది భాగంలో భూగర్భ కాలువ నిర్మాణం దీని ప్రత్యేకత. నీరు ఇంకిపోకుండా, వాటిక క్రుంగి పోకుండా బిటుమిన్, జిప్సంల మిశ్రమంతో ప్రత్యేకమైన ఇటుకలు తయారు చేసి 'పెద్ద స్నాన వాటిక' నిర్మాణానికి వినియోగించారు. దుస్తులు మార్చుకోవటానికి ప్రత్యేక గదులు నిర్మింపబడి ఉన్నాయి.



స్నాన వాటిక

ఈ స్నాన వాటిక చుట్టూ ఉత్తరం, తూర్పు వైపు పెద్ద పెద్ద భవన సముదాయాలున్నాయి. అందులో బహుశా పరిపాలకులు, పూజారులు, వర్తకులు మొదలగు వారు నివసించేవారు. ఈ స్నాన వాటిక దక్షిణ భాగంలో ఒక సభావేదిక ఉండేది. స్నానవాటికకు తూర్పుగా ఒక దీర్ఘచతురస్రాకారపు భవనం ఉంది. ఈ స్నాన ఘట్ట నిర్మాణం "అద్భుత వాస్తు ప్రావీణ్యము'' అని సర్‌జాన్ మార్షల్ ప్రశంసించెను.


**1.7.4 మురుగు నీటి పారుదల సౌకర్యాలు:** హరప్పా నాగరికతా నగర ప్రత్యేకత మురుగు నీటి కాలువల నిర్మాణం, హరప్పా సంస్కృతిలోని అన్ని నగరాలు, పట్టణాల్లో చిన్న, పెద్ద గృహాలలో స్నానపు గదులుండేవి. ఇంట్లో ఉపయోగించిన మురుగు నీరు వీధి రహదారి ప్రక్కన ఉన్న మురుగు కాలువకు చేరేది. చాలా సందులకు, వీధులకు ఇటుకలతో కట్టి, ఇటుకలతో మూయబడిన మురికి కాల్వలున్నాయి. వీటిలోకి ఇండ్లలోని వచ్చే మురుగు నీరు ప్రవహిస్తుంది. ఈ కాల్వలున్న పెద్ద గోతుల్లోకి మరల్చబడి ఉన్నాయి.వీధులలో కాల్వలన్నింటికి మధ్య మధ్య మలుపులు, వాటికి అమర్చబడిన మూతలు ఉన్నాయి. ఇవన్నీ కొన్నిసార్లు పెద్దగోతుల్లోకి ఇంకిపోయేటట్లు ఏర్పాటు కనిపిస్తాయి. మురుగునీటి కాల్వలను అక్కడక్కడా శుభ్రపరిచేందుకు మనిషి దూరేందుకు వీలుగా రంధ్రాలు ఉండేవి. వీటిని బట్టి సింధు ప్రజలు పరిశుభ్రత విషయంలో గొప్ప పరిణతి కలవారని చెప్పవచ్చు. సింధు ప్రజలు ఇటుకల తయారీలో సిద్ధహస్తులు. స్నానపు గదులు, బావి చుట్టూ ఉండే కాలువలకు 'L' ఆకారంలో ఉండే ఇటుకలను వాడారు. ఎక్కువ అంతస్తులు ఉన్న గృహాల్లో నిలిచే మురుగునీటి గొట్టాలను ఏర్పాటు చేసుకున్నారు. స్నానాల గదులను వీధులకు ఆనుకొని నిర్మించారు.



మురుగు కాలువల నిర్మాణం

**1.7.5 ధాన్యాగారము:** స్నానవాటికకు పడమర నిర్మించబడిన ఒక పెద్ద కట్టడం ధాన్యాగారము. తూర్పు, పడమరలు 150 అడుగులు పొడవు, ఉత్తరం, దక్షిణంగా 75 అడుగుల వెడల్పు కొలతలతో ఈ నిర్మాణం జరిగినది. హరప్పా ప్రాంతాలలో ఆరు ధాన్యాగారాల నిర్మాణం ఉన్నట్లు కనుగొన్నారు. ఒక్కొక్కటి 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పులతో ఉన్నాయి. వీటికి దక్షిణ దిక్కులో వృత్తాకారపు ఇటుకల మిట్ట లాంటి నిర్మాణాలు ఉన్నాయి. బహుశా నాటి కాలంలో ధాన్యం మార్పిడికి వీటిని ఉపయోగించి ఉండవచ్చు. వీటికి దగ్గరలో రెడు బార్కసులు (విశ్రాంతి శిలలు) జాడలు కనిపించాయి. వీటిని వ్యవసాయ కార్మికుల కొరకై నిర్మించడం జరిగినది. కాలిబంగన్, లోథాల్ ప్రాంతాలలో జరిగిన త్రవ్వకాలలో లభించిన ఓడరేవుల జాడల ప్రక్కన ఇలాంటి వృత్తాకారపు ఇటుకల మిట్టకు సంబంధించిన పునాది రాళ్ళ ఆనవాళ్ళు మరికొన్ని బయటపడ్డాయి. ధాన్యాల విలువ వాటి ప్రాముఖ్యతను ఈ పెద్ద పెద్ద ధాన్యాగారాలు చెబుతున్నాయి. ఈ ధాన్యాగారంలో ఒక పెద్ద తిరగలి (Grinding Stones) ఉన్నట్లు బయల్పడినాయి. బహుశా సింధు వరదల నష్టం నుండి తప్పించుకోవటం కొరకు ప్రతి ఇంటి నుండి ఇక్కడ ధాన్యం దాచుకొని, వరదల సమయంలో ధాన్యాన్ని తిరగలి ద్వారా వాడుకునే వీలుండే పదార్థాలను ఉపయోగించుకొన్నారని భావించవచ్చు. ఈ ధాన్యపు విలువలు, పంపిణీ వ్యవస్థలు ఒక నిర్ధిష్టమైన ప్రాధికార సంస్థ ద్వారా జరిగినట్లు తెలుస్తుంది.

**1.7.6 రేవు పట్టణం:** లోథాల్‌లో ఉన్న ఓడలు నిలిచే రేవు స్థలం సింధు నాగరికత నిర్మాణాలలో గొప్పది. ఈ డాక్ దీర్ఘచతురస్రాకారంలో, ఒక మోస్తరు సైజులో ఉంది. డా॥ యస్.ఆర్. రావ్ దీనికి ఓడ నుండి సామాన్లు దించే చోటుగా అభివర్ణించారు. లోథాల్ నగరం చుట్టూ గోడలున్నాయి. అందులో 3/4వంతు నివాస స్థలాలకు, పరిశ్రమను కేటాయించబడింది. గోమేధికాలు, మాణిక్యాలు మొదలైనవి వాటిని తయారు చేసే ధృడమైన పూసల తయారీ పరిశ్రమ చిహ్నాలు కూడా అక్కడ కనిపించాయి. బంగారు, వెండి పూసలు కూడా బయటపడ్డాయి. దంతాలను ఉపయోగించి కూడా వివిధ ఆభరణాలను తయారు చేశారు.



ఓడరేవు పట్టణం

## 1.8 సింధు ప్రాంతాల సాంస్కృతిక ఏకరూపకత:

విస్తారంగా వ్యాపించి ఉన్న సింధు ప్రాంతాలలో లభ్యమైన అవశేషాలు, కట్టడాలు పట్టణ నాగరికత ఆనవాళ్ళను బట్టి అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతిక సారూప్యం ఉండేదని తెలుస్తుంది. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్‌లో ఉపయోగించిన నాణ్యమైన, కాల్చిన ఇటుకలు వంటి పరిమాణం, మృణ్మయ పాత్రల తయారీలో అనుసరించిన సాంకేతిక పద్ధతులు, రాగి, కంచు లోహంతో తయారు చేసిన పనిముట్లు, ముద్రలు, పూసల తయారీ, తూనికలు, కొలతలను ఏకరూపు ప్రామాణికంగా కొలుచుట మొదలగు అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల నాగరికత, సంస్కృతుల మధ్య సారూప్యత విషయాన్ని ధృవీకరించారు. అయితే త్రవ్వకాలలో లభించిన వస్తువులలో సారూప్యత లేకపోయినా చిన్న చిన్న గ్రామాలన్నీ జాతులు, చిన్న పట్టణాలు అన్నీ ఒకే విధమైన భావ సారూప్యతగా బలమైన ఆర్థికవ్యవస్థ క్రిందకు రావడం ఈ నాగరికత ముఖ్య లక్షణం.

## 1.9 సంగ్రహంగా:

సింధు నాగరికత ప్రపంచ ప్రాచీన నాగరికతలలో ఒకటి, ప్రముఖమైనది. ఈ నాటికి సింధు నాగరికత ఒక్కటే కొనసాగుతూ ఉన్నది. దాని ఆనవాళ్ళు పదిలంగా ఉన్నాయి. మెసపటోమియా, ఈజిప్టు, చైనా నాగరికతలు, వాటి ప్రభావం ఆయా దేశాల్లో కనుమరుగైపోయినాయి. దాదాపు క్రీ.పూ. 5,000 సంవత్సరాల నుండి కొనసాగుతూ ఉన్న సింధు నాగరికత పునాది అంత ధృడమైనది. ఈ నాగరికత గ్రామ ప్రాంతాలతో ప్రారంభమైన దీనికి ఆయువుపట్టు పట్టణాలు అందువల్ల దీనిని పట్టణ నాగరికత అని అంటారు. హరప్పా, మొహంజోదారో, చన్హుదారో, కాలిబంగన్, బనవలి, లోథాల్, ధోలవీర మొదలైనవి త్రవ్వకాలలో బయటపడిన నాటి కాలపు పట్టణ నాగరికత చిహ్నాలు. ఈ పట్టణాలను పట్టణ ప్రణాళికలో భాగంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటివి ఎత్తైన మిట్ట ప్రాంతంలో నిర్మించబడిన కోటలు, దుర్గాలు కాగా, రెండవది దిగువన నిర్మించిన ప్రజావాసాలు. భవన నిర్మాణంలో కాల్చిన ఇటుకలు వాడినారు. పట్టణాలలో మురుగునీరు పోయేందుకు చక్కని డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొహంజోదారోలో జరిగిన త్రవ్వకాలలో బయల్పడిన అతి పెద్ద స్నానవాటిక, హరప్పాలో ధాన్యాగారం, లోథాల్‌లో నౌకానిర్మాణం మొదలైనవి. సింధు ప్రజల నగర నిర్మాణం ఒక అద్భుతమైన, ప్రణాళికాబద్ధమైనది. దాదాపు మనము ఇప్పటి నగరాలు వారి నగరాల కంటే భిన్నమైనవి కాదు అని చెప్పవచ్చు.

ఇంతటి గొప్ప నాగరికత క్రీ.పూ. 1750లో పతనం అయింది. సింధు నదికి తరచూ సంభవించిన వరదల తాకిడి తట్టుకోలేక, వ్యవసాయ నీటిపారుదల సౌకర్యాలు అన్ని ధ్వంసం అయ్యాయి. ఈ కారణం చేత మొహంజోదారో ప్రజలు వేరే చోటికి తరలిపోయారు. చరిత్రకాలు సింధు పతనానికి ఇతర కారణాలు వివరించిన, ఒక గొప్ప నాగరికత కాలగర్భంలో కలసిపోయింది. ఈ నాగరికత ముఖ్య లక్షణాలు ఏ నాగరికతలో లేవని చెప్పవచ్చు. ఈ లక్షణాలు ఈ నాగరికత ప్రత్యేకతతో భారతీయ నాగరికతను సుసంపన్నం చేసింది.

## 1.10 మాదిరి ప్రశ్నలు:

**(ఎ) ఈ క్రింది సూక్ష్మరూప ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. సింధు నాగరికత బయల్పడిన సంవత్సరం?
2. సింధు నాగరికత ఏ లోహయుగానికి చెందిన నాగరికత?
3. సింధు ప్రజలకు తెలియని లోహము?
4. సింధు నాగరికతలో స్నానవాటిక బయల్పడిన ప్రదేశము?
5. సింధు నాగరికత రేవు పట్టణం ఏది?

**(బి) ఈ క్రింది ప్రశ్నలకు 10 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. సింధు (హరప్పా) నాగరికత పుట్టుక, కాలం పై సమాధానము రాయండి.
2. సింధూ నాగరికత ఆరు ప్రధాన ప్రాంతాల గురించి తెలపండి.
3. హరప్పా ప్రాంతాల సాంస్కృతిక సారూప్యం గురించి వ్రాయండి.

**(సి) ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

1. సింధు నాగరిత పూర్వ సంస్కృతులను తెలుపుతూ, విస్తరణను గొప్ప తనమును వివరించుము.
2. సింధు నాగరికత ముఖ్య లక్షణాలను విశదీకరించుము.

**(డి) ఈ క్రింది ఖాళీలను పూర్తి చేయుము.**

1. సింధు నాగరికతలో ఇటీవల కనుగొనబడిన ప్రదేశము .....................................
2. హరప్పా నాగరికత మొత్తంగా ............................... నాగరికతగా చెప్పవచ్చు.
3. సింధు నాగరికతను ప్రాచీన భారతీయ నాగరికతగా వర్ణించినది ...................................................
4. స్నాన ఘట్టాన్ని అద్భుత వాస్తు ప్రావీణ్యంగా వర్ణించినది ............................................................
5. సింధు నాగరికత త్రవ్వకాలతో సంబంధం ఉన్న తొలి బ్రిటీష్ అధికారి ............................................

**(ఇ) ఈ క్రింది వానిని జతపరచుము.**

| | | | |
|---|---|---|---|
| 1. | క్రీ.పూ. 3500 - 2600 | (ఎ) మూడవ దశ | ( ) |
| 2. | క్రీ.పూ. 2600 - 1900 | (బి) నల్లని గాజులు | ( ) |
| 3. | క్రీ.పూ. 1900 - 1400 | (సి) మొదటి దశ | ( ) |
| 4. | తామ్ర శిలా యుగము | (డి) రెండవ దశ | ( ) |
| 5. | కాలిబంగన్ | (ఇ) సింధు నాగరికత | ( ) |

## 1.11 ఉపయుక్త గ్రంథాలు:


1. Jha, D.N. : Ancient India - An Introduction Outline
2. Romila Thapar : History of India, Vol. I
3. Romila Thaper : Studies in ancient Indian Social History
4. Sharma R.S. : Ancient India, NCERT XII Std.
5. Basham A.L. : The Wonder that was India



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ జె. కృష్ణ ప్రసాద్ బాబు**

పాఠం - 2

# ఋగ్వేద ఆర్యులు

## 2.1 లక్ష్యం:

* భారతదేశ నాగరికతను సుసంపన్నం చేసిన ఆర్యుల నాగరికతను తెలుసుకొనుట.

* ఆర్యుల నాగరికతలో మొదటి ఋగ్వేద ఆర్యుల స్థితిగతులను తెలుసుకొనుట.

## పాఠ్య నిర్మాణ క్రమం:


2.1 లక్ష్యం

2.2 పరిచయం

2.3 ఆధారాలు

2.3.1 వేద సాహిత్యం

2.4 ఆర్యుల జన్మ స్థానం

2.4.1 స్వదేశీ సిద్ధాంతం

2.4.2 విదేశీ సిద్ధాంతం

2.5 భౌగోళిక పరిస్థితులు

2.6 రాజకీయ పరిస్థితులు

2.6.1 క్రమానుగత శ్రేణి

2.6.2 పరిపాలనలో నియంత్రించే సంస్థలు

2.6.2.1 సభ

2.6.2.2 సమితి

2.6.2.3 విధాత

2.6.3 రాజన్ విధులు

2.6.4 పరిపాలన వ్యవస్థ

2.6.5 దశ రాజ గణ యుద్ధం

2.7 ఆర్థిక పరిస్థితులు

2.7.1 వ్యవసాయం & పశుపోషణ

2.7.2 పరిశ్రమలు

2.7.3 వాణిజ్యం

2.7.4 పన్నులు

2.8 సాంఘీక పరిస్థితులు

2.8.1 వర్ణ వ్యవస్థ

2.8.2 స్త్రీ స్థానం

**2.8.3 వివాహ వ్యవస్థ**

**2.8.4 సంస్కృతి**

**2.9 మత పరిస్థితులు**

**2.9.1 ముఖ్య దేవుళ్ళు**

**2.9.2 స్త్రీ దేవతలు**

**2.9.3 పూజా విధానం**

**2.10 సారాంశం**

**2.11 మాదిరి ప్రశ్నలు**

**2.12 ఉపయుక్త గ్రంథాలు**



## 2.2 పరిచయం:

భారతదేశంలో మొదటి నాగరికత అయిన సింధు నాగరికత పతనం తరువాత వచ్చిన రెండవ గొప్ప నాగరికత 'ఆర్యుల నాగరికత' (Vedic Culture). వీరు సప్త సింధు ప్రాంతంలో నివసించారు. వీరు ఐరోపా ప్రాంతం నుండి బయలుదేరి, మధ్య ఆసియా ప్రాంతంలో దీర్ఘ కాలం నివసించి, ఆ తరువాత విడిపోయి భారతదేశం వైపు వచ్చిన ఒక తెగ ప్రజలే ఋగ్వేద ఆర్యులు. వీరు 'నార్డిక్' జాతికి చెందినవారు. వీరు ఆర్యన్ భాషను మాట్లాడం వల్ల వీరిని ఆర్యులు అని అంటారు. వీరి నాగరికతకు 'వేదాలు' మూలం కావున వీరి నాగరికతను 'వేద నాగరికత' అని అంటారు. ఆర్యుల రాకతో భారతదేశంలో సంస్కృత భాష ప్రారంభమైనది.

## 2.3 ఆధారాలు:

ఋగ్వేద ఆర్యులకు సంబంధించి లభించిన ఆధారాలు వేద సాహిత్యం. వీటిలో ఋగ్వేద ఆర్యుల గురించి ఋగ్వేదం సమాచారం అందిస్తుంది.

### 2.3.1 వేద సాహిత్యం:



## 2.4 ఆర్యుల జన్మ స్థానం:

ఆర్యులు ఎవరు? ఎక్కడి నుండి వచ్చినారు? అనే అంశం పై చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. అవి: ఎ) స్వదేశీయులని, బి) విదేశీయులని.

**2.4.1 స్వదేశీ సిద్ధాంతం:** ఆర్యులు స్వదేశీయులని, వీరు ఎక్కడి నుండో భారతదేశానికి వలస రాలేదని వీరి సిద్ధాంతం.

* ఆర్యుల జన్మస్థలం సప్త సింధు → అవినాశ్ చంద్రదాస్ & సంపూర్ణానంద్
* ఆర్యుల జన్మస్థలం సరస్వతి నదీ ప్రాంతం → గంగానాథ్ ఝా
* ఆర్యుల జన్మస్థలం కాశ్మీరీ ప్రాంతం → ఎల్.డి. కల్లా
* ఆర్యుల జన్మస్థలం ముల్తాన్ లోని 'దేవికా' ప్రాంతం → డి.యస్. త్రివేది

**2.4.2 విదేశీ సిద్ధాంతం:**

* ఆర్యులు టిబెట్ నుండి వచ్చారు అని 'సత్యార్థ ప్రకాశిక'లో పేర్కొన్నారు → దయానంద సరస్వతి
* ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుండి వచ్చినారు → బాలగంగాధర్ తిలక్
* ఆర్యులు జర్మనీ నుంచి వచ్చారు → పెంకా
* ఆర్యులు మధ్య ఆసియా (యురేషియా) ప్రాంతం నుండి వచ్చినారు → మాక్స్ ముల్లర్

## 2.5 భౌగోళిక పరిస్థితులు:

ఋగ్వేద ఆర్యులు (క్రీ.పూ. 1500 - 1000) కేవలం 'సప్త సింధు' ప్రాంతంలో మాత్రమే నివసించారు. మాక్స్‌ముల్లర్ అభిప్రాయంలో సప్త సింధు అనగా పంజాబ్‌లో ప్రవహించే 5 నదులు మరియు సింధు, సరస్వతి నదులు. పంజాబ్‌లో ప్రవహించే 5 నదులు: జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్. ఋగ్వేదంలో ఈ నదుల పేర్లు 21 పర్యాయాలు ప్రస్తావించటం జరిగినది.




**సప్త సింధు పటం**

ఋగ్వేద ఆర్యుల సరిహద్దులు ఉత్తరాన హిమాలయాలు, తూర్పున యమున, దక్షిణమున ఆరావళి పర్వతాలు, పడమర ఆఫ్ఘనిస్తాన్.

## 2.6 రాజకీయ పరిస్థితులు:

ఋగ్వేద ఆర్యులు వివిధ తెగలుగా జీవించేవారు. వీరి కాలం నాటి రాజకీయ వ్యవస్థకు కుటుంబం (లేదా) గుంపు ప్రాతిపదిక. వీరి రాజ్య వ్యవస్థ వారసత్వ రాజరికం పై ఆధారపడి ఉండేది.

**2.6.1 క్రమానుగత శ్రేణి:**

కుటుంబం - కులప

↓

గ్రామం - గ్రామణి (అనేక కుటుంబాల కలయిక)

↓

విష్ - విష్‌పతి (అనేక గ్రామాలు కలిసి)

↓

జన - రాజన్ (అనేక విష్‌లు కలిసి)

ఋగ్వేద కాలంలో 'జన' నాయకుడు అయిన 'రాజన్' లేదా 'గోప' ఎన్నుకోబడతాడు. పరిపాలనలో రాజన్ యొక్క అధికారాలను నియంత్రించుటకు వివిధ సంస్థలు ఉండేవి.

**2.6.2 పరిపాలనలో నియంత్రించే సంస్థలు:** వివిధ రకాల ప్రభుత్వాల గురించి మొదటిగా ప్రస్తావించిన గ్రంథం - 'ఐతరేయ బ్రాహ్మణం'.

**2.6.2.1 సభ:** ఋగ్వేద కాలంలోని కుటుంబ పెద్దలు, తెగలోని పెద్ద వారు సభలో సభ్యులు. స్త్రీలు కూడా సభలో భాగంగా ఉండేవారు. సభ కార్యనిర్వహణాధికారాలను చెలాయించేది. సభకు రాజన్ అధ్యక్షత వహించేవాడు. సభ యొక్క తీర్మానాలను 'నరిష్త' అనే వారు.

**2.6.2.2 సమితి:** తెగ యొక్క సాధారణ సభ. తెగలోని ప్రతి వ్యక్తి ఇందులో సభ్యుడుగా ఉండేవాడు. దీనికి కూడా రాజన్ అధ్యక్షుడిగా ఉండేవాడు. అయితే రాజన్‌ను సమితి ఎన్నుకునేది. 'సమితి' కీలక సమయాలలో నిర్ణయాలు తీసుకునేది. సమితి నిర్ణయాలు అంతిమం.

**2.6.2.3 విధాత:** ఇది కీలకమైన సభ. తెగ యొక్క ఆర్థిక వనరుల పంపిణీ చేయటం, వివాదాలను పరిష్కరించటం దీని ముఖ్య విధులు. యుద్ధంలో లభించిన ఆర్థిక వనరులు రాజు యొక్క భాగము, ప్రజల భాగాన్ని విధాత నిర్ణయిస్తుంది.

**2.6.3 రాజన్ విధులు:** ఋగ్వేద కాలంలో గుంపు ప్రజల చేత ఎన్నికకాబడిన రాజన్‌కు విధులే తప్ప అధికారాలు లేవు. ఇతడు నామమాత్రపు అధికారి. ఇతని విధులు:

(1) పశువులను కాపాడటం

(2) గుంపు ప్రజలను కాపాడటం

రాజన్ వీటి నిర్వహణ కొరకు యుద్ధాలు చేయుట, సామూహిక ప్రార్థనలు నిర్వహించుట చేసేవాడు. ఇతనికి పరిపాలనలో పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి, గ్రామణి మొదలగు అధికారులు సహాయపడేవారు.

**2.6.4 పరిపాలన వ్యవస్థ:** పరిపాలన భాగంగా గ్రామ వ్యవస్థ కేంద్రం. గ్రామ పరిపాలనకు గ్రామణి అధికారిగా ఉంటూ, ప్రజల నుండి వారి రక్షణకు అవసరమైన ప్రతిఫలాన్ని వసూలు చేయుటం, రాజన్ ఆజ్ఞలు అమలుపరచటం, సభ, సమితి సమావేశాలకు హాజరు కావటం చేస్తాడు.

న్యాయపాలనలో భాగంగా దోపిడి, దొంగతనం, ఋణపడటం, హత్యలు మొదలగు వాటికి సాధారణ శిక్షలు అమలులో ఉండేవి.

రాజన్ తన గుంపు గోవులను రక్షించుటకు, ఇతర గుంపులోని గోవులను యుద్ధాల ద్వారా, దొంగతనం ద్వారా తెచ్చుకునేవాడు. దీని కొరకు జరిగే యుద్ధాలను "గవస్థి" అన్నారు. ఋగ్వేదకాలంలో భరత × పురు తెగలకు తరచూ యుద్ధాలు జరుగుతుండేవి. యుద్ధాలన్నీ గోవుల కొరకే, కారణం గోవు ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైనది. అయితే రాజన్‌కు స్థిరమైన సైన్యం ఉండేది కాదు.

**2.6.5 దశ రాజ గణ యుద్ధం:** ఈ యుద్ధం భరత తెగకు మరియు 10 మంది ఆర్య రాజుల, అనార్య రాజుల కూటమి మధ్య రావి నదీ తీరంలో జరిగినది. భరత తెగకు సుధాముడు నాయకత్వం వహించగా, 10 మంది రాజుల కూటమికి పురు తెగ నాయకుడైన పురుకుత్స నాయకత్వం వహించెను. ఈ యుద్ధంలో 10 మంది రాజుల కూటమి ఓడిపోయి, సుధాముని తెగ విజయం సాధించెను. వశిష్ట ఋషి మేధోపరమైన సలహాలు భరత తెగకు, విశ్వామిత్ర ఋషి 10 రాజుల కూటమికి సలహాలు ఇచ్చేవారు.

## 2.7 ఆర్థిక పరిస్థితులు:

ఋగ్వేద కాల ఆర్థికవ్యవస్థలో ప్రధానమైనది పశుపోషణ.

**2.7.1 వ్యవసాయం & పశుపోషణ:** ఋగ్వేద కాలపు ఆర్యులు ప్రధానంగా పశుపోషణ చేసేవారు. పశుపోషణలో గోవుల సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే అంత ఆర్థికబలమున్నట్లు భావించేవారు. గోవు ఆర్థికవ్యవస్థలో కీలకమైనదిగా పరిగణించి, ఆవు ఆర్థిక కార్యకలాపాలలో ప్రధానంగా ఉండేది.

సప్త సింధు ప్రాంతం వ్యవసాయం చేయటానికి అనుకూలంగా లేదు. పచ్చికబయళ్ళు అధికంగా ఉండటం వల్ల వ్యవసాయం పెద్దగా అభివృద్ధి జరగలేదు. ఈ కాలంలో బార్లీ, గోధుమ, వరి మొదలగున్నవి పండేవి. ఆర్యులు వ్యవసాయం చేయుటకు గుఱ్ఱమును ఎక్కువగా ఉపయోగించేవారు. వీరు వాడిన కర్ర నాగలిని 'సీతా' అని పిలిచేవారు.

**2.7.2 పరిశ్రమలు:** ఋగ్వేద కాలంలో మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేత, చర్మకార మొదలైన వృత్తుల వారు ఉండిరి. నేత పరిశ్రమలు ఎక్కువగా స్త్రీల ఆధ్వర్యంలో నడిచేవి. సమాజంలో వడ్రంగి వృత్తి పని గౌరవ ప్రదంగా ఉండేది. రథములు, ఎద్దు బండ్లు ప్రధాన రవాణా సాధనములుగా ఉండేవి. ఈ కాలంలో పేరొన్న లోహం ఆయాస్ (రాగి, తగరం). కొలమానం హిరణ్యా పిండ.

**2.7.3 వాణిజ్యం:** వ్యాపార, వాణిజ్యాలు కేవలం స్థానికంగా మాత్రమే జరిగేవి. వస్తు మార్పిడి పద్ధతి (Barter System) ద్వారా జరిగేది. వస్తు మార్పిడికి గోవులను ఎక్కువగా వినియోగించేవారు. సువర్ణ నిష్క (బంగారు వస్తువు), శతమణ (వెండి వస్తువు)లకు వినియోగించేవారు.

**1.7.4 పన్నులు:** ఋగ్వేద కాలంలో పన్నుల వ్యవస్థ లేదు. యుద్ధంలో లభించిన సంపద (ఆవులు) పైనే ఆదాయం ఉండేది. ఈ కాలంలోని ముఖ్య ఆదాయ మార్గాలు:

ఎ) బలి : ఇది పన్ను కాదు, స్వచ్ఛందంగా ప్రజలు రాజన్‌కు ఇచ్చే కానుక.

బి) భాగ : ప్రజల రక్షణకై ఇచ్చే భాగం.

## 2.8 సాంఘీక పరిస్థితులు:

ఋగ్వేద సమాజం పితృస్వామిక కుటుంబానికి చెందినది. తండ్రిని గృహపతి లేదా దంపతి అని పిలిచేవారు. వీరిది సమిష్టి కుటుంబము. R.S. శర్మ ప్రకారం, "ఋగ్వేద కాలపు సమాజం గిరిజన, సర్వ సమానత్వ లక్షణాలు" కలిగి ఉండేది. ఋగ్వేద కాలంలో వర్ణ, కుల వ్యవస్థ లేదు.

**2.8.1 వర్ణ వ్యవస్థ:** ఋగ్వేద చివరి కాలంలో 10వ మండలంలో వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఉన్నది. ప్రజాపతి అనే దేవుని యొక్క వివిధ భాగముల నుండి జన్మించినట్లు పేర్కొనబడింది. అదే చాతుర్వర్ణ వ్యవస్థ.

| | | | | |
|---|---|---|---|---|
| బ్రాహ్మణులు | - | ప్రజాపతి తల భాగం నుండి | - | ప్రార్థనలు చేయుట. |
| క్షత్రియులు | - | ప్రజాపతి భుజ భాగం నుండి | - | పరిపాలన, యుద్ధాలు చేయుట. |
| వైశ్యులు | - | ప్రజాపతి తొడల భాగం నుండి | - | వ్యవసాయం, వ్యాపారం చేయుట. |
| శూద్రులు | - | ప్రజాపతి పాదముల నుండి | - | సేవలు చేయుట. |

పై వర్ణాల వారు ఒకరి వృత్తిని మరొకరు స్వీకరించవచ్చు.

ఉదా॥ 9వ మండలంలో 'మా నాన్నగారు వైద్యులు, మా అమ్మ పిండి రుబ్బుతుంది. నేను ఒక రచయితను' అని పేర్కొనటం వల్ల ఒకే కుటుంబంలో అనేక వృత్తుల వారు ఉన్నట్లు అర్థమౌతుంది.

**2.8.2 స్త్రీ స్థానం:** ఈ కాలంలో స్త్రీ సమానత్వం కనిపిస్తుంది. స్త్రీ స్వతంత్ర్యంగా వ్యవహరించేది. ఋగ్వేద కాలంలో పరదా పద్ధతి లేదు. స్త్రీలు తమ జీవిత భాగస్వాములను ఎన్నుకునే హక్కు కలిగి ఉండేవారు.

ఉదా॥ లోపాముద్ర, విశ్వవర, ఘోష, అపల, గార్గి.

**2.8.3 వివాహ వ్యవస్థ:** ఆనాటి వివాహ వ్యవస్థలో సాధారణ అంశం ఏక పత్నీ వ్రతము. కాని కొన్ని సందర్భాలలో బహు భార్యత్వం ఉండేది.

ఉదా॥ సూర్యుని కూతురు, అశ్వినీ సోదరులను, రోమని మారుతీ సోదరులను వివాహం చేసుకున్నది. బాల్య వివాహాలు లేవు. స్త్రీకి యుక్త వయస్సు వచ్చిన తరువాతనే వివాహం జరిగేది. రాజకీయంగా సభ, విధాతలలో మహిళలకు ఉన్నత పదవులు ఉండేవి. వివాహాలు అనులోమ, ప్రతిలోమ పద్ధతులలో జరిగెను.

* అనులోమ వివాహం : ఉన్నత వర్గంలోని పురుషుడు, దిగువ వర్గంలోని స్త్రీని వివాహం చేసుకోవడం.
* ప్రతిలోమ వివాహం : దిగువ వర్గంలోని పురుషుడు, ఉన్నత వర్గంలోని స్త్రీని వివాహం చేసుకోవడం.

ఉదా॥ క్షత్రియుడైన యయాతి, బ్రాహ్మణ స్త్రీ అయిన దేవయానిని వివాహమాడుట.

**2.8.4 సంస్కృతి:** ఋగ్వేద ఆర్యులు ధరించిన వస్త్రాలు ప్రత్తి, నూలుతో చేసినవి. ఆర్యులు అధికంగా ఉన్ని బట్టను ధరించేవారు. స్త్రీలు, పురుషులు వస, అధివస అనే వస్త్రములను ధరించేవారు. వీరు ధరించిన వాటిలో ప్రధానమైనవి ధోవతి అనే వస్త్రము, నివి అనే అంతర్ వస్త్రం, అధివస అనే ఉత్తరీయం, నిష్కము అని కంఠ భాగములో ధరించే ఆభరణం. రుక్మ అనే హృదయ భాగమున ధరించిన ఆభరణం.

## 2.9 మత పరిస్థితులు:

ఋగ్వేద ఆర్యులు బహు దేవతారాధన, ఇష్ట దేవతారాధన దశ నుండి ఏకేశ్వరోపాసనకు మారినట్లు ఋగ్వేదంలోని 10వ మండలం తెలుపుతుంది. ప్రకృతి నుండి కాపాడుకోవటానికి ప్రకృతి శక్తులను పూజించారు.

వీటికి మానవ రూపాలను ఇచ్చి పూజించటం జరిగింది. విగ్రహారాధన, దేవాలయాలు లేవు. ఈ కాలంలోని దేవతలను రెండు భాగాలుగా చూడవచ్చు. అవి:

**2.9.1 ముఖ్య దేవుళ్ళు:** ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, సోమ, మారుత్ (తుఫానుల), అశ్వినీ, పుషాన్, రుద్ర, వాయువు, త్వష్ట్రి మొదలగువారు.

**2.9.2 స్త్రీ దేవతలు:** అదితి (దేవుళ్ళకు తల్లి), పృధ్వి, అరణ్యమని, సావిత్రి, విరితి, ఉషస్ మొదలగు స్త్రీ దేవతలు.

**2.9.3 పూజా విధానం:** ఋగ్వేద ఆర్యులు సామూహిక ప్రార్థనలు చేసేవారు. దేవుళ్ళకు బార్లీ, పండ్లు, కూరగాయలు, సోమ పానము మొదలైనవి సమర్పించేవారు. సరస్వతి నదిని పూజించారు. ఋగ్వేద ఆర్యులు మృతులను దహనం చేసేవారు. కొన్ని సందర్భాలలో భూస్థాపితం చేసేవారు. ఇహ లోకంలో అంతమైన జీవితం పర లోకంలో కొనసాగుతుందని విశ్వసించేవారు.

## 2.10 సారాంశం:

భారతదేశంలో క్రీ.పూ. పశ్చిమోత్తర దిశలో సప్త సింధు ప్రాంతంలో క్రీ.పూ. 1500-1000 మధ్య జీవించిన తొలి ఆర్యులు (ఋగ్వేద ఆర్యులు) గుంపులు, గుంపులుగా సంచార జీవతం గడిపారు. వీరు పశుపోషణ ప్రధాన వృత్తిగా జీవించడం వల్ల గోవుల కొరకు తరచూ యుద్ధాలు జరిగేవి. వీటినే 'గవష్ఠి' అన్నారు. వీరి రక్షణ, పశు రక్షణ కొరకు వీరు తమ గుంపు నుండి 'రాజన్' అనే తెగ నాయకుడిని ఎన్నుకున్నారు. అయితే ఆనాటి సభ, సమితులు పూర్తి అధికారం కలిగి ఉండేవి. ఋగ్వేద కాలంలో వర్ణ వ్యవస్థ లేదు. చివరి దశలో ఈ వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఉన్నది. వీరు ప్రధానంగా ప్రకృతిని ఆరాధించేవారు. వీరికి ఉపయోగపడిన ముఖ్య జంతువు గుఱ్ఱము. వీరికి తమ చివరి దశలో ఇనుమును తెలుసుకున్నారు. ఈ ఋగ్వేద ఆర్యులే తరువాతి కాలంలో తూర్పు దిశకు వెళ్ళి ఆర్యావర్త ప్రాంతంలో జీవించి మలి వేద ఆర్యులుగా నాగరికతను సుసంపన్నం చేశారు.

## 2.11 మాదిరి ప్రశ్నలు:

**(ఎ) ఈ క్రింది సూక్ష్మ రూప ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. దశ రాజుల యుద్ధం ఏ వేదంలో ప్రస్తావించబడినది.
2. వర్ణ వ్యవస్థను ప్రస్తావించిన వేదం ఏది?
3. ఋగ్వేద ఆర్యులు నివసించిన ప్రాంతం ఏది?
4. ఋగ్వేద ఆర్యుల కాలము ఏది?
5. ఋగ్వేద ఆర్యుల గురించి తెలిపే గ్రంథం ఏది?

**(బి) ఈ క్రింది ఖాళీలను పూరింపుము.**

1. ఋగ్వేద ఆర్యులు తెగ నాయకుడిని ఏమి పిలిచారు? ............................
2. ఋగ్వేద ఆర్యులు వ్యాపారంలో వాడిన పద్ధతి?.......................................
3. ఋగ్వేద కాలం నాటి కుటుంబం .........................................
4. ఋగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి ...............................
5. ఋగ్వేద ఆర్యులు ............................................. ఆరాధకులు.

**(సి) ఈ క్రింది వానిని జతపరుచుము.**

| | | | | |
|---|---|---|---|---|
| 1. నిష్క | (ఎ) | బాలగంగాధర్ తిలక్ | ( | ) |
| 2. ప్రజాపతి | (బి) | పెద్దలు ఉండే సంస్థ | ( | ) |
| 3. సభ | (సి) | ఋగ్వేద కాలం నాటి నాణెము | ( | ) |
| 4. సోమ | (డి) | వర్ణ వ్యవస్థకు మూల పురుషుడు | ( | ) |
| 5. ఋగ్వేద ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంత వాసులు | (ఇ) | పానీయము | ( | ) |

**(డి) ఈ క్రింది సంక్షిప్త ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. ఋగ్వేద ఆర్యుల జన్మస్థలం గురించి చర్చించుము.
2. ఋగ్వేద కాలం నాటి పరిపాలన క్రమానుగత శ్రేణిని వివరింపుము.
3. దశరాజగణ యుద్ధం గురించి తెలుపుము.
4. వేదసాహిత్యం గురించి వ్రాయుము.
5. అనులోమ, ప్రతిలోమ వివాహ వ్యవస్థలను తెలుపుము.

**(ఇ) ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. ఋగ్వేద కాలం నాటి రాజకీయ పరిస్థితులను వివరించుము.
2. ఋగ్వేద ఆర్థిక పరిస్థితులను తెలుపుము.
3. ఋగ్వేద కాల సాంఘీక, మత పరిస్థితులను వివరించుము.

## 2.12 ఉపయుక్త గ్రంథాలు:


1. Basham, A.L. : The Wonder That Was India
2. Kosambi D.D. : An introduction to the Study of Indian History
3. Sharma R.S. : Ancient India (NCERT)
4. Seenaiah E : భారతదేశ చరిత్ర
5. Thapar R. : History of India, Vol. I



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ జె. కృష్ణ ప్రసాద్ బాబు**

**పాఠం - 3**

# మలి వేద ఆర్యులు

## 3.0 లక్ష్యం:

* మలి వేద ఆర్యుల కాలం నాటి పరిస్థితులు తెలిసికొనుట.

* మలి వేద ఆర్యుల కాలంలో వచ్చిన మార్పులను అర్థం చేసుకొనుట.

## పాఠ్య నిర్మాణ క్రమం:

3.1 పరిచయం

3.2 భౌగోళిక పరిస్థితులు

3.3 కాలము

3.4 ఆధారాలు

3.5 మలి వేద కాలం నాటి పరిస్థితులు

3.5.1 రాజకీయ పరిస్థితులు

(ఎ) రాజు ఆధిపత్యము

(బి) పాలనా యంత్రాంగము - కేంద్ర పాలన

(సి) రాష్ట్ర పాలన

(డి) న్యాయ పాలన

3.5.2 ఆర్థిక పరిస్థితులు

(ఎ) వ్యవసాయం

(బి) వృత్తులు

(సి) వాణిజ్యం

3.5.3 సాంఘీక పరిస్థితులు

(ఎ) వర్ణ వ్యవస్థ

(బి) వివాహం

(సి) ఆశ్రమాలు

(డి) స్త్రీ స్థానము

(ఇ) సంఘంలో వచ్చిన ఇతర మార్పులు

3.5.4 మత పరిస్థితులు

(ఎ) త్రిమూర్తి వ్యవస్థ

(బి) కర్మ - పునర్జన్మ

(సి) సంస్కృతి

3.6 సారాంశము

3.7 మాదిరి ప్రశ్నలు

3.8 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 పరిచయం:

మలి వేద ఆర్యులు సప్త సింధు ప్రాంతం నుండి తూర్పు దిశగా బయలుదేరి గంగా-యమునా అంతర్వేది లేక ఆర్యవర్త ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పరచుకొనిరి. ఈ ప్రాంతం మిక్కిలి సారవంతమైన మైదాన ప్రాంతం కావటం వల్ల మరియు క్రీ.పూ. 800 నాటికి ఇనుమును వ్యవసాయ పనిముట్లుగా ఉపయోగించటం తెలుసుకోవటం వల్ల ఆర్థిక పరిస్థితులలో విపరీతంగా అభివృద్ధి వచ్చి దాని ఫలితముగా సమాజంలో, మత పరిస్థితులలో, సంస్కృతిలో మార్పులు చోటు చేసుకున్నాయి.

## 3.2 భౌగోళిక పరిస్థితులు:

మలి వేద ఆర్యులు గంగా మైదాన ప్రాంతంలో, మధ్య భారతదేశంలో, దక్షిణాపథంలో వచ్చి స్థిరపడిరి. వీరు స్థిరపడిన ప్రాంతాలలోని నదులు గంగా, యమున, నర్మద, గండక్, చంబల్ మొదలగున్నవి. వీటితోపాటు వింధ్య పర్వతాలు, పచ్చిక బయళ్ళు, ఆనాటి వాఙ్మయంలో వర్ణింపబడిన కంపిల, పాంచక, కోసల పురముల వాతావరణ పరిస్థితులు పరిశీలిస్తే ఈ ప్రాంతం సంవత్సరానికి 65 - 125 సెం.మీ. వర్షపాతం కురుస్తూ, వ్యవసాయానికి అనువైన ప్రాంతం. ఇనుము, రాగి తదితర నిక్షేపాలు కలిగిన ప్రాంతం.

## 3.3 కాలము:

మలి వేద ఆర్యుల కాలము క్రీ.పూ. 1000 - 600గా విభజించవచ్చు. వీరు ఇనుప యుగానికి చెందినవారు.

## 3.4 ఆధారాలు:

మలి వేద ఆర్యులకు సంబంధించి సామవేదం, యజుర్వేదం, అధర్వణ వేదం, బ్రాహ్మణకాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, ఇనుప పనిముట్లు, PGW మట్టి పాత్రలు మొదలగున్న పురావస్తు ఆధారాలు కూడా లభ్యమౌతున్నాయి.

## 3.5 మలి వేద కాలం నాటి పరిస్థితులు:

### 3.5.1 రాజకీయ పరిస్థితులు:

మలి వేద కాలంలో వివిధ కారణాల వల్ల ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థానంలో రాచరిక ప్రభుత్వాలు ఏర్పడి, సభ, సమితి ప్రాధాన్యతను కోల్పోయాయి. ప్రజల పై పన్నులు విధించటం ప్రారంభమైనది, రాజుకు ప్రజలను శిక్షించే అధికారం ఏర్పడి, రాజు దైవాంశ సంభూతుడనే భావన మొదలైంది. ఆధిపత్యం కొరకు ఆర్య జాతుల మధ్య జరిగిన పరస్పర యుద్ధములందు కొన్ని చిన్న బలహీనమైన జాతులు లేక తెగలు నశించగా, మరికొన్ని బలమైన తెగలుగా మారి విశాల రాజ్యముల స్థాపన గావించబడినది.

ఉదా॥ కురు, పాంచాల, కాశి, కోసల, మగధ మొదలగున్న జనపద రాజ్యాలు తరువాతి కాలంలో 16 మహా జనపద రాజ్యాల ఏర్పాటుకు దారి తీసినది.

**(ఎ) రాజు ఆధిపత్యము:** రాజ్య విస్తరణ చెందటంతో 'రాజన్', 'భూపతి'గా మారినాడు. వీరు తమ ఆధిపత్యం చాటుటకు రాజసూయ, అశ్వమేథ, వాజపేయ యాగాలు నిర్వహించి, ఏకరాట్, సామ్రాట్, మొదలగు బిరుదులను పొందిరి. సర్వాధికారియైన భూపతి కాలక్రమేణా 'రాజు'గా మార్పు చెంది నిరంకుశముగా ప్రవర్తించుటకు ఈ కాలంలో ప్రయత్నములు జరిగెను. ఈ కాలంలో రాజరికము వంశపారంపర్యము అయ్యేను. అయితే కొన్ని సందర్భాలలో రాజును ఎన్నుకొను సాంప్రదాయం ఉండెను. ప్రజా రక్షణ, రాజ్య రక్షణ, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, యజ్ఞ యాగాదులు, క్రతువులు, యుద్ధాలు నిర్వహించుట రాజు యొక్క ప్రధాన విధులుగా మారెను. రాజు ధర్మపాలన చేయవలెనని 'శతపథ బ్రాహ్మణము' చాటుతున్నది.

**రాజు ఆధిపత్యం పై ఆంక్షలు:** రాజ్యానికంతటికి రాజు సర్వాధికారియైనను అతని పై, అధికారము పై కొన్ని ఆంక్షలు కలవు. ఋగ్వేద కాలం వలె ప్రజా సంస్థలైన సభ, సమితులు ఎక్కువగా కాకపోయినా, కొంత వరకు రాజ్యాధికారము పై ప్రాబల్యము కలిగి ఉండెను. ఈ కాలంలో రాజు పై బ్రాహ్మణులు ఆధిపత్యము పెరిగెను. రాజు పట్టాభిషేక సమయంలో, యుద్ధాలకు బయలుదేరునప్పుడు, యుద్ధ విజయాలు సాధించినపుడు, బ్రాహ్మణులకు పాదాభివందనము చేసి, వారిని సర్వత్రా కాపాడగలనని ప్రమాణము చేయవలెను.

**(బి) పాలనా యంత్రాంగము - కేంద్ర పాలన:** రాజ్యమునకు ముఖ్య పాలనాధికారి రాజైనను విశాల రాజ్యాలు ఏర్పడినందు వలన పరిపాలనా యంత్రాంగము నిర్వహణ కష్టతరమయ్యెను. అందువలన రాజుకు ఋగ్వేద కాలం కంటే ఉద్యోగుల సంఖ్య గణనీయముగా పెరిగెను. పాలనా నిర్వహణలో పురోహితుడు, సేనాధిపతుడే కాక, సమంత (రధ సారధకుడు), సంగ్రహిత (కోశాధికారి), సచివ (మంత్రి), భాగ దూఘ (శిస్తు అధికారి), సంధి విగ్రహక (విదేశీ వ్యవహారాలు) మొదలగు ఉద్యోగులు రాజుకు సహాయకారులుగా కేంద్రములో ఉన్నట్లు మలి వేద సాహిత్యం తెలుపుతున్నది.

**(సి) రాష్ట్ర పాలన:** విశాల సామ్రాజ్యాలు పరిపాలనా సౌలభ్యం కొరకై రాజ్యమును కొన్ని రాష్ట్రాలుగా విభజించిరి. ప్రతి రాష్ట్రమునకు 'స్థపతి', 'శతపధి' అనే రాష్ట్రాధికారులున్నట్లు తెలియుచున్నది. ఋగ్వేద కాలంలో వలె గ్రామణి గ్రామ పాలనాధికారియైనను. పరిపాలనలో సహాయం చేయుటకు 'అధికృత' అనే ఉద్యోగి ఉండేవాడు.

**(డి) న్యాయ పాలన:** రాజ్యానికి రాజు సర్వోన్నత న్యాయాధికారి. కొన్ని సమయాలలో రాజ్యాధికారమును 'రాజన్యుడు' అనే ఉద్యోగి ద్వారా అమలు జరుపును. రాజద్రోహము, హత్య, గర్భస్రావము, దొంగతనము, వ్యభిచారం మొదలగున్నవి ఆనాటి నేరాలలో పెద్దవి. రాజ ద్రోహమునకు శిక్ష 'మరణ శిక్ష' కాగా, హత్యకు నూరు ఆవుల పరిహారము. దివ్య పరీక్షల ద్వారా తీర్పు చెప్పుట ఈ కాలంలో ఆచారముగా కలదు. గ్రామములందు జరుగు నేరములను 'గ్రామవాది' అనే ఉద్యోగి విచారించి, తీర్పు చెప్పెడివాడు. శిక్షలు కఠినంగా ఉండెను.

### 3.5.2 ఆర్థిక పరిస్థితులు:

**(ఎ) వ్యవసాయం:** ఋగ్వేద కాలం నాటి పశుపోషణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ ఏర్పడినది. మలి వేద ఆర్యుల వ్యవసాయ పద్ధతుల గురించి మరియు ఏరువాక ఉత్సవముల గురించి శతపథ బ్రాహ్మణం తెలియ చేసింది. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పడ్డాయి. గంగా-మైదాన ప్రాంతంలో అడవులను నరికి పంట పొలాలుగా రూపొందించి వ్యవసాయ ఉత్పత్తులను పెంచిరి. వ్యవసాయం పనిముట్లలో ఇనుము ప్రధాన పాత్ర వహించెను. వ్యవసాయంలో ఇనుము రాకతో అధిక ఉత్పత్తులు జరగటాన్ని Gordon Childe 'విప్లవాత్మకము' (Revolutionary)గా వర్ణించెను. వజసాహిణి సంహితలో మలి వేద ఆర్యులు బియ్యం, పప్పు దినుసులు, నూనె గింజలు మొదలగు పంటలను పండించినట్లుగా తెలుస్తుంది. పప్పు దినుసులు, చెరుకును భారతదేశంలో మొదటిసారి ఆర్యులు ప్రవేశపెట్టినారు.

**(బి) వృత్తులు:** వ్యవసాయోత్పత్తితోపాటు ఈ కాలంలో జన సంఖ్య పెరిగెను. ఈ కాలంలో వృత్తి పనివారి సంఖ్య ఋగ్వేద కాలం కంటే మూడింతలు ఎక్కువ అయ్యెను. వృత్తుల యందు స్థిరత్వం, నైపుణ్యము చోటు చేసికొనెను. మేదరులు, జాలరులు, కసాయి వారు, తాళ్ళునేయు వారు, క్షుర కర్మలు చేయువారు మొదలగువారు వృత్తులందు చేరిరి. వ్యవసాయంలోను, వృత్తులలోను బానిసలను ఉపయోగించెడి ఆచారం కలదు. కుమ్మరి వృత్తి పని వారు సమాజంలో గౌరవ స్థానమును పొందిరి.

**(సి) వాణిజ్యం:** ఈ కాలంలో వర్తక వ్యాపారములందు గణనీయమైన అభివృద్ధి సాధింపబడెను. దేశీయ, విదేశీ వ్యాపారము వర్ధిల్లెను. వర్తక, వ్యాపారములను 'వణిజులు' అనే ప్రత్యేక వర్గము వారు చేపట్టి దాని

ప్రగతికి కృషి చేసిరి. వర్తకంలో వస్తు మార్పిడి తగ్గి 'నిష్క', 'శతపథ', 'కర్షపణ' అనే బంగారు, వెండి నాణెములు వాడుకలోనికి వచ్చెను. ధనమును వడ్డీకి తీసుకొను ఆచారము అమలులోనికి వచ్చెను. ఆర్థికాభివృద్ధి ఫలితముగా తక్షశిల, కాశి, కౌశాంబి, హస్తినాపురం మొదలగు వర్తక, వాణిజ్య ముఖ్య కేంద్రాలుగా వర్థిల్లెను. ఈ నగరములు కలుపుచూ రాచ బాటలు నిర్మింపబడెను. రథములు, ఎద్దుల బండ్లు, గుఱ్ఱములు ఆనాటి ప్రయాణ సాధనములు.

### 3.5.3 సాంఘీక పరిస్థితులు:

**(ఎ) వర్ణ వ్యవస్థ:** ఈ కాలంలో వర్ణ వ్యవస్థ అమలులోనికి వచ్చినది. వృత్తులను బట్టి వర్ణములు ఏర్పడెను. ఈ వర్ణ వ్యవస్థను చాతుర్వర్ణ వ్యవస్థగా పేర్కొనిరి.

1. బ్రాహ్మణులు - దేవతారాధన, విద్యా బోధన.
2. క్షత్రియులు - యుద్ధాలు, శాంతిభద్రతలను కాపాడుట.
3. వైశ్యులు - వర్తక వాణిజ్యాలు
4. శూద్రులు - సేవలు, వ్యవసాయం.

ఈ వృత్తులే తదుపరి వంశపారంపర్యము అయ్యెను. వర్ణాంతర వివాహములు, వర్ణాంతర భోజనములు తగ్గిపోయెను. మలి వేద కాలంలో ద్విజులు, ఏకజులు అనే వ్యవస్థ ఏర్పడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ద్విజులుగా పిలువబడినారు. వీరికి ఉపనయనం ఉంటుంది. శూద్రులు ఏకజ వర్గంలోకి వస్తారు. వీరికి ఉపనయనం ఉండదు. మలి వేద కాలంలో పంచమ వర్ణంగా దాసదస్యులు పిలువబడినారు.

**(బి) వివాహం:** మలి వేద కాలంలో అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు కొనసాగినవి. ప్రతిలోమ వివాహం ధర్మబద్ధం కాదని పరిగణించబడినది. అయితే అనులోమ వివాహము వారి సంతానము గౌరవింపబడినది. ఈ కాలంలో అష్ట వివాహ వ్యవస్థ ఏర్పడినది. బ్రహ్మ వివాహం, దైవ వివాహం, అర్ష వివాహం, ప్రజాపత్య వివాహం, గాంధర్వ వివాహం, పైశాచ వివాహం, అసుర వివాహం, రాక్షస వివాహం.

**(సి) ఆశ్రమాలు:** మలి వేద కాలంలో ప్రతి వ్యక్తి ఆశ్రమ ధర్మాన్ని పాటించవలెనని బోధించారు. ఈ ఆశ్రమ వ్యవస్థలో నాలుగు దశలు కలవు. 1. బ్రహ్మచర్యం, 2. గృహస్థు, 3. వానప్రస్థం, 4. సన్యాసం. ఈ ఆశ్రమ ధర్మాలను ధర్మ, అర్థ, కామ, మోక్ష మొదలగు పురుషార్థాలతో పాటించాలి.

**(డి) స్త్రీ స్థానము:** సింధు నాగరికత కాలంలో స్త్రీ ఆధికత్య ఋగ్వేద కాలానికి స్త్రీ సమానత్వం అయింది. మలి వేద కాలం నాటికి స్త్రీ విచక్షణకు గురియైనది. ఈ కాలంలో స్త్రీలకు సభ, సమితులందు సభ్యత్వము లేదు. క్షత్రియ స్త్రీలలో తప్ప మిగిలిన వర్ణాలలో స్త్రీలకు భర్తను ఎన్నుకొనుటలో స్వాతంత్ర్యము లేదు. ఆడ శిశువులు జన్మించుట దుఃఖభరితములుగా భావించిరి. బాల్య వివాహాలు, వరకట్నములు, సతీ సహగమనము ఆచరణలోనికి వచ్చెను. బహుభార్యత్వము ఎక్కువయ్యెను. స్త్రీకి ఆస్తిలో హక్కు లేదు. భర్తకు అణుకువుగా, విధేయురాలైన స్త్రీని ఆదర్శ గృహిణిగా పరిగణించిరి.

**(ఇ) సంఘంలో వచ్చిన ఇతర మార్పులు:** ఈ కాలంలో సమాజంలో అనగా వస్త్రధారణ, ఆహారము, విందులు, వినోదములందు కొద్ది మార్పులు జరిగెను. మాంసాహారము భుజించుట, సోమ, సుర పానీయములను సేవించుట పాపకార్యములుగా భావించిరి. వాద్య, సంగీత, వినోదములందు నటనకు ప్రాధాన్యత ఇవ్వబడెను. స్త్రీలు సంగీత, నాట్యములను అభ్యసించిరి. గోత్ర, ఆచారములు, ఆర్య-అనార్య వర్ణ భేదములు మొదలగున్నవి ప్రారంభమయ్యెను.

**3.5.4 మత పరిస్థితులు:** ఋగ్వేద కాలంలో ప్రాధాన్యత గల దేవుళ్ళు ఈ కాలంలో తక్కువ ప్రాధాన్యత గల దేవుళ్ళుగా మారారు. ఈ కాలంలో త్రిమూర్తుల పద్ధతి ప్రారంభమైనది. ఋగ్వేద ముఖ్య దేవుళ్ళు త్రిమూర్తులకు అనుబంధ దేవుళ్ళుగా మారినారు. త్రిమూర్తి ఆరాధన గురించి మైత్రేయిని ఉపనిషత్తు ప్రస్తావించినది.

**(ఎ) త్రిమూర్తి వ్యవస్థ:**

1. ప్రజాపతి - బ్రహ్మ (సృష్టికర్త)
2. విష్ణు - విష్ణువు (లోక రక్షకుడు)
3. రుద్ర - రుద్రుడు (చెడును నాశనం చేయు వాడు)

**(బి) కర్మ - పునర్జన్మ:** ఈ యుగంలో వచ్చిన మత మార్పులతో యజ్ఞయాగాదులు, క్రతువులు అధికమై ఖర్చుతో కూడుకున్న పరిస్థితి ఏర్పడింది. ఇవి సామాన్యులకు అందుబాటులో లేక వారి యందు ఆధ్యాత్మిక అశాంతి ప్రబలెను. మరి కొందరికి జీవితం పై విసుగు, విరక్తి పెరిగి అడవులకేగి తపస్సు చేసి, మోక్షము పొందనెంచిరి. ముక్తిని సాధించుటకు జ్ఞాన సముపార్జన మార్గమని భావించిరి.

కర్మ, పునర్జన్మ, సంసారము, ఆత్మ, పరమాత్మ మొదలగు సిద్ధాంతములు ఆమోదింపబడెను. ఆత్మ శాశ్వతమైనదని, దానికి మరణము లేదని, ఆత్మ పరమాత్మలో లీనమగుట మోక్షమని విశ్వసించిరి.

**(సి) సంస్కృతి:**

* మలి వేద కాలంలో లిపి వాడకం వచ్చి, విద్యనభ్యసించుటకు గురుకులాలు వచ్చినవి.
* విస్తారంగా ధరించిన ఆభరణములు - శంఖములతో చేసిన ఆభరణములు.
* వినోదములు - రథ పందెములు, గుఱ్ఱపు పందెములు మరియు జూదము.
* ఈ కాలంలోని సంగీత పరికరము - శతంతు

## 3.6 సారాంశము:

సప్త సింధూ ప్రాంతంలో దాదాపు 500 సంవత్సరాలు (క్రీ.పూ. 1500-1000) వరకు సంచరించిన ఋగ్వేద ఆర్యులు పశుపోషణ (ముఖ్యంగా గోవును) ప్రధాన వృత్తిగా జీవించారు. పశువుల కొరకు (గోవు) యుద్ధాలు జరిగాయి. అయితే సప్త సింధు ప్రాంతం నుండి తూర్పుగా పయనించి ఆర్యావర్తము లేక గంగా-యమునా మైదాన ప్రాంతములో సారవంతమైన భూములు, జీవనదులు, చక్కటి వర్షపాతం, ఇనుము వ్యవసాయంలో వినియోగం మొదలగు వాటితో మలి వేద ఆర్యులు (క్రీ.పూ. 1000 - 600) వ్యవసాయం ప్రధాన వృత్తి అయినది. అందువల్ల ఋగ్వేద కాలంలోని రాజన్, మలి వేద కాలం నాటికి భూపతి అయినాడు. అంతేకాక యుద్ధాలు చేసి రాజ్య విస్తరణ చేయటం వల్ల మలి వేద కాలంలో భూపతి (రాజు) సభ, సమితి స్థానాలలో ఉద్యోగ వ్యవస్థ ఏర్పడినది.

ఇదే క్రమంలో సమాజంలో వృత్తి ధర్మం వంశపారంపర్యంగా మారి వర్ణ వ్యవస్థ ఏర్పడినది. స్త్రీలకు గౌరవ మర్యాదలు తగ్గి సతీసహగమనము, బాల్య వివాహములు ప్రారంభమైనవి. సమాజంలో కట్టుబాట్ల కొరకు 8వ శతాబ్దం నుండి ధర్మ శాస్త్రాలు, ధర్మ సూత్రాలు వ్రాయబడినవి. మత ప్రకారంగా ఋగ్వేద కాలం నాటి ప్రకృతి ఆరాధన, మలి వేద కాలంలో యజ్ఞయాగాలు, క్రతువులు, పూజలు ప్రారంభమై సామాన్యులకు మోక్షం పొందటం ఖర్చుతో కూడుకున్న పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనప్పటికీ మలి వేద ఆర్యుల నాగరికత ఇప్పటికీ భారతదేశంలో ఎక్కువ ప్రాంతంలో కొనసాగుతూ ఉన్నది.

"ఆర్యుల కాలము నాటి వేద భావములు నేటికీ భారతదేశములో బలీయమైన శక్తులు" - V.A. స్మిత్

## 3.7 మాదిరి ప్రశ్నలు:

**(ఎ) ఈ క్రింది సూక్ష్మరూప ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము.**

1. మలి వేద ఆర్యులు నివసించిన ప్రాంతం ఏది?
2. మలి వేద కాలం నాటి రాజ్యపాలకుడిని ఏమని పిలిచారు?
3. మలి వేద కాలంలో విదేశీ వ్యవహారాలు నిర్వహించే అధికారిని ఏమని పిలిచారు?
4. భారతదేశంలో పన్ను విధించుట అనే ఆర్థిక కార్యక్రమము ఎప్పుడు ప్రారంభమైంది?

**(బి) ఈ క్రింది ఖాళీలను పూరింపుము.**

1. మలి వేద కాలం నాటి త్రిమూర్తులు ........................................................
2. ఇనుప లోహమును వ్యవసాయంలో వినియోగించిన మొదటి వారు ..........................................
3. రాజు ధర్మపాలన చేయవలెనని .................................................. చాటుతున్నది.
4. మలి వేద కాలంలో రాష్ట్ర పాలకుడిని ........................................................ అని పిలిచేవారు.
5. మలి వేద కాలంలో గ్రామ న్యాయాధికారిని ...................................................... అని పిలిచేవారు.

**(సి) ఈ క్రింది వానిని జతపరుచుము.**

1. అధికృత ( ) ఎ) అరణ్యములకు వెళ్ళి తపస్సు చేసుకొనుట
2. వైశ్యులు ( ) బి) సంగీత పరికరం
3. శతంతు ( ) సి) గ్రామపాలన సహాయాధికారి
4. మోక్షము ( ) డి) వర్తక, వాణిజ్యాలు నిర్వహించేవాడు.
5. వానప్రస్థం ( ) ఇ) ఆత్మ, పరమాత్మతో లీనమగుట.

**(డి) ఈ క్రింది సంక్షిప్త ప్రశ్నలకు సమాధానము వ్రాయుము.**

1. మలి వేద కాలంనాటి వర్ణ వ్యవస్థను వ్రాయుము.
2. ఆశ్రమ ధర్మాలు ఏమి?
3. కర్మ - పునర్జన్మలను వివరించుము.
4. వివాహములోని రకాలను తెలుపుము.
5. మలి వేద కాలం నాటి స్త్రీల పరిస్థితిని వివరించుము.

**(ఇ) ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానము వ్రాయుము.**

1. మలి వేద కాలం నాటి రాజకీయ పరిస్థితులను వివరించుము.

2. మలి వేద కాలం నాటి ఆర్థిక పరిస్థితులను తెలుపుము.

3. మలి వేద కాలం నాటి సాంఘీక, మత పరిస్థితులను తెలియజేయుము.

## 3.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Basham A.L. : The Wonder that was India
2. Kusambi, D.D. : An Introductory to the study of Indian History
3. Sharma R.S. : Ancient India (NCERT)
4. Thapar R : History of India, Vol I.



పాఠ్యభాగ రచయిత

డా॥ జె. కృష్ణ ప్రసాద్ బాబు

## UNIT - II

**ప్రాచీన భారతదేశ చరిత్ర & సంస్కృతి**
**(క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి క్రీ.పూ. 2వ శతాబ్దం వరకు)**

**పరిచయం:**

క్రీ.పూ. 6వ శతాబ్దం ప్రాచీన భారతదేశ చరిత్రలో ఒక కీలకమైన దశ. ఈ యుగంలో తొలి రాజ్యాలు, నగరాలు ఆవిర్భవించడం, ఇనుము వినియోగం పెరగడం, నాణెల అభివృద్ధి వంటివి జరిగాయి. ఈ యుగములోనే వివిధ రకాల ప్రభుత్వ పద్ధతులు, రాజకీయ, మతపరమైన ఆలోచనా విధానాలు అభివృద్ధి చెందాయి. ఈ యుగంలో అవతరించిన మహా జనపదాలు, వాటి లక్షణాలు ప్రస్తుత కాలములోని రాజ్య పరిస్థితులలో స్పష్టంగా కనిపిస్తాయి. ప్రారంభంలో ఏర్పడిన జనపద రాజ్యాలు తెగ నాయకులతో పరిపాలించబడేవి. అయితే 'సభ', 'సమితి' అనే సంస్థలు అధికారాలను కలిగి ఉండేవి. తరువాత కాలంలో 16 జనపద రాజ్యాలుగా రూపొందిన తరువాత సభ, సమితులు ప్రాముఖ్యతను కోల్పోయి, రాజరిక రాజ్యాలుగా ఏర్పడ్డాయి, ఉదా॥ మగధ. కొన్ని గణతంత్ర రాజ్యాలుగానే కొనసాగినాయి, ఉదా॥ గాంధార.

ఈ కాలంలోనే క్రీ.పూ. 516లో పర్షియన్ చక్రవర్తి డేరియస్-I భారతదేశ పశ్చిమోత్తర ప్రాంతం పై దండయాత్ర చేసి తన భూభాగంలో కలుపుకొని, దానిని తన 20వ క్షాత్రపి (రాష్ట్రంగా) చేసుకున్నాడు. భారతదేశం పై జరిగిన మొదటి దండయాత్రగా దీనిని చెప్పవచ్చు.

ఆర్థికంగా పరిశీలిస్తే క్రీ.పూ. 6వ శతాబ్దం సుసంపన్నమైనది. వ్యవసాయంలో ఇనుము ప్రవేశించటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు అధికంగా పెరిగి, వృత్తులు, వ్యాపారాలు అభివృద్ధి చేందినవి. మౌర్య రాజులు వ్యాపారాభివృద్ధి కొరకు జాతీయ రహదారులు, విద్ధాంక నాణెలు (Punch Marked Coins) ముద్రించి, ప్రోత్సహించారు. ఈ ఆర్థిక పరిస్థితులలో వచ్చిన విపరీతమైన మార్పులు వైదిక మతంలోని అనేక లోపాలు మేధావులలో ఆలోచనలను రేకెత్తించి, కొత్త మతాలైన చార్వాక, అజవిక, జైన, బౌద్ధ మొదలైన 62 మత శాఖలు ఏర్పడ్డాయి. ఆ విధంగా మతోద్యమాలు క్రీ.పూ. 63వ శతాబ్దానికి ఉన్నట్లు ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ అభిప్రాయం.

క్రీ.పూ. 326లో మరొక పర్యాయం భారతదేశం పైకి విదేశీ దాడులు గ్రీకుల రూపంలో, అలెగ్జాండర్ నాయకత్వంలో జరిగింది. అలెగ్జాండర్ క్రీ.పూ. 326 నుండి 323 మధ్య కాలంలో సింధు నది ప్రాంతాల్లో గాంధారా, తక్షశిల, పురూరవ మొదలగు రాజ్యాలు ఆక్రమించి, వివిధ కారణాలతో వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ బాబిలోనియా ప్రాంతంలో మరణించారు.

----------

**యూనిట్ - 2**

# ప్రాచీన భారతదేశ చరిత్ర & సంస్కృతి

## (క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి క్రీ.పూ. 2వ శతాబ్దం వరకు)

**పాఠం - 1**

# క్రీ.పూ. ఆరో శతాబ్దం ప్రాముఖ్యం

### 3.0 లక్ష్యం:

* ఈ పాఠంలో క్రీ.పూ. ఆరో శతాబ్దం ప్రాముఖ్యం, జైన మతం, బౌద్ధ మతంల గురించి తెలుకొనుట.

### పాఠ్య నిర్మాణ క్రమం:


1.1 6వ శతాబ్దం విశిష్టత

1.2 రాజకీయ పరిస్థితులు

1.3 షోడశ మహా జనపదాలు

1.4 గణతంత్ర రాజ్యములు

1.5 సారాంశము

1.6 మాదిరి ప్రశ్నలు

1.7 ఉపయుక్త గ్రంథాలు


## 1.1 6వ శతాబ్దం విశిష్టత:

క్రీ.పూ. 6వ శతాబ్దం ప్రపంచ చరిత్రలో ప్రాముఖ్యతను కల్గి ఉంది. పురాతన వ్యవస్థను త్రోసిపుచ్చి తరతరాల మూఢ విశ్వాసాల పై, ఆచార సాంప్రదాయాల పై తిరుగుబాటు చేసి, నూతన తాత్త్విక విచారం ప్రారంభించడం జరిగింది. గ్రీక్ ద్వీపాలైన అయోనియాలో, హెరిక్లిటస్, పిరమిడ్స్, ఎంపెడో క్లెస్ సాంఘీక మత విషయాలలో చైతన్యం కల్గించడానికి కృషి చేశారు. గ్రీస్‌లో సోక్రటీస్, పర్షియాలో నాటి మూఢ విశ్వాసాలను జోరాస్టర్ నిశితంగా విమర్శించడం జరిగింది. చైనాలో కన్‌ఫ్యూషియస్ లావోత్సి బోధనలు జీవితాలకు దిశా నిర్దేశాలు చూపారు. ఇలా ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మిక భావనలు పురోగతిస్తున్న కాలంలో భారత దేశంలో కూడా వర్ధమాన మహావీరుడు, గౌతమబుద్ధుడు బోధనలు మత, సాంఘీక సమస్యలకు పరిష్కార మార్గం చూపడం జరిగింది.

## 1.2 రాజకీయ పరిస్థితులు:

క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి భారతదేశం 16 షోడశ మహా జనపదాలుగా ఉండి, రాజకీయ అనిశ్చితికి, అనైఖ్యతకు తలవాలంగా ఉండినాయి.

**ఆధారాలు:**

పురాణాలు, జైన, బౌద్ధ గ్రంథాలు, గ్రీకుల రచనలు.

## 1.3 షోడశ మహా జనపదాలు:

**1. అంగ:**

నేడు బీహార్ రాష్ట్రంలో ఉంది. భగల్‌పూర్ - మోంఘీర్ జిల్లాలకు చెందినది. రాజధాని చంపా నగరం, గంగా- చంపా నదుల మధ్య ప్రాంతం. సుప్రసిద్ధ వాణిజ్య కేంద్రం. మగధ రాజైన బింబిసారుడు 'అంగ'ను జయించి, మగధ రాజ్యంలో విలీనం చేసెను.

**2. కాశీ:**

వరుణ - అశి నదుల సంగమ స్థానమున నిర్మింపబడినది. గొప్ప విద్యా కేంద్రం. వారణాసి, కాశీ రాజధాని. కోసల, అంగ, మగధ రాజ్యములతో బద్ధవైరము. తుదకు కోసల రాజు జయించి ఆక్రమించుకొనెను.

**3. కోసల:**

ఉత్తరప్రదేశ్‌లోని ఔద్ (అయోధ్య ప్రాంతానికి చెందినది). ఈ రాజ్యాన్ని సరయూ నది రెండు భాగాలుగా విభజించింది. ఉత్తర కోసలకు శ్రావస్థి, దక్షిణ కోసలకు కుశావతి రాజధానులు. కాశీని మహా కోసలుడు జయించి, విలీనం చేసెను. మహా కోసలుడు కుమారుడు ప్రసేనజిత్తు మగధ రాజైన అజాతశత్రువుతో దీర్ఘకాల పోరాటం జరిపెను.

**4. మగధ:**

నేటి బీహార్‌లోని పాట్నా - గయా జిల్లాల మధ్య ప్రాంతం. ఇది చాలా బలమైన రాజ్యం, హర్యాంక వంశస్థుడైన బింబిసారుడు రాజు. మొదట గిరివ్రజపురం లేక రాజగృహ, తరువాత పాటలీపుత్రం రాజధానులైనవి. గంగా - శోణ్ నదుల మధ్య ప్రాంతమే ఈ పాటలీపుత్రం.

**5. ఛేది:**

డి-ఆర్ భండార్కర్ అభిప్రాయం ప్రకారం నేటి బుందేల్‌ఖండ్ రాజధాని శుక్తిమతి.

**6. వత్స:**

ఐశ్వర్యవంతమైంది, యమునా నదికి దక్షిణముగా ఉన్నది. ఉదయనుడనే రాజు పరిపాలిస్తూ ఉండెను. ఉదయనునికి అవంతి రాజు ప్రద్యోతనునికి బద్ధవైరము. ప్రద్యోతనుని కుమార్తె అయిన వాసవదత్తను వివాహమాడగా వైరము స్నేహముగా మారెను.

**7. కురు:**

ఇది నేటి ఢిల్లీ, మీరట్ జిల్లాల ప్రాంతం. రాజధాని ఇంద్రప్రస్థం. మహాభారత యుద్ధ రంగస్థలం ఇది.

**8. పాంచాల:**

ఇది నేటి ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ - ఫరూకాబాద్ జిల్లాల ప్రాంతం. గంగానది ఈ రాజ్యమును ఉత్తర దక్షిణ భాగాలుగా విభజించెను. ఉత్తర పాంచాలకు అహిచ్ఛత్రము. దక్షిణ పాంచాలకు కాంపిల్యము రాజధానులు. మొదట రాజరికంగా ఉన్నను క్రీ.పూ. 6వ శతాబ్దికి గణ రాజ్యము అయ్యెను.

**9. మత్స్య:**

ఇది నేటి రాజస్థాన్‌లోని జయపూర్ ప్రాంతం. రాజధాని విరాట నగరం. మత్స్య రాజులలో ఒక శాఖ వారు విశాఖపట్టణం ప్రాంతంలో రాజ్యం చేశారు.

**10. శూరసేన:**

ఢిల్లీ - ఆగ్రాల మధ్య యమునా నది పై నున్న రాజ్యము. రాజధాని మధుర. అవంతి పుత్రుడను రాజు దీనికి అధిపతి.

**11. అస్మక:**

ఇది దక్షిణ భారతదేశంలో ఉన్నది. అస్సక, ములక రాజ్యానికి మధ్య గోదావరి నది ప్రవహిస్తున్నది. రాజధాని పోతన. నేటి నిజామాబాద్ జిల్లాలో ఉంది. ములక రాజధాని ప్రతిష్ఠాన (పైఠాన్) పురం. ఇది అంథకులు లేదా ఆంధ్రుల భూభాగం. సుజాతనుడు అనే రాజు పరిపాలించుచుండెను.

**12. అవంతి:**

వేత్ర నది ప్రాంతాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తుంది. నేటి మధ్యప్రదేశ్‌లోని మాళ్వా ప్రాంతం. మొదట మహిష్మతి, తదుపరి ఉజ్జయినీ దీని రాజధానులు. చండ ప్రద్యోతనుడు పరిపాలించుచుండెను.

**13. గాంధార:**

నేటి రావల్పిండి - పెషావర్‌ల మధ్య ప్రాంతం. రాజధాని తక్షశిల ప్రాచీన విద్యా కేంద్రం. పుష్కరశిరి అను రాజు పరిపాలించుచుండెను.

**14. భోజ:**

భారతదేశ వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని హజరా జిల్లా ప్రాంతం.

## 1.4 గణతంత్ర రాజ్యములు:

**1. వజ్జి గణ రాజ్య సమాఖ్య:**

ఎనిమిది తెగలు ఉన్న గణ రాజ్య సమాఖ్య. ప్రతి తెగకు ప్రత్యేకముగా ఒక ప్రభుత్వము, ఒక రాజధాని. విదేహ, జ్ఞాత్రిక, లిచ్ఛవి, వజ్జీ ముఖ్యమైనవి. విదేహకు మిధిలా రాజధాని. వీరు కోసల, మల్ల రాజ్యములతో నెయ్యమును కల్గి మగధ రాజ్యముతో పోరాడిరి. కానీ లిచ్ఛవీ రాజు ఛేతక రాజు తన కుమార్తె చల్లనను మగధ రాజు అయిన బింబిసారునికి ఇచ్చి వివాహం చేయడంతో వారి ప్రాబల్యం అడుగంటినది.

**2. మల్ల గణ రాజ్య సమాఖ్య:**

9 తెగలున్న గణతంత్ర సమాఖ్య వైశాలికి ఉత్తరంగా ఉన్నది. కుశి నగరం పావా రాజధానులుగా ఉన్నవి. బుద్ధుని మరణం తరువాత మల్ల, మగధలో కలిసినది. షోడస మహా జన పదాలు పరస్పరం సార్వభౌమాధికారం కొరకు కలహించుకుంటూ ఉండటం వలన మగధ విజృంభించి జన పదాలపై ఆధిపత్యం సాధించి, సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించింది.

**3. మగధ రాజ్య విస్తరణ:**

ఇతిహాస కాలము నుండి మగధను బృహద్రుద వంశం పరిపాలించుచుండెను. మగధ రాజ్యాన్ని స్థాపించినవాడు బృహద్రుదుడు. గిరివ్రజము అతని రాజధాని. జరాసంధుడు ఇతడి వంశం వాడే. బృహద్రుద వంశంలో చివరి రాజైన రిపుంజయుని తుదముట్టించి హర్యాంక వంశస్థుడైన బింబిసారుడు మగధకు క్రీ.పూ. 547లో ఆక్రమించెను.

**4. హర్యాంక వంశం:**

**(ఎ) బింబిసారుడు (క్రీ.పూ. 547 - 495):**

ఇతను బుద్ధుని సమకాలికుడు. గొప్ప యోధుడు, రాజనీతి చతురుడు. కోసల, లిచ్ఛవీ, మద్ర, విదేహ రాజ కన్యలను వివాహమాడి, మగధ రాజ్య విస్తరణ చేసినాడు. కోసల రాజకుమారి సాలీన లక్ష సువర్ణాల ఆదాయం గల కాశి గ్రామాన్ని అరణంగా తెచ్చింది. అంగరాజు అయిన బ్రహ్మదత్తుని ఓడించి ఆ రాజ్యాన్ని ఆక్రమించాడు. గాంధార రాజు, బింబిసారుని మైత్రిని కాంక్షించి రాయబారం పంపాడు. బింబిసారుడు జైనుడని జైన గ్రంథాలు, బౌద్ధుడని బౌద్ధ గ్రంథాలు పేర్కొన్నాయి. బుద్ధ ద్వేషి అయిన దేవదత్తుడు చేత ప్రేరేపితుడైన అజాతశత్రువు తండ్రిని చంపి సింహాసనం ఆక్రమించాడని బౌద్ధ అనుశృతి. భర్త అకాల మృతిని తట్టుకోలేని కోసల దేవి మృతి చెందిన తరువాత ఆమె సోదరుడు ప్రసేనజిత్తు అరణంగా ఇచ్చిన కాశీని తన కైవసం చేసుకున్నాడు.

**(బి) అజాతశత్రువు:**

భారతదేశ చరిత్రలో తొలి పితృ హంతకుడిగా బింబిసారుడు ఖ్యాతి గడించినాడు. సింహాసనం అధిష్టించిన వెంటనే తన మేనమామ అయిన ప్రసేనజిత్తుతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఓడిపోయి సంధి చేసుకొని, మగధకు రాజుగా ప్రసేనజిత్తును ప్రకటించి, అరణంగా వచ్చిన కాశీని వదులుకోవాల్సి వచ్చింది. అనంతరం అజాతశాత్రువు వరుస విజయాలతో తూర్పు భారతదేశాన్నంతటిని తన పరిపాలన క్రిందకు తెచ్చుకున్నాడు. అవంతి రాజైన ప్రద్యోత మగధ పై దాడి ఒక వైపు, శక్తివంతులైన లిచ్ఛవీలు ఒక వైపు దాడి చేయుటకు సిద్ధం అవ్వగా వారిని జయించాలంటే ఒక బలమైన కోట అవసరమని భావించి, గంగా-సోన్ నదుల మధ్య పాటలీ అనే కోటను నిర్మించాడు. తరువాత లిచ్ఛవీ పై దాడి చేసి గణరాజ్యాలైన వైశాలి, వైదేహిలను ఆక్రమించుకున్నాడు. ఇతడు బుద్ధునికి, మహావీరునికి సమకాలీనమే. మొదటి బౌద్ధ సంగీతి అజాతశత్రువుని కాలంలోనే మహాకశ్యపుడు అధ్యక్షతన రాజగృహంలో జరిగెను. ఇతడు అతని కుమారుడైన ఉదయబద్రుని చేతిలో హత్య గావించబడ్డాడు.

**(సి) ఉదయబద్రుడు లేక ఉదయనుడు:**

ఇతను పాటలీ కోట యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ఆ కోట చుట్టూ కుసుమపురము అనే పట్టణాన్ని నిర్మించెను. ఆ పట్టణం తరువాత పాటలీపుత్రం అయినది. రాజధానిని పాటలీపుత్రంనకు మార్చెను. అవంతి రాజైన ప్రద్యోతకును ఇతనికి మధ్య వైరము ఉన్నందున ప్రద్యోత ప్రోత్సాహముతో ప్రద్యోతకు సన్నిహితుడైన ఒక జైన మతస్థుడు ఇతనిని హత్య చేసినాడు.

**(డి) చివరి రాజులు:**

ఉదయభద్రుడు తరువాత అనిర్దుడు, ముండరాజు, నాగదాసకుడు వరుసగా పాలించారు. వీరందరు పితృ హంతకులు అగుటచే ప్రజలు వీరి దుర్మార్గములను సహింపలేక తిరుగుబాటు చేసి, మంత్రియైన శిశనాగుని రాజుగా చేసిరి.

**(ఇ) శైశు నాగ వంశం:**

వంశస్థాపకుడు శిశునాగుడు. ఇతడు రాజధానిని పాటలీపుత్రం నుండి రాజ గృహమునకు మార్చెను. ఇతడు గొప్ప యోధుడు. అవంతి, కోసల, వత్స, రాజ్యములను జయించి మగధ సామ్రాజ్యమున విలీనం చేశాడు.

**(ఎఫ్) కాలాశోకుడు:**

ఇతని కాలము నందు వైశాలిలో రెండవ బౌద్ధ సంగీతి జరిగెను. పురాణాలలో చెప్పిన కాకవర్ణుడు ఇతడే. క్రీ.పూ. 364 సంవత్సరంలో నంద వంశస్థులు కాలాశోకుని, అతని పది మంది కుమారులను హత్య చేసి, మహా పద్మనందుడు మగధను ఆక్రమించి, నంద వంశంను స్థాపించెను.

**నంద వంశము (క్రీ.పూ. 364-324):**

**మహాపద్మ నందుడు:**

మహా పద్మనందుడు శూద్రుడని పురాణాలు, అజ్ఞాత కులజుడని బౌద్ధ గ్రంథాలు, హీన జాతి వాడని (మంగలి యొక్క బానిస) గ్రీకు రచనలు అభివర్ణించడం జరిగింది. ఇతడు క్షత్రియ పాలకులగు పాంచాల, కాశి, కురు, అస్మక, కోసల మొదలగు రాజ్యాలను ఆక్రమించుకొనెను. ఈ విజయాలకు చిహ్నంగా 'క్షాత్రంతక' బిరుదును పొందినాడు. ఖారవేలుని హాథిగుంఫా శాసనం మహా పద్మనందుడు కళింగను జయించినట్లు చెప్తున్నది. సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి 'ఏక్‌రాట్' అనే బిరుదును పొంది, భారత సామ్రాజ్య నిర్మాతగా మహా పద్మనందుడు ప్రసిద్ధికెక్కాడు.

మహా పద్మనందుని తరువాత వరుసగా అతని కుమారులైన 9 మంది రాజ్యపాలన చేసిరి. ఉగ్రసేన, రాష్ట్రపాల, గోవిషనాక్, దస సిద్ధిక్, పాండుక్ పాండుగట్టి, భూతపాల, కైవర్త, ధననంద. వీరిని నవ నందులు అంటారు. నందులకు 20,000 గుర్రాలు, 2 లక్షల కాల్బలం, 2 వేల రథాలు, 3 వేల ఏనుగులు ఉండేవని గ్రీకు రచనలు పేర్కొన్నాయి. గొప్ప సామ్రాజ్యం, సకల సంపదలు కల్గిన నందులు ప్రజల అభిమానం చూరగొన లేకపోవటం వలన అలెగ్జాండర్ సులభంగా గెలవవచ్చునని మౌర్య చంద్రగుప్తుడు అనుయాయులకు చెప్పాడు. పంజాబ్ రాజైన పురుషోత్తముడు (పోరస్) ఈ విషయాన్ని బలపరిచాడు. ధననందుని నిరంకుశపాలన, అధిక పన్నులు, చాణుక్యుని అవమానము, అసంతృప్తికి సరి అయ్యెను. ఇది గమనించిన చంద్రగుప్త మౌర్యుడు, చాణుక్యుని సాయంతో ధననందుని వధించి, మౌర్య సామ్రాజ్య స్థాపన చేసెను.

## 1.5 సారాంశము:

బింబిసారుని పరిపాలన నుండి, మహా పద్మనందుని వరకు మగధ రాజ్యం సుసంపన్నమై, రాజకీయ ఐక్యత, సాధించి, మహా సామ్రాజ్యంగా వెలుగొంది, దేశ రాజకీయాలకు కేంద్రమై, జైన, బౌద్ధ మతాల ప్రాచుర్యానికి వ్యాప్తికి ఎంతో సహాయపడింది.

## 1.6 మాదిరి ప్రశ్నలు:

**(ఎ) వ్యాస ప్రశ్నలు:**

1. క్రీ.పూ. 6 - శతాబ్దముల మధ్య మగధ ఔన్నత్యమును వివరింపుము.
2. క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి ఉత్తర భారతదేశ పరిస్థితులు తెలియజేయండి.

**(బి) సమస్యపూరిత ప్రశ్నలు:**

1. మగధ ఔన్నత్యమునకు హర్యాంక వంశం ఎంత వరకు కారణమయ్యెను వ్రాయుము.
2. క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి ఉత్తర భారతదేశ రాజకీయ పరిస్థితులను వర్ణింపుము.
3. క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి ఉత్తర భారతదేశపు సాంఘీక, ఆర్థిక పరిస్థితులను వివరింపుము.

**(సి) లఘుటీక: ఈ క్రింది వాటికి క్లుప్తంగా జవాబులు వ్రాయుము.**

1. 16 మహా జన పదాలు
2. బింబిసారుడు
3. అజాతశత్రువు
4. క్రీ.పూ. 6వ శతాబ్దము నాటి సంఘంలోని ప్రస్థానం
5. మహా పద్మనందుడు

**(డి) కుశాగ్ర బుద్ధి పరీక్ష:**

**ఈ క్రింది ప్రశ్నలకు ఎ, బి, సి, డిల అక్షరములను ఉపయోగించి సరియైన సమాధానములను ప్రశ్నలకు ఎదురుగా గడులలో వ్రాయుము.**

1. హర్యాంక వంశ స్థాపకుడు ( )

   ఎ) శిశునాగుడు బి) బృహద్రదుడు సి) బింబిసారుడు

   డి) కాలాశోకుడు ఇ) వీరెవరు కాదు

2. పాటలీపుత్ర నిర్మాత ( )

   ఎ) బింబిసారుడు బి) ఉదయనుడు సి) కాలాశోకుడు

   డి) శిశునాగుడు ఇ) ధననందుడు

3. పాటలీపుత్రాన్ని మగధ రాజధానిగా చేసికొన్న రాజు ఎవరు? ( )

   ఎ) అజాతశత్రువు బి) ధననందుడు సి) ఉదయనుడు

   డి) శిశునాగ ఇ) రిపుంజయ

**ఇ) జతపరుచుము.**

| | | |
|---|---|---|
| 1. అంగ | ( ) | ఎ) వారణాసి |
| 2. కాశీ | ( ) | బి) చంపా |
| 3. కోసల | ( ) | సి) శుక్తిమతి |
| 4. మగధ | ( ) | డి) శ్రావస్థి, కుశావతి |
| 5. చేది | ( ) | ఇ) పాటలీపుత్రం |

## 1.7 ఉపయుక్త గ్రంథాలు:


1. R.C. Majumdar - An advanced History of India.
2. T.M. Rhys David - Buddhist India
3. B.N. Lumiya - Life and Culture in Ancient India
4. K.M. Panikkar - A Survey of India History
5. R.C. Majundar - Ancient India



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ షేక్ రమీ బేగం**

పాఠం - 2

# జైన మతం - బౌద్ధ మతం

## 2.0 లక్ష్యం:

* ఈ పాఠంలో జైన మతం మరియు బౌద్ధ మతం గురించి తెలుకొనుట.

## పాఠ్య నిర్మాణ క్రమం:


2.1 జైన మత పరిచయము

2.2 ఆధ్యాత్మిక అశాంతికి గల కారణాలు

2.3 జైన మత సిద్ధాంతాలు లేదా మహావీరుని బోధనలు

2.4 జైన పరిషత్తు

2.5 జైన మత వ్యాప్తి - క్షీణత

2.6 బౌద్ధ మత పరిచయం

2.7 బుద్ధుని బోధనలు

2.8 బౌద్ధ మత వ్యాప్తి

2.9 బౌద్ధ సంగీతులు

2.10 బౌద్ధ మత క్షీణత

2.11 భారతీయ సంస్కృతికి జైన - బౌద్ధ మతాలు చేసిన సేవ

2.6 సారాంశము

2.7 మాదిరి ప్రశ్నలు

2.8 ఉపయుక్త గ్రంథాలు


## 2.1 జైన మత పరిచయము:

క్రీ.పూ. 6వ శతాబ్దం విశ్వ మానవ చరిత్రలో గణనీయమైనది. ఈ శతాబ్దము నందు ప్రపంచంలో అనేక దేశములందు మహా ప్రవక్తలు ఉద్భవించి తరతరాలుగా ఉన్న మూఢ విశ్వాసాలు, ఆచార సాంప్రదాయాలు పాత విలువల పై విజయ ధ్వజమెత్తి కొత్త సిద్ధాంతాలను నూతన భావనలు సృష్టించినారు. ఆధ్యాత్మిక అశాంతియే మన దేశమున ఆధ్యాత్మిక సంచలనమునకు కారణము.

## 2.2 ఆధ్యాత్మిక అశాంతికి గల కారణాలు:

ఆర్య-ఆర్యేతర జాతుల మధ్య వైరము, ఆర్యేతర ప్రాంతాల నుండి మహావీరుడు జ్ఞాత్రిక వంశం, బుద్ధుడు శాక్య వంశానికి చెందినవారు. ఈ రెండు వంశాలు టిబెటో-మంగోలియన్ జాతికి చెందినవి. ఆర్యులు నార్డిక్ జాతికి చెందినవారు. అందువలనే ఆర్యుల - ఆర్యేతర జాతుల తిరుగుబాటే ఈ మతముల అవతరణ జరిగినది.

రాజకీయ విభేదాల వలన కాని, సంఘంలోని, వర్ణ వ్యవస్థ, ఆధ్యాత్మిక విషయాలలోని తేడాల వలన నూతన మతముల ఆవిర్భావము జరిగినది.

జైన మతము వైదిక మతమంత ప్రాచీనమైనదని జైనుల విశ్వాసము. ఋగ్వేద మంత్రాలలో జైన మత స్థాపకుడైన వృషభుడు, అరిష్టనేమి తీర్థంకరుల గురించి స్పష్టమైన ప్రస్తావన ఉంది. జైన మతంలో 24 మంది తీర్థంకరులు ఉన్నారని, వారందరూ క్షత్రియులని, జైన అనుశ్రుతి వల్ల తెలుస్తున్నది. తీర్థంకరులంటే "జీవ ప్రవాహాన్ని దాటటానికి వారధి నిర్మించిన వారు" అని అర్థం. ఇరవై రెండు మంది తీర్థంకరులు పౌరాణిక పురుషులు. కానీ ఇరవై మూడో తీర్థంకరుడైన పార్శ్వనాథుడు, ఇరవై నాలుగవ తీర్థంకరుడైన మహావీరుడు చారిత్రక పురుషులు. పార్శ్వనాథుడే చారిత్రకంగా జైన మత స్థాపకుడు.

| తీర్థంకరులు | చిహ్నం | తీర్థంకరులు | చిహ్నం |
|---|---|---|---|
| 1. ఋషభ దేవ | ఎద్దు | 13 విమలనాథ | వరాహం |
| 2. అజితనాథ | ఏనుగు | 14 అనంతనాథ | బైరిపక్షి |
| 3. సంభవనాథ | గుఱ్ఱం | 15 ధర్మనాథ | పిడుగు |
| 4. అభినందన | కోతి | 16 శాంతినాథ | దుప్పి |
| 5. సుమతినాథ | క్రౌంచపక్షి | 17 కుంతనాథ | మేక |
| 6. పద్మప్రభు | కమలం | 18 అరనాథ | నంద్యావర్తగుర్తు |
| 7. సుపార్శ్వనాథ | స్వస్థిక్ గుర్తు | 19 మల్లినాథ | కుండ |
| 8. చంద్రప్రభు | చంద్రుడు | 20 మునీసు వీరనాథ | తాబేలు |
| 9. పుష్పదంత | మకరం | 21 నేమినాథ | నీలి కమలం |
| 10.శీతనాథ | శ్రీవత్సగుర్తు | 22 అరిష్టనేమి | శంఖం |
| 11.శ్రేయాంసనాథ | ఖడ్గమృగం | 23 పార్శ్వనాథ | పాము |
| 12.వాసుపూజ్య | గేదె | 24 వర్ధమాన మహావీరుడు | సింహం |

**పార్శ్వనాథుడు:**

ఇతడు క్రీ.పూ. 8వ శతాబ్దానికి చెందినవాడు. కాశీ రాజైన అశ్వసేనునకు రాణి వామదేవికి జన్మించెను. నవవర్మ కుమార్తె ప్రభావతిని వివాహం చేసుకున్నాడు. 30 సం॥ల వరకు గృహస్థ జీవితం గడిపిన తరువాత 83 రోజులపాటు తపస్సు చేసి, జ్ఞానసిద్ధి పొందాడు. నాటి నుండి తాను తెలుసుకున్న సత్యాన్ని ప్రచారం చేశాడు. ఇతను 100 సంవత్సరాలు జీవించి, బెంగాల్ నందు మరణించెను.

**పార్శ్వనాథుని సిద్ధాంతాలు:**

నాలుగు సిద్ధాంతాలు, అవి:

1. అసత్య మాడరాదు (సత్యం)
2. దొంగతనము చేయరాదు (అపరిగ్రహం)

3. ఆస్థిపాస్థులుండరాదు (అస్తేయం)

4. జీవహింస చేయరాదు (అహింస)

**వర్ధమాన మహావీరుడు:**

ఇతని తండ్రి సిద్ధారుడు. క్షత్రియ తెగకు నాయకుడు. తల్లి త్రిశాల. ఈమె లిచ్ఛవి రాకుమార్తె. మొదట ఇతని పేరు వర్ధమానుడు. ఇతని తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు పార్శ్వనాథుని మతంలో చేరారు. అందుచేత సమాజంగా మహావీరుడు యువకునిగా ఉన్నప్పటి నుండే జైన మత సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యెను. యుక్త వయసులోనే యశోదతో వివాహం జరుగగా, ఒక పుత్రిక జన్మించినది. ఆమె పేరు అణోజ్ఞ (ప్రియదర్శిని). ఈమెను తన మేనల్లుడు జామాలికి ఇచ్చి వివాహం చేసెను. మహావీరుడు తన తల్లిదండ్రుల మరణం తరువాత అన్న అయిన నంద వర్ధనుడు అనుమతితో తన ముప్ఫైవ ఏట సన్యసించాడు. దిగంబరుడై, కఠిన నియమాలు పాటిస్తూ 12 సంవత్సరాలు కఠిన తపస్సును ఆచరించి, ఋజుపాలిక నది తీరాన, జృంభిక గ్రామ సమీపంలో, సాల వృక్షం క్రింద జినత్వం పొందాడు. 'జిన' అనగా 'జయించినవాడు' అని అర్థం. ఇతనిని నిర్ధంథుడని కూడా పిలిచేవారు. ఇతనికి దేహదిన్న, నాయపుత్ర అనే బిరుదులు కూడా కలవు. జినత్వం పొందిన 42వ యేట కైవల్యం పొందిన తరువాత మహావీరుడు అయ్యాడు. సంవత్సరంలో 8 నెలలు దేశాటన చేస్తూ, బోధనలు చేశాడు. మిగిలిన నాలుగు మాసాలు, చంపా, వైశాలి, రాజగృహ, మిథిల, శ్రావస్థి మొదలైన నగరాలలో కాలం గడిపేవాడు. 72వ యేట పాట్నా జిల్లాలోని పావాపురిలో హస్థిపాలుడనే రాజు గృహంలో నిర్యాణం చెందాడు.



వర్ధమాన మహావీరుడు

## 2.3 జైన మత సిద్ధాంతాలు లేదా మహావీరుని బోధనలు:

జైన తీర్థంకరులు బోధించిన సిద్ధాంతాలు 12 అంగాలుగా క్రోడికరణమయ్యాయి. ఆచరాంగ, సూత్రకృతాంగ, భగవతి సూత్రాలలో జైన సిద్ధాంతాలు పేర్కొనటం జరిగింది. మహావీరుడు వేదాల ఆధిపత్యాన్ని, వైదిక కర్మకాండను, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని తిరస్కరించాడు. తన మతంలో అందరికి ప్రవేశం ఉందని, జాతి, మత, కుల, వర్గ, లింగ భేదం లేదని చెప్పాడు. భగవంతుడే ఈ ప్రపంచం సృష్టించాడని విశ్వసించలేదు. మానవుడు విముక్తి కోసం

భగవంతుని అనుగ్రహం పైన లేదా ఇతర వ్యక్తి పై ఆధారపడి ఉండకూడదని తన భవిష్యత్తుకు తనే కర్తయని మహావీరుడు బోధించాడు. అన్ని జీవులను సమానంగా చూడాలని బోధించాడు. ఈ ప్రపంచం చేతన, అచేతన జీవులతో నిండి ఉందని చెప్పాడు. మోక్షమును పొందవలెనన్న ప్రతి ఒక్కడు మూడు సూత్రములు పాటింపవలెను. అవి:

1. సరియైన విశ్వాసము
2. సరియైన జ్ఞానము
3. సరియైన నడవడి

వీటినే త్రిరత్నములు అందురు. మోక్షమనునది దుఃఖలేశము లేని అనంత సౌఖ్యము. దీనిని 'శుద్ధశీల'యని కేవలావస్థ అంటారు.

## 2.4 జైన పరిషత్తు:

క్రీ.పూ. 4వ శతాబ్దం చివరి దశలో బీహార్‌లో భయంకరమైన కరువు ఏర్పడింది. ఈ సమయంలో భద్రబాహు నాయకత్వంలో కొంతమంది జైనులు దక్షిణ మైసూరు ప్రాంతానికి వెళ్ళారు. చాలా మంది జైనులు స్థూలభద్ర నాయకత్వంలో మగధలో ఉండిపోయారు.

మైసూరు నుండి వచ్చిన వారికి మగధలో ఉన్న వారికి బేధాభిప్రాయాలు ఏర్పడినవి. మగధలో ఉన్నవారు తెల్లని దుస్తులు ధరించారు. మైసూరు వారు నగ్నంగా ఉండి మహావీరుని బోధనలు అనుసరించారు. కాలం గడిచే కొద్ది శ్వేతాంబరులలో, దిగంబరులలో కూడా చీలికలు ఏర్పడ్డాయి. శ్వేతాంబరులలో ఒక శాఖవారు విగ్రహారాధన మాని పవిత్ర గ్రంథాలను పఠిస్తారు. వీరిని 'థేరిపంత్'లు అందురు. దిగంబరులలో సమైయాలు అనే శాఖ ఏర్పడింది.

## 2.5 జైన మత వ్యాప్తి - క్షీణత:

వైదిక మతం పై తిరుగుబాటుగా జైన మతం వైశాలిని కేంద్రంగా చేసుకుని అతి తక్కువ కాలంలోనే బహుళ వ్యాప్తి చెందింది. మగధ పాలకుడైన బింబిసారుడు, అజాతశత్రువు, ఉదయనుడు, నందులు, చంద్రగుప్త మౌర్యులు జైన మతాన్ని అవలంభించి, పోషించారు. మౌర్య చక్రవర్తి అయిన సంప్రతి జైనానికి విస్తృతంగా ప్రచారం గావించాడు. ఇతని ఆదేశం ప్రకారం అతని రాజ్యం మొత్తం తిరిగి ప్రచారకులు ప్రచారం చేశారు. భద్రబాహు, స్థూలభద్రుడు, దిగ్నాగుడు మొదలగు జైనాచార్యులు మత వ్యాప్తికి కృషి చేశారు. చంద్రగుప్త మౌర్యునికాలంలో పాటలీపుత్రంలో మొదటి జైన పరిషత్తును ఏర్పాటు చేసి దేశం నలుమూలలకు జైన మత ప్రాచుర్యం గావించినాడు. భారవేలుడు రెండవ పరిషత్తును జరిపి, జైన గ్రంథాలు తిరగ వ్రాయించినాడు. క్రీ.శ. 512లో గుజరాత్‌లోని వల్లభలో మూడవ జైన పరిషత్తు నిర్వహించి, జైన గ్రంథాలు అన్ని అర్థ మాగధిలో తర్జుమా చేయించాడు.

## 2.6 బౌద్ధ మత పరిచయం:

ప్రపంచంలో వెల్లివిరిసిన 11 మతాలలో బౌద్ధ మతం ఒకటి. దీనిని గౌతమ బుద్ధుడు స్థాపించినాడు. కోసలకు ఉత్తరాన కపిలవస్థు అనే ప్రాంతాన్ని శాక్య వంశానికి చెందిన శుద్ధోధనుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఇతని భార్య మాయాదేవి. కోలియ తెగకు చెందినది. క్రీ.పూ. 563లో లుంబిని వనం అనే గ్రామంలో సిద్ధార్థుడు జన్మించెను. ఇతను జన్మించిన 7 రోజుల తరువాత తల్లి మరణించింది. ఆమె సోదరి, సవతి తల్లి మహా ప్రజాపతి గౌతమి ఇతనిని పెంచి, పెద్ద చేసింది. బుద్ధుడు పుట్టినప్పుడు అనేక అద్భుతమైన సంఘటనలు జరిగినట్లు బౌద్ధ గ్రంథాల వలన తెల్తుంది. మహావీరునికి సమకాలికుడు, మాయాదేవి కలలో తన శరీరంలోనికి ఒక తెల్ల ఏనుగు

ప్రవేశించినట్లు కనిపించిందట. దానికి జ్యోతిష్యుల గొప్ప రాజు గాని, సన్యాసి గాని అవుతాడని చెప్పారట. శుద్ధోదనుడు భయపడి సిద్ధార్థునికి 19వ యేట యశోధర అనే రాకుమార్తెను ఇచ్చి వివాహం చేసెను. రాహులుడు అనే కుమారుడు కలిగెను. రాజభోగాలు గాని, దాంపత్య సుఖము గాని సిద్ధార్థునికి సంతృప్తి ఇవ్వలేదు.

జాతక కథల ప్రకారం సిద్ధార్థుడు నగర వీథుల యందు వెళుతుండగా రోగ పీడితుని, మృతదేహము, వృద్ధుని రూపము, సన్యాసిని చూసి హృదయము నందు చింతించెను. ప్రపంచం నందు ఈ ఈతి బాధలకు చలించి, అశాశ్వతమైనది, దుఃఖపూరితమైనదని భావించి 29వ యేట అర్థరాత్రి సమయంలో చెన్నడు అనే రథసారథి సాయంతో భార్యను, కుమారుని వదిలి వెడలెను. గౌతముడు సమస్త సంపదను త్యజించి 6 సంవత్సరాలపాటు రాజ గృహములోని బ్రాహ్మణ పండితుల దగ్గర శుశ్రూష చేసి, వేదాంగాలను అభ్యసించాడు. అరామ కలామ అనే పండితుని వద్ద యోగాభ్యాసాన్ని చేశాడు. శరీరాన్ని శుష్కింపజేసుకొని, జ్ఞానోదయం కాలేదని ఆ మార్గాన్ని వదలి, గయలోని బోధి వృక్షం క్రింద ధ్యాన నిమగ్నుడై యుండగా, 35వ యేట జ్ఞానోదయం అయ్యింది. దీనిని 'సంబోధి' అంటారు. గౌతముడు బుద్ధుడయ్యెను. జ్ఞానోదయం అయిన తరువాత సారనాథ్‌లో జింకల వనంలో శిష్యులకు కఠోర దీక్ష ద్వారా సాధించిన జ్ఞానాన్ని ప్రబోధించాడు. దీనినే ధర్మ చక్ర ప్రవర్తన అంటారు. నాటి నుండి కాశీ, మగధ, వైశాలి, కపిలవస్థు ప్రాంతాలను సందర్శించుతూ బోధనలు ప్రచారం గావించెను. వేల కొలది శిష్యులు ఏర్పడినారు. వారినందరిని సంఘముగా ఏర్పరచి, 80వ యేట మళ్ళీ రాజధానియైన కుశి నగరమున బుద్ధుడు క్రీ.పూ. 487లో నిర్యాణం చెందెను.



**గౌతమ బుద్ధుడు**

## 2.7 బుద్ధుని బోధనలు:

బుద్ధుడు భగవంతుని గురించి గాని, ఆత్మను గురించి గాని ప్రస్తావించలేదు. వీటి గురించి చర్చలు మానవునికి ఎటువంటి ఉపయోగము లేదని పేర్కొన్నాడు. ఈ ప్రపంచము కార్యకరణ సంబంధమై, ప్రతి సంఘటనకు ఏదో ఒక కారణము కలదు అని ఇదే సత్యము అని భావించాడు. జీవితం పై కలిగే కోరికల వలననే పునర్జన్మకు కారణమని పేర్కొనెను. మానవజన్మ దుఃఖభరితము, దుఃఖానికి కోర్కెలు కారణమని, ఈ ప్రపంచం అశాశ్వతము అని పేర్కొనెను. కోర్కెలు జయింపవలెనన్న 4 సూత్రాలను తెలుసుకోవలెనని పేర్కొనెను.

నాలుగు సూత్రములు ఏమనగా -

1. ప్రపంచం దుఃఖభరితము
2. కోరికలే దుఃఖమునకు కారణము
3. దుఃఖంనంతము చేయాలంటే కోరికలను అంతం చేయవలెను
4. కోరికలు అంతము చేయుటకు అష్టాంగ మార్గము కలదు

**అష్టాంగ మార్గము:**

ఇవి 8 సూత్రములు. అవి:

1. సరియైన దృష్టి
2. సరియైన జ్ఞానము
3. సరియైన వాక్కు
4. సరియైన క్రియ
5. సరియైన జీవనము
6. సరియైన ప్రయత్నము లేక శ్రమ
7. సరియైన ఆలోచన
8. సరియైన ధ్యానము

వీటిని ఆచరించుట వలన వ్యక్తి శీల, సమాధి, ప్రజ్ఞలను పొందును. జ్ఞాని అయిన వానికి పునర్జన్మ ఉండదు. పునర్జన్మ లేకపోవటమే మోక్షము లేక నిర్యాణము. అతి భోగములకు కానీ, వ్రత కాఠిన్యము చెందకుండుటకు దీనినే మధ్యే మార్గము అనిరి.

మహావీరుని వలె బుద్దుడు కూడా యజ్ఞ యాగాదులను, జంతు బలులను, బ్రాహ్మణుల ఆధికత్యను ఖండించెను. వేదాలను త్రోసిపుచ్చాడు.

## 2.8 బౌద్ధ మత వ్యాప్తి:

నిరాండబరమైన సూక్ష్మమైన బౌద్ధ సిద్ధాంతాలు, కుల వ్యవస్థ ఖండించి, స్త్రీ, పురుష తేడా లేకుండా అందరూ మోక్షమునకు అర్హులు అని పేర్కొనెను. బౌద్ధమత వ్యాప్తికి విశేష రాజాదరణ కారణము. బింబిసారుని కాలము నుండి హర్షవర్ధనుని వరకు పాలించిన వారందరూ ఆదరించారు. మగధ, కోసల, కౌశాంబి, రాజ్యాలు మరియు మల్ల, శాక్య, వజ్జి గణ రాజ్యములు బౌద్ధ మతం ఆదరించారు.

, అశోకుని కాలమున బౌద్ధమతం భారతదేశం నందే కాక ప్రపంచ దేశాలలో వ్యాపించి, అంతర్జాతీయ మతమయ్యెను. బౌద్ధ మతము మూఢ విశ్వాసాలతో కూడుకున్నది కాదు. కాలానుగుణముగా మార్పులకు లోనైనది. బౌద్ధ మతము సామాన్య ప్రజలు అర్థం చేసుకొను భాషలో సులభ శైలిలో ప్రచారం సాగినది. బౌద్ధ సంఘాలు నిర్విరామ కృషి చేయుట వలన వ్యాప్తి జరిగినది.

## 2.9 బౌద్ధ సంగీతులు:

బుద్ధుని నిర్యాణం అనంతరం అజాతశత్రుని కాలంలో మొదటి బౌద్ధ సంగీతి రాజగృహలో మహాకశ్యపుడు అధ్యక్షత వహించెను. ఈ సమావేశంలో బుద్ధుని ఉపదేశాలు అన్ని వినయ, సుత్త పీటకములుగా రచించారు.

రెండవ బౌద్ధ సంగీతి కాలాశోకుని కాలంలో వైశాలి నందు జరిగెను. బౌద్ధ భిక్షువుల ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలలో తేడాల వల్ల బౌద్ధం రెండు శాఖలుగా చీలినది. అవి - మహాయానం, హీనయాన శాఖలు.

బౌద్ధ సంఘంలో ఐక్యత సాధించుటకు ఆశోకుడి కాలాన మూడవ బౌద్ధ సంగీతి పాటలీపుత్రంలో ఏర్పాటు చేశాడు. గ్రంథాలను చర్చించి అభిదమ్మ పీటకం వ్రాయబడింది. కనిష్కుడు కుందల వనంలో నాలుగవ బౌద్ధ సంగీతి ఏర్పరచి బౌద్ధ సంఘాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నించాడు.

## 2.10 బౌద్ధ మత క్షీణత:

బౌద్ధ భిక్షువులలో నైతిక ప్రమాణాలు దిగజారడం, మత ప్రచారానికి సరియైన వారసుడు లేకపోవడం, హిందూమత లక్షణాలైన విగ్రహారాధన, ఉత్సవాలు, బౌద్ధమతంలో ప్రవేశించి, బౌద్ధమతం క్షీణించింది. హిందుమత పునరుద్ధరణ వలన బౌద్ధ మతం క్షీణించింది.

## 2.11 భారతీయ సంస్కృతికి జైన - బౌద్ధ మతాలు చేసిన సేవ:

బౌద్ధ, జౌన మతములకు అనేక సామ్యములు మరియు భేదములు గలవు. బౌద్ధ, జైన మతాలు రెండును వైదిక మతము పై తిరుగుబాటుగా ఆవిర్భవించినవే.

1. రెండు ఆధ్యాత్మిక అశాంతిని తొలగించి మోక్ష మార్గాన్ని అన్వేషించినవే.
2. వేదాలు, భగవంతుడు అనే భావనలు కాదని, యజ్ఞయాగాలను నిరసిస్తూ, బ్రాహ్మణుల ఆధిక్యతను త్రోసిపుచ్చి, జంతు బలులను, వర్ణ వ్యత్యాసాలను ఖండించెను.
3. కర్మ, పునర్జన్మ, మోక్ష సిద్ధాంతాలను రెండూ అంగీకరించెను.
4. ఇద్దరూ క్షత్రియులే.
5. అహింస, సత్యము నియమాలను పాటించుట వలన ఆత్మ సంస్కారం, జ్ఞాన సముపార్జన సాధించి మోక్షము పొందవచ్చునని చెప్పెను.
6. మోక్ష మార్గానికి అందరూ సమానమే అని ప్రబోధించారు.
7. సిద్ధాంతాలు ప్రజల భాషలోనే సులభతరముగా ప్రచారం చేసెను.
8. ఐహిక ప్రపంచమును విసర్జించవలెనన్న తపస్సు, సన్యాసము రెండును అంగీకరించినవి.

**భేదములు:**

1. ఆత్మ, పరలోకము, నిర్యాణము విషయాల మధ్య విభేదాలు కలవు.
2. జైన మతము ప్రాణికే గాక జడ పదార్థానికి కూడా ఆత్మ కలదని విశ్వసించెను. బౌద్ధం ఆత్మను గూర్చి మౌనం వహించెను.
3. దిగంబరత్వాన్ని నిరసించెను బౌద్ధం. జైన మతం కఠోర అహింసా వ్రతమును నిర్దేశించెను. ముక్కు పై గుడ్డ వేసి కాని గాలి పీల్చుట, దీపాలను వెలిగించరు.

4. శరీరమును శుష్కించుకుందురు జైన మతం నందు. బౌద్ధంలో అష్టాంగ మార్గము మధ్యే మార్గం నందు మోక్షం పొందవచ్చునని చెప్పెను.

5. జైన మతము కాలానుగుణముగా మారే స్వభావం లేదు. బౌద్ధం పరిస్థితులకు అనుగుణంగా రూపాంతరం చెందుతూ వచ్చినది.

6. జైనమతం మన దేశం దాటి వ్యాప్తి చెందలేదు. కానీ బౌద్ధం ప్రపంచమతమై భారతదేశం నందు అంతర్ధానమైనది.

## 2.6 సారాంశము:

బౌద్ధ మతం భారతదేశంలో ఒక ప్రబల మతం కాకపోయినప్పటికీ, విదేశాలలో వ్యాపించినప్పటికీ ఒక వ్యవస్థితమైన శాఖగా రూపొందింది. సనాతన, వైదిక మతాలకు సన్నిహితంగా ఉండటం వలన ఇతర మతాలతో విద్వేషం లేనందున ఈ నాటికి జైనం మనుగడ సాగిస్తున్నది.

## 2.7 మాదిరి ప్రశ్నలు:

1. వర్ధమాన మహావీరుని జీవితాన్ని, బోధనలను వివరింపుము.

2. బుద్ధుని జీవితాన్ని, అతని బోధనలను వివరింపుము.

**(బి) సమస్యపూరిత ప్రశ్నలు**

1. జైన, బౌద్ధ మతాలు ఆవిర్భవించుటకు దోహదపడిన పరిస్థితులు వివరింపుము.

2. భారతీయ సంస్కృతికి జైన, బౌద్ధులు చేసిన సేవ ఎట్టిది?

**(సి) లఘుటిక ప్రశ్నలు:**

1. పార్శ్వనాథుడు

2. బౌద్ధమత వ్యాప్తి

3. అజాతశత్రువు

**(డి) బహుళైచ్చిక ప్రశ్నలు:**

1. తీర్థంకరులలో 23వ వాడు... ( )

ఎ) మహావీరుడు బి) పార్శ్వనాథుడు సి) బుధుడు

డి) ఆదినాథుడు ఇ) అశోకుడు

2. గౌతమ బుద్ధుడు తల్లి పేరు ...... ( )

ఎ) భౌమ బి) మాయదేవి సి) ప్రజాపతి గౌతమి

డి) సుజాత ఇ) విద్యాదేవి

3. గౌతముడు ఎక్కడ జన్మించెను? ( )

ఎ) నేపాల్ బి) కుశి సి) సారనాథ్

డి) గయ ఇ) లుంబిని వనం

4. మహాయాన మతాన్ని వ్యాప్తి చేసినవాడు.... ( )

ఎ) అశోకుడు బి) కనిష్కుడు సి) బింబిసారుడు

డి) కనిష్కుడు ఇ) కాలాశోకుడు

**(ఇ) జతపరుచుము:**

1. గోమతేశ్వరుడు ( ) ఎ) జైనుల స్త్రీ దేవత
2. విద్యాదేవి ( ) బి) శ్రావణబెళగొళ
3. చరకుడు ( ) సి) మహాయానం
4. నాగార్జునుడు ( ) డి) చరక సంహిత

## 2.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Romila Thapar - History of India Vol I.
2. A.L. Basham - The Wonder That Was India
3. R.C. Majumdar - An advanced History of India.
4. Nilakanta Sastry K.A.- History of India Vol. I
5. D. D. Kosambi - The Culture and invilization of Ancient India - A Historical Outline



పాఠ్యభాగ రచయిత

డా॥ షేక్ రమీ బేగం

**పాఠం - 3**

# మౌర్య సామ్రాజ్యం

## 3.0 లక్ష్యం:

మౌర్య సామ్రాజ్య ఆవిర్భావము, ఆధారాలు, చంద్రగుప్త మౌర్యుని రాజ్యవిస్తరణ, పరిపాలనా పద్ధతులు వివరించటమే ఈ పాఠం లక్ష్యం.


## పాఠ్య నిర్మాణ క్రమం:

- **3.1 ఉపోద్ఘాతం**
- **3.2 ఆధారాలు**
- **3.3 చంద్రగుప్త మౌర్యుడు**
  - **3.3.1 తొలిజీవితం**
  - **3.3.2 వాయవ్య భారత విముక్తి**
  - **3.3.3 మగధ ఆక్రమణ**
  - **3.3.4 సెల్యూకస్ దండయాత్ర**
  - **3.3.5 దక్షిణ భారత దండయాత్రలు**
  - **3.3.6 చివరి దశ**
- **3.4 బిందుసారుడు**
  - **3.4.1 పరిపాలనాకాలం**
  - **3.4.2 తక్షశిల తిరుగుబాటు**
  - **3.4.3 విదేశాంగ విధానం**
  - **3.4.4 మతం**
- **3.5 సారాంశం**
- **3.6 మాదిరి ప్రశ్నలు**

## 3.1 ఉపోద్ఘాతం:

భారతదేశ చరిత్రలో మౌర్య సామ్రాజ్య స్థాపన ఒక నూతన శకానికి నాంది పలికింది. వాయవ్య భారతదేశంలోని గ్రీకులను జయించి, అక్కడ విదేశీ పాలనను అంతం చేయటమే కాక, నందరాజుల నిరంకుశ పాలన నుంచి మగధ ప్రజలకు విముక్తి కలిగించి, నంద రాజ్య శిథిలాలపై మనదేశ చరిత్రలోనే మొట్టమొదటి సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు

చంద్రగుప్త మౌర్యుడు. ఇతడు స్థాపించిన మౌర్య సామ్రాజ్యం ఉత్తరాన హిమాలయాలు, ఆక్సస్ నది నుంచి దక్షిణాన తుంగభద్రా నది వరకు విస్తరించింది. భారతదేశంలోని అధిక భాగాన్ని ఏకఛత్రాధిపత్యం కిందకు తెచ్చిన ఘనత చంద్రగుప్త మౌర్యునికి దక్కుతుంది.




మౌర్య సామ్రాజ్యం

## 3.2 ఆధారాలు:

మౌర్యుల చరిత్ర రచనకు అవసరమైన ఆధారాలు సమకాలిక రచనల్లోను, తరవాత కాలంనాటి రచనల్లో లభ్యమవుతున్నాయి. ఈ ఆధారాలలో శాసనాలు, వాఙ్మయ ఆధారాలు, నాణాలు, మృణ్మయ పాత్రలు, శిల్ప అవశేషాలు ముఖ్యమైనవి. మౌర్య యుగ చరిత్రను తెలుసుకోవడానికి గల శాసనాలలో అశోకుని శాసనాలు, సోహగౌరా తామ్ర శాసనం, మహాస్థాన్ శాసనం, దశరథుని నాగార్జునకొండ శాసనం, రుద్రదాముని జునాగడ్ శాసనం మొదలైనవి ముఖ్యమైనవి. వాఙ్మయ ఆధారాలలో బౌద్ధ గ్రంథాలైన దీప వంశం, మహా వంశం, వాటి టీకలు, అశోకవదాన, దివ్యావదానం, జాతక కథలు, మంజుశ్రీ మూలకల్పం, జైన గ్రంథాలైన హేమచంద్రుని స్థవిరవలి చరిత్ర లేదా పరిశిష్టపర్వం, పురాణాలు ముఖ్యమైనవి. లౌకిక గ్రంథాలలో కౌటిల్యుని అర్థశాస్త్రం, విశాఖదత్తుని ముద్రా రాక్షసం, కల్హణుని రాజతరంగిణి, సోమదేవుని కథాసరిత్సాగరం, క్షేమేంద్రుని బృహత్కథామంజరి మొదలయిన గ్రంథాలు, నాటకాలు, కావ్యాలలో మౌర్యులకు సంబంధించిన ఎన్నో అంశాలు, ఐతిహ్యాలున్నాయి. విదేశీ రచనల్లో మెగస్తనీస్ ఇండికా, స్ట్రాబో-డియోడోరస్, ప్లినీ, ఎరియన్, ప్లూటర్క్, జస్టిన్, ఫాహియాన్, హూయాన్‌త్సాంగ్ రచనలు, మౌర్యుల చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మౌర్యుల కాలం నాటి నాణాలు,

నల్లమెరుగు ఉన్న మృణ్మయ పాత్రలు, శిల్ప అవశేషాలు మొదలయినవి మౌర్యుల ఆర్థిక వ్యవస్థ, వాస్తుశిల్ప సంప్రదాయ రీతులు మొదలయిన అంశాలను తెలుసుకోవచ్చు.

## 3.3 చంద్రగుప్త మౌర్యుడు:

**3.3.1 తొలిజీవితం:** చంద్రగుప్తుని పుట్టు పూర్వోత్తరాలు, అతని తల్లిదండ్రుల గురించి తెలుసుకోవడానికి సరైన ఆధారాలు లేవు. ఇప్పటివరకు లభించిన ఆధారాలలో భిన్నాభిప్రాయలతో కూడిన ఐతిహ్యాలు కనిపిస్తున్నాయి. పరిశిష్ట పర్వమనే జైన గ్రంథం చంద్రగుప్తుని తల్లి మయూర పోషణమే జీవనంగా గల ఒక గ్రామ పెద్ద కుమార్తె అని తెలియచేస్తుంది. విష్ణుపురాణం మౌర్య అనే పదం ముర అనే పదం నుంచి వచ్చిందని, ముర అనే శూద్ర స్త్రీ ఒక నందరాజు భార్య అని, ఆమె చంద్రగుప్తుని తల్లి లేదా మాతామహి అని, ఆమె పేరు పైనే చంద్రగుప్తుని వంశం మౌర్యవంశంగా పిలువబడినట్లు వివరిస్తుంది. కాని అదే నిజమైతే ముర సంతానాన్ని మౌరేయులని పిలవాలేకాని మౌర్యులని కాదు. విశాఖదత్తుని ముద్రారాక్షసం నాటకంలో చంద్రగుప్తుడు వృషలుడని, కులహీనుడని సంబోధించబడ్డాడు. వృషలుడు అనే పదానికి శూద్రుడని, రాజులలో శ్రేష్టుడనే అర్థాలున్నాయి. బౌద్ధ గ్రంథమైన మహావంశం చంద్రగుప్తుడు నేపాల్ తరాయి ప్రాంతాల రుమ్మిండై, గోరఖ్‌పూర్ జిల్లాలోని కాసియాల మధ్య ఉన్న పిప్పలవన గణ రాజ్యాన్ని పాలిస్తున్న 'మొరియ' అనే క్షత్రియ తెగకు చెందినవాడని చెబుతుంది. మొరియ క్షత్రియగణం బుద్ధుని కాలం నుంచి ఉన్నట్లు మహాపరినిర్వాణ సూత్రం పేర్కొంటుంది. 'మొరియ' శబ్దం నుంచి మౌర్య పదం ఉత్పన్నమైందనే సిద్ధాంతాన్ని ఎక్కువ మంది చరిత్రకారులు అంగీకరిస్తున్నారు.

మొరియ క్షత్రియ తెగకు చెందిన చంద్రగుప్తుని తండ్రి ఒక సరిహద్దు పోరాటంలో మరణించగా, గర్భవతిగా ఉన్న అతని భార్య రక్షణ కోసం పాటలీపుత్రం వలస రాగా, అక్కడ చంద్రగుప్తుడు జన్మించాడు. పేదరికంలో ఉన్న చంద్రగుప్తుడ్ని మొదట ఒక పశువుల కాపరి, తరవాత ఒక వేటగాడు ఆదరించారు. బాల్యంలో చంద్రగుప్తుడు తోటి బాలకులతో ఆటలలో రాజు పాత్రను నిర్వహించేవాడు. నందరాజుచే అవమానింపబడి, తన స్వస్థలమైన తక్షశిలకు వెళ్తున్న చాణక్యుడు సాటి బాలకులతోటి ఆటలో రాజు పాత్రను పోషిస్తున్న చంద్రగుప్తుడి ప్రజ్ఞాపాటవాన్ని గమనించి తన లక్ష్య సాధనకు చంద్రగుప్తుడే తగినవాడని తలచి చాణక్యుడు చంద్రగుప్తుడ్ని తనతో తక్షశిలకు తీసుకొని వెళ్ళి అతడికి సకల విద్యలను నేర్పినట్లు బౌద్ధ వాఙ్మయం వల్ల తెలుస్తుంది.

**3.3.2 వాయవ్య భారత విముక్తి:** చంద్రగుప్తుడు తన లక్ష్యసాధనలో భాగంగా నంద చక్రవర్తి పై తిరుగుబాటు సాగిస్తూనే, క్రీ.పూ. 326-325లో అలెగ్జాండర్‌ను కలసినట్లు, ఆ సమావేశంలో చంద్రగుప్తుని ప్రవర్తన అలెగ్జాండరు ఆగ్రహం కలిగించగా అలెగ్జాండర్ అతడిని వధించమని ఆజ్ఞాపించినట్లు కాని చంద్రగుప్తుడు తప్పించుకున్నట్లు గ్రీకు రచనల వల్ల తెలుస్తుంది.

చాణక్య, చంద్రగుప్తులు సాధించవలసిన లక్ష్యాలు రెండు. అవి 1. గ్రీకుల పాలనలో ఉన్న వాయవ్య భారతదేశాన్ని విముక్తం చేయటం, 2. నందరాజుల నిరంకుశత్వాన్ని నిర్మూలించి, మగధను ఆక్రమించటం. తమ లక్ష్య సాధనకు అవసరమైన సైన్యాన్ని పంజాబ్, సింధు ప్రాంతాలలో యుద్ధ విద్యలలో ఆరితేరి ధైర్యసాహసాలకు పేరు పొందిన జాతుల నుంచి సమీకరించారు. వీరు అలెగ్జాండర్ దండయాత్రల సమయంలో పంజాబ్, సింధు ప్రాంతాలలో అతడిని ఎదిరించి, ఓడిపోయిన గణరాజ్యాల సైనికులు. స్వతంత్ర్యాభిలాషులైన వీరు తమ రాజ్యాలు ఓటమి పొందిన తరవాత చంద్రగుప్తుని సైన్యంలో చేరటానికి అవకాశముంది. ఈ విధంగా సమీకరించిన సైన్యాన్నే గ్రీకు రచయిత జస్టిన్ 'దోపిడి దొంగలని' వర్ణించాడు. అర్థశాస్త్రం చోరులు, కిరాతకులు మొదలయిన మ్లేచ్ఛులు, దారిదోపిడి దొంగలు, ఆటవికులు, శాస్త్రోపజీవి శ్రేణులు అనే ఐదు వర్గాల నుంచి సైన్య సమీకరణ చేయవచ్చని పేర్కొంటుంది. చంద్రగుప్తుడు అర్థశాస్త్రం ప్రకారం సైన్య సమీకరణ చేసి ఉండవచ్చు. జైన, గ్రీకు ఆధారాలు చంద్రగుప్తుడు మొదట వాయవ్య భారతదేశంలోని గ్రీకుల పాలనను అంతంచేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించాడని చెబుతున్నాయి. వాయవ్య భారతదేశంలోని ఆనాటి రాజకీయ పరిస్థితులు చంద్రగుప్తునికి అనుకూలించాయి.

భారతదేశ దండయాత్రల తరవాత స్వదేశానికి వెళ్తున్న అలెగ్జాండర్ అనారోగ్యంతో క్రీ.పూ. 323లో బాబిలోనియా నగరంలో మరణించాడు. సింధు ప్రాంతం పై అలెగ్జాండర్ ప్రతినిధిగా నియమితుడైన ఫిలప్పస్ క్రీ.పూ. 324లోనే హత్య చేయబడ్డాడు. అలెగ్జాండరు మరణంతో సింధు ప్రాంతంలోని గ్రీకు ఆక్రమిత రాజ్యాలలో వారి అధికారం నామమాత్రంగా కొనసాగింది. ఇదే సమయంలో వాయవ్య భారతదేశంలో గ్రీకుల పాలనపట్ల ప్రజలలో అసంతృప్తి మరింత ఎక్కువైంది. కాందహార్‌లో వీరి పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. గ్రీకు శాత్రపి నికెనాలను అస్సకనోయి చంపాడు. ఇటువంటి రాజకీయ అశాంతికి, ఘర్షణలకు మాసిడోనియన్లకు ఇతర గ్రీకులకు ఉన్న విద్వేషాలే కారణం.

వాయవ్య ప్రాంతంలోని రాజ్యాల రాజులైన అంభి, పురుషోత్తముడు, శశిగుప్తుడు మొదలయినవారు తమ గత అనుభవంతో తమ రాజ్యాల రక్షణకు ఎటువంటి కృషి చేయలేదు. ఫలితంగా పతనావస్థలో ఉన్న ఈ రాజ్యాలను ఎవరైనా సులభంగా జయించటానికి అవకాశం ఏర్పడింది. దీనికితోడు అలెగ్జాండరు వారసులు లేనందున అతని సామ్రాజ్యం కోసం అతని సేనానులు కలహించుకొంటూ భారతదేశంలోని గ్రీకు రాజ్యాలపై ప్రత్యేక శ్రద్ధవహించలేదు. ఇటువంటి అనుకూల పరిస్థితిని చంద్రగుప్తుడు అవకాశంగా తీసుకొని వాయవ్య భారతదేశంలోని గ్రీకులను ఓడించి పంజాబ్, సింధు ప్రాంతాలను ఆక్రమించాడు. క్రీ.పూ. 313 నాటికి చంద్రగుప్తుడు అవంతి రాజ్యాన్ని ఆక్రమించాడు. జైన వాఙ్మయ ఆధారాలు కూడా చంద్రగుప్తుని పాలన మగధలో కాక పంజాబ్, అవంతీలలో ప్రారంభమైనట్లు సూచిస్తున్నాయి.

**3.3.3 మగధ ఆక్రమణ:** గ్రీకుల పాలన నుంచి వాయవ్య భారతదేశాన్ని విముక్తం చేసిన తరవాత నందరాజు ధననందుడిని ఓడించి మగధను ఆక్రమించాడు. అయితే చంద్రగుప్తుని మగధ ఆక్రమణకు సంబంధించిన వివరాలు స్పష్టంగా లభించటం లేదు. జైన గ్రంథమైన పరిశిష్ట పర్వం చంద్రగుప్తుడు హిమాలయ పర్వతప్రాంత రాజైన పర్వతకుని మైత్రిని, సైనిక సహాయాన్ని పొంది మగధ పై దండయాత్ర చేసినట్లు తెలియచేస్తుంది. బౌద్ధ, జైన ఐతిహ్యాల ప్రకారం మగధను ఆక్రమించడానికి చంద్రగుప్తుడు రెండు పర్యాయాలు దండెత్తవలసి వచ్చింది. పరిశిష్ట పర్వం నందరాజును చంద్రగుప్తుడు ప్రాణాలతో వదిలినట్లు పేర్కొంటుండగా, మిళిందపన్హా మొదలయినవి నందరాజు యుద్ధంలో మరణించాడని వివరిస్తున్నాయి. మగధలో నందవంశ పరిపాలన అంతమై చంద్రగుప్తుడు మగధ సింహాసనాన్ని అధిష్ఠించుటతో పాటలీపుత్రంలో మౌర్యవంశ పాలన ప్రారంభమైంది.

**3.3.4 సెల్యూకస్ దండయాత్ర:** అలెగ్జాండర్ మరణించిన తరవాత అతని సేనానులు క్రీ.పూ. 321లో అతని సామ్రాజ్యాన్ని పంచుకొన్నారు. ఈ పంపిణీలో పశ్చిమ ఆసియా ప్రాంతం సెల్యూకస్ నికెటారు దక్కింది. భారతదేశంలో అలెగ్జాండర్ జయించిన సింధు, పంజాబ్ తదితర ప్రాంతాలను చంద్రగుప్తుడు ఆక్రమించినందున ఆ ప్రాంతాలను తిరిగి జయించడానికి సెల్యూకస్ నికెటార్ క్రీ.పూ. 305లో మౌర్య సామ్రాజ్యం పై దండెత్తాడు. మార్గమధ్యంలో బాక్ట్రియన్లను జయించి, సింధు నదిని దాటి చంద్రగుప్తుడిని ఎదుర్కొనుటకు సిద్ధమయ్యాడు. కాని అదే సమయంలో సెల్యూకస్ మిత్రులైన కాస్సాండర్, లిసిమాచస్, టాలెమీలు ఆంటిగోనతో యుద్ధం చేస్తూ సెల్యూకస్ సహాయాన్ని కోరారు. అందువల్ల సెల్యూకస్ చంద్రగుప్తునితో యుద్ధం చేయకుండా సంధి చేసుకోవలసి వచ్చింది. ఫలితంగా సెల్యూకస్ పరోపనిసదే (కాబూల్), అరఖోసియా (కాందహార్) ఏరియా (హీరట్) గెడ్రోషియా (బెలూచిస్తాన్) ప్రాంతాలను చంద్రగుప్తునికిచ్చి, వాటికి ప్రతిగా 500 యుద్ధ ఏనుగులను తీసుకొని సంధి చేసుకొన్నాడు. అంతేకాకుండా తమ రెండు సామ్రాజ్యాల మధ్య స్నేహ సంబంధాలు మరింత మెరుగుపరచుటకు సెల్యూకస్ చంద్రగుప్తునికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. సెల్యూకస్ తన రాయబారిగా మెగస్తనీసును పాటలీపుత్రానికి పంపాడు. మెగస్తనీస్ రాయబారిగా పాటలీపుత్రంలో ఉన్న సమయంలో మౌర్య సామ్రాజ్యమంతటా పర్యటించి తాను చూసిన, విన్న విశేషాలతో 'ఇండికా' అనే గ్రంథాన్ని రచించాడు.

**3.3.5 దక్షిణ భారత దండయాత్రలు:** మగధలో తన అధికారం పటిష్ఠం చేసుకున్న తరవాత చంద్రగుప్తుడు దిగ్విజయ యాత్రలు చేసి దక్షిణాన కర్ణాటక వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. గ్రీకు రచయిత ప్లూటార్క్ 'ఆరు లక్షల సైన్యంతో' చంద్రగుప్తుడు భారతదేశాన్ని జయించాడని పేర్కొన్నాడు. మెగస్తనీస్ 'ఇండికా'లో చంద్రగుప్తునికి 6 లక్షల కాల్బలం, 30,000 అశ్విక బలం, 9,000 గజ బలం, ఎన్నో వేల రథ బలంతో కూడిన అపార సైన్యం ఉన్నట్టు వర్ణించాడు. చంద్రగుప్తుని మనుమడైన అశోకుని శాసనాలు దక్షిణ భారతదేశంలో కర్ణాటకలోని సిద్ధపురం వరకు లభిస్తున్నాయి. అశోకుడు తన శాసనాలలో చోళ, పాండ్య, సతియపుత్ర, కేరళపుత్ర రాజ్యాలను సరిహద్దు రాజ్యాలుగా పేర్కొన్నాడు. అశోకుడు రాజ్యాధికారం చేపట్టిన తరవాత కళింగ రాజ్యాన్ని మాత్రమే జయించాడు. మిగిలిన సామ్రాజ్యమంతా అతనికి వారసత్వంగా సంక్రమించింది. అశోకుని తండ్రి బిందుసారుడు యుద్ధాలు చేసి ఏ రాజ్యాన్ని ఆక్రమించిన ఆధారాలు లేవు. అందువల్ల అశోకునికి వారసత్వంగా వచ్చిన సామ్రాజ్యాన్ని జయించినవాడు చంద్రగుప్త మౌర్యుడే అనుటలో ఎటువంటి సందేహం లేదు. అహనానూరు, పురనానూరు వంటి తమిళ కావ్యాలు మౌర్యులు మొహర్ రాజును జయించి, కొంకణం నుంచి కన్ననూరు మండలం దాటి కొడుగు రాజ్యం మీదుగా తిరునల్వేలి జిల్లాలోని పొదియిల్ కొండల ప్రాంతం వరకు తమ రాజ్యాన్ని విస్తరింపచేశారని వర్ణిస్తున్నాయి. మాళవ పాలకుడైన శకక్షాత్రపుడు రుద్రదాముని జునాగడ్ శాసనం సౌరాష్ట్ర చంద్రగుప్త మౌర్యుని సామ్రాజ్యంలో ఒక రాష్ట్రమని తెలియచేస్తున్నది. ఈ శాసనం చంద్రగుప్త మౌర్యుని రాష్ట్ర పాలకుడైన పుష్యగుప్తుడు వ్యవసాయాభివృద్ధికి జునాగడ్‌లో సుదర్శన సరోవరాన్ని నిర్మించినట్లు తెలియచేస్తుంది.

చంద్రగుప్తుని సామ్రాజ్యం పశ్చిమాన ఆక్సస్ నది నుంచి తూర్పున బెంగాల్ వరకు, ఉత్తరాన హిమాలయాల నుంచి దక్షిణాన కర్ణా టక వరకు విస్తరించింది. చంద్రగుప్త మౌర్యుడు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించుటయేకాక చాణుక్యుని సహాయంతో పటిష్ఠమైన పాలనా యంత్రాంగాన్ని రూపొందించాడు.

**3.3.6 చివరి దశ:** చంద్రగుప్త మౌర్యుడు తన పరిపాలనా చివరికాలంలో జైన మతం స్వీకరించినట్లు పరిశిష్ట పర్వం వల్ల తెలుస్తుంది. ఈ గ్రంథం మగధలో 12 సంవత్సరాలపాటు క్షామం సంభవించినట్లు చెబుతుంది. క్షామ నివారణోపాయాలను పేర్కొంటున్న సోహగౌరా, మహాస్థాన్ శాసనాలు కూడా ఈ క్షామాన్ని ధృవీకరిస్తున్నాయి. తీవ్ర క్షామం సంభవించటంతో చంద్రగుప్తుడు తన కుమారుడైన బిందుసారునికి రాజ్యాధికారం అప్పగించి జైన మతాచార్యుడు, గురువు అయిన భద్రబాహుతో కర్ణాటకలోని శ్రావణబెళగొళకు వెళ్ళాడు. అక్కడే సనాతన జైన సంప్రదాయం ప్రకారం సల్లేఖనం ద్వారా చంద్రగుప్తుడు దేహత్యాగం చేసినట్లు జైన గ్రంథాలు వివరిస్తున్నాయి. చంద్రగుప్త మౌర్యుడు రాజ్యాధికారం చేపట్టిన సంవత్సరం గురించి, అతడు ఎంత కాలం పాలించాడనే విషయాలలో చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. రొమిలాథాపర్ అభిప్రాయం ప్రకారం చంద్రగుప్త మౌర్యుడు క్రీ.పూ. 321లో రాజ్యాధికారం చేపట్టి 24 సంవత్సరాలు పాలించి క్రీ.పూ. 297లో మరణించాడు.

## 3.4 బిందుసారుడు:

చంద్రగుప్తుడు రాజ్యత్యాగం చేసిన తరవాత అతని కుమారుడైన బిందుసారుడు క్రీ.పూ. 297లో మగధ సింహాసనమధిష్ఠించాడు. ఇతడ్ని పురాణాలు బిందుసారుడని, రాజావళి కథ అనే జైన గ్రంథం సింహ సేనుడని పేర్కొంటున్నాయి. గ్రీకు రచయితలు ఇతడ్ని 'అమిత్ర ఘేట్స్' అని వ్యవహరించారు. 'అమిత్ర ఘేట్స్' అనేది అమిత్రఖాధ (శత్రు భక్షకుడు) అనగా అమిత్రఘాత (శత్రు విధ్వంసకుడు) అనే సంస్కృత పదానికి గ్రీకు రూపం.

**3.4.1 పరిపాలనాకాలం:** బిందుసారుడు క్రీ.పూ. 297 నుంచి క్రీ.పూ. 272 వరకు 25 సంవత్సరాలు పరిపాలించాడు. కౌటిల్యుడు కొంతకాలం బిందుసారునికి ప్రధానమంత్రిగా ఉన్నాడు. కౌటిల్యుని తరవాత ఖల్లాటకుడు కొంతకాలం బిందుసారునికి ప్రధానమంత్రిగా ఉన్నాడని ఆ తరవాత రాధాగుప్తుడు ప్రధానమంత్రి అయినట్లు దివ్యావదానం

వివరిస్తుంది. బిందుసారుడు పరిపాలించిన 25 సంవత్సరాల కాలంలో అతడు సాధించిన విజయాలు కాని, సామ్రాజ్య విస్తరణకు చేపట్టిన చర్యల గురించి ఎటువంటి వివరాలు తెలియటంలేదు.

**3.4.2 తక్షశిల తిరుగుబాటు:** బిందుసారుడు తన కుమారులలో సుసీముడ్ని తక్షశిలకు, అశోకుడిని ఉజ్జయినికి రాజ ప్రతినిధులుగా నియమించాడు. సుసీముడు రాజ ప్రతినిధిగా ఉన్న కాలంలో తక్షశిలలో తిరుగుబాటు జరిగింది. ఆ తిరుగుబాటును అణచుటకు బిందుసారుడు ఉజ్జయినిలో రాజప్రతినిధిగా ఉన్న అశోకుడిని తక్షశిలకు రాజప్రతినిధిగా పంపాడు. అశోకుడు తక్షశిలలో ప్రవేశించక ముందే ప్రజలు అతనిని కలిసి 'తాము రాజప్రతినిధికి గాని, బిందుసారునికి గాని వ్యతిరేకంగా తిరుగుబాటు చేయలేదని ప్రజలను బాధిస్తున్న దుష్ట అమాత్యులకు వ్యతిరేకంగా మాత్రమే తిరుగుబాటు చేశామని' విజ్ఞప్తి చేసుకొన్నట్లు అశోకావదానం, దివ్యావదానం వల్ల తెలుస్తుంది. అశోకుడు తక్షశిలలో పరిస్థితులను చక్కదిద్ది, శాంతిని నెలకొల్పి రాజప్రతినిధిగా కొనసాగాడు.

**3.4.3 విదేశాంగ విధానం:** బిందుసారుడు తనకు సంక్రమించిన సామ్రాజ్యాన్ని కాపాడుకొనుటయే కాక తన తండ్రి చంద్రగుప్త మౌర్యుని విదేశాంగ విధానాన్నే అనుసరించాడు. స్ట్రాబో అందిస్తున్న వివరాల ప్రకారం 'సాండ్రకోట్టోస్ కుమారుడైన అమిత్రఖేట్స్ ఆస్థానానికి సిరియా రాజైన ఆంటియోకస్ సోతర్ తన రాయబారిగా డిమేఖస్ (Deimachos)ను, ఈజిప్ట్ రాజైన రెండవ టాలెమి ఫిలడెల్ఫస్ తన రాయబారిగా డియోనిసియస్ (Dionysics)ను పంపినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 3వ శతాబ్దానికి చెందిన ఎథీనియన్ అను గ్రీకు రచయిత హెగేసాండర్ గ్రంథంలో బిందుసారుడు సిరియా రాజైన ఆంటియోకస్ సోతరకు మధువును, అత్తిపండ్లను, సోఫిష్‌ను పంపమని కోరగా, దానికి ఆంటియోకస్ మధువును, అత్తిపండ్లను పంపుతానని, తమదేశంలో సోఫిస్టులను అమ్మడం, కొనడం చట్టవిరుద్ధమని బదులిచ్చినట్లుందని రాశాడు.

**3.4.4 మతం:** బిందుసారుని ప్రస్తావన బౌద్ధ గ్రంథాలలో ఎక్కువగా కనిపించదు. బహుశా అతనికి బౌద్ధం పట్ల ఎక్కువ ఆసక్తి లేకపోవడమే కారణం కావచ్చు. బిందుసారుని ఆస్థానంలో 'పింగళివత్స' అనే ఆజీవక పరివ్రాజకుడు ప్రముఖ స్థానాన్ని పొందినట్లు దివ్యావదానం పేర్కొంటుంది. ఈ ఆజీవక దైవజ్ఞుడే అశోకుడు జన్మించినపుడు చక్రవర్తి అవుతాడని జోస్యం చెప్పాడు.

క్రీ.పూ. 272లో బిందుసారుడు మరణించిన తరవాత సామ్రాజ్యం కోసం అతని కుమారుల మధ్య నాలుగు సంవత్సరాలపాటు వారసత్వ యుద్ధం జరిగింది. వారసత్వ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు క్రీ.పూ. 268లో బిందుసారుని వారసునిగా పాటలీపుత్రంలో రాజ్యాధికారం చేపట్టాడు.

## 1.5 సారాంశము:

నందరాజులను చాణుక్యుని సహాయంతో వధించి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు చంద్రగుప్త మౌర్యుడు. ఇతడు మౌర్యులలో సుప్రసిద్ధుడు. చతురంగ బలాలతో మౌర్య సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినాడు. పరమత సహనం పాటించాడు. జైన మతంను ఆదరించాడు, తాను స్వయంగా స్వీకరించాడు. చరిత్రలో మౌర్యులకు ఒక సుస్థిర స్థానం సంపాదించినవాడు చంద్రగుప్తుడు.

## 1.6 మాదిరి ప్రశ్నలు:

1. చంద్రగుప్త జీవిత విశేషాలు గూర్చి వ్రాయుము?
2. వాయవ్య భారత విముక్తికి చంద్రగుప్తుడు ఏ విధంగా పాటుపడ్డాడు?
3. చంద్రగుప్తుడు భారత్‌లో జరిపిన దండయాత్రల గూర్చి వ్రాయుము?
4. బిందుసారుడు గురించి వివరింపుము?

**సంక్షిప్త ప్రశ్నలు**

1. మగధ ఆక్రమణ గూర్చి వ్రాయుము?

2. సెల్యుకస్ దండయాత్ర గూర్చి వ్రాయుము?

3. చంద్రగుప్తుని చివరి దశను గూర్చి వ్రాయుము?

**జతపరచండి:**

| | | |
|---|---|---|
| 1. మెగస్తనీస్ | ( ) | నందరాజు |
| 2. చంద్రగుప్త మౌర్యుడు | ( ) | అమిత్రఖేట్స్ |
| 3. బిందుసారుడు | ( ) | ఇండికా |
| 4. కౌటిల్యుడు | ( ) | శ్రావణబెళగొళా |
| 5. ధననందుడు | ( ) | అర్థశాస్త్రము |

**పాఠ్యభాగ రచయిత**
**డా॥ కొండా శ్రీనివాసులు**

## పాఠం - 4

# అశోకుడు

### 4.0 లక్ష్యం:

అశోకుని సామ్రాజ్య నిర్మాణం, కళింగ యుద్ధం, బౌద్ధ మత స్వీకరణ, వ్యాప్తి, అశోకుని దమ్మ విధానం మొదలగు అంశాలు వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### పాఠ్యాంశ నిర్మాణక్రమం:


**4.1 ఉపోద్ఘాతం**

**4.2 అశోకుని పేర్లు మరియు బిరుదులు**

**4.2.1 రాజప్రతినిధి - తక్షశిల తిరుగుబాటు**

**4.2.2 వారసత్వ యుద్ధం - పట్టాభిషేకం**

**4.2.3 కళింగ యుద్ధం**

**4.2.4 పశ్చాత్తాపం - యుద్ధ విముఖత**

**4.3 అశోకుని దమ్మ విధానము**

**4.3.1 బౌద్ధ మత స్వీకరణ**

**4.3.2 మూడవ బౌద్ధ సంగీతి**

**4.3.3 మత సామరస్యం**

**4.3.4 ప్రజా సంక్షేమం**

**4.3.5 చివరికాలం**

**4.3.6 ముగింపు**

**4.4 అశోకుని దమ్మ విధానం**

**2.4.1 ఉపోద్ఘాతం**

**2.4.2 దమ్మ ఉద్దేశం**

**4.4.3 దమ్మ నిర్వచనం**

**4.4.4 దమ్మప్రకటన**

**4.4.5 దమ్మ సూత్రాలు**

**4.4.6 దమ్మవ్యాప్తికి కృషి**

**4.4.7 దమ్మయాత్రలు**

**4.4.8 దమ్మ ప్రచార సాధనాలు**

**4.4.9 దమ్మవ్యాప్తి - వికాసం**

**4.4.10 దమ్మం - వ్యాఖ్యానం**

**4.4.11 ముగింపు**

**4.5 సారాంశం**

**4.6 నమూనా ప్రశ్నలు**

## 4.1 ఉపోద్ఘాతం:

బిందుసారుడు క్రీ.పూ. 272లో మరణించిన తరవాత జరిగిన వారసత్వ యుద్ధంలో విజయం సాధించిన అశోకుడు క్రీ.పూ. 268లో పట్టాభిషేకం చేసుకొన్నాడు. భారతదేశ చక్రవర్తులలోనే, కాక ప్రపంచ ప్రసిద్ధి పొందిన చక్రవర్తులలో అశోకుడు సుప్రసిద్ధుడు. దిగ్విజయ యాత్రలు చేసి సామ్రాజ్యాన్ని విస్తరింపచేసినందువల్ల అశోకుడు సుప్రసిద్ధుడు కాలేదు. అశోకుడు తన పాలనాకాలంలో కళింగ యుద్ధం ఒకటే చేశాడు. ఆ యుద్ధంలో విజయం పొందినా కూడా యుద్ధ విముఖతను ప్రకటించిన మహామనిషి అశోకుడు. ప్రజా శ్రేయస్సుకు సంక్షేమ కార్యాలకు తోడు దమ్మ విధానాన్ని రూపొందించి, తన పాలనా కాలమంతా ప్రజలను ధర్మానువర్తనులుగా చేసి వారి సంక్షేమం కోసం కృషి చేసిన మానవతావాది అశోకుడు. అశోకుని ఘనతకు అతని అత్యుత్తమ ఆదర్శాలు, సర్వమానవ సంక్షేమానికి అతడనుసరించిన విధానాలు మాత్రమే కారణం.

## 4.4 అశోకుని పేర్లు మరియు బిరుదులు:

ఇప్పటివరకు లభించిన ఆధారాల వల్ల మనదేశ చరిత్రలో మొట్టమొదటి శాసనాలను జారీ చేసిన ప్రథమ భారతీయ చక్రవర్తి అశోకుడు. ఇతని శాసనాలు బ్రాహ్మి, ఖరోష్టి, గ్రీకు, అరమిక్ లిపులలో ఉన్నాయి. అశోకుని శాసనాలు 'దేవానాంప్రియ', 'ప్రియదర్శి' అనే అతని బిరుదులను పేర్కొంటున్నాయి. మస్కీ శాసనంలో 'దేవానాంప్రియ అశోక' అని, గుజ్జర్ల శాసనంలో 'ప్రియదర్శి రాజా అశోక' అని ఉంది. అశోకుని పూర్తి బిరుదు 'దేవానాం ప్రియ, ప్రియదర్శి రాజా అశోక'. 'దేవానాంప్రియ' అంటే 'దేవతలకు ఇష్టమయినవాడని', ప్రియదర్శి అనగా 'సుందరరూపం గలవాడు/దర్శనీయుడు' అని అర్థం. తనకు పూర్వం పరిపాలించిన రాజులు 'దేవానాంప్రియ' బిరుదున్నట్లు అశోకుడు తన ఎనిమిదవ శిలాశాసనంలో ప్రస్తావించాడు. చంద్రగుప్త మౌర్యునికి, అశోకుని మనుమడైన దశరథునికి కూడా దేవానాంప్రియ బిరుదున్నది. అశోకుడ్ని పురాణాలు 'అశోక వర్థనుడ'ని పేర్కొంటున్నాయి. అందువల్ల 'అశోక' అనేది పేరు అని 'ప్రియదర్శి' పట్టాభిషేక సమయంలో గ్రహించిన బిరుదుగాను, 'దేవానాంప్రియ' అనేది మౌర్యులు సర్వసాధారణంగా వాడిన రాజబిరుదని రొమిల్లాథాపర్ అభిప్రాయం.

బిందుసారుని మరణం తరవాత అతని కుమారుల మధ్య రాజ్యం కోసం నాలుగు సంవత్సరాలపాటు వారసత్వ యుద్ధం జరిగింది. ఈ వారసత్వ యుద్ధంలో విజయం సాధించి, అశోకుడు పట్టాభిషేకం చేసుకొన్నాడు. వారసత్వ యుద్ధం గురించి, నాలుగు సంవత్సరాల అరాచకత్వాన్ని గురించి సింహళ దేశ బౌద్ధ గ్రంథాలు వివరించగా, పురాణాలు ఎటువంటి వివరాలు ఇవ్వటంలేదు.

**4.2.1 రాజప్రతినిధి - తక్షశిల తిరుగుబాటు:** అశోకుడు అవంతి రాష్ట్ర రాజప్రతినిధిగా కొంతకాలం ఉజ్జయినిలో ఉన్నాడు. రాజప్రతినిధిగా సమర్థుడైన సైన్యాధిపతి అని, రాజనీతిజ్ఞుడని, పరిపాలనాదక్షుడని రుజువు అయింది. అశోకుడు ఉజ్జయినిలో రాజప్రతినిధిగా ఉన్న సమయంలో తక్షశిల ప్రజలు దుష్టామాత్యుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. తక్షశిలలో రాజప్రతినిధిగా ఉన్న సుసీముడు ఆ తిరుగుబాటును అణచలేకపోయాడు. అందువల్ల బిందుసారుడు తక్షశిల తిరుగుబాటును అణచుటకు అశోకుడ్ని తక్షశిలకు రాజప్రతినిధిగా నియమించినట్లు అశోకావదానం తెలుపుతుంది. తక్షశిల తిరుగుబాటును అణచడం, ఉజ్జయినిలో రాజప్రతినిధి పదవిని సమర్థవంతంగా నిర్వహించటం వల్ల అశోకునికి తన శక్తిసామర్థ్యాల పై నమ్మకం కలిగింది.

**4.2.2 వారసత్వ యుద్ధం - పట్టాభిషేకం:** సింహళదేశ బౌద్ధ గ్రంథాలైన దీపవంశం, మహావంశాలు అశోకుడు తన 99 మంది సోదరులను వధించి రాజ్యాధికారం చేపట్టాడని పేర్కొంటున్నాయి. అయితే అశోకుడు జరిపిన ఈ హత్యాకాండకు ఇతర సాక్ష్యాలు లేవు. అంతేకాక అశోకుడు తరవాత కాలంలో జారీచేసిన తన శాసనాలలో తన సోదరీ, సోదరులను, వారు కుటుంబాల పట్ల ఎంతో బంధుభావాన్ని వ్యక్తపరచాడు. అందువల్ల అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించిన తరవాత అతనిలో వచ్చిన పరివర్తనకు కారణం బౌద్ధమతం గొప్పతనమేనని ప్రచారం చేయటానికి బౌద్ధ గ్రంథాలు ఇటువంటి కథను సృష్టించినట్లు చరిత్రకారుల అభిప్రాయం. అందువల్ల 99 మంది సోదరుల హత్యాకాండను కల్పితమని తోసిపుచ్చవచ్చు. ఈ కథనం ప్రకారం బిందుసారుని మరణం తరవాత సింహాసనం కోసం జరిగిన వారసత్వ యుద్ధంలో

అశోకుడు తన అన్న సుసీమునితోపాటు ఇతర సోదరులను వధించి ఉండటానికి అవకాశం ఉంది. బౌద్ధ మత స్వీకారానికి ముందు అశోకుడు నీతి నియమాలు లేని దుష్టునిగా చిత్రించడమే ఆ బౌద్ధ సాహిత్య లక్ష్యమైనందున బౌద్ధ గ్రంథాలలో అశోకుని సోదరుల సంఖ్యను గురించిన అతిశయోక్తి చోటుచేసుకొన్నది.

**4.2.3 కళింగ యుద్ధం (క్రీ.పూ. 261):** అశోకుని పరిపాలనా కాలంలో జరిగిన ముఖ్య సంఘటన కళింగ యుద్ధం, కళింగ రాజ్య ఆక్రమణ. కళింగ రాజ్యంపై అశోకుడు దండెత్తుటకు కొన్ని ప్రత్యేక కారణాలున్నాయి. అశోకుడు రాజ్యాధికారం చేపట్టే నాటికి మౌర్య సామ్రాజ్యం దక్షిణాన కర్ణాటకలోని సిద్ధపురం వరకు వ్యాపించింది. కళింగ రాజ్యం మాత్రం స్వతంత్ర రాజ్యంగా ఉంది. మౌర్య సామ్రాజ్య తూర్పు తీరం నుంచి సింహళ, బర్మా, ఆగ్నేయ ఆసియా రాజ్యాలతో వాణిజ్యం విస్తృతంగా జరుగుతుంది. మహానది, గోదావరి నదుల మధ్య గల కీలకమైన ప్రదేశంలో కళింగ రాజ్యమున్నందు వల్ల దక్షిణాపథ రాజ్యాల మధ్య జరిగే వాణిజ్యాన్నే కాక సముద్రం ద్వారా జరిగే విదేశీ వాణిజ్యాన్ని కూడా హస్తగతం చేసుకుంది. ఉత్తర-దక్షిణాపథాల మధ్య ఉన్న భూమార్గాలు కళింగ రాజ్యం నుంచి వెళ్తున్నాయి. కళింగ రాజ్యం శత్రువుల స్వాధీనంలో ఉంటే ఆ వాణిజ్య మార్గాలకు అవరోధం ఏర్పడుతుంది. అందువల్ల ఇటువంటి కీలక ప్రాంతంలో ఉన్న కళింగ రాజ్యాన్ని మౌర్య సామ్రాజ్య ఆర్థిక వాణిజ్యాభివృద్ధిని ఆశించి, అశోకుడు కళింగ పై దండెత్తాడు.

**4.2.4 పశ్చాత్తాపం - యుద్ధ విముఖత:** అశోకుడు కళింగ యుద్ధంలో విజయాన్ని పొందాడు. అయితే ఆ యుద్ధం వల్ల జరిగిన అపార ప్రాణ నష్టం, ప్రజలు పడిన బాధలు గమనించిన అశోకుడు తన పశ్చాత్తాపాన్ని, విచారాన్ని 13వ శిలాశాసనంలో ప్రకటించాడు. క్షణికమైన భావోద్వేగంతో జరిగిన స్వయంకృతాపరాధాన్ని గుర్తించిన అశోకుని పశ్చాత్తాపం, అర్థవంతం, గాఢమైన అనుతాపం ఆ శాసనంలో ధ్వనిస్తుంది.

ఆ మనోవేదనే అశోకునిలో వినూత్న భావాలను కలిగించింది. అశోకుడు కళింగ ప్రజానీకానికి తన శాసనం ద్వారా ఈ వినూత్న భావాలను తెలియచేశాడు. "ఇక ముందెప్పుడూ యుద్ధాలు చేయను, ఆటవికులతో సహా సమస్త ప్రజలతో సామరస్యంగా మెలుగుతాను. నా సామ్రాజ్యంలోనే గాక ప్రపంచమంతటా ప్రజలు సత్క్రియలు చేయటానికి ప్రోత్సహించబడే ధర్మాన్ని వ్యాపింప చేయడమే నా జీవిత పరమావధి. దీని ఫలితంగా ప్రజలందరు అహింసాపరులు, స్వార్థరహితులై సత్ప్రవర్తనను, నమ్రతను పాటించి సుఖిస్తారని నా విశ్వాసం" 13వ శిలాశాసనంలో పేర్కొన్న ఈ నూతన భావాలను ఆచరణలో పెట్టడానికి అశోకుడు తన జీవిత కాలమంతా కృషి చేశాడు. యుద్ధాల ద్వారా లభించే విజయాలను విస్మరించి, ధర్మ బోధనల ద్వారా సాధించే ధర్మ విజయాలను జీవిత లక్ష్యంగా నిర్ణయించుకొన్నాడు.

## 4.3 అశోకుడి మత విధానం:

**4.3.1 బౌద్ధ మత స్వీకరణ:** కళింగ యుద్ధం వల్ల అశోకునికి కలిగిన అశాంతికి, ఆవేదనకు బౌద్ధ మతం ఉపశమనాన్ని కలిగించింది. కళింగ యుద్ధం ముగిసిన కొద్ది కాలానికే అశోకుడు ఉపగుప్తుడనే బౌద్ధాచార్యుని వద్ద బౌద్ధ మత దీక్ష స్వీకరించాడు. బౌద్ధ మతం స్వీకరించిన తరవాత సంవత్సర కాలం బౌద్ధ ధర్మాచరణంనకు గాని, వ్యాప్తికి గాని అశోకుడు ప్రయత్నించలేదు. ఆ తరవాత అశోకుడు బౌద్ధ మత వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేయడమేకాక తాను స్వయంగా రూపొందించిన 'దమ్మ' విధానాన్ని కూడా తన సామ్రాజ్యంలోను, పొరుగున ఉన్న రాజ్యాలలోను ప్రచారం చేశాడు. తన దమ్మ శాసనాలను తన రాజ్యమంతా అనేక ప్రాంతాలలో ముఖ్యంగా జనసమ్మర్థం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో, బౌద్ధ క్షేత్రాలలో, ప్రధాన రహదారుల కూడలి ప్రదేశాలలోను నెలకొల్పాడు. బౌద్ధమత వ్యాప్తికి, దమ్మ ప్రచారానికి ఎన్నో విధాలుగా కృషి చేశాడు. తన రాజ్యంలో అశోకుడు 84,000 స్థూప, విహారాలను నిర్మించినట్లు బౌద్ధ గ్రంథాలు వర్ణిస్తున్నాయి. పట్టాభిషేకం జరిగిన పది సంవత్సరాలకు అశోకుడు గయకు వెళ్ళి బోధి వృక్షాన్ని దర్శించాడు. ఆ తరవాత 256 రోజులు ధర్మయాత్ర చేసి తన సామ్రాజ్యం అంతటా పర్యటించి, పుణ్యక్షేత్రాలను దర్శించి, తన పర్యటనలో తటస్థపడిన ముఖ్య ప్రదేశాలన్నింటిలోను తన ధర్మయాత్రకు సంబంధించిన శాసనాలను వేయించాడు. బౌద్ధ మత వ్యాప్తికి, తన దమ్మ ప్రచారానికి తన సామ్రాజ్యంలోను, విదేశాలలోను ప్రచారక సంఘాలను

అశోకుడు ఏర్పరచాడు. తాను స్వయంగా తన సామ్రాజ్యంలో పర్యటించి దమ్మ ప్రచారం చేసి, బ్రాహ్మణులకు, ఇతర మతాల వారికి దానాలు చేసి, గ్రామీణ ప్రజలను బౌద్ధ, దమ్మ విషయంలో చైతన్యవంతులను చేశాడు. దమ్మ బోధనే ముఖ్యవిధిగా గల ధర్మ మహామాత్రులనే ఉద్యోగులను నియమించాడు. వీరితోపాటు ప్రాదేశికులు, రాజుకులు, యుక్తులు, మొదలైన ఉద్యోగులు మూడు లేదా ఐదు సంవత్సరాలకొకసారి సామ్రాజ్యమంతటా పర్యటించి దమ్మ సందేశాన్ని వ్యాపింపచేయాలని అశోకుడు ఆజ్ఞాపించాడు. మతం పేరుతో జరిగే జంతు బలులను, అటువంటి బలులకు కారణమైన జాతర్లను, హింసాయుతమైన వినోదాలను నిషేధించాడు.

**4.3.2 మూడవ బౌద్ధ సంగీతి:** బౌద్ధ ధర్మాన్ని స్పష్టంగా నిర్వచించి, బౌద్ధమత శాఖల మధ్య శాంతిని నెలకొల్పుటకు అశోకుడు తన 19వ రాజ్య సంవత్సరంలో అంటే క్రీ.పూ. 250లో పాటలీపుత్రంలో మూడవ బౌద్ధ సంగీతిని ఏర్పాటుచేశాడు. బౌద్ధ మత గ్రంథాలు బుద్ధుని మహాపరినిర్యాణం తరవాత 263 సంవత్సరాలకు మూడవ బౌద్ధ సంఘ సమావేశం జరిగినట్లు పేర్కొంటున్నాయి. మూడవ బౌద్ధ సంగీతికి మొగ్గలి పుత్తతిస్స అధ్యక్షత వహించాడు. ఈ సంగీతిలో బౌద్ధశాఖల మధ్య తీవ్రవాదోపవాదాలు జరిగాయి. ఈ సంగీతిలో ఆంధ్ర బౌద్ధ బిక్షువులు కూడా ప్రముఖ పాత్ర వహించినట్లు బౌద్ధ గ్రంథాల వల్ల తెలుస్తుంది. ఈ సంగీతిలో విభాజ్యవాదమే యదార్ధ బౌద్ధంగా ప్రకటించడం జరిగింది. త్రిపీటకాలలో మూడవదైన 'అభిదమ్మ పిటకం' ఈ సంగీతిలోనే రూపొందింది. ఈ సంగీతిలో జరిగిన వాదోపవాదాలు 'కథావత్తు' అనే గ్రంథంగా తయారు చేయడమయింది. మూడవ బౌద్ధ సంగీతి తరవాత దేశవిదేశాలలో బౌద్ధమత ప్రచారానికి ప్రసిద్ధ బౌద్ధబిక్షువులను అశోకుడు నియమించాడు. కాశ్మీర, గాంధారాలకు మరుంతికను, మహిషమండలానికి మహదేవను, బనవాసికి రవితమ, అపరాంతకు యోనధర్మరక్షితను, మహారజకు మహాధర్మ రఖితను, సిరియా, ఈజిప్టు, మాసిడోనియా, సైరీన్, ఎపిరస్ మొదలయిన గ్రీకు రాజ్యాలకు మహారబ్దితను, హిమాలయ ప్రాంతానికి మద్దినును, బర్మా రాజ్యానికి సోణ, ఉత్తరలను, శ్రీలంకకు మహేంద్ర, సంఘమిత్రలను పంపించాడు.

**4.3.3 మత సామరస్యం:** అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించి, ఆ మత ప్రచారానికి కృషి చేసి ఆదరించినా, ఇతర మతాలపట్ల ద్వేషభావాన్ని ప్రదర్శించలేదు. అన్ని మతాల వారిని సమభావంతో చూడాలని శాసనాలలో ఆదేశించాడు. అశోకుడు తన శాసనాలలో "ఎల్లవేళలా ఇతర మతస్థుల పట్ల అభిమానం చూపడం అత్యంత అవసరం. ఎవరైతే తన మతమే గొప్పదని కీర్తిస్తూ, పరమత దూషణ చేస్తాడో, అటువంటి వ్యక్తి తన మత పతనానికి కారకుడవుతాడు. మాటలలో సంయమనం వల్ల ఒక మతంవారి పై మరొక మతం వారికి గౌరవాభిమానాలు పెరిగి ధర్మచింతనకు దోహదపడుతుంది" అని స్పష్టంగా మత సామరస్యాన్ని గురించి ఉద్బోదించాడు. బౌద్ధులకే కాక అజీవకులకు కూడా బారాబర్ కొండలలో మూడు గుహలను తొలిపించి దానంగా ఇచ్చాడు. అశోకుడు క్రీ.పూ. 255 సంవత్సరంలో బుద్ధుని జన్మస్థలం లుంబినీ వనాన్ని దర్శించి అక్కడ ఒక అశ్వకిరీట శిల్పం ఉన్న శాసన శిలాస్తంభాన్ని ప్రతిష్టించాడు.

**4.3.4 ప్రజా సంక్షేమం:** బౌద్ధమత ప్రచారం, దమ్మ వ్యాప్తి కార్యక్రమాలలో నిమగ్నుడైనప్పటికీ అశోకుడు చక్రవర్తిగా తన బాధ్యతలను విస్మరించలేదు. ప్రజా శ్రేయస్సుకు తగిన చర్యలను చేపట్టాడు. ప్రజల అవసరాలను చక్రవర్తికి నివేదించే పటివేదకులు అనే ఉద్యోగి బృందం, మంత్రి పరిషత్తు అభిప్రాయాలను చక్రవర్తికి విన్నవించే మహామాత్రుల సహాయంతో అశోకుడు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాడు. అశోకుడు "తాను భోజనం చేస్తున్నప్పుడు కాని, అంతఃపురంలో ఉన్నప్పుడు కాని, నిద్రిస్తున్నప్పుడు కాని, వ్యాహ్యాళికి వెళ్ళునప్పుడు కాని, ప్రయాణిస్తున్నప్పుడు కాని, ధర్మయాత్రలో ఉన్నప్పుడు కాని, వ్యక్తిగత కార్యక్రమాలలో ఉన్నప్పుడు కాని ఏ సమయంలోనైనా ఈ ఉద్యోగులు తనను కలుసుకొని ప్రజల అవసరాలను తనకు నివేదించవచ్చని" ఆరవ శిలాశాసనంలో తెలియచేశాడు. అశోకుడు చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొన్నింటిని రెండవ శిలాశాసనం పేర్కొంటుంది. అశోకుడు తన సామ్రాజ్యమంతట మనుషులకు, పశువులకు వైద్యశాలలు నిర్మించాడు. రహదారుల కిరువైపులా బాటసారులకు నీడనిచ్చే చెట్లు నాటించి, తోటలు పెంచాడు. బావులు తవ్వించాడు. ఎనిమిది క్రోసులకు ఒకటి చొప్పున సత్రాలు నిర్మించి మానవులకు, పశువులకు సౌకర్యాలు కల్పించాడు.

అశోకుడు తన 28వ రాజ్యపాలనా సంవత్సరంలో దమ్మ ప్రచారం వల్ల జరిగిన ధర్మ వికాసాన్ని సమీక్షిస్తూ ఒక స్తంభ శాసనం చెక్కించాడు. ఇదే అశోకుని చివరి శాసనం. ఈ శాసనం తరవాత అశోకుడు క్రీ.పూ. 232లో మరణించే వరకు అతని శాసనాలు కనిపించటం లేదు.

**4.3.5 చివరికాలం:** అశోకుని చివరి పది సంవత్సరాల పరిపాలన గురించిన శాసనాధారాలు ఏమీలేవు. అయితే బౌద్ధ గ్రంథాలు మాత్రం అతని పాలనా చివరికాలంలో ప్రభుత్వం అతని వశం తప్పిందని చెబుతున్నాయి. ఈ కాలంలోనే అశోకుని అధికారం క్షీణించుటమేకాక, ఉద్యోగుల దౌర్జన్యం మితిమీరిందని, రాకుమారులు, రాష్ట్రాధిపతులు సామ్రాజ్య పాలనను సమర్థవంతంగా నిర్వహించ లేకపోయారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అశోకుడు పాలనా బాధ్యతను తన వారసునికి, తన విధానాలను వ్యతిరేకించిన మంత్రులకు అప్పగించి వృద్ధాప్యంలో రాజ్యాధికార బాధ్యత నుంచి తొలిగాడని మరికొందరు చరిత్రకారుల అభిప్రాయం.

**4.3.6 ముగింపు:** క్రీ.పూ. మూడవ శతాబ్దం నాటి సంక్లిష్టమైన సాంస్కృతిక పరిస్థితులలో దమ్మాన్ని రూపొందించి, నిర్వచించి, ప్రభోదించుటలో అశోకుడు చాలా తెగువ చూపాడు. మత గ్రంథాలు చెప్పిన మతం పట్ల, తమ పూర్వీకుల సంప్రదాయాల పట్ల మనిషికి గల బాధ్యతల కంటే అశోకుడు సాటి మానవుని పట్ల మనిషికి గల బాధ్యతను తన దమ్మ విధానంలో భాగంగా శాసనస్థం చేశాడు. అశోకుడు తన సంస్కృతిని, మారుతున్న సామాజికావసరాలను గ్రహించి, తన స్వయం కృషితో తన ఆదర్శాలను సామ్రాజ్యమంతటా వ్యాప్తం చేయటానికి కృషి చేశాడు. "సమకాలిక సమస్యలతో, పరిస్థితులతో ప్రయోగం చేయటానికి, వాటికి అపూర్వమైన పరిష్కారం సూచించే ధైర్యం ఉండటమే అశోకుని ఘనతకు కారణం" అని రోమిలా థాపర్ వ్యాఖ్యానించింది.

## 4.4 అశోకుని దమ్మ విధానం:

**4.4.1 ఉపోద్ఘాతం:** అశోకుని 'దమ్మ' స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ముందు అటువంటి దమ్మ విధానాన్ని ప్రవేశపెట్టుటకు కారణమైన పరిస్థితులను గురించిన అవగాహన అవసరం. నందుల కాలంలో మహా పద్మనందుని అధికారంలో కేంద్రీకృత సామ్రాజ్య నిర్మాణానికి జరిగిన ప్రయత్నం విఫలమైంది. అందుకు కారణం నందులు కేంద్రీకృత సామ్రాజ్యపాలనను అర్థం చేసుకోలేకపోవడమే. నంద వంశాన్ని అంతం చేసి, మగధను ఆక్రమించిన చంద్రగుప్త మౌర్యుడు కేంద్రీకృత అధికార వ్యవస్థను ప్రవేశపెట్టడంలో విజయం సాధించాడు. సమర్థులైన కేంద్ర ఉద్యోగులు, దేశవ్యాప్తమైన రవాణా సౌకర్యాలు, సమర్థుడైన చక్రవర్తి అదుపులో ఉన్న సామ్రాజ్యం ఆనాటి పరిస్థితులలో కేంద్రీకృత పాలనా వ్యవస్థ కలిగిందని చెప్పవచ్చు. ఈ లక్షణాలు మౌర్య సామ్రాజ్యానికి ఉన్నట్లు అర్థశాస్త్రం ద్వారా గ్రహించవచ్చు. అయితే చక్రవర్తి తన కేంద్రాధికారాన్ని ఏవిధంగా పరిరక్షించుకోవాలనేది ప్రధాన సమస్య. ఈ సమస్యను అధిగమించుటకు రెండు పద్ధతులున్నాయి. 1. సైనిక బలంతో ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచి అదుపులో ఉంచడం, చక్రవర్తి తనను దైవ స్వరూపుడని ప్రకటించుకోవడం మొదలయినవి. 2. ప్రజలలో బాగా ప్రచారమైన ఒక నూతన సిద్ధాంతానికి కాని, సమదృష్టితో భిన్న వర్గాల నుంచి సేకరించిన భావాలపట్ల కాని తన అనుకూలతను ప్రకటించడం. ఈ రెండవ పద్ధతి ద్వారా సామ్రాజ్యంలోని ఇతర వర్గాల ప్రాబల్యం క్షీణించి, నశించటంతోపాటు చక్రవర్తి తన బలాన్ని, అధికారాన్ని పెంపొందించుకోవడానికి వీలవుతుంది. ఉద్యోగుల ప్రచారంవల్ల పాలకుల భావాల పట్ల ప్రజలు గౌరవాన్ని కలిగి ఉంటారు. అశోకుడు ఈ రెండవ పద్ధతిని అనుసరించి దమ్మ విధానాన్ని ప్రవేశపెట్టాడు.

**4.4.2 దమ్మ ఉద్దేశం:** 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అనే బౌద్ధ సూక్తిని అనుసరించి అశోకుడు 'దమ్మ' విధానాన్ని రూపొందించాడు. తన 'దమ్మం'లోని కొన్ని సూత్రాలను అశోకుడు వైదిక, బౌద్ధ మతాల నుంచి గ్రహించి ఉండవచ్చు. అశోకుని 'దమ్మ'లోని నీతిసూత్రాలకు దీర్ఘనికాయంలో బుద్ధుడు శ్రీగాలునికి బోధించిన ఉపదేశాలకు ఎక్కువ పోలికలు కనిపిస్తాయి. ప్రజలకు అనుకూలం, ఆచరణీయం అయిన నీతి సూత్రాలను, ఉన్నతమైన జీవన విధానాన్ని అందించటమే అశోకుని దమ్మ ఉద్దేశం. ఆ కారణంవల్లనే అశోకుడు సామాన్య ప్రజలకు పరిచయం అయిన 'స్వర్గలోకప్తి'ని తన శాసనాలలో ప్రస్తావించాడు. నైతిక జీవనం వల్ల, ధమ్మాచరణ వల్ల స్వర్గలోక ప్రాప్తి

ప్రతిఫలంగా కలుగుతుందని ప్రచారం చేశాడు. ధర్మాపేక్ష, శ్రద్ధ, విధేయత, పాపభీతి, సామర్థ్యం లేకపోతే ఇహపరలోక సుఖాలను పొందలేరని బోధించాడు.

**4.4.3 దమ్మ నిర్వచనం:** అశోకుని దృష్టిలో 'దమ్మం' అనేది ఒక జీవిత విధానం. అశోకుడే తన శాసనంలో 'దమ్మం' అంటే ఏమిటి అనే ప్రశ్నకు సమాధానంగా "తక్కువ దోషాలు, ఎక్కువ పుణ్యకార్యాలు చేయటమే దమ్మం" అని చెప్పాడు. ఈ రెండింటిని పాటించినట్లయితే దమ్మాన్ని అనుసరించినట్లేనని అశోకుని భావన. మానవులు తాము చేసే పాపాలను గుర్తించాలని, క్రూరత్వం, కాఠిన్యం, ఆగ్రహం, గర్వం, అసూయలు పాపహేతువులని, వాటిని అధిగమించాలని శాసనాలలో బోధించాడు.

**4.4.4 దమ్మప్రకటన:** అశోకుడు తన సామ్రాజ్యంలో దమ్మవ్యాప్తికి ఎన్నో విధాలుగా కృషి చేశాడు. ప్రజలు దమ్మాన్ని అనుసరించి ఇహలోక సుఖం, స్వర్గలోక ప్రాప్తిని పొందాలనే ఆశయంతో దమ్మ సూత్రాలను గండశిలల పైన, శిలాస్తంభాల పైన చెక్కించి జన సమ్మర్థం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలోను, బౌద్ధ క్షేత్రాలలోను, ప్రధాన రహదారుల కూడలి ప్రదేశాలలోను దమ్మ లిపులున్న శాసనాలను నెలకొల్పాడు. నాలుగు నెలలకొకసారి తిష్యా నక్షత్రం, అష్టమ దినానను, సంవత్సరం మధ్య మధ్య తరచుగా ముఖ్యమైన సందర్భాలలోను ఈ దమ్మ శాసనాలను ప్రజలకు, ఒక్క మనిషి ఉన్నప్పటికీ బిగ్గరగా చదివి వినిపించాలని అశోకుడు ఆదేశించాడు.

**4.4.5 దమ్మ సూత్రాలు:** సామాన్య ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకొని తన దమ్మ మార్గాన్ని అనుసరించుటకు అశోకుడు తన శాసనాలలోనే మార్గాన్ని వివరించాడు. అవి: తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు మొదలయినవారి పట్ల వినయ విధేయతలు కలిగి ఉండటం. సన్యాసులను, బ్రాహ్మణులను, బంధువులను, బానిసలను, సేవకులను, పేదలను, దీనులను, స్నేహితులను, మనపై ఆధారపడి ఉన్నవారిని దయతో సత్కరించాలి. బ్రాహ్మణులకు, శ్రమణులకు, స్నేహితులకు, బంధువులకు, వృద్ధులకు, బానిసలకు, సేవకులకు దానం చేయాలి. జంతుబలి నిషేదం. జీవులను హింసించరాదు. మిత వ్యయం, మిత సంపాదన మాత్రమే చేయాలి. సర్వ ప్రాణుల పట్ల దయ, కరుణ చూపాలి. ప్రతి వ్యక్తి సత్యాన్నే మాట్లాడాలి. ప్రతివారు ధర్మాన్నే చాటాలి. పవిత్రమైన మనస్సు, సౌశీల్యత కలిగి ఉండాలి.

**4.4.6 దమ్మవ్యాప్తికి కృషి:** అశోకుడు దమ్మ ప్రచారమే ముఖ్యవిధిగా గల ధర్మ మహామాత్రులనే ఉద్యోగులను తన పద్నాల్గవ రాజ్య సంవత్సరంలో నియమించాడు. ఈ ఉద్యోగుల ముఖ్య బాధ్యత వివిధ మతాలను అనుసరించే వారికి దమ్మ బోధ చేయటం, ధర్మ నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చూడటం. చక్రవర్తి ధర్మ మహామాత్రులకు ప్రత్యేకాధికారాలు ఇచ్చాడు. రాజ కుటుంబ ప్రాసాదాలు, రాజ బంధువుల నివాసాలతో సహా అన్ని వర్గాల ఇళ్ళలో ప్రవేశించడానికి వీరికి అనుమతి ఉంది. స్త్రీల కోసం ప్రత్యేకంగా మహామాత్రులను నియమించాడు. ధర్మ మహామాత్రుల ద్వారా ప్రతి వ్యక్తి దమ్మం చేరాలని స్పష్టం చేశాడు. వీరు ఆర్యులు, బ్రాహ్మణులు, పాలకులు మొదలయిన వారి యోగక్షేమాలు చూడటమేకాక దీనులు, అనాథలు, వృద్ధులైనవారి బాధలను నివారించడానికి కూడా పాటుపడాలి. వీరు ఖైదీల కుటుంబాలకు అవసరమైన ధన సహాయం చేయటం, ఇతరుల ప్రోద్బలం పై నేరాలు చేసి శిక్షలు అనుభవిస్తున్న వారికి విముక్తి కలిగించటం, వృద్ధులకు అవసరమైన సహాయం చేయటం వంటి బాధ్యతలను కూడా నిర్వర్తించాలని అశోకుడు ఆదేశించాడు. వీరే కాకుండా రాజోద్యోగులైన రాజుకులు, ప్రాదేశికులు ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి తమ పాలిత ప్రాంతమంతా దమ్మ ప్రచారం చేయటానికి పర్యటించాలని కూడా అశోకుడు ఆజ్ఞాపించాడు. ఇటువంటి కార్యాచరణ ఫలితంగా సమాజంలోని అన్ని స్థాయిలలోని ప్రజలతో వీరికి సాన్నిహిత్యం ఏర్పడి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలలోకి దమ్మ విధానం చొచ్చుకొనిపోవటానికి ఉపయోగపడింది. దమ్మ మహామాత్రుల నియామకాన్ని ఉదారబుద్ధితో, దమ్మ ప్రచారం కోసం ప్రారంభించినా, ఆనాడు అటువంటి ఉద్యోగుల అవసరం కూడా ఉంది. అన్ని స్థాయిలలో సంఘ సంక్షేమ కృషి జరుగుతున్నప్పుడే కేంద్రీకృత పాలనావిధానం ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తుంది. వీరి ద్వారా అశోకుడు తన లక్ష్యాన్ని సాధించగలిగాడు.

**4.4.7 దమ్మయాత్రలు:** దమ్మ ప్రచారానికి అశోకుడు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా తన సామ్రాజ్యంలో దమ్మ యాత్రలు సాగించాడు. పట్టాభిషేకం తరవాత పది సంవత్సరాలకు అశోకుడు గయలోని బోధి వృక్షాన్ని దర్శించాడు. ఆ తరవాత 256 రోజులు తన సామ్రాజ్యంలోని అనేక ప్రదేశాలలో దమ్మ యాత్రలు చేశాడు. ఈ యాత్ర వల్ల కలిగే ప్రయోజనాలను అశోకుడే తన శాసనాలలో వివరించాడు. బ్రాహ్మణులను, శ్రమణులను దర్శించి వారికి దానాలు చేయటం, వృద్ధులకు ధన సహాయం చేసి వారికి భృతిని కల్పించటం, ఉదాత్తమైన నీతి సూత్రాలను బోధించి ప్రజల నైతిక ప్రవర్తన గురించి పరామర్శించటం, గ్రామీణ ప్రాంతాలలోని జానపదులను కలసి వారితో ధర్మ చర్చ జరిపి వారి సందేహాలను తీర్చి వారిని దమ్మ నిరతులను చేయటానికి ప్రయత్నించటం మొదలయిననవి ఈ దమ్మ యాత్రలలో అశోకుని ముఖ్య కార్యక్రమాలు. ఈ దమ్మ యాత్రల ద్వారా ఆయా ప్రాంతాలలోని వేరు వేరు మత శాఖలను, రైతులను, గ్రామస్తులను, వృద్ధులను కలసి ప్రజలతో తన సంబంధాలను పెంచుకునేందుకు, ప్రజలలో అన్ని తరగతులవారికి తన దమ్మ విధానాన్ని ప్రభోదించేందుకు అశోకుడు ప్రయత్నించాడు.

**4.4.8 దమ్మ ప్రచార సాధనాలు:** రెండు సాధనాల ద్వారా తన సామ్రాజ్యంలో దమ్మప్రచారం జరిగిందని అశోకుడు వివరించాడు. అందులో మొదటిది శాసనం. రెండవది ప్రోత్సాహం. అశోకుడు శాసనాల ద్వారా కొన్ని రకాల జంతు బలిని, జీవహింసకు కారణమైన జాతర్లను నిషేధించాడు. కాని దీనికంటే జంతువధ, జీవహింస చేయకూడదనే ప్రోత్సాహం ద్వారానే ప్రజలలో ధర్మానువర్తనం పెరిగింది. తాను బోధించిన ధమ్మాన్ని తానే ఆచరించుట దమ్మ వ్యాప్తికి ఎక్కువ దోహదకారి అవుతుందని భావించిన అశోకుడు రాజాంతఃపురంలో ఆహారం కొరకు ప్రతి రోజూ జరిగే వేలాది జంతువుల వధకు బదులు రోజుకు ఒక జంతువు, రెండు పక్షులను మాత్రమే ఆహారం కోసం చంపేటట్లు నిర్ణయించి, క్రమంగా అంతఃపురంలో జంతువధను మాన్పించుటకు ప్రయత్నించాడు.

**4.4.9 దమ్మవ్యాప్తి - వికాసం:** అశోకుడు చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా దమ్మ వ్యాప్తి రాజ్యంలోని బ్రాహ్మణులు మొదలు, మావటీల వరకు అన్ని సాంఘిక తరగతులలో జరిగింది. మొదట స్తంభ శాసనంలో దమ్మవ్యాప్తిని సింహావలోకనం చేస్తూ అశోకుడు కాలం గడిచిన కొద్దీ దమ్మం వికసించిందనే సంతృప్తిని ప్రకటించాడు. సమాజంలోని అన్ని సమస్యలకు నూతన పరిష్కార మార్గంగా దమ్మగుణాలను వర్ణించాడు. తన ప్రబోధం ద్వారానే దమ్మ వికాసం జరిగిందని అశోకుడు ఈ శాసనంలో చెప్పాడు. అశోకుని తొలి శాసనాలలో కనిపించే స్వీయ బాధ్యతా భావం క్రమంగా ఆజ్ఞలుగా మారి వ్యక్తి అభీష్టానికి అవకాశం తగ్గిపోయింది. వ్యక్తుల ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా దమ్మ మహామాత్రులు అమలుచేసే నిర్దిష్టమైన ఆజ్ఞాపనా రూపాన్ని దమ్మం వహించినట్లు కనిపిస్తుంది. సర్వ సమస్యలకు దమ్మం ఇంద్రజాలిక పరిష్కారంగా రూపుదిద్దుకొంది. దమ్మ ప్రచారకులు ఒక మత వ్యవస్థగా రూపొందసాగారు. ఈ శాసనంలో చివరి వాఖ్యాలైన "ఇది నా సిద్ధాంతం. దమ్మం ద్వారా రక్షణ, దమ్మ పరిపాలన, దమ్మం ద్వారా ప్రజాసుఖం. దమ్మం ద్వారా సామ్రాజ్య పరిరక్షణ" అనేది ధమ్మోన్మాదానికి, అహంభావానికి నాందిగా కనిపిస్తున్నాయి.

**4.4.10 దమ్మం - వ్యాఖ్యానం:** అశోకుని దమ్మాన్ని బౌద్ధ ధర్మంతో కాని, ధర్మమనే సాధారణంగా వ్యవహరిస్తున్న ఏ ఇతర విధానంతో కాని కలిపివేయడం సరికాదు. ప్రాచీన భారత సాహిత్యంలో, వివిధ మతాలలోను కనిపించే ధర్మాలు అశోకుని దమ్మం ఒక్కటే అని చెప్పడం సరికాదు. అశోకుని దమ్మం ఏమిటి అనే ప్రశ్నకు అశోకుని శాసనాలే సమాధానమిస్తున్నాయి.

**4.4.11 ముగింపు:** మౌర్య యుగ భారతదేశంలో న్యాయం, సాంఘిక విధానం అనే అర్థంలో ధర్మ సూత్రాన్ని ఉపయోగించటం సాధారణమైన విషయం. ధర్మాన్ని ప్రచారం ద్వారా సభ్యమైనదిగా చేయటానికి అశోకుడు ప్రయత్నించాడు. "మత బోధకుల సంకుచిత ద్రృక్పథాన్ని సంస్కరించటానికి సామ్రాజ్యమంతటా సాంఘిక ప్రవర్తనా చైతన్యాన్ని కలిగించటానికి" అశోకుడు దమ్మ ప్రచారం ద్వారా ప్రయత్నించాడు. అశోకుని మరణంతో అతని దమ్మ విధానం కూడా అంతరించింది. అశోకుని తరవాత మగధ పాలకులైన మౌర్యులు ఎవరు కూడా దమ్మ విధానాన్ని అనుసరించలేదు. 1837లో జేమ్స్ ప్రిన్సెప్ అశోకుని శాసనాలను చదివేంత వరకు అంటే సుమారు రెండువేల సంవత్సరాల వరకు అతని దమ్మ సంప్రదాయాన్ని స్మరించిన వారు కాని, లక్ష్య పెట్టినవారు కాని లేరు.

## 4.5 సారాంశము:

అశోకుని కాలం భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఇతని కాలంలో ఇవ్వబడిన శిలాశాసనాలు ఆధారంగా భారతీయులు అప్పటికే భాషాకోవిదులని తెలియ చెప్పటమేకాక, భారత చరిత్రకు కాల నిర్ణయం చేయటానికి ఉపయోగపడుతున్నాయి. అశోకుని దమ్మ పథం జాతిని సంఘటితపరచింది. అశోకుడు అవలంభించిన పద్దతుల వల్ల విదేశాలలో కూడా బౌద్ధ మతం విరివిగా వ్యాప్తి చెందింది. భారత దేశం శాంతికాముక దేశంగా విలసిల్లడానికి అశోకుని శాంతి ప్రవచనాలు ప్రామాణికంగా మారాయి.

## 4.6 మాదిరి ప్రశ్నలు:

1. ప్రజల సంక్షేమం కోసం అశోకుడు ఏ విధంగా పాటుపడ్డాడు?
2. అశోకుని కళింగ యుద్ధం గూర్చి వ్రాయుము.
3. అశోకుని దమ్మ విధానం గూర్చి వ్రాయుము ? దాని ఫలితము గూర్చి వ్రాయుము.
4. మూడవ బౌద్ధ సంగీతి గూర్చి వ్రాయుము ?

**సంక్షిప్త ప్రశ్నలు:**

1. దమ్మ విధాన వ్యాప్తి గూర్చి వ్రాయుము ?
2. అశోకుని యొక్క బిరుదులు తెలుపుము ?
3. తక్షశిల తిరుగుబాటు గూర్చి వ్రాయుము ?
4. బౌద్ధ మత వ్యాప్తి గూర్చి వ్రాయుము ?

**ఖాళీలను పూరించండి:**

1. దేవానాంప్రియ బిరుదు గల రాజు ..................................
2. అశోకుడు చేసిన ఏకైక యుద్ధం ..................................
3. మూడవ బౌద్ధ సంగీతి జరిగిన ప్రదేశం ........................................
4. దమ్మ ప్రచారం కోసం అశోకుడు నియమించిన అధికారులు ..........................

**మీకిచ్చిన భారతదేశ పటంలో క్రింది ప్రదేశాలను గుర్తించండి.**

1. పాటలీపుత్రం 2. తక్షశిల 3. సాంచి 4. సారనాథ్ 5. కళింగ

పాఠ్యభాగ రచయిత
**డా॥ కొండా శ్రీనివాసులు**

## పాఠం - 5

# కడపటి మౌర్యులు

### 5.0 లక్ష్యం:

కడపటి మౌర్య రాజుల చరిత్రను వివరించి, మౌర్య సామ్రాజ్య పతనానికి గల కారణాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### పాఠ్యాంశ నిర్మాణక్రమం:


5.1 ఉపోద్ఘాతం

5.2 పురాణాలు - కడపటి మౌర్యులు

5.2.1 బౌద్ధ గ్రంథాలు - కడపటి మౌర్యుల జాబితా

5.3 మౌర్య సామ్రాజ్యపతనం - కారణాలు

5.3.1 అశోకుని మత విధానం

5.3.2 అశోకుని అహింసా విధానము - సైనిక బలహీనత

5.3.3 ఆర్థిక విధానం

5.3.4 పన్నుల భారం

5.3.5 అసమర్థులైన వారసులు

5.3.6 రాష్ట్ర పాలకుల దౌర్జన్యాలు

5.4 సారాంశం

5.5 మాదిరి ప్రశ్నలు


### 5.1 ఉపోద్ఘాతం:

**అశోకుడి తరవాత మౌర్యులు:**

అశోకుడు మరణించిన తరవాత 52 సంవత్సరాలపాటు అంటే క్రీ.శ. 187 వరకు మౌర్యుల పరిపాలన కొనసాగింది. అయితే ఈ చివరి రాజుల కాలంలోనే మౌర్య సామ్రాజ్యం క్షీణించి, వారి అధికారం కేవలం మగధ పరిసర ప్రాంతాలకే పరిమితమయింది. అశోకుని తరవాత మగధ సింహాసనమధిష్టించిన మౌర్యులను గురించిన ఆధారాలు చాలా స్వల్పం. ఈ ఆధారాలు కూడా అస్పష్టంగాను, సంశయాస్పదంగాను, క్రమరహితంగాను ఉన్నాయి. ఈ కారణాల వల్ల చివరి మౌర్యుల చరిత్ర గురించి చరిత్రకారులలో ఏకాభిప్రాయం కనిపించటం లేదు. పురాణాలు, జైన, బౌద్ధ సాహిత్యాలు తమ తమ గ్రంథాలలో వీరిని గురించి విభిన్న కథనాలను వివరిస్తున్నాయి. ఈ ఆధారాలకంటే కొన్ని నూతన విషయాలతో కల్హణుని రాజతరంగిణి, టిబెట్ చరిత్రకారుడు తారానాథ్‌లు తమ రచనలో అశోకుని తరవాత మౌర్య రాజ్యాన్ని గురించి వివరించారు.

## 5.2 పురాణాలు - కడపటి మౌర్యుల జాబితా:

అశోకుని శాసనాల వల్ల మనకు తెలుస్తున్న అశోకుని కుమారుడు తీవరుడు. కాని అశోకుని తరవాత అతని ప్రసక్తి మౌర్య చరిత్రలో కనిపించదు. సారస్వత ఆధారాలు, మహేంద్రుడు, కుణాలుడు, జలౌకుడు అనే ముగ్గురు కుమారులు అశోకునికున్నట్లు తెలుపుతున్నాయి. వాయు, బ్రహ్మాండ పురాణాలు అశోకుని తరవాత కుణాలుడు ఎనిమిది సంవత్సరాలు పరిపాలించాడని, అతని తరవాత బంధుపాలితుడు, ఇంద్రపాలితుడు, దేవవర్మ, శతధనుష్, బృహద్రధుడు మొత్తం ఆరుగురు రాజులు 48 సంవత్సరాలు పరిపాలించారని వర్ణిస్తున్నాయి. మత్స్య పురాణం అశోకుని తరవాత దశరధుడు, అతని తరవాత సంప్రతి, శతధన్వుడు, బృహద్రధుడు 34 సంవత్సరాలు పరిపాలించినట్లు పేర్కొంటుంది. విష్ణుపురాణం అశోకుని తరవాత సుయశ, దశరధ, సంగత, శాలిశుక, సోమవర్మ, శతధన్వ, బృహద్రధుడు అనే ఏడుగురు రాజలు పరిపాలించారని చెబుతుంది. ఈ పురాణాలలో ఇచ్చిన వివిధ పట్టికలలోని జాబితాలను పోల్చడంవల్ల వచ్చిన పట్టిక ప్రకారం అశోకుని తరవాత కుణాలుడు, బంధుపాలిత, ఇంద్రపాలిత, దశోన, దశరధ, సంప్రతి, శాలిశుక, దేవవర్మ, శతధన్వ, బృహద్రధుడు మొత్తం పదిమంది రాజులు 85 సంవత్సరాలు పరిపాలించినట్లు మౌర్యుల కాలక్రమం వస్తుంది. కాని మౌర్యుల కాల నిర్ణయం ప్రకారం ఈ జాబితా ఆమోదయోగ్యం కాదు. చివరి మౌర్యుల గురించి పురాణాలలో విభిన్న సమాచారమున్నప్పటికీ మొత్తం మౌర్యవంశం 137 సంవత్సరాలు పరిపాలించదన్న అంశంలో పురాణాలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయి. పురాణాలు చెబుతున్న ప్రకారం మౌర్యవంశంలో మొదటి ముగ్గురు చక్రవర్తులైన చంద్రగుప్త, బిందుసార, అశోకుడు మొత్తం 85 సంవత్సరాలు పరిపాలించారు. మిగిలిన 52 సంవత్సరాలు అశోకుని తరవాత మౌర్య రాజ్యాన్ని పరిపాలించిన మౌర్య రాజులందరి పాలనా సంవత్సరాలు. పురాణాలలోని జాబితాల ప్రకారం చివరి మౌర్యుల పాలనా సంవత్సరాలు 85 సంవత్సరాలుగా కనిపిస్తుంది. కాని చివరి మౌర్యులు 85 సంవత్సరాలు పరిపాలించినారనడం పూర్తిగా అసంమంజసం అవుతుంది. అందువల్ల పురాణాలు పేర్కొంటున్న ఏ పట్టికా పూర్తి ప్రామాణికమని అంగీకరించడానికి వీలులేదు.

**5.2.1 బౌద్ధ గ్రంధాలు - కడపటి మౌర్యుల జాబితా:** బౌద్ధ గ్రంథాలలో అశోకావదానం ఇస్తున్న సమాచారం ప్రకారం అశోకుని తరవాత సంప్రతి, బృహస్పతి, వృషసేన, పుష్యధర్మ, పుష్యమిత్రులు మగధను పరిపాలించారు. జైన గ్రంథాల ప్రకారం అశోకుని అనంతరం అతని మనుమడు, కుణాలుని పుత్రుడు అయిన సంప్రతి మౌర్య సామ్రాజ్యాధినేత అయ్యాడు. టిబెట్ చరిత్రకారుడు తారానాథ్ వివిధ బౌద్ధ గ్రంథాల ఆధారంగా ఇచ్చిన జాబితా ప్రకారం అశోకుని తరువాత విగతాశోక, వీరసేనులు మగధను పరిపాలించారు. కల్హణుడు తన రాజతరంగిణిలో మిగిలిన ఆధారాలలో లేని జలౌకుడు, అశోకుని తరవాత కాశ్మీరు రాజ్యానికి రాజైనట్లు అతని తరవాత దామోదరుడు పరిపాలించినట్లు తెలియచేశాడు. గ్రీకు రచయిత పోలిబియన్ పేర్కొంటున్న వివరాల ప్రకారం క్రీ.పూ. 206లో సిరియా రాజైన యాంటియెకస్ వాయవ్య భారత ప్రాంతంలో రాజైన సోఫగసేనస్ (శుభగ సేన) ఆస్థానానికి యాంద్రోస్తనీసు రాయబారిగా నియమించి, శుభగసేనుడిచ్చే ఏనుగులను, ధనాన్ని తీసుకురావలసిందిగా ఆజ్ఞాపించినట్లు తెలుస్తుంది. దీనివల్ల శుభగ సేనుడు యాంటియోకు సామంతుడని స్పష్టమవుతుంది. బహుశా శుభగసేనుడుకాని, అతని పూర్వీకులు కాని ఈప్రాంతంలో మౌర్యుల రాజప్రతినిధిగా ఉంటూ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని ఉండవచ్చు. అయితే శుభగసేనునికి మౌర్యులకు ఉన్న సంబంధం తెలియటం లేదు.

మౌర్య వంశ చరిత్రను నిశితంగా అధ్యయనం చేసిన రోమిలా థాపర్ విశ్లేషణ ప్రకారం అశోకుని మరణం తరవాత క్రీ.పూ. 233-232లో మౌర్య సామ్రాజ్యం తూర్పు, పశ్చిమ భాగాలుగా విభజించడం జరిగింది. తక్షశిల రాజధానిగా పశ్చిమ ప్రాంతాన్ని మొదట కుణాలుడు, ఆ తరవాత సంప్రతి కొద్దికాలం పరిపాలించారు. సామ్రాజ్యం తూర్పు భాగాన్ని పాటలీపుత్రం రాజధానిగా దశరధుడు, సంప్రతి, శాలిశుక, దేవవర్మ, శతధన్వ, బృహద్రధులు 52 సంవత్సరాల కాలం పరిపాలించారు. బృహద్రధుడి మరణంతో మౌర్య వంశం అంతరించింది.

## 5.3 మౌర్య సామ్రాజ్య పతనం - కారణాలు:

అశోకుని మరణం తరవాత అర్ధ శతాబ్ద కాలానికే మౌర్య సామ్రాజ్యం పతనమయింది. మౌర్య రాజులలో చివరివాడైన బృహద్రథుడ్ని క్రీ.పూ. 187 సంవత్సరాలలో అతని సేనాని అయిన పుష్యమిత్రుడు వధించి మగధరాజ్యాన్ని ఆక్రమించి శుంగవంశపాలన ప్రారంభించాడు. మౌర్య సామ్రాజ్య పతనానికి గల కారణాలను గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి.

**5.3.1 అశోకుని మత విధానం:** మౌర్య సామ్రాజ్య పతనానికి అశోకుడు అనుసరించిన మత విధానాలే ప్రధాన కారణం అని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అశోకుని బౌద్ధ మత ఆదరణ, అతని తరవాత సంప్రతి మొదలయినవారి జైన మత అనుకూల విధానానికి వ్యతిరేకంగా బ్రాహ్మణ మతం విజృంభించి పుష్యమిత్ర శుంగుని నాయకత్వంలో తిరుగుబాటు చేసి మౌర్య సామ్రాజ్యాన్ని కూలదోసింది. బ్రాహ్మణులు నిర్వహిస్తున్న యజ్ఞాల వల్ల వారి అధికార ప్రతిష్ఠలు పెరిగాయి. అశోకుడు జంతు బలులను నిషేదించటం ప్రత్యక్షంగా బ్రాహ్మణులను దెబ్బతీయడమేనని కొందరి అభిప్రాయం. అయితే నాటి బ్రాహ్మణ వాఙ్మయం కూడా అహింసను సమర్థిస్తూ కేవలం యజ్ఞాలు మాత్రమే చేస్తుండటం నిష్ప్రయోజనం అని చెబుతుంది. అందువల్ల జంతు బలి నిషేధం బ్రాహ్మణుల పట్ల అశోకుడు విరోధం వహించడం కాదని కొందరి అభిప్రాయం. అశోకుడు తన ధమ్మ విధానంలో భాగంగా జాతరలను నిషేధించటం ప్రజల తిరుగుబాటుకు కారణం అనే వాదన ఉంది. జాతర్ల వేడుకలను, మాంసాహారాన్ని నిషేధించి అశోకుడు ప్రజాదరణను కోల్పోయారు. కాని ఈ నిషేధం పూర్తిగా అమలు జరిగిందనడం అనుమానాస్పదం. అశోకుని విధానాలనే తరవాత మౌర్య రాజులు అనుసరించారనే భావంపైనే ప్రజా విప్లవవాదం ఆధారపడి ఉంది. కాని తరవాత రాజులు అశోకుని విధానాలను తు.చ. తప్పకుండా అనుసరించలేదు. అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించి ఆ మత ప్రచారానికి, మత వ్యాప్తికి ఎంతో కృషి చేశాడని, అందులో భాగంగానే 84,000 స్తూప, విహారాలను నిర్మించాడని, బౌద్ధ మతాదరణ వల్ల ఇతర మతాల పట్ల ముఖ్యంగా బ్రాహ్మణ మతం పట్ల నిరాదరణ చూపాడని, ఆ కారణంగానే బ్రాహ్మణుడు, వైదిక మతాభిమాని అయిన పుష్యమిత్రుడు మౌర్యులపై తిరుగుబాటు చేసి అశోకుడు నిర్మించిన బౌద్ధ కట్టడాలను ధ్వంసం చేయుటకు సంకల్పించాడని బౌద్ధ వాఙ్మయం పేర్కొంటుంది. అశోకుడు తన శాసనాలలో మత సామరస్యాన్ని, మత సహనాన్ని ప్రచారం చేయటమే కాక అన్ని మతాలను సమానంగా ఆదరించాలని బోధించాడు. అంతే కాకుండా మౌర్య యుగానంతర వాస్తు శిల్పాలలో ముఖ్యంగా సాంచీ, బార్హుత్ స్తూపాల విస్తరణకు కారకులు శుంగులే. అందువల్ల కేవలం అశోకుని బౌద్ధమత స్వీకరణయే మౌర్య సామ్రాజ్య పతనానికి కారణం అనేది సరైన వాదన కాదు.

**5.3.2 అశోకుని అహింసా విధానము - సైనిక బలహీనత:** అశోకుడు అవలంభించిన అహింసా విధానం వల్ల మౌర్యుల సైన్యం నిర్వీర్యమై తరవాత జరిగిన గ్రీకు దండయాత్రను ఎదిరించలేకపోయిందనే విమర్శ ఉంది. ఈ కారణంవల్ల అశోకుని మరణం తరవాత కొద్ది కాలంలోనే సామ్రాజ్యం పతనం అయిందని, ఈ అహింసా విధానం వల్లనే సైనికబలం క్షీణించటమే కాక, రాజ్యాధికారం బలహీనమై రాష్ట్రాధికారుల దౌర్జన్యాలు మితిమీరటంవల్ల తిరుగుబాటు జరిగిందని రాయ్ చౌదరి అనే చరిత్రకారుడి అభిప్రాయం. అశోకుని పాలనా విధానం, ప్రభుత్వ స్వభావం ఆ కాలపు సంప్రదాయానికి విరుద్ధమైనవే. అతడు తన ధమ్మ విధానానికి అనుగుణంగా, తన పాలనా విధానాలను రూపొందించుకున్నాడు. అహింసా విధానంలో భాగంగా జంతువధ నిషేధంతోపాటు, జంతువుల పట్ల కరుణ ప్రదర్శించాలని తన శాసనాలలో ప్రకటించాడు. అహింసావాది అయిన అశోకుడు మరణశిక్షను రద్దు చేయకపోవటం గమనించాల్సిన అంశం. అతని అహింసా విధానం ప్రజలను ధర్మాను వర్తనులుగా చేసి, సామ్రాజ్యం శాంతి సుస్థిరతలతో విలసిల్లడానికి ఉద్దేశించింది. అశోకుడు పాలనా వ్యవహారాలలో కఠినంగా ఉన్నట్లు అతని శాసనాల వల్ల తెలుస్తుంది. కళింగను అశోకుడాక్రమించటంతో భారతదేశంలో అధిక భాగంలో మౌర్య సామ్రాజ్యం విస్తరించింది. దక్షిణ దిశలో ఉన్న చోళ, పాండ్య మొదలయిన రాజ్యాలు మౌర్యుల పట్ల విధేయతగా ఉన్నందున వారిని జయించనవసరం లేదు. పశ్చిమ దిక్కున ఉన్న ఆంటియోకస్ పరిపాలిస్తున్న సిరియా సామ్రాజ్యం పై దాడి చేయటం అవివేకం. ఆ రాజ్యంతో మైత్రి చంద్రగుప్త మౌర్యుని కాలం నుంచే కొనసాగుతుంది. ఈ కారణాలవల్ల అశోకుడు

దండయాత్రలు కొనసాగించలేదు. అందువల్ల అశోకుడు అహింసా విధానం అనుసరించినంత మాత్రాన మౌర్య సామ్రాజ్యం బలహీనమై విచ్ఛిన్నం కాలేదు. అతని తరవాత తరంవారు అసమర్థులైనందున, దండయాత్రలు చేసి ఆక్రమించాల్సిన రాజ్యాలు లేనందున సైనికంగా మౌర్య సామ్రాజ్యం క్షీణదశకు చేరుకొంది.

**5.3.3 ఆర్థిక విధానం:** కడపటి మౌర్యుల కాలంలో మౌర్యుల ఆర్థిక విధానం పై అధిక భారం ఏర్పడిందని, ఆ కారణం కూడా మౌర్యుల పతనానికి తోడ్పడిందనే అభిప్రాయముంది. ఆర్థికాభివృద్ధికి పన్నులు పెంచారని, దీనికి ఉదాహరణగా నటుల మీద, వేశ్యల మీద పన్నులు విధించటం, చివరి మౌర్యుల విద్ధాంక నాణాలలో నకిలీ నాణాలు ఎన్నో కనిపించడం మొదలయిన వాటిని కొందరు చరిత్రకారులు పేర్కొంటున్నారు. రాజ్య ఆదాయానికి పన్నులు ముఖ్య ఆధారమని గుర్తించిన మౌర్యులు తదనుగుణంగా పన్నులు విధించే పద్ధతిని అనుసరించారు. వేశ్యా వృత్తి పై పన్నులు విధించటం న్యాయబద్ధమేనని, వ్యవసాయదారుల పై పన్నులవంటివి సాధారణమైనవని, ఖజానా ఖాళీ అయిన సమయంలో విధించాల్సిన పన్నుల జాబితాలో నట, వేశ్యా వృత్తుల పై పన్నులున్నట్లు అర్థ శాస్త్రంవల్ల తెలుస్తుంది. ఆర్థిక విధానం పై భారం కారణంగానే నకిలీ నాణాలు తయారయ్యాయని కౌశాంబి అభిప్రాయం. ఇటువంటి నకిలీ నాణాలు చివరి మౌర్యుల కాలంలో రాష్ట్రాల పై కేంద్రాధికారం అదుపు తప్పినందున ఆ ప్రాంతాలు స్వతంత్రమైన కారణంగా ఇవి చెలామణిలోకి వచ్చాయి. పురావస్తు తవ్వకాలలో లభ్యమైన భౌతిక అవశేషాలు నాటి ఆర్థిక విధానంపై ఒత్తిడిని సూచించడం లేదు. హస్తినా పురం, శిశు పాలఘర్ మొదలయిన ప్రదేశాలలో తవ్వకాలలో బయల్పడ్డ సామాగ్రి నాటి ఆర్థిక విధానంలో ముఖ్యంగా వాడుకలో ఉన్న వస్తువుల గుణంలోను, సాంకేతిక విజ్ఞానంలోను పురోగతిని సూచిస్తున్నాయి. ఇటువంటి అభివృద్ధి మౌర్యుల తొలి కాలం కంటే చివరి కాలంలో సామ్రాజ్యమంతటా సమంగా విస్తరించినట్లు ఈ ఆధారాలు సూచిస్తున్నాయి. పూసలు, ఉంగరాలు, జేగురు మట్టి బొమ్మల తయారీలో కూడా అభివృద్ధి కనిపిస్తుంది. దేశం సమైఖ్యం కావడంవల్ల, రవాణా సౌకర్యాలు పెంపొందడంవల్ల, ఆంతరంగిక శాంతిభద్రతల కారణంగా వర్తకం అభివృద్ధి చెంది నూతన వాణిజ్య శ్రేణులు అనేకం ఏర్పడి ఆర్థిక పురోగతిని మౌర్య యుగం సాధించగలిగింది. మౌర్య సామ్రాజ్యం క్షీణించే దశలో కూడా సామ్రాజ్యం సుసంపన్నంగానే ఉన్నందున ఆర్థిక భారం మౌర్య సామ్రాజ్య పతనానికి కారణం కాదు అని రోమిలా థాపర్ అభిప్రాయం.

**5.3.4 పన్నుల భారం:** మౌర్యుల కాలంలో రైతుల పై విధించిన భూమి శిస్తు భారమే ప్రజలు చేసిన తిరుగుబాటుకు కారణం. గ్రీకు రచనల ప్రకారం మౌర్యులు పంటలో నాల్గవ వంతు భూమి శిస్తుగా విధించేవారు. కాని భూసారాన్ని బట్టి, నీటి వనరులను బట్టి ప్రాంతానికి, ప్రాంతానికి మధ్య పన్నులలో వ్యత్యాసాలున్నాయి. మెగస్తనీస్ పంటలో నాల్గవ వంతు శిస్తుగా విధించేవాడని ఇండికాలో పేర్కొన్నాడు. బహుశా అది పాటలీపుత్రం ప్రాంతంపై అయి ఉంటుంది. ఈప్రాంతం సారవంతమైనదే కాక నీటివనరులు కూడా పుష్కలంగా కలిగివున్న కారణంగా అక్కడ నాల్గో వంతు శిస్తుగా విధించి ఉండవచ్చు. రుమ్మిండై వంటి ప్రాంతాలలో శిస్తు ఆరవ వంతుగా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో శిస్తును నాల్గవ వంతు లేదా మూడవ వంతుకు పెంచవచ్చని అర్థశాస్త్రం పేర్కొంటుంది.

**5.3.5 అసమర్థులైన వారసులు:** అశోకుని తరవాత బలహీనులైన రాజులు మౌర్య సామ్రాజ్యాన్ని పరిపాలించడం ఆ సామ్రాజ్య పతనానికి ముఖ్య కారణం. వారసుల మధ్య జరిగిన సామ్రాజ్య విభజన కూడా సామ్రాజ్య పతనానికి కారణం అయింది. సామ్రాజ్యంలోని తూర్పు భాగానికి దశరధుడు రాజు, పశ్చిమ ప్రాంతానికి కుణాలుడు రాజుగా సామ్రాజ్య విభజన జరిగింది. ఈ విభజన కారణంగా బలహీనపడిన మౌర్య సామ్రాజ్యం, వాయవ్య ప్రాంతం పై జరిగిన బాక్ట్రియన్ గ్రీకుల దండయాత్రను సమర్థవంతంగా ఎదుర్కొనలేకపోయింది. సామ్రాజ్య విభజన వల్ల పాలనా వ్యవస్థ కూడా బలహీనపడింది. ఈ సమయంలోనే వాయవ్య ప్రాంతం పై గ్రీకు దండయాత్రలు ప్రారంభమయ్యాయి. ఈ గ్రీకు దండయాత్రలను అరికట్టి తమ రాజ్యాన్ని, వాయవ్య ప్రాంతంలోని మౌర్యులు రక్షించుకోలేకపోయారు. అశోకుని తరువాత అధికారం చేట్టిన వారందరూ అసమర్థులే. అశోకుడు అనుసరించిన విధానాలు సంప్రదాయ సిద్ధమైనవి కావు. అతడనుసరించిన విధానాలనే కొనసాగించాలా, లేక సాంప్రదాయసిద్ధమైన పద్ధతికి మారడమా అనేది అశోకుని

వారసులకు సమస్యగా మారింది. క్రీ.పూ. 3వ శతాబ్దంలో మౌర్య సామ్రాజ్యానికి ధమ్మం ఎందుకు అవసరమయిందో, అశోకుడు ఆ విధానాన్ని ఎందుకు అనుసరించాడో తరవాత మౌర్యులు అర్థం చేసుకోలేకపోయారు. అశోకుని వారసులలో దశరథుడు మాత్రమే ఆజీవిక శ్రమణులకు బరాబర్ కొండలలో గుహలను దానంగా ఇచ్చాడు. దశరథుని శాసనం తప్ప అశోకుని తరువాత మౌర్యుల శాసనాలు కనిపించకపోవడం అశోకుని విధానం పట్ల వారికి గల అనాసక్తిని సూచిస్తుంది. పురాణాలలో కనిపిస్తున్న ఆధారాల వల్ల చివరి మౌర్యుల పట్టికల పేర్లలో ఎన్నో వ్యత్యాసాలున్నట్లు తెలుస్తుంది. దీనివల్ల రాజకుమారులే కాక, రాజ బంధువులు, దాయాదులు సింహాసనం పై తమకు గల హక్కును ప్రకటించి, అధికారం కోసం ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. మౌర్యవంశంలో రాజ్యాధికారం కోసం వారసత్వ యుద్ధాలు, అంతర్గత కలహాలు కొత్తగా వచ్చినవేమీ కాదు. అశోకుడే రాజ్యం కోసం సోదరులను వధించాడన్న అంశం మనం మరువరాదు. అటువంటి ప్రయత్నమే అశోకుని వారసులలో కొందరు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇటువంటి వారిలో కొంతమంది రాష్ట్రాలలో స్వతంత్ర్యాధికారాన్ని ప్రారంభించారు. అశోకుని తరవాత దాదాపు ఆరుగురు రాజులు కేవలం 52 సంవత్సరాల స్వల్ప కాలం పరిపాలించటం వారి బలహీనతను సూచిస్తుంది. ఇటువంటి బలహీనులైన చక్రవర్తుల పాలనలో సామంత రాజులు, సరిహద్దు రాష్ట్రాల పాలకులు స్వాతంత్ర్యం కోసం ప్రయత్నించటం సామాన్యమైన విషయం. కేంద్రాధికారం బలహీనం కావటంతో ఆంధ్రులు, కళింగులు మొదలగు బలవంతులయిన సామంతులు, ఇతర రాష్ట్ర పాలకులు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు.

**5.3.6 రాష్ట్ర పాలకుల దౌర్జన్యాలు:** చివరి మౌర్యుల కాలంలో రాష్ట్ర పాలకుల దౌర్జన్యాలు మితిమీరి ప్రజలు తిరుగుబాటు చేసినందువల్ల కూడా మౌర్య సామ్రాజ్యం పతనమయింది. సమర్థులైన తొలి మౌర్యుల కాలంలోనే అమాత్యుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తక్షశిలలో ప్రజలు తిరుగుబాటు చేశారు. ఇక అసమర్థులైన చివరి మౌర్యుల కాలంలో ప్రబలిన రాష్ట్ర పాలకుల దౌర్జన్యాన్ని అదుపులో ఉంచే శక్తి వారిలో లోపించింది.

## 5.4 సారాంశం:

మౌర్య సామ్రాజ్య పతనానికి సైనిక బలహీనత, బ్రాహ్మణుల ఆగ్రహం, ప్రజల అసంతృప్తి, పన్నుల భారం, ఆర్థిక ఒత్తిడి మొదలయిన కారణాలేకాక, పాలనా వ్యవస్థ స్వరూపం, జాతీయ ఐక్యత లోపించటం కూడా కారణాలయ్యాయి. మౌర్యుల పాలనా వ్యవస్థ కేంద్రీకృత రాజరిక వ్యవస్థపై ఆధారపడి రూపొందింది. సమర్థుడైన చక్రవర్తి ఈ పద్ధతిని తన శ్రేయస్సుకు ప్రజల శ్రేయస్సుకు, సామ్రాజ్య రక్షణకు ఉపయోగించుకొంటాడు. కాని అసమర్థులైన వారి పాలనలో కేంద్రాధికారం దుర్భలమై, సామ్రాజ్యానికి అది ప్రమాదకరంగా పరిణమించింది. అరాచక శక్తులు విజృంభించి సామ్రాజ్య విచ్ఛిన్నానికి అవకాశం కలుగుతుంది. మౌర్య సామ్రాజ్యంలో జాతీయ సమైఖ్యతా భావం లేదు. భారతీయులందరూ గ్రీకులను ద్వేషించారు. అయినా వారంతా సంఘటితంగా గ్రీకులను ఎదుర్కోలేకపోవటానికి కారణం వారిలో జాతీయ ఐక్యత లోపించటమే. అలెగ్జాండర్‌ను పురుషోత్తముడు ఎదుర్కొన్నప్పుడు కాని, ఆంటియోకస్‌కు శుభగసేనుడు లొంగిపోయినప్పుడు కాని స్థానిక పాలకులు మాత్రమే గ్రీకులను ఎదిరించి పోరాడారు. కాని ఇతరుల సహాయం వారికి లభించలేదు. మౌర్య సామ్రాజ్య ప్రజల మధ్య మౌలికమైన రాజకీయ ఐక్యత లేనందున మౌర్య సామ్రాజ్య విచ్ఛిన్నం అనివార్యమై, ఆ సామ్రాజ్యం పతనమయింది.

## 5.5 మాదిరి ప్రశ్నలు:

1. కడపటి మౌర్యుల జాబితాలను వివరింపుము ?
2. మౌర్య సామ్రాజ్యం పతనానికి గల కారణాలు వివరింపుము ?

**సంక్షిప్త ప్రశ్నలు:**

1. అశోకుని అహింసా విధానం, ఏ విధంగా మౌర్య సామ్రాజ్య పతనానికి కారణమయ్యేను ?

పాఠ్యభాగ రచయిత
డా॥ కొండా శ్రీనివాసులు

పాఠం - 6

# మౌర్యుల పరిపాలన

## 6.0 లక్ష్యం:

మౌర్యుల పరిపాలనా లక్షణాలను, ఆకాలం నాటి ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, మత లక్షణాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్యభాగ నిర్మాణక్రమం:


6.1 ఉపోద్ఘాతం
6.2 చక్రవర్తి
6.2.1 మంత్రి పరిషత్తు
6.2.2 ధర్మ మహా మాత్రులు
6.3 రాష్ట్ర పాలన
6.3.1 ప్రదేశ పాలన (మండల పాలన)
6.3.2 నగరపాలన
6.3.3 గ్రామ పాలన
6.3.4 ఆదాయ వ్యయాలు
6.4 సైనిక వ్యవస్థ
6.4.1 గూఢచారి దళం
6.5 న్యాయ వ్యవస్థ
6.6 నీటిపారుదల - వ్యవసాయం
6.7 జనాభా లెక్కల సేకరణ
6.8 మౌర్య యుగ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు
6.8.1 వర్ణాశ్రమ ధర్మాలు
6.8.2 కుటుంబ వ్యవస్థ
6.8.3 సమాజంలో స్త్రీ స్థానం
6.8.4 బానిస వ్యవస్థ
6.8.5 ఆర్థిక పరిస్థితులు
6.8.6 వర్తక వాణిజ్యాలు
6.8.7 విదేశీ వాణిజ్యం
6.8.8 స్వదేశీ వాణిజ్యం
6.8.9 మతం
6.8.10 భాషా-సారస్వతాలు
6.8.11 వాస్తు శిల్పాలు
6.9 సారాంశం
6.10 మాదిరి ప్రశ్నలు

## 6.1 ఉపోద్ఘాతం:

**మౌర్యుల పరిపాలనా విధానం:**

చంద్రగుప్త మౌర్యుడు తన సువిశాలమైన మౌర్య సామ్రాజ్యంలో చాణుక్యుని సహాయంతో సమర్ధవంతమైన కేంద్రీకృత పాలనా యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాడు. చంద్రగుప్తుని పాలనా విధానాలకు అశోకుడు మరికొన్ని పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టి మౌర్యుల పాలనా వ్యవస్థకు మెరుగులుదిద్దాడు. మౌర్యుల సువిశాల సామ్రాజ్యంలో మతం, ఆచార వ్యవహారాలు, భాషలలో వైవిధ్యం, వైరుధ్యం ఉన్న అనేక ప్రాంతాల జాతులు, తెగలు ఉన్నారు. వారందరి సంక్షేమానికి, వారికి అనుకూలమైన పాలనా విధానాన్ని రూపొందించుటలో తొలి మౌర్య చక్రవర్తులు సఫలీకృతులైనారు. మౌర్యుల పాలనా విధాన స్వరూపాన్ని తెలుసుకొనుటకు కౌటిల్యుని - అర్థశాస్త్రం, మెగస్తనీస్ 'ఇండికా', అశోకుని శాసనాలు మొదలయినవి ముఖ్యమైన ఆధారాలు.

## 6.2 చక్రవర్తి:

మన దేశ ప్రాచీన సాంప్రదాయక రాజరిక విధానాన్ని అనుసరించి, ప్రజల స్థితిగతులను పరిరక్షించుటమే చక్రవర్తి ప్రధాన కర్తవ్యం. తన సామ్రాజ్యంలోని ప్రజలందరూ వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ తమ వృత్తులను, ధర్మాలను అనుసరించేటట్లు చేయటం చక్రవర్తి బాధ్యతలలో ముఖ్యమైనది. సువిశాలమైన తమ సామ్రాజ్య పాలనకు మౌర్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ కేంద్రీకృత పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నిర్వహించుటకు వివిధ స్థాయిలలో సమర్థులైన అధికారులను, ఉద్యోగులను నియమించి, వారు ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేయడానికి తగిన మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి. మౌర్యులు తమ పాలనా యంత్రాంగాన్ని 1. చక్రవర్తి, 2. రాజప్రతినిధులు, 3. మంత్రులు, 4. వివిధ శాఖాధిపతులు, 5. పౌర విధుల నిర్వహణకు దిగువ శ్రేణి ఉద్యోగులు, 6. గ్రామీణ స్థాయి అధికారులు, ఉద్యోగులతో రూపొందించారు. సామ్రాజ్యంలోని అన్ని పాలనా విభాగాల విధాన నిర్దేశకుడు చక్రవర్తి. శాసనాలు చేయటంలోను, న్యాయ నిర్ణయంలోను, సైనిక వ్యవహారాలలోను, అన్ని పాలనా విషయాలలోను చక్రవర్తే అత్యున్నత అధికారి. పాలనా వ్యవహారాలలో చక్రవర్తికి తగిన సలహాలు ఇచ్చి సహాయపడే మంత్రులను, ఇతర ఉద్యోగులను నియమించడటమే కాక వారి కార్యకలాపాలను అదుపు చేస్తూ, ప్రణాళికాబద్ధమైన పర్యవేక్షణ, అజమాయిషీలతో ప్రజా శ్రేయస్సుకు చక్రవర్తి నిర్విరామంగా కృషి చేస్తుండేవాడు. కౌటిల్యుడు 'అర్థశాస్త్రం'లో 'చక్రవర్తి ప్రజలకు, ఉద్యోగులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని సూచించాడు. "అలా లేనట్లయితే అసంతృప్తికి, సంక్షోభానికి కారణమై, శత్రువులకు బలికాక తప్పదని'' హెచ్చరించాడు. ఈ సూచనను మౌర్యులు పాటించారనుటకు అశోకుని ఆరవ శిలా శాసనమే చక్కని ఉదాహరణ. ఆరవ శిలా శాసనంలో తాను ఎక్కడ ఉన్నా, భోజనం చేస్తున్నా, అంతఃపురంలో ఉన్నా, విశ్రాంతి తీసుకుంటున్నా, నివేదకులు తనను దర్శించ వచ్చని అశోకుడు పేర్కొన్నాడు. కౌటిల్యుని సిద్ధాంతం ప్రకారం పరిపాలన పటిష్టంగా కొనసాగుటకు చక్రవర్తి మూడు పద్ధతులను అనుసరించాలి. అవి 1. పాలనలో అన్ని అంశాలకు సమాన ప్రాముఖ్యతను ఇవ్వటం. 2. అన్ని సమయాలలో అప్రమత్తుడై కార్యనిర్వహణకు సన్నద్ధుడై ఉండటం. 3. విధి నిర్వహణలో ఎటువంటి జాప్యం కలగకుండా చూడటం. ఈ పద్ధతుల అమలుకు చక్రవర్తి సమర్థులైన ఉద్యోగులను నియమించాలి.

**6.2.1 మంత్రి పరిషత్తు:** పాలనా వ్యవహారాలలో సలహాలిచ్చి చక్రవర్తికి సహాయపడుటకు మంత్రి పరిషత్ ఉండేది. అయితే మంత్రి పరిషత్తులో ఎంత మంది సభ్యులుండాలి అనే విషయంలో ఎటువంటి నిబంధనలు లేవు. మంత్రుల సంఖ్య అవసరాన్ని బట్టి ఉంటుంది. బిందుసారుడు 50 మంది మంత్రులను నియమించాడు. చక్రవర్తే మంత్రి పరిషత్తు సభ్యులను ఎన్నిక చేసేవాడు. 'కులీనత, బుద్ధి కుశలత, న్యాయవర్తనలను మంత్రులకు ఉండవలసిన లక్షణాలు' అని పేర్కొంటూ, వివిధ పద్ధతుల ద్వారా ఈ గుణాలను పరిరక్షించాలని అర్థశాస్త్రం పేర్కొంటుంది. ఈ మంత్రులను తాను పేర్కొన్న ఏడు వర్ణాలలో ఏడవ వర్ణం నుంచి ఎన్నిక చేస్తారని మెగస్తనీస్ 'ఇండికా'లో రాశాడు. సాధారణంగా మంత్రులను బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల నుంచి ఎంపికచేసేవారు. మంత్రి పరిషత్తులో పురోహిత, సేనాధిపతి, యువరాజు, ఇతర మంత్రులతో పాటు సభ్యులుగా ఉంటారు. మంత్రి పరిషత్తు కార్యదర్శిని మంత్రి పరిషాధ్యక్షుడని

వ్యవహరించేవారు. చక్రవర్తి మంత్రి పరిషత్తును సంప్రదించి, సలహాలను స్వీకరించాలనే నియమనిబంధనలు లేవు. అర్థశాస్త్రంలో కౌటిల్యుడు "సహాయరహితమైన రాజరికం అడుగు ముందుకు వేయలేని ఏకచక్ర శకటం వంటిది" అని అందువల్ల "చక్రవర్తి మంత్రులను నియమించి వారితో సంప్రదించాలని" సూచించాడు. మంత్రి పరిషత్తు ప్రస్తావన అశోకుని మూడవ, ఆరవ ముఖ్య శిలా శాసనాలలో కనిపిస్తుంది. తాను ప్రవేశపెట్టిన కార్యక్రమాలను ప్రజలకు స్పష్టంగా వివరించవలసిందిగా ఉద్యోగులను మంత్రి పరిషత్తు ఆదేశిస్తుందని, అశోకుడు మూడవ ముఖ్య శిలా శాసనంలో పేర్కొన్నాడు. ఆరవ ముఖ్య శాసనంలో మౌఖికంగా చెప్పిన శాసనాన్ని గురించి కాని, ఉద్యోగులకు ఆదేశించిన అత్యవసర అంశాల గురించి మంత్రి పరిషత్తులో చర్చించే సమయంలో వివాదం వస్తే దానిని తాను ఎక్కడున్నా వెంటనే నివేదించాలని ఆదేశించాడు. అందువల్ల మంత్రి పరిషత్తు సలహా సంఘమని ఏ విషయంలోనైనా తుది నిర్ణయం చక్రవర్తిదేనని స్పష్టమవుతుంది. ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమాలను కొనసాగించటం, నూతన పథకాలను అమలు చేయటం, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేయటం కూడా మంత్రి పరిషత్తు బాధ్యతలలో ముఖ్యమైనవి. పాలనా వ్యవహారాలను సక్రమంగా నిర్వహించుటకు సమర్థులైన ఉద్యోగులను చక్రవర్తి నియమించేవాడు. కేంద్ర ప్రభుత్వంలో 32 పాలనా శాఖలలో ఉన్నతోద్యోగులను నియమించి, పాలనా యంత్రాంగాన్ని పటిష్టంగా రూపొందించుకోవాలని అర్థశాస్త్రంలో కౌటిల్యుడు పేర్కొన్నాడు. దాని కనుగుణంగా మౌర్య చక్రవర్తులు 32 శాఖలకు అధ్యక్షులను జాతి, కుల, మత భేదాలు పాటింపక అర్హతను బట్టి నియమించేవారు. ఈ అధ్యక్షులు కేంద్ర ప్రభుత్వంలో ముఖ్య ఉద్యోగి బృందంగా ఉండేవారు. మౌర్య చక్రవర్తులు నియమించిన అధ్యక్షులలో ముఖ్యులు - కోశాధ్యక్షుడు (కోశాగారం), సూత్రాధ్యక్షుడు (నేత), శుల్కాధ్యక్షుడు (అమ్మకం పన్ను), సురాధ్యక్షుడు (మత్తు పానీయాలు), ముద్రాధ్యక్షుడు (ముద్రణా శాఖ), సీతాధ్యక్షుడు (వ్యవసాయం), దేవతాధ్యక్షుడు (దేవాలయాలు, ఆదాయాలు) మొదలయిన వారు. మంత్రి పరిషత్‌లో కొంతమంది ఉప మంత్రులుండే వారు. వారిని తీర్థులనేవారు. వారిలో దౌవారికుడు, అంతర్వేశికుడు, ప్రశస్తి, సన్నిధాత, అంతపాల, దుర్గపాలకులు ముఖ్యులు.

**6.2.2 ధర్మ మహా మాత్రులు:** తన పదమూడవ రాజ్య పాలనా సంవత్సరంలో అశోకుడు ధర్మ మహామాత్రులనే ఉద్యోగులను నియమించాడు. అంతకు పూర్వం ఇటువంటి ఉద్యోగులు మౌర్య ప్రభుత్వంలో లేరు. అశోకుడు తన శాసనాలలో ఈ పదవిని కొన్ని చోట్ల పాలనా యంత్రాంగానికి సంబంధించిన సలహా సంఘానికి, కొన్నిచోట్ల న్యాయాధికారులు గాను, మరికొన్నిచోట్ల న్యాయాధికారుల చర్యలను తనిఖీ చేయటానికి సామ్రాజ్యంలో పర్యటించే ఉన్నతాధికారులు గాను ఉపయోగించాడు. అశోకుని శాసనాలను పరిశీలించినప్పుడు మహామాత్రులు అనేక బాధ్యతలు కలిగిన ఉద్యోగులని స్పష్టమవుతుంది. నగరాలలో న్యాయ వ్యవహారాలను పరిష్కరించుటకు మహామాత్రులను ప్రత్యేకంగా నియమించారు. స్త్రీ సంక్షేమ కార్యకలాపాలను నిర్వహించుటకు ఇథీజ్ఞక మహామాత్రులను నియమించారు. వీరికి గణికాధ్యక్షులకు సంబంధం ఉంది. ఈ మహామాత్రులు పాటలీపుత్రంలోను, ఇతర ప్రాంతాలలోని చక్రవర్తి కుటుంబం, ఇతర సమీప రాజ బంధువుల అంతఃపుర నిర్వహణ, రాజ కుటుంబ సభ్యులు దాన ధర్మాలు చేయటం, వారు ధమ్మ మార్గాన్ని అనుసరించేటట్లు చూడటం వంటి వ్యవహారాలను నిర్వర్తించేవారు. వీరు కాకుండా నేత మొదలయిన కుటీర పరిశ్రమలలో స్త్రీలకు ఉపాధి కల్పించటం, గణికలను అదుపులో ఉంచటం. మొదలయిన ఇతర స్త్రీ సంక్షేమ కార్యక్రమాలకు దిగువ శ్రేణి ఉద్యోగులుండేవారు.

## 6.3 రాష్ట్ర పాలన:

మౌర్య చక్రవర్తులు పాలనా సౌలభ్యం కోసం తమ సామ్రాజ్యాన్ని జన పదాలు(రాష్ట్రాలు)గా, ప్రదేశాలు, ఆహార్యాలు, విషయాలు అనే ప్రాదేశిక విభాగాలుగా విభజించారు. అశోకుని శాసనాల వల్ల అతని కాలంలో మౌర్య సామ్రాజ్యం లోని నాలుగు ప్రధాన రాష్ట్రాల పేర్లు తెలుస్తున్నాయి. అవి తక్షశిల రాజధానిగా ఉన్న వాయువ్య రాష్ట్రం, ఉజ్జయిని రాజధానిగా ఉన్న అవంతీ రాష్ట్రం, తోసలి రాజధానిగా ఉన్న కళింగ రాష్ట్రం , సువర్ణగిరి రాజధానిగా ఉన్న దక్షిణాపథ రాష్ట్రం . సౌరాష్ట్ర, అనార్త వంటి చిన్న రాష్ట్రాలు కూడా ఉండేవని శాసనాలవల్ల తెలుస్తుంది. సాధారణంగా రాష్ట్ర పాలకులుగా రాజ కుమారులను,

రాజ బంధువులను నియమించబడేవారు. చంద్రగుప్తుని కాలంలో పుష్యగుప్తుడు సౌరాష్ట్రకు రాజప్రతినిధిగా కాగా, అశోకుని కాలంలో యవనుడైన తుషాస్పుడు ప్రతినిధిగా ఉన్నాడు.

రాష్ట్రాలలో కూడా కేంద్ర ప్రభుత్వంలో లాగా రాజ ప్రతినిధులకు పాలనలో సహాయకారిగా మంత్రి పరిషత్తులుండేవి. రాజ ప్రతినిధుల అజమాయిషీలో మంత్రి, రాజుకులు, ఉపదేష్టి మొదలయిన అధికారులు పని చేసేవారు. రాష్ట్రంలో పన్నులు వసూలు చేయడం, శాంతిభద్రతలను కాపాడటం వారి ముఖ్య విధులు.

**6.3.1 ప్రదేశ పాలన (మండల పాలన):** ప్రతి రాష్ట్రాన్ని కొన్ని ప్రదేశాలుగా విభజించారు. ప్రదేశాల పాలనకు ప్రాదేశిక, రాజుక, యుక్త మొదలయిన ఉద్యోగులుండే వారు. ప్రాదేశికుడు ప్రదేశం పై ముఖ్య అధికారి. ఇతడు ప్రదేశంలో పర్యటించి ప్రదేశ గ్రామాధికారుల కార్యకలాపాల గురించిన నివేదికలు సమాహర్తకు పంపించేవారు. ప్రాదేశికుని విధులలో ముఖ్యమైనవి ప్రదేశాలలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఓ రాజ శాసనాలను అమలు చేయటం, శాంతి, భద్రతల నిర్వహణ మొదలయినవి. రాజుకులు ప్రాదేశికుని కింది ఉద్యోగులు. వీరికి న్యాయ నిర్వహణ కూడా అప్పగించారు. పంట పొలాలను సర్వేచేసి పన్నులు విధించే అధికారం కూడా వీరికి ఉంది. స్థానికపాలనలో వీరు కీలకమైన ఉద్యోగులు. పన్నుల విధింపు, పన్నుల మినహాయింపు, రైతులకు పాలకులకు మధ్య వచ్చే భూమి తగాదాలు, నీటి తగాదాలు, పచ్చిక మేత తగాదాలు మొదలయినవి రాజుకులు పరిష్కరించేవారు. రాజుకుని అధికారాలు పెరిగినందున అతడు నిరంకుశంగా వ్యవహరించే ప్రమాదముంది. అటువంటి ప్రమాదం లేకుండా రాజుకుని కార్యకలాపాలను ప్రాదేశికుడు పర్యవేక్షించేవాడు. రాజుకులు కంటే కిందిస్థాయి ఉద్యోగులు యుక్తులు. వీరు గణాంక, కార్యనిర్వాహక విధులను నిర్వహించేవారు.

**6.3.2 నగరపాలన:** నగరాల పాలనను, నగరాలలో శాంతి భద్రతల రక్షణను, న్యాయ నిర్వహణను నాగరకుడు అనే ఉద్యోగి నిర్వహించేవాడు. నగరంలో ప్రవేశించిన కొత్తవారు తమ వివరాలను నాగరకుని వద్ద నమోదు చేసుకోవాలి. అనుమతి ఉన్నవారు కాక ఇతరులెవరూ రాత్రులలో నగరంలో సంచరించుటకు వీలులేదు. క్షామ పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రభుత్వ ధాన్యాగారాల నుంచి ధాన్యాన్ని ప్రజలకు పంపిణీ చేసే బాధ్యత కూడా నాగరికునిదే. నగర పాలనలో గోప, స్థానిక అనే ఉద్యోగులు నాగరకునికి సహాయం చేసేవారు. గోపుడు పది, ఇరవై లేదా నలభై వరకు ఇళ్ళ లెక్కలను సేకరించేవాడు. ప్రతివ్యక్తి పేరు, కులగోత్రాలు, వృత్తి మొదలయిన వివరాలను నమోదు చేసేవారు. నగరంలోని వేరువేరు విభాగాల లెక్కలను సేకరించే బాధ్యత స్థానికునిది. పాటలీపుత్ర నగర పరిపాలన గురించి మెగస్తనీస్ 'ఇండికా'లో వ్రాస్తూ నగరపాలనలో నాగరకునికి 30 సభ్యులున్న సంఘం సహాయపడేదని తెలియచేశాడు. ఈ సంఘం ఐదుగురు సభ్యులు గల ఆరు పంచాయతీలుగా ఏర్పడి, 1. పరిశ్రమలు, 2. విదేశీయుల సౌకర్యాలు, 3. జనన మరణ లెక్కలు, 4. వాణిజ్యం, తూనికలు, కొలతలు, 5. వస్తు విక్రయం, 6. సుంకాల వసూలు మొదలయిన బాధ్యతలను నిర్వహించేవి.

**6.3.3 గ్రామ పాలన:** పాలనా వ్యవస్థలో అతి చిన్న ప్రాదేశిక విభాగం గ్రామం. గ్రామాలు చాలా వరకు స్వయం ప్రతిపత్తిని అనుభవించేవి. గ్రామ పెద్దల సహాయంతో గ్రామికుడు గ్రామపాలనా బాధ్యతలను నిర్వహించేవాడు. ఇతడు గ్రామంలో పన్ను వసూలు, క్రమశిక్షణ, శాంతి భద్రతల రక్షణ మొదలయిన గ్రామ సంబంధమైన వ్యవహారాలను పర్యవేక్షించేవారు. పెద్ద గ్రామాలలో గ్రామికునకు గణక, లేఖక మొదలయిన ఉద్యోగులు పాలనా నిర్వహణలో సహాయపడేవారు. 5 లేదా 10 గ్రామాల పై అధికారి గోపుడు. గోపుని అధికారంలో గ్రామికులు తమ విధులను నిర్వహించేవారు. నూరు గ్రామాలపై అధికారి స్థానికుడు.

**6.3.4 ఆదాయ వ్యయాలు:** ప్రభుత్వ ఆదాయం అనేక మార్గాల ద్వారా వస్తుండేది. ఈ ఆదాయం ధన రూపంలోను, ధాన్య రూపంలోను, వజ్రవైఢూర్యాది రూపాలలో ఉండేది. ఈ విధంగా వచ్చిన ఆదాయాన్ని సన్నిధాత అనే ఉద్యోగి భద్రపరచేవాడు. సమాహర్త అనే ఉద్యోగి సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాల నుంచి పన్నులను వసూలు చేసేవారు. గనులు, అడవులు, రహదారులు, వివిధ రకాల సుంకాలు, అపరాధ రుసుములు, అనుమతి పత్రాలు, ఉత్పాదక

వస్తువులపై పన్నులు, క్రయవిక్రయాల పై పన్నులు, మొదలగునవి ప్రభుత్వానికి ఆదాయమార్గాలు. సామ్రాజ్యంలోని అధిక సంఖ్యాకుల వృత్తి వ్యవసాయం. అందువల్ల ప్రభుత్వాదాయంలో అధికభాగం భూమిశిస్తు ద్వారా వస్తుండేది. పంటలో నాల్గవ వంతు భూమిశిస్తుగా వసూలుచేసేవారు. అయితే కాలానుగుణంగా ఈ శిస్తు పెరుగుతూ, తగ్గుతూ ఉండేది. భూమిశిస్తును ధనరూపంలోగాని, ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చు. కాని సాధారణంగా భూమిశిస్తు ధాన్యరూపంలోనే ఎక్కువగా వసూలయ్యేది.

ఈ విధంగా వసూలైన ధాన్యాన్ని భద్రపరచుటకు సామ్రాజ్యంలో పెద్ద పెద్ద గిడ్డంగులను ప్రభుత్వం నిర్మించింది. గ్రామాలలో జనాభా లెక్కలను, ఇతర వివరాలను సేకరించటానికి నియుక్తుడైన గోపుడే గ్రామాలలో భూమిశిస్తును వసూలు చేస్తుండేవాడు. నగరాలలో స్థానికుడు అనే అధికారి పర్యవేక్షణలో కొందరు ఉద్యోగులు గ్రామ సమూహాల లెక్కలను సేకరిస్తూ భూమి శిస్తును కూడా వసూలు చేసేవారు. సామ్రాజ్య ఆదాయ వ్యయాలను గురించి ప్రథమ గణకుడు సమర్పించిన లెక్కలను సమాహర్త తనిఖీ చేసేవారు. సామ్రాజ్య ఆదాయంలో ఎక్కువ భాగం ఉద్యోగుల జీతాలకు, రాజు అతని కుటుంబ నిర్వహణకు, ప్రజాసంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు, రాజ కుటుంబానికి ఖర్చు అయ్యేది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో రహదారులు, బావులు, సత్రాల నిర్మాణం, పోషణలు, చెరువుల నిర్మాణం, మనుషులకు, పశువులకు వైద్యశాలలు నిర్మించటం, మూలికల మొక్కలు, చెట్లు నాటడం మొదలయిన కార్యక్రమాలకు ధనాన్ని కేటాయించేవారు. సైన్య పోషణ కూడా రాజ్య వ్యయంలో ప్రధానమైనది. మత సంస్థలకు దాన ధర్మాలకు కూడా ఎక్కువగా ధనాన్ని ఖర్చు చేసేవారు.

## 6.5 న్యాయ వ్యవస్థ:

ఇతర నిరంకుశ రాజరిక వ్యవస్థలలోలాగా మౌర్యుల న్యాయ విధానంలో కూడా రాజాస్థానమే ఉన్నత న్యాయస్థానం. చక్రవర్తే ఉన్నత న్యాయాధీశుడు. ప్రతి పది గ్రామాలకు ఒక సంగ్రహ న్యాయస్థానం, 400 గ్రామాలకు ఒక ద్రోణముఖ న్యాయస్థానం, 800 గ్రామాలకు ఒక స్థానీయ న్యాయస్థానం ఉండేవి. ఆస్తిహక్కుల తగాదాల విచారణకు 'ధర్మసేయం' అని, అపరాధ విచారణకోసం 'కంటకశోధన' అనే ప్రత్యేక న్యాయస్థానాలుండేవి. నగరాలలో న్యాయపాలనను ప్రత్యేకంగా నియమితులయిన మహామాత్రులు నిర్వహించేవారు. తన శాసనాలలో అశోకుడు "ఆగ్రహం, విసుగు, అసహనం, అలసత్వం మొదలయిన బలహీనతలు న్యాయాధికారులకు ఉండరాదని, తీర్పులు పక్షపాత రహితంగా ఉండాలని'' హెచ్చరించారు. నగర న్యాయ శాఖలు అన్యాయాలు చేయకుండా చూడటానికి ఐదు సంవత్సరాలకు ఒకసారి న్యాయ శాఖలను తనిఖీ చేసేవారు. వృత్తి పనివారు, వర్తకులు, ఇతర నగర వాసులకు సంబంధించిన సమస్యలను న్యాయ మహామాత్రులు విచారణ చేసేవారు. గ్రామాలలో రాజుకులు న్యాయ నిర్వహణ చేసేవారు. 'విచారణ క్రమంలో, శిక్షలలో సమత ఉండటం ఆపేక్షణీయం' అని అశోకుడు తన శాసనాలలో పేర్కొన్నాడు. శాసనాలు నేరస్తుని సాంఘిక హెూదాను బట్టి పక్షపాతబుద్ధితో శిక్ష విధించరాదని సూచిస్తున్నాయి. ఈ పద్ధతి అప్పటివరకు అమలులో ఉన్న సంప్రదాయ న్యాయ పద్ధతికి విరుద్ధంగా ఉంది. అర్థశాస్త్రం "సంప్రదాయక న్యాయ విధానాన్ని, వ్యక్తుల సాంఘిక హెూదాను, నేర స్వభావాన్ని, నేర కారణాలు, పూర్వాపరాలు, నేరస్తులు రాజ కుటుంబానికి తన ఉన్నత వర్గానికి చెందిన వారా లేదా సామాన్య ప్రజలా అన్న అంశం మొదలయినవాటిని పరిశీలించిన తరవాతనే న్యాయాధికారి అధమ, మధ్యమ, ఉన్నత శిక్షలలో ఏది తగినదో నిర్ణయించాలి'' అని స్పష్టంగా వివరిస్తుంది. వర్ణ వ్యత్యాసాలను పాటించి నేరస్థుడు బ్రాహ్మణుడైతే తక్కువ శిక్ష, హీనవర్గానికి చెందినవాడైతే కఠిన శిక్షలు విధించేవారని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. అయితే అశోకుడు శిక్షలు విధించడంలో వర్ణ వ్యత్యాసాలను, సాంఘిక హెూదాను నిషేధించి నేరస్తులందరికి ఒకే విధమైన శిక్షలు విధించాలని ఆదేశించి, తన సామ్రాజ్యంలో చట్టం ముందు అందరూ సమానులే అనే భావాన్ని, ఒకే రకమైన శిక్షాస్మృతిని మొదటిసారిగా ప్రవేశపెట్టినవాడయ్యాడు. నేరస్తులకు విధించే శిక్షలు సామాన్యంగా జరిమానా రూపంలో ఉండేవి. జరిమానా చెల్లించలేని నేరస్తులు బానిసలుగా అమ్ముడుపోయి జరిమానా చెల్లించడానికి అనుమతిచ్చేవారు. అశోకుడు అహింసకు ప్రముఖ స్థానం ఇచ్చినప్పటికి మరణ శిక్షను రద్దు చేయలేదు. అయితే ఉరిశిక్షపడిన నేరస్తునికి మూడు రోజుల కాలవ్యవధిని ఇచ్చారు. ఈ కాలవ్యవధిలో పునర్విచారణ కోరుతూ న్యాయాధికారులకు విజ్ఞప్తి చేసుకోవచ్చు.

## 6.4 సైనిక వ్యవస్థ:

మౌర్య చక్రవర్తులు క్రమశిక్షణ కలిగిన పెద్ద సైన్యాన్ని సంప్రదాయసిద్ధ పద్ధతులలో ఏర్పాటుచేసుకొన్నారు. చక్రవర్తే సర్వ సైన్యాధ్యక్షుడు. యుద్ధ సమయాలలో చక్రవర్తే స్వయంగా సైన్యాన్ని పర్యవేక్షించేవాడు. అయినప్పటికీ ప్రత్యేకంగా సేనాధిపతి లేదా బలాధ్యక్షుడుండేవాడు. చక్రవర్తి అస్తిత్వం సైన్యం పై ఆధారపడి ఉంది కాబట్టి తగిన జాగ్రత్తలతో సైన్య వ్యవహారాలను నిర్వహించేవారు. కౌటిల్యుడు, మెగస్తనీస్ రచనల వల్ల సైన్యాన్ని మూడు ప్రధాన వర్గాలుగా విభజించినట్లు తెలుస్తుంది. అవి వంశానుగత సైన్యాలు, కిరాయి సైన్యం, శ్రేణుల సైన్యం. మొదటి విభాగమైన వంశానుగత సైన్యం చక్రవర్తి మూల బలం. రైతుల తరవాత సామ్రాజ్యంలో జనాభాలో సంఖ్యా బలం సైనికులదే. చంద్రగుప్తుని సైన్యంలో 9,000 గజ దళం, 30,000 అశ్విక దళం, 6,00000 కాల్బలమున్నట్లు ప్లినీ తెలపగా, 6,000 గజ దళం, 80,000 అశ్విక దళం, 8,000 రథ బలం, రెండు లక్షల కాల్బలమున్నట్లు ప్లూటార్క్ వివరించాడు. కత్తులు, డాలు, శిరాస్త్రాణాలు, విల్లంబులు, ఈటెలు మొదలయిన ఆయుధాలను ఉపయోగించేవారు. విస్తృతమైన మౌర్య సైనిక పాలనా బాధ్యతను 30 మంది సభ్యులున్న సంఘం నిర్వహించేది. ఈ సంఘం ఐదుగురు సభ్యులున్న ఆరు ఉపసంఘాలుగా ఏర్పడి, సైనిక శాఖల నిర్వహణ బాధ్యతలను నిర్వహించేవి. మొదటి ఉప సంఘం నౌకా యుద్ధం నిర్వహణకు సంబంధించినది. నదుల పై రవాణా, నదుల ద్వారా దండయాత్రలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలలో యుద్ధాలకు నౌకలను ఉపయోగించేవారు. రెండవ సంఘం సైన్యానికి భోజన సౌకర్యాలు ఏర్పాటుచేయటం, రవాణా కోసం ఉపయోగించే ఎడ్లబండ్లను పర్యవేక్షిస్తుంది. మిగిలిన నాలుగు సంఘాలు రథ, గజ, అశ్విక, కాల్బలాల విభాగాల నిర్వహణా బాధ్యతలను చేపట్టాయి.

**6.4.1 గూఢచారి దళం:** సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాల నుంచి సమాచారాన్ని సేకరించడానికి గూఢచారులను నియమించటం రాజరిక వ్యవస్థలోని సంప్రదాయం. గూఢచారి వ్యవస్థ సమర్థవంతమైన పాలనా వ్యవస్థలో అంతర్భాగం. సమాజంలోని భిన్న వర్గాల నుంచి, అనాధ బాలలు, బ్రాహ్మణ వితంతువులు మొదలుకొని శూద్ర స్త్రీలు, వివిధ రకాల ప్రభుత్వోద్యోగులు మొదలయిన వారిని మౌర్యులు గూఢచారులుగా నియమించేవారు. గూఢచారి దళం చురుకు గాను, దక్షత తోను పని చేస్తుండేవి. ఏ వర్గంవారి పై గూఢచారి పని చేయాలో వారితో పూర్తిగా కలసిపోవటమే గూఢచారులు చేయవలసిన పని. అందువల్లనే కౌటిల్యుడు సన్యాసులు, వ్యభిచారులు, గృహస్తులు, వర్తకులు, బైరాగులు, విద్యార్థులు మొదలయిన వేషాలతో గూఢచారులు పనిచేయాలని సూచించాడు. గూఢచారి వ్యవస్థలోని అతి ముఖ్యమైన అంశం గూఢచారులెవరో ప్రజలకు తెలియకూడదు. అంతే కాకుండా గూఢచారులు పరస్పరం తెలిసి ఉండకూడదని అధికారులకు కూడా కార్యసాధకులైన గూఢచారులు తెలియకూడదని, తమ సూచనలను అధికారులు లిఖిత పూర్వకంగా గూఢచారులకు అందచేయాలని కౌటిల్యుడు నిర్దేశించాడు. గూఢచారులను నేరపరిశోధనకు, ప్రజాభిప్రాయ సేకరణకు ఉపయోగించుకోవటమేకాక విదేశాలకు కూడా పంపేవారు.

## 6.6 నీటి పారుదల - వ్యవసాయం:

రాజ్య ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ ప్రాముఖ్యతను గుర్తించిన మౌర్యులు నీటిపారుదల వనరులు, కాలువల నిర్వహణకు ఒక శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చెఱువులు, బావులు, కాలువలు తవ్వించి నీటి వనరులు కల్పించారు. నీటి పారుదల వ్యవహారాలను రాజుకుల కార్యస్థానం నిర్వహిస్తుంది. వీరు నదుల, కాలువలను, తూములను తనిఖీ చేసి రైతుల మధ్య జరిగే నీటి పంపిణీని పర్యవేక్షించేవారు. వ్యవసాయ భూములకు నీటి వనరులు కల్పించేందుకు చంద్రగుప్తుని కాలంలో సౌరాష్ట్ర పాలకుడైన పుష్యగుప్తుడు గిరినార్ లో సుదర్శన తటాకాన్ని నిర్మించినట్లు రుద్రదాముని జునాగడ్ శాసనం తెలియచేస్తుంది. ఈ శాసనమే అశోకుని కాలంలో సౌరాష్ట్ర, అనార్త రాష్ట్రాల పాలకుడైన తుషాస్ప సుదర్శన తటాకానికి అనుబంధంగా తూములను ఏర్పరచాడని చెబుతున్నది. కరువు వచ్చినప్పుడు రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఎద్దులు, నారు విత్తనాలు అవసరమైనంత ప్రభుత్వం సరఫరాచేసి రైతుల సంక్షేమానికి తోడ్పడింది.

## 6.7 జనాభా లెక్కలు - సేకరణ:

కౌటిల్యుని అర్థశాస్త్రం, మెగస్తనీస్ ఇండికాల వల్ల మౌర్య సామ్రాజ్యంలో జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేక విభాగం ఉన్నట్లు తెలుస్తుంది. సామ్రాజ్యంలోని ప్రతి పౌరుని జనన మరణ వివరాలను ఒక రిజిష్టర్‌లో నమోదు చేసేవారు. నగరాలలో జనాభా లెక్కలను నాగరికుడు స్థానికుడు, గోపుడు అనే ఉద్యోగుల సహాయంతో సేకరించేవాడు. నగరాలకు వచ్చే విదేశీయులను, వలస వచ్చే ఇతర రాజ్యాల వారి వివరాలను, వర్తకం కోసం వచ్చే వ్యాపారులు, విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థుల వివరాలను ఒక ప్రత్యేకమైన రిజిష్టర్ లో పొందుపరచటమే కాక వారికి అవసరమైన సదుపాయాలను కల్పించటం కూడా ఈ జనాభా లెక్కల విభాగం నిర్వహిస్తుంది. నగరంలో ప్రవేశించిన కొత్త వారిలో అనుమానాస్పద ప్రవర్తన కలిగిన వారి జాబితా ప్రత్యేకంగా తయారు చేసి వారి పై గట్టి నిఘా ఉంచేవారు. గ్రామాలలో గోపులు గ్రామ ప్రజలు, వారి కులగోత్రాలు, జీవనోపాధి, వృత్తి వివరాలు, మతం, వారి ఆదాయం మొదలయిన పూర్తి వివరాలతో జనాభా లెక్కలను సేకరించేవారు. జనాభా లెక్కల సేకరణ వల్ల సామ్రాజ్యంలోని అన్ని వర్గాల ప్రజల వివరాలు తెలియటమేకాక వారిపై పన్నులు విధించుటకు, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టుటకు తగిన మార్గదర్శక సూత్రాలను సక్రమంగా రూపొందించి అమలుజరుపుటకు ప్రభుత్వానికి అవకాశం కలుగుతుంది.

## 6.8 సాంఘిక పరిస్థితులు:

మౌర్యుల కాలంలో సమాజంలో వర్ణవ్యవస్థ సంపూర్ణ రూపం పొందింది. వర్ణాశ్రమ ధర్మం ఆధారంగా ఏర్పడిన వ్యవస్థను రక్షించడం ప్రభుత్వ బాధ్యత, అర్థశాస్త్రం నాలుగు ప్రధాన వర్ణాలను పేర్కొని, ఒక వర్ణం వారు మరొక వర్ణం వారి వృత్తిని చేపట్టరాదని ఆంక్షలు విధించింది. సంఘంలో బ్రాహ్మణులకు అధిక గౌరవం ఇచ్చేవారు. వారు అధ్యాపక, ఆధ్యాత్మిక వృత్తిని అనుసరించేవారు. అయినా పుష్యమిత్ర శుంగుని వంటి కొందరు బ్రాహ్మణులు రాజోద్యోగాలను నిర్వహించేవారు. వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యాలను వైశ్య, శూద్ర కులాల వృత్తులని అర్థశాస్త్రం వివరిస్తుంది. కులాల సంఖ్య క్రమంగా పెరగటం ప్రారంభమయింది. మెగస్తనీస్ 'ఇండికా'లో మౌర్య సమాజంలో ఏడు కులాల వారున్నట్టు పేర్కొన్నారు. వారు బ్రాహ్మణులు, వ్యవసాయదారులు, పశు పాలకులు, వృత్తిపని వర్తక జనులు, వేటగాళ్ళు, సైనికులు, అవేక్షకులు లేదా ఉద్యోగులు. మెగస్తనీస్ పేర్కొన్న వివరాల ప్రకారం ప్రతి వృత్తి ఒక కులంగా రూపొందటం మౌర్య యుగంలో ప్రారంభమైనట్లు తెలుస్తుంది. అయినప్పటికి సమాజంలో జైన, బౌద్ధ మతాల ప్రభావం వల్ల మౌర్యుల కాలంలో సమాజంలో వర్ణ భేదాలు పూర్తిగా పాటించలేదు. వైవాహిక సంబంధాలలో కూడా వర్ణ వ్యత్యాసాలను అనుసరించలేదు. మౌర్య చక్రవర్తి గ్రీకు రాకుమార్తెను వివాహం చేసుకున్నాడు. అశోకుని భార్యలలో క్షత్రియేతరులున్నారు.

**6.8.1 వర్ణాశ్రమ ధర్మాలు:** వర్ణాశ్రమ ధర్మాలను అగ్ర వర్ణాల వారు మాత్రమే పాటించేవారు. సన్యాసాశ్రమాన్ని ఎక్కువ మంది స్వీకరించేవారు. జైన, బౌద్ధ, ఆజీవక మతాల ప్రభావమే దీనికి కారణం. మౌర్య సామ్రాజ్యంలో పరివ్రాజక సంఘాలు ఎక్కువ సంఖ్యలో ఉండేవి. చంద్రగుప్త మౌర్యుడు తన జీవిత చరమాంకంలో రాజ్య త్యాగం చేసి జైన మతం స్వీకరించి సన్యసించాడు. అర్థశాస్త్రం సన్యాసాశ్రమ స్వీకారానికి కొన్ని ఆంక్షలు విధించింది. వృద్ధులు సన్యాసాశ్రమ స్వీకరణకు ఎటువంటి ఆంక్షలు లేవు.

**6.8.2 కుటుంబ వ్యవస్థ:** మౌర్యుల కాలంలోని కుటుంబాలు చాలా వరకు ఉమ్మడి కుటుంబాలే. బాలురకు 16 సంవత్సరాలు, బాలికలకు 12 సంవత్సరాలు యుక్త వయస్సుగా అర్థశాస్త్రం పేర్కొంటుంది. ఎనిమిది రకాల వివాహాలలో నాలుగు రకాల వివాహాలు మాత్రమే సక్రమమైనవని కౌటిల్యుడు నిర్ణయించాడు. భార్యాభర్తల అంగీకారంతో కాని, లేదా వారిద్దరిలో ఎవరైనా దీర్ఘకాలం సంసారం నుంచి దూరమైనా కాని విడాకులు పొందవచ్చు. వివాహిత స్త్రీలకు స్త్రీ ధనరూపంలో ఆస్తి ఉండేది. మగ సంతానం లేకపోతే భార్యకు ఎటువంటి నష్ట పరిహారం చెల్లించకుండా భర్త రెండవ వివాహం చేసుకోవచ్చు. వివాహ నిబంధనలు, భార్యాభర్తల సంబంధాల గురించి మూడు అధ్యాయాలలో అర్థశాస్త్రం

వివరిస్తుంది. వితంతువులు స్వేచ్ఛగా జీవించేవారని, వారికి సమాజంలో తగిన గౌరవం లభించేదని, వారిని గూఢచారిణులుగా కూడా నియమించేవారని అర్థశాస్త్రం ద్వారా తెలుస్తుంది.

**6.8.3 సమాజంలో స్త్రీ స్థానం:** స్త్రీలకు సమాజంలో గౌరవం కాని, ఉన్నత స్థానం కాని లేదు. స్త్రీలు విలాస వస్తువులుగా పరిగణించబడ్డారు. గృహానికే వారి జీవితం పరిమితమయింది. పరదా పద్ధతి అమలులో ఉండేది. స్త్రీలను చాలా సులభంగా బేరం చేసి కొనడం, అమ్మడం జరుగుతుండేది. వరకట్నం అమలులో ఉంది. పునర్వివాహం చేసుకునేందుకు, విడాకులు తీసుకునేందుకు స్త్రీలకు హక్కు ఉంది. కొంత మంది స్త్రీలు బౌద్ధ మతం స్వీకరించి, విద్యావంతులై బిక్షుకులుగా మారేవారు. ఆనాటి స్త్రీలలో మూఢ విశ్వాసాలు, నిరర్థకమైన ఆచారాలు ఎక్కువగా ఉన్నట్లు అశోకుని శాసనాలవల్ల తెలుస్తుంది. చంద్రగుప్తునికి అంగరక్షకులుగా స్త్రీలుండేవారని మెగస్తనీస్ 'ఇండికా' వల్ల తెలుస్తుంది. అంగరక్షకులుగా నియమించిన ఈ స్త్రీలను ప్రభుత్వం ఆ స్త్రీల తల్లిదండ్రుల నుంచి కొనేది. వివాహిత స్త్రీలకు మత గ్రంథాలు చదివే హక్కు లేదు. భర్తతోపాటు మత కార్యక్రమాలలో పాల్గొనే అర్హత భార్యకున్నది. సతీ సహగమనం ఆచారంగా మారింది. ప్రభుత్వం గణికా వృత్తిని గుర్తించింది. వేశ్యావాటికలు నగరాలలో ఉండేవి. అశోకుని శాసనాలు, బౌద్ధ గ్రంథాలవల్ల మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తుంది.

**6.8.4 బానిస వ్యవస్థ:** బౌద్ధ గ్రంథాలు బానిసలలో మూడు రకాల వారున్నట్లు పేర్కొంటున్నాయి. వారు 1. యజమానుల ఇంట్లో జన్మించిన వారు, 2. డబ్బు ఇచ్చి కొన్నవారు లేదా బహుమతిగా లభించినవారు, 3. వారసత్వంగా తండ్రి నుంచి సంక్రమించినవారు. యుద్ధాలలో పట్టుబడిన శత్రు సైనికులను బానిసలుగా చేసే ఆచారముంది. జాతక కథలలోను, అర్థశాస్త్రం లోను దండదాస్యులనే మరో రకం బానిసల ప్రసక్తి కనిపిస్తుంది. వీరు శిక్ష ఫలితంగా బానిసలైనవారు. తన శాసనాలలో అశోకుడు సేవకులకు, బానిసలకు మధ్య తేడాను స్పష్టంగా చెప్పాడు. బానిసల పట్ల దయతో వ్యవహరించాలని కూడా అశోకుడు తన శాసనాలలో ఆదేశించాడు. ఇతర రాజ్యాలలో లాగా మౌర్య సామ్రాజ్యంలో బానిసల స్థితి కఠినంగా ఉండేది కాదు. యజమానులు సాధారణంగా బానిసలపట్ల మానవతా భావాన్ని ప్రదర్శించేవారని అర్థశాస్త్రం, జాతక కథలు సూచిస్తున్నాయి. బానిసగా అమ్ముడయిన వ్యక్తి సంతానం బానిసలు కాదు. యజమాని వల్ల స్త్రీ బానిసకు సంతానం కలిగితే తల్లిబిడ్డలిద్దరు స్వతంత్రులవుతారు. మెగస్తనీస్ 'ఇండికా'లో మౌర్య సామ్రాజ్యంలోని ప్రజలు నిజాయితీపరులని, ఎటువంటి పత్రాలు లేకుండా ఇచ్చిపుచ్చుకోవడం చేసేవారని, నిరాడంబరమైన, సుఖప్రద జీవనాన్ని గడిపేవారని, సాధారణంగా మధువు సేవించేవారు కాదని, వినోదం కోసం చదరంగం, పాచికలు ఆడేవారని, పండుగలు, ఉత్సవాల సమయాలలో ముష్టి యుద్ధాలు, రథాల పందాలు, కత్తి యుద్ధాలు వంటి పోటీలలో పాల్గొనేవారని తెలియచేశాడు.

**6.8.5 ఆర్థిక పరిస్థితులు:** నాటి సమాజంలో ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం అయినందున మౌర్యులు వ్యవసాయ రంగ అభివృద్ధికి ఎన్నో చర్యలు చేపట్టారు. సామ్రాజ్యంలో నగరాలు, పట్టణాలు ఉన్నప్పటికీ సామ్రాజ్య ఆర్థిక వ్యవస్థకు గ్రామమే పునాది. అందువల్ల వ్యవసాయాభివృద్ధికి మౌర్యులు బావులు, చెరువులు, కాలువలు తవ్వించారు. కరువు వచ్చినప్పుడు రైతులకు వ్యవసాయ పనిముట్లు, ఎద్దులు, నారు విత్తనాలను తగినంతగా పంపిణీ చేసి రైతుల సంక్షేమానికి కృషి చేశారు. రైతులు వరి, నూనెగింజలు, గోధుమ, చెఱకు, కూరగాయలు, అనేక రకాల పండ్లను పండించేవారు. సాగుచేసే భూములపై విధించే భూమి శిస్తు ప్రాంతాన్ని బట్టి మారుతుంది. పంటలో నాల్గవ వంతు నుంచి ఆరవ వంతు వరకు శిస్తుగా వసూలు చేసేవారు. వ్యవసాయంతోపాటు ఎన్నో రకాల పరిశ్రమలు కూడా మౌర్యుల కాలంలో అభివృద్ధి పొందాయి. ఉత్తమ శ్రేణికి చెందిన వస్త్రాలు, అందమైన నగలను తయారు చేయటంలో ప్రజలు నైపుణ్యం సాధించారని మెగస్తనీస్ ఇండికాలో వ్రాశాడు. మౌర్య యుగం వస్త్ర పరిశ్రమలో అద్భుత ప్రగతిని సాధించింది. నూలు, ఉన్ని, పట్టు వస్త్రాల ఉత్పత్తి ఎక్కుగా జరిగింది. కాశీ, వత్స, మధుర, వంగ, అపరాంత మొదలయిన ప్రాంతాలు వస్త్ర పరిశ్రమ కేంద్రాలుగా ఉన్నాయి. మగధ, కాశీ ప్రాంతాలు జనపనార పరిశ్రమకు కేంద్రాలు. ఈ పరిశ్రమలేకాక వడ్రంగం, పానీయాలు, యుద్ధ పరికరాలను తయారు చేయడం, నౌకా నిర్మాణం మొదలయిన పరిశ్రమలలో కూడా ఆనాటి ప్రజలు ఎంతో సాంకేతిక నైపుణ్యాన్ని సాధించారు.

**6.8.6 వర్తక వాణిజ్యాలు:** మౌర్య చక్రవర్తులు ప్రదర్శించిన శ్రద్ధాసక్తుల వల్ల వర్తక వాణిజ్యాలు ఎంతో అభివృద్ధిని సాధించాయి. వాణిజ్యాభివృద్ధికి రహదారులను మౌర్య చక్రవర్తులు నిర్మించారు. ఫలితంగా సరుకులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సులభంగా రవాణా జరుగుటకు అవకాశం కలిగింది. సామ్రాజ్యంలోని ప్రముఖ వాణిజ్య కేంద్రాలైన పాటలీపుత్రం, కాశీ, ఉజ్జయిని మొదలయిన నగరాలను కలుపుతూ, రహదారి మార్గాలు నిర్మించబడ్డాయి. ఉత్తరాపథ, దక్షిణాపథాల మధ్య రాకపోకలు ఎక్కువయ్యాయి. రహదారులలో వివిధ ప్రదేశాల మధ్య ఉన్న దూరాన్ని తెలియచేసే మైలురాళ్ళను, కూడలి ప్రదేశాలలో వివిధ నగరాలకు వెళ్ళే మార్గాలను తెలిపే సూచికలను ఏర్పాటు చేశారు. రహదారుల నిర్వహణకు ప్రభుత్వాధికారులు ఉన్నట్లు ఇండికా వల్ల తెలుస్తుంది.

**6.8.7 విదేశీ వాణిజ్యం:** బాబిలోనియా మొదలగు పశ్చిమ ఆసియా రాజ్యాలకు ప్రాచీన కాలం నుంచి వెళ్ళే ముఖ్యమైన రహదార్లను మౌర్యులు అభివృద్ధి చేశారు. ఈ రహదారుల ద్వారా వెళ్ళే వర్తకులు టైగ్రీస్ నదీ తీరాన ఉన్న సెల్యూసియా నగరానికి చేరుకుని వాణిజ్యం సాగించేవారు. సముద్రం ద్వారా జరిగే వ్యాపారానికి తూర్పు తీరంలోని తామ్రలిప్తి, పశ్చిమ తీరంలోని బరుకచ్చం, సోపారా రేవు పట్టణాలు కేంద్రాలు. భూ మార్గం లేదా సముద్ర మార్గం ద్వారా విదేశాలతో వ్యాపారం చేసే వర్తకులు తగిన అనుమతి పత్రాలను తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి పొందాలి. నగరపాలనకు ఏర్పాటుచేసిన ఆరు ఉపసంఘాలలో మూడు ఉపసంఘాలను వాణిజ్యం, వస్తు విక్రయం, పరిశ్రమలు, విదేశీయుల సౌకర్యాల కొరకు ఏర్పాటు చేయటం ద్వారా మౌర్య యుగం వాణిజ్య రంగంలో అభివృద్ధిని సాధించింది. పశ్చిమ ఆసియా రాజ్యాలకు ముఖ్యంగా సిరియా, ఈజిప్ట్ రాజ్యాలకు నీలి మందు, వివిధ రకాల ఔషధాలు, నూలు, పట్టు వస్త్రాలు ఎగుమతి చేసేవారు. విదేశాల నుంచి పానీయాలు, విలాస వస్తువులు, చీనాంబరాలు దిగుమతి చేసుకొనేవారు.

**6.8.8 స్వదేశీ వాణిజ్యం:** దేశీయ వాణిజ్యంలో కూడా ప్రగతిని మౌర్య యుగంగా సాధించింది. దక్షిణాపథం నుంచి వజ్రాలు, ముత్యాలు, నూలు వస్త్రాలు, ఉత్తరాపథానికి ఎగుమతి చేసేవారు. ఉన్ని వస్త్రాలు, కంబళ్ళు, గుర్రాలను ఉత్తరాపథం నుంచి, దక్షిణాపథానికి దిగుమతి చేసేవారు. వర్తకులు శ్రేణులుగా ఏర్పడి వాణిజ్యాన్ని సాధించేవారు. వడ్రంగం, లోహకార వృత్తి, నగల తయారీ మొదలైన 18 రకాల చేతివృత్తుల వారు శ్రేణులనే వర్తక సంఘాలుగా ఏర్పడ్డారు. ప్రతి శ్రేణికి ప్రముఖ అనే పేరుతో అధ్యక్షుడుండే వాడు. శ్రేణి కార్యదర్శిని 'బెట్టక' అని పిలిచేవారు. వర్తక శ్రేణులు బ్యాంకుల లాగా పనిచేసి తాము స్వీకరించిన నిధులపై 15% వరకు వడ్డీని చెల్లించేవి. అన్ని రకాల వాణిజ్యాలను అదుపులో ఉంచి వ్యాపారాన్ని సక్రమంగా నిర్వహించుటకు ఉద్యోగులను నియమించారు. పణ్యాధ్యక్షుడు సరుకుల ధరను నిర్ణయించే వాడు. దొంగ రవాణా, కల్తీలకు కఠిన శిక్షలు విధించేవారు. తూనికలు, కొలతలలో మోసాలు జరగకుండా పర్యవేక్షించుటకు పౌతవాధ్యక్షుడనే అధికారి ఉండేవాడు. నగర, పట్టణ ప్రవేశద్వారాల వద్దనే సరుకుల పై సుంకాలు వసూలు చేసేవారు.

**6.8.9 మతం:** మౌర్య సామ్రాజ్యంలో బౌద్ధ, జైన, వైదిక మతాలు ప్రధాన మతాలుగా ప్రాముఖ్యతను పొందాయి. ఈ మతాలను అనుసరించి సామ్రాజ్యంలోని ప్రజలు బౌద్ధులు, జైనులు, వైదికులని మూడు ముఖ్యమైన తరగతులుగా విభజించబడ్డారు. ఈ మతాలతో పాటున్న ఇతర మతాలలో ఆజీవకులు ముఖ్యమైన వర్గంగా ప్రాధాన్యతను పొందింది. ఈ నాలుగు మతాలలో బౌద్ధమతం మౌర్య యుగంలో ఎక్కువ ఆదరణ పొందింది. అశోకుని కాలంలో బౌద్ధ మతం సామ్రాజ్యమంతటా వ్యాపించింది. అశోకుని పోషణలో బౌద్ధం విదేశాలలో కూడా ప్రచారం అయింది. అశోకుడు, తదనంతరం పాలించిన మౌర్యుల మత సహన విధానాల వల్ల మౌర్య సామ్రాజ్యంలో అన్ని మతాల వ్యాప్తికి అవకాశం కలిగింది. బౌద్ధ మతంతో పాటు జైన మతం కూడా చక్రవర్తులు, వృత్తి పని వారు, వర్తకుల పోషణ కారణంగా సామ్రాజ్యమంతటా విస్తరించింది. చంద్రగుప్త మౌర్యుడు జైన మతాన్ని స్వీకరించాడు. సంప్రతి అశోకుడు బౌద్ధ మత వ్యాప్తికి చేసినంత కృషిని జైన మత వ్యాప్తికి చేశాడు. వీరి కృషి వల్ల అయోధ్య, బీహార్, ఒరిస్సా మొదలయిన ప్రాంతాలలో జైన మతానికి ఎంతో ఆదరణ లభించింది. జైన, బౌద్ధ మతాలు మౌర్య సామ్రాజ్యంలో అమితంగా ఆదరణ పొందినా, ప్రాచీనకాలం నుంచి ఆచరణలో ఉన్న వైదిక మతం పూర్తిగా నశించలేదు. మెగస్తనీస్ 'ఇండికా', కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల వైదిక మతాన్ని అనుసరించేవారు సామ్రాజ్యంలో అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. అశోకుడు

అహింసా సిద్ధాంతాన్ని ప్రచారం చేసి జంతు బలులను నిషేధించినా కూడా, వైదిక క్రతువులు జరుగుతూనే ఉన్నాయి. అశోకుని మరణం తరవాత వైదిక మతం విజృంభించింది. జైన, బౌద్ధ మతాలతో పోటీని తట్టుకోవటానికి వైదిక మతంలో మౌర్య యుగంలోనే కొన్ని మార్పులు ప్రవేశించాయి. మోక్ష సాధనకు క్రతువుల కంటే భక్తి మార్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందువల్ల వైదిక మతంలో శైవ, వైష్ణవాలు ప్రచారం అయ్యాయి. యదు నాయకుడైన వాసుదేవ కృష్ణుని తత్వం వైష్ణవానికి మూలమై 'వాసుదేవ ఆరాధనగా' రూపొందింది. ఈ ఆరాధనకు మధురా నగరం ప్రముఖ కేంద్రమయింది. కాలక్రమేణా వాసు దేవుడు విష్ణువుకు నామాంతరంగా మారింది. భక్తి మార్గ ప్రచారం ఫలితంగా ప్రజలలో విగ్రహారాధనపట్ల ఆసక్తి పెరిగింది. శివ, విష్ణు, ఇంద్ర, స్కంధ, విశాఖాది దేవతల విగ్రహాలను పూజించటం ప్రారంభమయింది. మౌర్య సామ్రాజ్యంలో ఉన్న గ్రీకుల వంటి విదేశీయులు వైదిక దేవతలైన శివ, ఇంద్ర, విష్ణువులను తమ దేవతలైన హేరాక్లిస్, జీయస్, డయోనిసస్తే ప్రతిరూపాలుగా భావించి వైదిక మతాన్ని స్వీకరించి వైదిక సమాజంలో కలసిపోయారు.

6.8.10 **భాషా-సారస్వతాలు:** తొలి మౌర్య చక్రవర్తులు సాధించిన రాజకీయ ఐక్యత, ఆర్థికాభివృద్ధి, మత సహనంవల్ల సామ్రాజ్యంలో ప్రశాంతత నెలకొంది. ఫలితంగా సాహిత్య, కళా రంగాలలో పురోగతికి అవకాశం ఏర్పడింది. ప్రాకృత, సంస్కృత భాషలలో అపారమైన సాహిత్య కృషి జరిగింది. తొలిసారిగా బ్రాహ్మీ, ఖరోష్టి లిపులలో అశోకుడు శాసనాలను శిలల పై చెక్కించి తన సామ్రాజ్యమంతటా నెలకొల్పాడు. దీని వల్ల లిపి విరివిగా వాడుకలోకి వచ్చింది. తక్షశిల, వారణాశి నగరాలు ప్రముఖ విద్యా కేంద్రాలుగా ప్రసిద్ధికెక్కాయి.

ఈ విద్యాకేంద్రాలలో తర్కం, వ్యాకరణం, వార్త, రాజనీతి, ఇతిహాసం, వైద్యం మొదలయిన విద్యలు బోధించేవారు. ప్రాకృతం రాజ భాషగా ఉన్నందున ఆ భాషలో ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. జైన మతాచార్యుడైన బద్రబాహు ఈ కాలంలోనే కల్ప సూత్రాలను వ్రాశాడు. అశోకుని కాలంలో పాటలీపుత్రంలో జరిగిన మూడవ బౌద్ధ సంగీతిలో అభిధమ్మ పిటకాన్ని రూపొందించారు. ఆ సంగీతిలో జరిగిన వాదోపవాదాలు 'కథావత్తు' అనే పేరుతో గ్రంథస్తం చేశారు. ప్రాకృతంతో పాటు, సంస్కృతం కూడా గ్రంథ రచనకు ఉపయోగించడం జరిగింది. కౌటిల్యుని అర్థశాస్త్రం, పింగళ, గౌతమ, బౌద్ధాయన, ఆపస్తంబ, వశిష్టుల పేర ఉన్న ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు మౌర్య యుగానికి చెందినవే. రామాయణం, మహాభారతాలలోని మూల భాగాలు మౌర్య యుగంలోనే రచించబడ్డాయనే అభిప్రాయముంది. పాణిని అష్టాధ్యాయి, పతంజలి మహాభాష్యం, వాత్స్యాయనుడి కామ సూత్రాలు మౌర్యుల కాలంనాటి సమకాలిక సంఘాన్ని, మతాన్ని, వేదాంత సాహిత్యాలను కళాభివృద్ధి గురించిన అమూల్యమైన సమాచారాన్ని అందిస్తున్నాయి. ఈ గ్రంథాల వల్ల మౌర్యుల కాలంలో కంసవధ, బలిబంధ నాటకాలు ప్రదర్శించేవారని, యయాతి, వాసవదత్తల కథలు ప్రచారంలో ఉన్నాయని తెలుస్తుంది.

6.8.11 **వాస్తు శిల్పాలు:** మౌర్య యుగంలో భారతీయ వాస్తు శిల్ప కళా చరిత్రలో నూతన శకం ప్రారంభమయింది. సింధు నాగరికత అంతరించిన తరవాత భారతీయులు అనుసరించిన వాస్తు శిల్ప కళా సంప్రదాయాలు మౌర్యుల కాలం వరకు కనిపించవు. ఆచార్య సరస్వతి వంటి శిల్ప కళా విమర్శకులు సింధు నాగరికతా శిల్ప సంప్రదాయాల సహజ పరిణామమే మౌర్యుల శిల్ప కళలో వ్యక్తమవుతున్నదని వాదిస్తున్నారు. కాని ఈ వాదనకు స్పష్టమైన ఆధారాలు కనిపించవు. విన్సెంట్ స్మిత్ గ్రీకు పారశీకుల శిల్ప కళా రీతుల ప్రభావ ఫలితంగా మౌర్య శిల్పం రూపొందిందని ప్రకటించాడు. ప్రభావమేదైనప్పటికి మన దేశ చారిత్రక యుగానికి సంబంధించిన మొదటి వాస్తు శిల్పాలు మౌర్య యుగం నుంచే లభిస్తున్నాయి. మౌర్య యుగానికి పూర్వం వాస్తు శిల్ప నిర్మాణానికి దారువు (కలప) ఉపయోగించినందున అవి పూర్తిగా నశించాయి. వాస్తు శిల్ప నిర్మాణాలలో దారువు బదులు శిలను వాడటం మౌర్యుల కాలంలో ప్రారంభమయింది. కుమ్రాహార్ ప్రాంతంలో జరిగిన తవ్వకాలలో మౌర్యుల రాజ ప్రాసాదం బయల్పడింది. ఈ రాజ భవన నిర్మాణం పారశీక చక్రవర్తుల రాజ ప్రాసాదం పెర్సిపోలిస్ నమూనాగా నిర్మితమయింది. అశోకుని పాలనాకాలంలో వాస్తు శిల్పాలు పరిపక్వ దశకు చేరుకున్నాయి. బౌద్ధ గ్రంథాలు అశోకుడు **84,000** స్తూపాలను నిర్మించాడని తెలియ చేస్తున్నాయి. వీటిలో సాంచీ, సారానాథ్, బార్హుత్ స్తూపాలు ముఖ్యమైనవి. ఈ స్తూప నిర్మాణాలు వాస్తు శిల్ప కళలో

మౌర్యయుగ శిల్పులు సాధించిన నైపుణ్యానికి నిదర్శనాలు. మౌర్యుల కాలంలోనే కొండలను తొలచి గుహాలయాలను రూపొందించే పద్ధతి ప్రారంభమయింది. అశోకుడు, దశరథుడు తొలిపించిన గుహాలయాలు బీహార్ లోని గయ జిల్లాలో ఉన్న బరాబర్ కొండల్లో నాలుగు, నాగార్జున కొండలో మూడు, సీతామర్హి కొండలలో ఒకటి ఉన్నాయి. ఈ గుహాలయాలను ఆజీవకులకు దానంగా ఇచ్చారు. బరాబర్ పర్వతాలలో ఉన్న గుహాలయాలలో సుధామ గుహాలయం, లోమస్ రిషి గుహాలయాలు ప్రధానమైనవి. బౌద్ధ పుణ్య క్షేత్రాలలో గల అశోకుని ఏక శిలా స్తంభాలు మౌర్యుల కాలం నాటి శిల్ప కళా వైభవానికి నిదర్శనాలు. ఈ స్తంభాలు 30 నుంచి 40 అడుగుల ఎత్తైన కాండంతో ఉన్నాయి. ఈ స్తంభాలు లోహంతో చేసినట్లు నిగనిగలాడుతూ మెరుస్తున్నాయి. ఈ స్తంభాల పైన గల శీర్షభాగం అధోముఖ పద్మం, దాని పైన ఫలకం, ఫలకం మీద సింహం లేదా వృషభం లేదా అశ్వం శిల్పం ఉన్నాయి. అశోకుని స్తంభాలలో రాంపూర్వా, బఖీరా, లౌరియనందనగర్, రుమ్మిండై, సాంచి, సారనాథ్ స్తంభాలు ముఖ్యమైనవి. రాంపూరా స్తంభం పై వృషభ శిల్పం, లౌరియనందనగర్ స్తంభం పై సింహం శిల్ప ఉన్నాయి. సారనాథ్ లో గల స్తంభం పైనున్న ఫలకం పై నాలుగు వైపుల నాలుగు జంతువుల శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. ఫలకం పై నున్న జంతువుల మధ్య అశోక చక్రముంది. శీర్షిక పై భాగాన నాలుగు సింహాల శిల్పముంది. ఈ స్తంభాల నిర్మాణంపై పారశీకుల శిల్ప ప్రభావం ఉందని విన్సెంట్ స్మిత్ అభిప్రాయం. "ప్రాచీన యుగ జంతు శిల్పాలలో ఇది అసమానం. దీనిలోని ప్రతి అణువు, సహజ సౌందర్యంతో గంభీరతను జోడించి, పరిపూర్ణమైన, వాస్తవిక, మనోహర కళా ఖండంగా రూపొందించారు" అని విన్సెంట్ స్మిత్ ఈ స్తంభ శిల్పాన్ని కీర్తించాడు.

## 6.9 సారాంశం:

మౌర్య చక్రవర్తులు తమ సువిశాల సామ్రాజ్యంలో పటిష్టమైన కేంద్రీకృత పాలనా యంత్రాంగాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయం, వ్యాపార, వాణిజ్య, సైనిక వ్యవస్థ మొదలయిన అంశాలలో ఎన్నో నూతన పాలనా విధానాలను మొదటిసారి ప్రవేశపెట్టారు. సమకాలిక ప్రపంచంలో సువిశాల సామ్రాజ్యాన్ని సుస్థిరత, శాంతి భద్రతలతో పరిపాలించిన ఫలితంగానే వారి సామ్రాజ్యంలో వాణిజ్యాభివృద్ధి జరిగి, ఆర్థిక వికాసానికి అవకాశం కలిగింది. స్థానిక పాలనకు అవసరమైన అధికారాలను కల్పించి సమర్థవంతమైన కేంద్రీకృత పాలనను, ఉద్యోగులను రూపొందించుటలో మౌర్యులు సఫలీకృతులయ్యారు. పాలనా లక్ష్యమైన ప్రజా శ్రేయస్సును సాధించారు. మౌర్య పాలన అంతమైన తరవాత కాలంలోని రాజ వంశాలు మౌర్యులు ప్రారంభించిన పాలనా వ్యవస్థను పెద్దగా మార్పులు లేకుండా కొనసాగించడం వారి ఉత్తమ పాలనా పద్ధతికి నిదర్శనం.

## 6.10 మాదిరి ప్రశ్నలు:

1. చక్రవర్తి యొక్క స్థానం, అధికారాల గూర్చి వివరింపుము?
2. చక్రవర్తి యొక్క పాలనా వ్యవస్థ గూర్చి వివరింపుము?
3. సైనిక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ గూర్చి వ్రాయుము?
4. మౌర్య యుగ సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులను గూర్చి వ్రాయుము?

**సంక్షిప్త ప్రశ్నలు**

1. సమర్ధవంతమైన పరిపాలనకు రాజు అనుసరించవలసిన మూడు పద్ధతుల గూర్చి వ్రాయుము?
2. ఆదాయ, వ్యయాలు గూర్చి వ్రాయుము?
3. వాణిజ్యాభివృద్ధి ఆర్థిక వికాసానికి ఎలా తోడ్పడింది?
4. మౌర్య యుగంలో ప్రధాన మతాల గూర్చి వ్రాయుము?
5. వాస్తు శిల్పాలను వివరింపుము?
6. భాషా - సారస్వత రంగాలలో మౌర్య యుగం సాధించిన పురోగతిని వివరింపుము?

పాఠ్యభాగ రచయిత
డా॥ కొండా శ్రీనివాసులు

## పాఠం - 7

# విదేశీయుల దాడులు - కనిష్కుడి సేవ

## 7.0 లక్ష్యం:

మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఉత్తర భారతదేశంను స్వదేశీ, విదేశీ వంశాలు పాలించాయి. విదేశీయులలో కుషాణులు ముఖ్యులు. కుషాణులలో కనిష్కుడు గొప్ప పాలకుడు. వీకి కాలంలో జరిగిన పరిణామాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:

7.1 ఉపోద్ఘాతం
7.2 శుంగ వంశం
7.3 కణ్వ వంశం
7.4 గ్రీకులు
7.5 శకులు
7.7 పార్థియన్లు
7.8 కుషాణులు
  7.8.1 కుజులకాడ్ ఫైసిస్
  7.8.2 వీమాకాడ్ ఫైసిస్
  7.8.3 కనిష్కుడు
  (ఏ) రాజ్య విస్తరణ
  (బి) పరిపాలన
    రాజు
    పరిపాలనా వికేంద్రీకరణ
  (సి) ఆర్థిక పరిస్థితులు
    స్త్రీ స్థానం
    అలంకరణ
    వినోదం
  (డి) కనిష్కుడి మత విధానం
    నాల్గవ బౌద్ధ సంగీతి
    మత సహనం
    సాహిత్య పోషణ
  (ఇ) భవన నిర్మాణం
  (ఎఫ్) గాంధార శిల్ప కళ
7.9 ముగింపు
7.10 సారాంశం
7.11 మాదిరి ప్రశ్నలు
7.12 చదువదగిన గ్రంథాలు

## 7.1 ఉపోద్ఘాతం:

మౌర్య సామ్రాజ్య పతనానంతరం, గుప్త సామ్రాజ్య స్థాపన వరకు అంటే క్రీ.పూ. 200 మంచి క్రీ.శ. 350 వరకు దాదాపు ఐదున్నర శతాబ్ద కాలంపాటు ఉత్తర భారతదేశాన్ని సమైఖ్యం చేసి, సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరించగలిగిన రాజవంశమంటూ ఏదీ లేదు. మౌర్యుల తరవాత గంగానదికి దక్షిణంగా మగధ, కాశి, కోశాంబి, మధుర, తూర్పున విదేహ, కోసల; మధ్య భారతంలో బారుత్, విదిశ, ఉజ్జయిని, పశ్చిమాన పాంచాల రాజ్యాలు విస్తరించి ఉండేవి. శుంగ వంశ స్థాపకుడు పుష్యమిత్రుడి కాలం నాటికి దక్షిణాపథంలోని ఆంధ్రులు, ఉత్తరాపథ రాజకీయాల్లో కీలకపాత్ర నిర్వహించడం ప్రారంభించారు. క్రీ.పూ. ఒకటవ శతాబ్దకాలం నాటికి శుంగులు గంగా మైదానాన్ని; ఆంధ్రులు, కళింగ వాసులు ద్వీపకల్ప ఉత్తర ప్రాంతాన్ని; తమిళ రాజ్యాలైన చోళ, చేర, పాండ్యులు ద్వీపకల్ప దక్షిణ ప్రాంతాన్ని పాలించారని తెలుస్తుంది. వాయువ్య భారతదేశం విదేశీ దాడులకు గురయింది. ఇండోబాక్ట్రియన్లు, పార్థియన్లు, శకులు, కుషాణులు వంటి విదేశీ రాజ వంశాలవారు ఆయా ప్రాంతాలలో రాజ్యాలు స్థాపించి, పాలించడం జరిగింది. వాయవ్య భారతదేశం పూర్తిగా గ్రీకుల ప్రభావానికి లోనైనట్లుగా తెలుస్తుంది. ఈ విధంగా దేశంలో ప్రవేశించిన విదేశీయులు, వివిధ సాంస్కృతిక ప్రభావాలను జీర్ణింప చేసుకొని, భారతీయ సంస్కృతిని సుసంపన్నం చేయడం జరిగింది.




కుషాణ్ సామ్రాజ్యం

## 7.2 శుంగ వంశం (క్రీ.పూ. 187-75):

క్రీ.పూ. 187వ సంవత్సరంలో కడపటి మౌర్య చక్రవర్తి బృహథృదుడ్ని, అతని సేనాని పుష్యమిత్ర శుంగుడు చంపి, మౌర్య సామ్రాజ్య శిథిలాలపై శుంగ రాజ్యాన్ని స్థాపించాడు. పుష్యమిత్రుడ్ని గురించి బాణుని 'హర్ష చరిత్ర' వివరిస్తుంది. పది మంది శుంగ వంశ రాజులు దాదాపు 112 సంవత్సరాలు మగధను పరిపాలించడం జరిగింది. పుష్యమిత్రుడు శుంగ వంశ స్థాపకుడే గాక, ఆ వంశంలో గొప్పరాజు కూడా. పుష్యమిత్రుడు నిర్వహించిన అశ్వమేధ యాగంవల్ల అతడి హిందూ మతాభిమానం తెలుస్తుంది. ఇతడి కుమారుడు అగ్నిమిత్రుడు విదర్భ రాకుమార్తె మాళవికను వివాహమాడినట్లు కాళిదాసు రాసిన 'మాళవికాగ్ని మిత్రం' పేర్కొంది. నాల్గో బౌద్ధ సంగీతికి అధ్యక్షత వహించిన వసుమిత్రుడు కూడా ఈ వంశస్థుడే. ఈ వంశం చివరి రాజైన దేవభూతిని అతడి సేనాని వాసుదేవుడు క్రీ.పూ. 75 లో చంపడంతో శుంగ వంశం అంతరించింది.

## 7.3 కణ్వ వంశం:

కణ్వ వంశస్థులు చరిత్రలో కాణ్వాయనులుగా కూడా పిలువబడ్డారు. వాసుదేవుడు ఈ - వంశస్థాపకుడు. కణ్వ వంశంలో వాసుదేవ, భూమిమిత్ర, నారాయణ, సుశర్మ అనే నలుగురు పాలకులు దాదాపు **45** సంవత్సరాలు పరిపాలించడం జరిగింది. చివరి కణ్వ రాజైన సుశర్మను, ఆంధ్ర శాతవాహనరాజు పులోమావి ఓడించినట్లు తెలుస్తుంది. దీంతో కణ్వ వంశం క్షీణించింది. శాతవాహనులు మగధను ఆక్రమించినప్పటికీ, దానిని ఎక్కువ కాలం పరిపాలించినట్లు ఆధారాలు లేవు.

## 7.4 గ్రీకులు (క్రీ.పూ. 250-50):

భారతదేశానికి వాయువ్యంగా హిందూకుష్-ఆక్సస్-హీర మధ్య ప్రాంతాన్ని బాక్ట్రియాగా పిలుస్తారు. దీన్ని పాలించినవారే బాక్ట్రియన్ గ్రీకులుగా చరిత్రలో ప్రసిద్ధికెక్కారు. బ్రాక్టియన్ గ్రీకు పాలకులలో గొప్పవాడు డెమిట్రియస్. ఇతడు భారతదేశం పై దాడిచేసి, పంజాబ్ సింధూలలో కొన్ని ప్రాంతాలను ఆక్రమించి, పాలించాడు. డెమిట్రియస్ గ్రీకు, ఖరోష్టి అక్షరాలు కలిగిన నాణాలను చెలామణిలో ఉంచాడు. ఇతడు సాధించిన విజయాలు అలెగ్జాండర్ విజయాల కంటే గొప్పవని స్ట్రాబో తన రచనలలో పేర్కొన్నాడు. బాక్ట్రియా గ్రీకు పాలకులలో చివరి పాలకుడు హెలియోకిల్స్. ఇండో గ్రీకు పాలకులలో అగ్రగణ్యుడు మినాండర్. శాకల ఇతడి రాజధాని. మిళిందపన్హా అనే బౌద్ధ గ్రంథం మినాండర్‌ను గురించి వివరిస్తుంది. మినాండర్ విజయాలను స్ట్రాబో, ఫ్లూటార్క్ జస్టిన్లు కూడా తమ రచనలలో పేర్కొన్నారు. ఇతడు బౌద్ధ పండితుడైన నాగసేనుడితో చర్చ జరిపి, తన ఓటమిని అంగీకరించి, బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు పాళీ భాషా గ్రంథం మిళిందపన్హా వివరిస్తుంది.

## 7.5 శకులు (క్రీ.పూ. 165- క్రీ.శ. 388):

క్రీ.పూ. రెండో శతాబ్దంలో యూచి తెగవారి చేతిలో ఓటమిపాలైన శకులు, హిందూకుష్ పర్వతాలను దాటి, బొలాన్ కనుమ ద్వారా సింధు ప్రాంతానికి రావడం జరిగింది. వీరిపై ఇండో గ్రీకుల ప్రభావం అధికంగా కనిపిస్తుంది. భారతదేశాన్ని పాలించిన శకులలో మేనేజ్, వోనోనీజ్ అనే రెండు శాఖలు ప్రధానమైనవి. మొట్టమొదటి శక రాజు మావుజ్ లేదా మావుస్. వీరు తమ రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించి, మహా క్షాత్రపులనే అధికారుల కింద ఉంచారు. వీరి తరవాత క్షాత్రపులనే పాలకులుండేవారు. అనంతర కాలంలో మహారాష్ట్ర క్షాత్రపులుగా పిలవబడ్డారు. మాళ్వా పాలకులలో గొప్పవాడు రుద్రదాముడు. ఉజ్జయిని ఇతడి రాజధాని. గిర్నార్ శాసనం రుద్రదాముడి విజయాలను వివరిస్తుంది. ఇతడు సుదర్శన తటాకానికి మరమ్మత్తులు చేపట్టాడు.

## 7.6 పార్థియన్లు (క్రీ.శ. 20-48):

శకుల అనంతరం భారతదేశంలో ప్రవేశించిన వారు పార్థియన్లు. వీరినే పహ్లవులు అని కూడా అంటారు. పేర్లను బట్టి శకులకు, పహ్లవులకు దగ్గరి సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది. పార్థియన్లలో గొప్ప పాలకుడు గొండో ఫర్నీస్ (క్రీ.శ. 20-48). ఇతడు కాబూల్ నుంచి పంజాబ్ వరకు ఉన్న ఇరానియన్ ప్రాంతాలను కలుపుకొని పాలించాడు. క్రైస్తవ ఐతిహ్యాల వల్ల క్రీస్తు అనుయాయి సెయింట్ థామస్ గొండో ఫెర్నిస్ రాజ్యంలో మత ప్రచారం చేశాడని తెలుస్తుంది. అలాగే మరొక కథనం ప్రకారం సెయింట్ థామస్ మలబారు ప్రాంతానికి వచ్చి, సిరియన్ చర్చిలను నెలకొల్పి, నేటి చెన్నై వద్ద మతబోధ చేస్తుండగా దుర్మరణం చెందాడని తెలుస్తుంది. పార్థియన్ల తరవాత దేశంలో ప్రాబల్యాన్ని నెలకొల్పిన విదేశీయులు కుషాణులు.

## 7.7 కుషాణులు:

మౌర్యులకు, గుప్తులకు మధ్యకాలంలో ఉత్తర భారతదేశంలో విశాల రాజ్యాన్ని స్థాపించిన పాలకులు కుషాణులు. వీరు ఏ జాతికి చెందిన వారనే విషయంలో చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. కుషాణులు తురుష్క జాతికి చెందినవారని కొందరు భావించగా, మరి కొందరు మంగోల్ జాతికి చెందినవారని తెలియచేశారు. అయితే ఇంకొందరు చరిత్రకారులు కుషాణులు శక జాతికి చెందినవారని అభిప్రాయపడ్డారు. వీరి అభిప్రాయం ప్రకారం బాక్ట్రియా కుషాణుల స్వస్థలం. కుషాణులనే తొఖారియన్లు లేదా తుఖారులని పిలిచేవారు. అయితే భారతీయులు మాత్రం వీరిని తుషారులని వ్యవహరించారు. తోషియా అనే ప్రాంతాన్ని ఆక్రమించిన తరవాత వీరు 'యూచి' తెగవారిగా, చరిత్రలో కుషాణులుగా ప్రసిద్ధికెక్కారు. వీరిని హూణులు తరమగా పశ్చిమంగా వెళ్ళి, శకులను ఓడించి, స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. అక్కడి నుంచి ఐదు శాఖలుగా విడిపోయి, పరిపాలన ప్రారంభించారు.

**7.8.1 కుజులకాడ్ ఫైసిస్:** ఈ ఐదు శాఖలలోని ఒక శాఖకు చెందిన కుషాణులు భారతదేశ వాయవ్య ప్రాంతంపై దాడి చేసి సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ ఘనకార్యాన్ని సాధించి, భారతదేశంలో కుషాణ్ సామ్రాజ్యాన్ని స్థాపించిన పాలకుడు కుజులకాడ్ ఫైసిస్. ఇతడు క్రీ.శ. 15 నుంచి క్రీ.శ. 65 వరకు పరిపాలించాడు. మిగిలిన నాలుగు తెగల పై ఆధిపత్యం పొందాడు. అంతేగాక కాబూల్, గాంధార ప్రాంతాలను జయించి, రాజ్యాన్ని తక్షశిల వరకు విస్తరింపచేశాడు. కుజులకాడ్ ఫైసిస్ బౌద్ధ మతాన్ని స్వీకరించినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయం. మహారాజు, రాజాధిరాజు, దేవపుత్ర బిరుదులు - ధరించాడు. రాగి నాణాలను ముద్రించాడు. ఇతడి నాణాల పై రోమన్ నాణాల ప్రభావం కనిపిస్తుంది.

**7.8.2 వీమాకాడ్ ఫైసిస్:** కుజులకాడ్ ఫైసిస్ పాలనానంతరం అతడి కుమారుడు వీమాకాడ్ ఫైసిస్ కుషాణ్ రాజ్య పాలకుడయ్యాడు. ఇతడు క్రీ.శ. 65 నుంచి క్రీ.శ. 75 వరకు కుషాణ్ రాజ్యాన్ని పాలించినట్లు తెలుస్తుంది. వీమాకాడ్ ఫైసిస్ పాలనాకాలంలో కుషాణ్ రాజ్యం సింధూ పరీవాహక ప్రాంతం పంజాబు వరకు విస్తరించింది. ఇతడు చైనా సైన్యాధిపతి పాన్-చావో చేతిలో పరాజయం పొందినట్లు తెలుస్తుంది. కుజులకాడ్ ఫైసిస్ ముద్రించిన వెండి, బంగారు నాణాల పై శివుని ప్రతిమ, మహేశ్వర పదాల వల్ల, అతడు శైవుడని తెలుస్తుంది.

**7.8.3 కనిష్కుడు (క్రీ.శ. 78-102):** కుషాణ్ రాజ్యపాలకులలో అగ్రగణ్యుడు కనిష్కుడు. కనిష్కుడు క్రీ.శ. 78 నుంచి క్రీ.శ. 102 వరకు కుషాణ్ సామ్రాజ్యాన్ని పాలించి, నూతన శకారంభం చేశాడని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు గొప్ప విజేత, పాలనాదక్షుడు, బౌద్ధ మతాభిమాని. "అతడిలో చంద్రగుప్తుని పరాక్రమం, అశోకుని మతావేశం మిళితమై ఉన్నాయని, పుట్టుకచే విదేశీయుడైనా, ఆచార వ్యవహారాలలో భారతీయుడని, జన్మతః విదేశీయుడైనప్పటికీ, భారతదేశాన్ని పెంపుడు తల్లిగా అంగీకరించాడని" ఆచార్య ఘోష్ అభిప్రాయపడ్డాడు.

**(ఎ) రాజ్య విస్తరణ:** సింహాసనాన్ని అధిష్టించిన తరవాత కాశ్మీర్ పై దండెత్తి విజయం సాధించాడని, దానికి గుర్తుగా 'కనిష్క పురమనే' నగరాన్ని నిర్మించాడని, కల్హణుని రాజ తరంగిణి తెలుపుతుంది. అనంతరం మగధపై దండెత్తి, పాటలీపుత్రాన్ని ఆక్రమించి, అశ్వఘోషుడనే పండితుడ్ని తన ఆస్థానానికి తీసుకు వెళ్ళాడని బౌద్ధ మత

గ్రంథాల వల్ల తెలుస్తుంది. అంతేగాక కనిష్కుడు చైనా సేనాధిపతి పాన్ దావోను ఓడించి, వారి వద్ద నుంచి కాష్ గర్, యార్ఖండ్, ఖోటాన్ ప్రాంతాలను పొందినట్లు తెలుస్తుంది. చైనా వారికి అప్పటి వరకు చెల్లించే కప్పం కూడా నిలిపివేయడం జరిగింది. అయితే తమకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా పాన్ చావోన్ పామీర్ వద్ద కనిష్కుడిని ఓడించి, ప్రతీకారం తీర్చుకున్నాడు. కనిష్కుని చేతిలో ఓడిన చష్టనుడు, ఉజ్జయిని పాలకుడేనని టాలమీ పేర్కొన్నాడు. ఈ విజయాలవల్ల కనిష్కుడు దేవపుత్ర, సీజర్ బిరుదులు పొందాడు.

**(బి) పరిపాలన:** కనిష్కుడు తన పరిపాలనా విధానంలో శకులు అనుసరించిన 'క్షాత్రపి' విధానాన్ని పాటించడం జరిగిందని సారనాథ్ శాసనం ద్వారా తెలుస్తుంది. కుషాణుల రాజధాని పురుషపురం. దీనికి పెషావర్ అనే పేరు కూడా ఉంది. పెషావర్‌తో పాటుగా, తక్షశిల కూడా ఒక ప్రధాన పాలనా కేంద్రంగా గుర్తింపు పొందింది. కనిష్కుడు పరిపాలనలో దేశీయ, విదేశీయ పద్ధతులను ప్రవేశపెట్టడం జరిగింది. వాయవ్య ప్రాంతాల పాలకులుగా సాత్రపీలను, మధ్య ప్రాంతంలో అమాత్యులు, సేనాపతి వంటి అధికారులను నియమించినట్లు రాధాకుముద్ ముఖర్జీ తెలిపాడు. క్షాత్రపులు గవర్నర్లు కాగా, మహాక్షాత్రపులు స్వతంత్ర పాలకులుగా వ్యవహరించారు. వీరు నాణాలను ముద్రించే అధికారం కూడా కలిగి ఉండేవారు. కనిష్కుని నాణాలు కొన్ని గణతంత్ర రాజ్యాలున్నట్లు తెలిపినప్పటికీ, ప్రధానంగా రాచరికమే కొనసాగింది.

**రాజు:** కుషాణులు రాజు దైవాంశ సంభూతుడిగా భావించి, దైవదత్తాధికార సిద్ధాంతాన్ని అనుసరించినప్పటికీ, ప్రజాశ్రేయస్సును కాంక్షించి పరిపాలించారు. లభించిన ఆధారాలు మంత్రిమండలి ఉనికిని తెలియచేయడంలేదు. సందర్భానుసరించి కుషాణులు ద్వంద్వ ప్రభుత్వాన్ని సాగించినట్లు నాణాల వల్ల తెలుస్తుంది.

**పరిపాలనా వికేంద్రీకరణ:** రాజ్యాన్ని రాష్ట్రాలు, ఆహారాలు, జనపదాలు, విషయాలుగా విభజించారు. విషయాలకు మరో పేరు దేశం. సరిహద్దు ప్రాంతాలను సైనికాధికారులు పాలించగా, దండ నాయకుడు పోలీస్ విధులను నిర్వహించాడు. కుషాణు రాజుకు పరిపాలనలో తులకలు అనే సభ్యులతో కూడిన సభ సాయపడినట్లు, రాజామాత్యుడనే ఉద్యోగి రాజుకు ప్రధాన సలహాదారుడైనట్లు, గ్రామ పాలన కోసం గ్రామిక, భద్రపాల అనే ఉద్యోగులున్నట్లు బౌద్ధ సాహిత్యం పేర్కొంది.

**(సి) ఆర్థిక పరిస్థితులు:** కుషాణుల పాలనాకాలంనాటి ప్రజల జీవన పరిస్థితులు మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తుంది. వ్యవసాయం పైనే ఎక్కువ మంది ప్రజలు ఆధారపడి జీవించేవారు. వ్యవసాయంతో పాటుగా వారు అనేక వృత్తులను అవలంభించారు. నాటి సమాజంలో కంసాలులు, సాలెలు, కుమ్మరులు, గానుగ పనివారు, ధాన్య వర్తకులు వంటి పనులు నిర్వహించే వారున్నట్లు తెలుస్తుంది. వర్తక వాణిజ్యాలు దేశంలోను, విదేశాలతోను విరివిగా జరిగేవి. శ్రేణుల ద్వారా వర్తక వాణిజ్యాలు నిర్వహింపబడేవి. నాడు 18 రకాల శ్రేణులున్నట్లు తెలుస్తుంది. శ్రేణి పెద్దను శ్రేష్టి అని పిలిచేవారని బౌద్ధ వాజ్మయం తెలుపుతుంది. శ్రేణులు వర్తకులకు అప్పులిచ్చేవి. శ్రావస్తి, సోపారాను; తక్షశిల, కాశీలను కలుపుతూ వేయించిన రాజమార్గాలు దేశంలోని వర్తక, వాణిజ్యాలకు బాగా ఉపకరించాయి. ఎన్నో మార్గాలున్నా, దారి దోపిడి దొంగల బారి నుంచి కాపాడేందుకు అనేక ముందు జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. వణిక్కులనేవారు స్థానికంగా ఉండి వ్యాపారం చేయగా, సార్థవాహులనేవారు దేశమంతా తిరిగి ముడిసరుకుల వ్యాపారాన్ని నిర్వహించేవారు. కుషాణుల కాలంలో దీనారాలు, కార్షాపణాలు అనే నాణాలు ముద్రించబడ్డాయి. బంగారు వర్తకులను హిరణ్యకులని పిలిచేవారు.

**విదేశీ వాణిజ్యం:** ఈ కాలంలో విదేశీ వాణిజ్యం బాగా జరిగినట్లు తెలుస్తుంది. కుషాణుల కాలంలో భారతదేశానికి రోమ్‌తో వర్తక సంబంధాలున్నట్లు పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ ద్వారా తెలుస్తుంది. రోమ్‌తో వాణిజ్యం వల్ల కుషాణులకు ఎంతో లాభం చేకూరింది. బరుకచ్చం లేదా బ్రోచ్ ప్రధాన రేవు పట్టణం. వజ్రాలు, రత్నాలు, శిల్కు, మజ్లిస్, నూలు వస్త్రాలు ఎగుమతులలో ప్రధానమైనవి. దిగుమతులలో వెండి, బంగారం, రాగి, మద్యం ముఖ్యమైనవి.

భారతదేశంలో బంగారు నాణాలను ఎక్కువ జారీ చేసిన పాలకులు కుషాణులనే చెప్పవచ్చు. మొత్తం మీద ప్రజలు భోగభాగ్యాలతో సుఖజీవనం గడిపారని సమకాలీన రచనలు పేర్కొంటున్నాయి.

**సాంఘిక పరిస్థితులు:** కుషాణుల కాలంనాటి హిందూ సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే చాతుర్వర్ణ విధానం కొనసాగిందని 'మిళిందపన్హా' తెలియచేస్తుంది. అయితే 'లలిత విస్తారం' అనే మరో గ్రంథం అన్ని వర్గాలవారిని ఏకజాతిగానే వర్ణించడం జరిగింది. బౌద్ధ సాహిత్యం సమాజంలో బ్రహ్మణులకు ప్రత్యేక గౌరవం లభించిందని, వారు ధన ధాన్యాలతో తులతూగేవారని పేర్కొంది. నాడు పితృస్వామిక వ్యవస్థ కొనసాగింది. తండ్రే కుటుంబ యజమాని. కుటుంబ పెద్దను గహపతి అనేవారు. అతడే ఇంటి విషయాలలో నిర్ణయాలు తీసుకునేవాడు. తండ్రి తన ఆస్తిని కుమారుల మధ్య పంపకం చేస్తూ వీలునామా వ్రాసే సంప్రదాయం ఉంది.

**స్త్రీ స్థానం:** ఈ కాలంలో స్త్రీలు చాలా వరకు స్వేచ్ఛను అనుభవించారని చెప్పవచ్చు. నాటి శాసనాలు స్త్రీలు కూడా అనేక దానాలు చేసినట్లు తెలియ చేస్తున్నాయి. సంపన్న గృహాలలో స్త్రీలకు ప్రత్యేక వసతి, అంతఃపురం ఉండేవి. పసి పిల్లలను పెంచేందుకై 'ధాత్రి' అనే సేవకురాండ్రు ఉండేవారు. సాధారణంగా వివాహాలు సవర్ణీకుల మధ్య జరుగుతూ ఉండేవి. బహుభార్యాత్వం అమల్లో ఉంది. పురుష సంతానం కోసం మరొక వివాహం చేసుకోవడం పరిపాటి అయింది. వీటితో పాటుగా కన్యాశుల్కం కూడా నాటి కాలంలో ఉన్నట్లు అశ్వఘోషుని 'బుద్ధచరిత్ర' వల్ల తెలుస్తుంది. ధనికులు విలాసవంతమైన జీవితాన్ని గడిపినట్లు సాహిత్యాధారాలు పేర్కొంటున్నాయి. వేశ్యావృత్తి ఉన్నట్లు కూడా అవి తెలియచేశాయి. వేశ్యలు నివసించే వీధిని 'గణికవీధి' అని పిలిచేవారు.

**ఆలంకరణ:** స్త్రీ, పురుషులిరువురూ అలంకార ప్రియులు. వీరు రకరకాల ఆభరణాలను ధరించి, సౌందర్య పోషణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. దుస్తులు ధరించడంలో విదేశీ పోకడలు బయలుదేరాయి. కనిష్కుడు పొడవాటి దుస్తులు ధరించి, కాళ్ళకు బరువైన మూసి ఉంచే పాదరక్షలను ధరించినట్లు మధురలో లభించిన శిల్పాల వల్ల తెలుస్తుంది.

**వినోదం:** ప్రజల వినోదం, కాలక్షేపం కోసం అందమైన ఉద్యాన వనాలు, క్రీడా స్థలాలు ఉండేవని 'దివ్యావదానం' పేర్కొంటుంది. సంగీతం, నృత్యం, నాటకం, చదరంగం, వేట నాటి ప్రజల ముఖ్య వినోదాలు.

**(డి) కనిష్కుడి మత విధానం:** కనిష్కుడి ఘనతకు అతడి సైనిక విజయాల కంటే, అతడు అనుసరించిన మత విధానమే కారణమయింది. ఇతడు తన పూర్వీకుల మాదిరిగానే మొదట్లో హిందూ మతాభిమాని. శివుడిని, సూర్యుణ్ణి, అగ్నిని అతడు ఆరాధించేవాడు. కాని, అశ్వఘోషుడనే బౌద్ధ పండితుడి వల్ల బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. అనంతరం బౌద్ధ మతానికి ఎనలేని సేవచేసి, 'రెండో అశోకుడి' గా కీర్తి గడించాడు. కనిష్కుని ఆదరణతో బౌద్ధ మతానికి నూతన జీవనం వచ్చినట్లయింది. బౌద్ధ మతాన్ని స్వీకరించిన తరవాత కనిష్కుడు రాజ్యంలో అనేక స్థూపాలను, విహారాలను నిర్మించాడు. బౌద్ధ మత వ్యాప్తి కోసం అశోకుడిలాగా మత ప్రచారకులైన కశ్యప, మాతంగులను టిబెట్, చైనా, జపాన్, మధ్య ఆసియా ప్రాంతాలకు పంపాడు.

**నాల్గవ బౌద్ధ సంగీతి:** అంతేకాక బౌద్ధ మత ప్రాశస్త్యాన్ని తెలపడానికి, మత ప్రచార విధానాన్ని క్రమపరచేటందుకు నాల్గవ బౌద్ధ సంగీతిని ఏర్పాటు చేశాడు. ఈ సంగీతి కాశ్మీర్‌లోని కుందల వనంలో జరిగిందని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడగా, మరి కొందరు పంజాబ్ లోని జలంధర్‌లో ఏర్పాటయిందని భావించారు. ఈ సమావేశానికి బౌద్ధ మతానికి చెందిన పద్దెనిమిది శాఖల మతాచార్యులు హాజరయ్యారని టిబెటన్ చరిత్రకారుడు తారానాథ్ వ్రాశాడు. ఈ సంగీతిని పార్శ్వుడనే వృద్ధ బౌద్ధ ఆచార్యుని సలహా మేరకు నిర్వహించడం జరిగిందని తెలుస్తుంది. దీనికి వసుమిత్రుడు అధ్యక్షత వహించగా, అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడిగా వ్యవహరించాడు. ఈ సంగీతికి దేశ విదేశాల నుంచి 500 మంది భిక్షువులు, సన్యాసులు హాజరై, త్రిపీఠకాలపై వ్యాఖ్యానాలను వ్రాశారని హ్యూయాన్‌త్సాంగ్ తెలిపాడు. ఈ సంగీతిలో బౌద్ధ మత సిద్ధాంతాలు సమన్వయపరచబడి, మహావిభాష్య శాస్త్రం అనే పేరుతో వాటిని

క్రోడీకరించారు. వీటిని రాగి రేకుల పై చెక్కించి, కనిష్కుడు ఒక స్థూపంలో భద్రపరచినట్లు బౌద్ధ వాఙ్మయం ద్వారా తెలుస్తుంది. ఈ బౌద్ధ సంగీతిలోనే మహా సాంఘికులు ఒక బౌద్ధ మత శాఖగా ఆవిర్భవించారు. ఇక్కడే ప్రాచీన స్థవిర వాదులు, సర్వాస్థి వాదులయ్యారు. కనిష్కుడు మహాయాన బౌద్ధ మతాన్ని ఆదరించాడు.

కనిష్కుని కాలంలోనే బౌద్ధమతం హీనయాన బౌద్ధ మతం, మహాయాన బౌద్ధ మతంగా చీలిపోయింది. మహాయాన బౌద్ధ మతశాఖకు చెందినవారు బుద్ధుడిని భగవంతునిగా భావించి, హిందూ దేవతల మాదిరిగా పూజించడం ప్రారంభించారు. మహాయానులు, సంసారులు, సన్యాసులు అందరూ బుద్ధుడిని పూజించి, బోధి సత్వం పొందగలరని నమ్మగా, హీనయానులు ఐహిక సుఖాలు, త్యజించి, సన్యాసం స్వీకరించిన వారు మాత్రమే బోధి సత్వాన్ని పొందగలరని విశ్వసించారు. కాబట్టి మహాయాన బౌద్ధ మతాన్ని విశాలమైన మార్గం ద్వారా పయనించే పెద్ద రవాణా సాధనంగా, హీనయాన బౌద్ధ మతాన్ని ఇరుకైన మార్గం ద్వారా కొనిపోయే చిన్న రవాణా సాధనంగా అభివర్ణించడం జరిగింది. హీనయాన బౌద్ధ మతస్థులు పాళీ భాషను అనుసరించగా, మహాయానులు సంస్కృత భాషను అనుసరించారు.

**మత సహనం:** కనిష్కుడు బౌద్ధమతాన్ని స్వీకరించినప్పటికీ అన్ని మతాలను ఆదరించాడు. అతడి నాణాల పై ముద్రించిన గ్రీకు, సుమేరియన్, పారశీక, హైందవ దేవతల ప్రతిమలు, కనిష్కుని పరమత సహనాన్ని సర్వమత ఆదరణను చాటి చెప్తున్నాయి.

**సాహిత్య పోషణ:** కనిష్కుడు గొప్ప సాహిత్యాభిమాని, సాహిత్య పోషకుడు. అనేక భారతీయ, యవన విద్వాంసులు, పండితులు అతడి పోషణ నందుకున్నారు. వారిలో అశ్వఘోషుడు బహుముఖ ప్రజ్ఞాశాలి. అతడు నాటక కర్త, విమర్శకుడు, తత్వవేత్త. బుద్ధచరిత్ర, సౌందర్య నందం అతడి కావ్యాలు. శౌరిపుత్ర ప్రకరణం అనే సంస్కృత నాటకాన్ని ఇతడే రచించాడు. మాద్యమిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, మహాయాన బౌద్ధ మతాన్ని ప్రచారం చేసిన ఆచార్య నాగార్జునుడు కనిష్కుని కాలానికి చెందిన వాడేనని భావిస్తారు. మహావిభాష్య శాస్త్రాన్ని సంతరింపచేసిన వసుమిత్రుడు పార్శ్వుడనే వేద పండితుడు కనిష్కుని ఆదరణ పొందినవాడే. మహావిభాష్య శాస్త్రాన్ని విజ్ఞాన సర్వస్వంగా భావిస్తారు. అంతేగాక ఆయుర్వేద శాస్త్రవేత్త, చరక సంహిత రచయిత చరకుడు, కనిష్కుని ఆస్థాన వైద్యుడు. వీరందరి కృషి వల్ల కనిష్కుడి కాలంలో అపారమైన సాహిత్య సృష్టి జరిగింది. ఇతడి కాలంలో ప్రాకృత భాషకు బదులు, సంస్కృత భాష అభివృద్ధి చెందింది.

**(ఇ) భవన నిర్మాణం:** కనిష్కుడు గొప్ప భవన నిర్మాత. ఇతడు అనేక స్థూపాలను, విహారాలను నిర్మించాడు. పెషావర్ విహారాన్ని కనిష్కుడే నిర్మించినట్లు ఆ బెరూని రాశాడు. ఇక్కడే కనిక చైత్యం కట్టించాడని తెలుస్తుంది. ఈ కనిక చైత్యమే కనిష్క చైత్యంగా పిలువబడింది. కనిష్కుడు కాశ్మీర్‌లో కనిష్క పురాన్ని నిర్మించాడని కణుని రాజతరంగిణి చెబుతుంది. రాజధాని పురుషపురంలో 13 అంతస్తులు, 400 అడుగుల ఎత్తుగల కొయ్య గోపురాన్ని నిర్మించి, అందులో నిలువెత్తు బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్టించాడు. పెషావర్‌లో, కంచు గోపురాన్ని నిర్మించి, అందులో బుద్ధుడి అవశేషాలను భద్రపరిచాడు.

**(ఎఫ్) గాంధార శిల్ప కళ:** కనిష్కుడి పాలనాకాలంలో గాంధార శిల్పకళ వికసించి, ఉత్తరాపథంలో అపార ప్రభావాన్ని చూపింది. ఈ శిల్ప కళకు కేంద్రం మధుర. గాంధారం భారతదేశానికి వాయవ్యంగా సింధూ నదికి ఇరువైపుల ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతాన్ని క్రీ.పూ. 5, 6 శతాబ్దాలలో ఇరానియన్లు, అనంతరం గ్రీకులు, మౌర్యులు, శకులు, పహ్లవులు, చివరగా కుషాణులు పరిపాలించారు. ఫలితంగా ఇక్కడ మిశ్రమ సంస్కృతి కనిపిస్తుంది. ఇక్కడ వస్తుశిల్పం ఎక్కువగా బౌద్ధపరంగా రూపుదాల్చింది. దీనిలో గ్రీకు, రోమన్ల ప్రభావం కనిపిస్తుంది. గ్రీకుల పల్చటి వస్త్రధారణ, రోమన్ల ఉంగరాల జుట్టు. బలిష్టమైన అంగ సౌష్టవం, సీగముడి, బరువైన కనురెప్పలు, త్రిముఖ భంగిమలు, నైష్పత్తిక కొలతలు, దరహాస వదనం గాంధార శిల్పకళ ముఖ్య లక్షణాలు. గాంధారశిల్పికి శిల్పాలు చెక్కడంలో గ్రీకు

హస్తం, భారతీయ హృదయం ఉండడం విశేషంగా చెప్తారు. ఇందులో భారతీయ, గ్రీకు శిల్పకళా సంప్రదాయాలు మేళవింపబడి ఉన్నందువల్ల, దీనిని ఇండో- గ్రీక్ కళగా పిలుస్తారు. గాంధార శిల్పంతో చెక్కిన ప్రతి శిల్పంలో సజీవకళ ఉట్టిపడుతుంది. గాంధార శిల్పంలోనే బుద్ధుడు మొదటిసారిగా విగ్రహరూపం దాల్చడం జరిగింది. గాంధార శిల్పకళ మధుర, సారనాథ్, అమరావతిలలో అభివృద్ధి చెందింది. అయితే హూణుల దండయాత్రల కారణంగా ఈ శిల్పకళా ప్రాభవం పూర్తిగా ధ్వంసమయింది.

## 7.9 ముగింపు:

భారతదేశాన్ని పరిపాలించిన విదేశీ రాజులలో కనిష్కుడు గొప్పవాడు. అతడు కేవలం విజేతయే గాక, పరిపాలనాదక్షుడు కూడా. బౌద్ధ మతాభిమాని అయినప్పటికీ పరమత సహనాన్ని చూపాడనీ, ప్రజాహితాన్ని కోరి పాలించిన చక్రవర్తి అని, సాహిత్య, కళా రంగాలను పోషించాడనీ H.G. రావిల్సన్ అభిప్రాయపడ్డాడు. ఉత్తర భారతదేశ సాంస్కృతిక వికాస చరిత్రలో కుషాణ్ యుగం ఒక విశిష్ట అధ్యాయం అని రొమల్లా థాపర్ కీర్తించారు.

## 7.10 సారాంశం:

మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఉత్తర భారతదేశం శుంగులు, కణ్వులు కొంత కాలం పరిపాలించారు. వీరి పాలనా కాలంలోనే విదేశీదాడులు జరిగాయి. తీరిలో గ్రీకులు, శకులు, కుషాణులు ముఖ్యులు. కుషాణులలో కనిష్కుడు ముఖ్యుడు. అతడి కాలంలో బౌద్ధ మత వ్యాప్తి జరిగి, వాస్తు శిల్పము మొదలైన రంగాలలో అభివృద్ధి జరిగింది.

## 7.11 మాదిరి ప్రశ్నలు:

1. కనిష్కుడు భారతదేశ సంస్కృతికి చేసిన సేవలను వివరించండి.
2. భారతదేశం పై జరిగిన విదేశీదాడులను సంక్షిప్తంగా వ్రాయండి.

**సంక్షిప్త ప్రశ్నలు:**

1. శుంగ వంశ ప్రాధాన్యత ఎట్టిది?

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. కనిష్కుడు ఆదరించిన మతం ....... ( )

   ఎ) జైన మతం బి) బౌద్ధ మతం సి) శైవ మతం డి) ఏదీ కాదు.

2. నాల్గవ బౌద్ధ సంగీతి ఎవరి కాలంలో జరిగింది? ( )

   ఎ) అశోకుడు బి) బిందుసారుడు సి) కనిష్కుడు డి) పుష్యమిత్రుడు

3. కనిష్కుడి ఆస్థాన వైద్యుడు .......... ( )

   ఎ) చరకుడు బి) పార్శ్వుడు సి) అశ్వఘోషుడు డి) కల్హణుడు

4. రాజతరంగిణి గ్రంథ రచయిత ............ ( )

   ఎ) అశ్వోఘోషుడు బి) నాగార్జునుడు సి) కల్హణుడు డి) చరకుడు

5. కణ్వ వంశ స్థాపకుడు ............ ( )

   ఎ) దేవభూతి బి) నారాయణ సి) భూమి మిత్ర డి) వాసుదేవుడు

**జతపరచండి:**

| | | | |
|---|---|---|---|
| 1. శుంగ వంశం | ( ) | ఎ) | మినాండర్ |
| 2. కణ్వ వంశం | ( ) | బి) | డెమిట్రియస్ |
| 3. బాక్ట్రియన్ గ్రీకులు | ( ) | సి) | గొండోఫర్నెస్ |
| 4. ఇండో గ్రీకులు | ( ) | డి) | పుష్యమిత్రుడు |
| 5. పార్థియన్లు | ( ) | ఇ) | వాసుదేవుడు |

**ఖాళీలను పూరించండి:**

1. నాల్గవ బౌద్ధ సంగీతికి అధ్యక్షుడు ..........................
2. శుంగ వంశ చివరి పాలకుడు .................................
3. కనిష్కుడి రాజధాని .......................................
4. రెండో అశోకుడిగా పేరు గాంచిన పాలకుడు ............................
5. బుద్ధ చరిత్ర రచయిత ...............................

## 7.12 ఉపయుక్త గ్రంథాలు:


1. E.J. Majumdar - The Cambridge Histry of India
2. Puri B.N. - India Under The Kushans
3. Smita V.A. - Early History of India
4. Smita V.A. - Oxford History of India



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ డి. వెంకటేశ్వర రెడ్డి**

## UNIT - III

**దక్షిణ భారతదేశ చరిత్ర & సంస్కృతి**
**(క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 8వ శతాబ్దం వరకు)**

**పరిచయం:**

దక్షిణ భారతదేశం భౌగోళికంగా రెండు భాగాలు: 1. దక్కన్ పీఠభూమి, 2. సుదూర దక్షిణ భారతదేశం. దక్కన్ ప్రాంతంలో క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 మధ్య కాలంలో పరిపాలించిన మొదటి రాజ వంశం శాతవాహన వంశం. వీరు నేటి మహారాష్ట్ర నుండి తూర్పున అంధతీర ప్రాంతం వరకు పరిపాలించారు. వీరి తరువాత ఇక్ష్వాకులు, శాలంకాయునులు, ఆనందగోత్రికులు, బృహత్పలాయనులు, విష్ణు కుండినులు మొదలైన రాజ వంశాలు పరిపాలించారు. మధ్య మధ్యలో అనేక పర్యాయాలు ప్రాచీన పల్లవులు కూడా పరిపాలించారు. విష్ణు కుండినుల తర్వాత తూర్పు చాళుక్యులు పరిపాలించారు. పడమర ప్రాంతంలో కదంబులు, పశ్చిమ చాళుక్యులు, రాష్ట్రకూటులు మొదలైన వారు పరిపాలించారు.

ఇక సుదూర దక్షిణ భారతదేశంలో సంగం యుగం (చేర, చోళ, పాండ్య రాజుల కూటమి.) రాజ వంశాల పాలన జరిగింది. సంగం సాహిత్యమైన శిలప్పాధికారం, మణిమేఖలై, జీవన చింతామణి మొదలగు ప్రముఖ గ్రంథాలు వెలువడినాయి. సంగం కాలంలో (నేటి తమిళనాడు, కేరళ) వీరు తమలో తాము కలహించుకుంటూ, బయట రాజులు దండెత్తి వచ్చినప్పుడు ఏకమై ఎదుర్కొనేవారు. అందువల్ల సంగం యుగంలో ఆర్యుల నాగరికత ఈ ప్రాంతంలో ప్రవేశించలేకపోయినది. తరువాత కాలంలో నవీన పల్లవులు క్రీ.శ. 3వ శతాబ్దం నుండి 8వ శతాబ్దం వరకు పరిపాలించారు. పల్లవుల పరిపాలన, పల్లవులు దక్షిణ భారతదేశ సంస్కృతికి ఎనలేని సేవ చేసినారు. ఒక రకంగా భారతదేశంలో దేవాలయాల భావజాలాన్ని, దేవాలయ రీతులు, నిర్మాణాలు, శిల్ప కళలను ప్రవేశపెట్టిన వారు పల్లవులు. వీరు గుహాలయాలు, ద్రవిడ శైలిలో దేవాలయ నిర్మాణాలు చేపట్టినారు. ఉదా॥ కంచిలోని దేవాలయాలు, మహాబలిపురంలోని కట్టడాలు. వీరు కూడా భూస్వామ్య పద్ధతిని అనుసరించినారు.

క్రీ.పూ. 200 నాటికి మౌర్య సామ్రాజ్యం పతనమై మరొక పర్యాయం విదేశీ దాడులు జరిగాయి. ఇండో గ్రీకులు, శకరాజులు, పర్షియన్‌లు, కుషాణులు మొదలగువారు భారతదేశంలోనికి ప్రవేశించారు. వీరి రాకతో దాదాపు 400 సంవత్సరాలు భారతదేశం విదేశీయుల ఆధీనంలోకి వెళ్ళిపోయింది. అయితే వారి వల్ల కొన్ని ప్రయోజనాలు జరిగి, భారతదేశ సంస్కృతిలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇండో గ్రీకులు భారతదేశంలో బంగారు నాణెల సంస్కృతిని ప్రవేశపెట్టగా, శకరాజులు శాసనాలను సంస్కృత భాషలో వ్రాయటాన్ని ప్రవేశపెట్టారు. కుషాణులు, గుఱ్ఱపు స్వారీలో సాంకేతిక మార్పులు చేయటం, అశ్వకుని వేషధారణ, రాజులు బిరుదులను కలిగి ఉండటం, గాంధార శిల్ప కళ మొదలైనవి ప్రవేశపెట్టారు. విదేశీ రాజులైనా భారతదేశ ఆర్థిక పరిస్థితులను బాగా ప్రోత్సహించటం వల్ల వీరి కాలానికి వృత్తులలో, వ్యాపార రంగాలలో శ్రేణి వ్యవస్థ ఏర్పడింది.

----------

**యూనిట్ - 3**

**పాఠం - 1**

# సంగం యుగం

## 1.0 లక్ష్యం:

* ఈ పాఠం అధ్యయనం ద్వారా సంగం యుగ రాజకీయ చరిత్రను, సంస్కృతిని, సంగం సమావేశాల గురించి తెలుసుకుంటారు.

## పాఠ్య నిర్మాణ క్రమం:


**1.1 ఉపోద్ఘాతం**

**1.2 కాలం**

**1.3 సంగం సమావేశాలు**

**1.4 రాజకీయ చరిత్ర**

**1.4.1 చోళ సార్వభౌమత్వం**

**1.4.2 చేర సార్వభౌమత్వం**

**1.4.3 పాండ్య సార్వభౌమత్వం**

**1.5 సంగం యుగ విశేషాలు**

**1.5.1 రాజకీయ పరిస్థితులు**

**1.5.3 ఆర్థిక పరిస్థితులు**

**1.5.4 సామాజిక పరిస్థితులు**

**1.5.5 మతం**

**1.5.6 సాహిత్యం**

**1.6 సారాంశము**

**1.7 మాదిరి ప్రశ్నలు**

**1.8 ఉపయుక్త గ్రంథాలు**


## 1.1 ఉపోద్ఘాతము:

తమిళుల చరిత్ర సంగం యుగంతో ప్రారంభమవుతుంది. సంగం అంటే పరిషత్తు, కూడలి లేదా సమావేశం అని అర్థం. దీనిని ప్రాచీనకాలంలో పాండ్య ప్రభువులు మధురైలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులోని వందల కొద్ది కవులు సృష్టించిన సారస్వతమే సంగం వాఙ్మయంగా ప్రసిద్ధికెక్కింది. ఈ వాఙ్మయంలో తమిళ దేశ సంస్కృతి స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. ప్రాచీన తమిళ రాజ్యాలైన చోళ, చేర, పాండ్యులను గురించి ఇందులో విశదీకరించడం జరిగింది.

## 1.2 కాలం:

సంగం యుగకాలం విషయంలో చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. రామచంద్ర దీక్షితార్ క్రీ.పూ. 6వ శతాబ్దం నుంచి 5వ శతాబ్దం మధ్య కాలం అని అభిప్రాయడ్డాడు. ఎన్. సుబ్రమణియన్ క్రీ.పూ. 4వ శతాబ్దం నుంచి 3వ శతాబ్దం వరకు సంగం యుగమని భావించాడు. అయితే ఆచార్య నీలకంఠశాస్త్రి సంగం యుగం క్రీ.శ. మొదటి మూడు శతాబ్దాలకు చెందిందని పేర్కొన్నారు.

## 1.3 సంగం సమావేశాలు:

సంగం మూడు సమావేశాలుగా జరిగింది. మొదటి సంగం సమావేశాన్ని 'మొదల్ సంగం' అన్నారు. ఇది మధురైకి దక్షిణంగా, పాండ్య రాజు మకీర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశం **4,400** సంవత్సరాలు జరిగిందని, అందులో **4,449** మంది పండితులు పాల్గొన్నారని, అయితే వారు వ్రాసిన వాఙ్మయం కాల గర్భంలో కలసి పోయిందని అంటారు. రెండో సంగం 'ఇదైసంగంగా' ప్రసిద్ధి చెందింది. ఇది పాండ్యుల రాజధాని కపోతపురంలో ఏర్పాటయింది. ఈ సమావేశం **3,700** సంవత్సరాలపాటు జరిగిందని, అందులో **3,700** మంది కవులు పాల్గొన్నారని పేర్కొనడం జరిగింది. చివరిదైన కడై సంగం ఆధునిక మధురై నగరంలో నిర్వహించడం జరిగింది. ఇది **1,850** సంవత్సరాలు కొనసాగిందని, అందులో **449** మంది కవులు పాల్గొన్నారని సంగం సాహిత్యం వల్ల తెలుస్తుంది.

అయితే పై మూడు సమావేశాలు జరిగిన కాలాలు, వాటిలో పాల్గొన్న సభ్యుల సంఖ్య నమ్మ శక్యంగా లేవు. అందువల్ల వాటిని చారిత్రక సత్యాలుగా గ్రహించలేం. అయితే, ప్రాచీనకాలంలో తమిళ దేశంలో మూడు గొప్ప సాహిత్య సమావేశాలు జరిగాయని, వాటిలో అనేక మంది కవులు, పండితులు పాల్గొన్నారని, ఆ సమావేశంలో విశేష ప్రజాదరణ పొందిన సాహిత్య సృష్టి జరిగిందని గ్రహించగలం.

## 1.4 రాజకీయ చరిత్ర:

తమిళ దేశంలో త్రై రాజ్యాలైన చేర, చోళ, పాండ్య రాజ్యాలు స్వతంత్రంగా ఉన్నట్లు అశోకుని శిలా శాసనం పేర్కొంటుంది. ఈ రాజ్యాలను గురించిన ప్రస్తావన మెగస్తనీస్ రచనలు, ఖారవేలుని హాతిగుంఫా శాసనంలో కూడా కనిపిస్తుంది. ఆర్కాట్ నుంచి తిరుచునాపల్లి వరకు ఉన్న కావేరి నది డెల్టాతో కూడిందే చోళ రాజ్యం. ఒరయూరు దీని రాజధాని. ఉత్తరాన కొచ్చిన్, దక్షిణాన తిరువాన్కూర్ల మధ్యనున్న ప్రాంతం చేర రాజ్యం. దీని రాజధాని వంజి. మధుర రాజధానిగా పాండ్యులు, పుదుక్కోట నుంచి కన్యాకుమారి వరకు పాలించారు. ఈ మూడు రాజ్యాలు కలసిన ప్రాంతాన్ని ప్రాచీన వాఙ్మయంలో 'తమిళకం' లేదా 'ద్రావిడదేశం' అని వ్యవహరించడం జరిగింది. 'తమిళకం'పై రాజ్యాధిపత్యం కోసం చోళ, చేర, పాండ్య రాజ్యాల మధ్య తరచుగా యుద్ధాలు జరిగేవి.

**1.4.1 చోళ సార్వభౌమత్వం:** సంగం వాఙ్మయాన్ని బట్టి తమిళకం పై మొదట విజయం సాధించి, సార్వభౌమాధికారాన్ని సాధించిన పాలకులు చోళులు. చోళరాజులలో కరికాలచోళుడు సుప్రసిద్ధుడు. కాలు కాలి నల్లబడినందువల్ల కరికాలుడనే (కాలిన కాలు కలవాడు) పేరొచ్చిందని కొందరు, శత్రువుల గజ (కరి) బలానికి కాలుడి (యముడి) వంటి వాడని మరికొందరు భావిస్తారు. ఇతడు పాండ్య, చేర రాజ్యాల పై ఆధిపత్యాన్ని ఏర్పరచి, పుహార్ (కావేరీ పట్టణం) అనే నూతన రాజధాని నగరాన్ని నిర్మించాడు. అంతేగాక ప్రజోపయోగ కార్యక్రమాలెన్నింటినో చేపట్టాడు. అడవులను నరికించి, సేద్య భూములుగా మార్చాడు. అలాగే కావేరి నదికి ఆనకట్టలు నిర్మించి, తంజావూరు పరిసర ప్రాంతాలను సస్య శ్యామలం చేశాడు. కరికాలుడు వైదిక మతాన్ని ఆదరించి, అనేక యాగాలను నిర్వహించాడు. పరిశ్రమలను, విదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహించి, కళలను, సారస్వతాన్ని ఆదరించాడు. ఇతడి అనంతరం చోళ ప్రాభవం నశించి, చేర వంశస్తులు తమిళ రాజ్యానికి సార్వభౌములయ్యారు.

**1.4.2 చేర సార్వభౌమత్వం:** చేర వంశంలో మొదటి పాలకుడు ఉదివాంజెరల్. అతడి కుమారుడు నెడుంజెరల్, నాయకత్వంలో చేరుల విజృంభణ జరిగింది. ఇతడు మలబార్ తీర నౌకా యుద్ధంలో యవనులను, స్థానిక శత్రువులను ఓడించాడు. అంతేగాక హిమాలయాల వరకు రాజ్యాన్ని విస్తరించి 'అధిరాజు' బిరుదాన్ని ధరించాడు. చేర రాజుల్లో సెంగుట్టువాన్ గొప్ప పాలకుడు. ఇతడి సోదరుడైన ఇళంగో అడిగల్ రాసిన 'శిలప్పాధికారం' చేర పాలకుల నౌకాదళాన్ని, వారి విజయాలను వర్ణిస్తుంది. మహా పతివ్రత అయిన పత్తిణిదేవి ఆరాధనను సెంగుట్టువాన్ ప్రవేశపెట్టాడు.

**1.4.3 పాండ్య సార్వభౌమత్వం:** పాండ్యుల మొదటి రాజు ముదుకుడిమి పెరువల్లడి. ఇతడు గొప్ప యుద్ధ వీరుడు, సాహిత్యాభిమాని, శివ భక్తుడు. అనేక గ్రామాలను బ్రాహ్మణులకు దానం ఇచ్చినట్లు వెల్విక్కుడి శాసనం పేర్కొంటుంది. పాండ్యరాజుల్లో అగ్రగణ్యుడు నెడుంజెలియన్. ఇతడి రాజ్యం పై చేర, చోళ, నాయక రాజులు దండెత్తగా, తలైయాలం గానం యుద్ధంలో వారిని ఓడించి, చేర రాజును బంధించాడు. పరిసర ప్రాంతాలను జయించి, తమిళ రాజ్యాన్ని పటిష్టపరచాడు. నెడుంజెలియన్ వైదిక మతాభిమాని. అతడి పోషణలో మధుర కవి, పండితులకు నిలయమయింది.

## 1.5 సంగం యుగ విశేషాలు:

సంగం యుగ విశేషాలను సంగం వాఙ్మయం కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తుంది. ఈ కాలంలో ద్రావిడ దేశంపై ఆర్య సంస్కృతి ప్రభావం అధికమైనట్లు కనిపిస్తుంది. ఆర్య, ద్రావిడ సంస్కృతుల సమన్వయమే సంగం యుగ సంస్కృతి.

**1.5.1 రాజకీయ పరిస్థితులు:** ఆర్యావర్త, దక్షిణాపథాలలోలాగ తమిళకంలో కూడా పటిష్టమైన రాచరిక వ్యవస్థ అమల్లో ఉండేది. రాచరికం వంశ పారంపర్యం. రాజు తరువాత పెద్ద కుమారుడే సింహాసనాన్ని అధిష్టించేవాడు. రాజు సర్వాధికారి అయినప్పటికీ ధర్మబద్ధుడు. అతడు దైవాంశ సంభూతుడనే భావం ప్రజల్లో ఉంది. రాజుకు సలహాలు ఇచ్చేందుకు మంత్రులుండేవారు. రాజులు రాజ దూతలను, గూఢచారులను సైతం నియోగించేవారు. రాజే అత్యున్నత న్యాయాధికారి. రాజధానిలోని సభ లేదా మన్రం ఉన్నత న్యాయస్థానంగా వ్యవహరించేది. గ్రామాలలోని గ్రామసభలు (మన్రం) గ్రామపాలనను సాగించేవి. ఈ గ్రామసభలే, చోళుల కాలం నాటి స్థానిక స్వపరిపాలనకు మార్గదర్శకాలు అయ్యాయి. ఆ రాజ్యాలు నిరంతరం యుద్ధాలలో మునిగితేలేవి. యుద్ధం చేసి రాజ్యాలను గెలుచుకోవడం నాటి రాజుల సహజ ఆచారం. రాజులను ఓడించి, వారి కిరీటాలను మాలగా ధరించి 'అధిరాజు' అని బిరుదు పొందడం ఆచారంగా తెలుస్తుంది. తరచుగా యుద్ధాలు జరుగుతుండడం వల్ల రాజులు చతురంగ బలాలను పోషించేవారు. చేర రాజులు నౌకా దళాన్ని కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. యుద్ధంలో మరణించిన వారు వీర స్వర్గాన్ని అలంకరిస్తారనే నమ్మకం ఉంది. సేనా నాయకులున్నప్పటికి, రాజే స్వయంగా యుద్ధభూమిలో సైన్యాన్ని నడిపేవారని 'కళావతి' కావ్యం తెలుపుతుంది. యుద్ధంలో పరాజితులైన వారు అనేక అవమానాలను ఎదుర్కొనే వారని సంగం వాఙ్మయం పేర్కొంటుంది.

**1.5.2 ఆర్థిక పరిస్థితులు:** సంగం యుగ ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. పాలకులు నీటి వసతి కల్పించి, వ్యవసాయాన్ని ప్రోత్సహించే వారు. భూమి సారవంతమై సస్య శ్యామలంగా ఉండేది. ప్రజలు కష్టించి పని చేసేవారు. వరి, చెఱకు, పప్పు ధాన్యాలు, పండ్లు పండించే వారు. వ్యవసాయం తరవాత చేపలు పట్టడం, వేటాడడం వారి ఇతర ప్రధాన వృత్తులు. నేత పరిశ్రమ, నౌకా పరిశ్రమ, ఆభరణాల పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. మధురై, పుహార్, వంజి, తొండి, ఉరయూర్ ఆనాటి ప్రధాన పట్టణాలు. ఈ యుగంలో స్వదేశీ వ్యాపారంతో పాటు విదేశీ వాణిజ్యం కూడా విస్తృతంగా జరిగేది. తమిళులకు సముద్రం పై ప్రయాణించడం, సముద్రం ద్వారా వ్యాపారాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య.

రోమన్ సామ్రాజ్యంతో దక్షిణ భారతదేశం జరిపిన వ్యాపారాన్ని గురించి 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' గ్రంథం వర్ణిస్తుంది. కావేరి పట్టణం, క్రాంగనూర్ ఆనాటి ప్రధాన రేవు పట్టణాలు. మిరియాలు, అల్లం, యాలకులు, టేకు, నూలు బట్టలు, బియ్యం, ముత్యాలు, దంతాలు, రత్నాలు నాటి ముఖ్య ఎగుమతులు. దిగుమతుల్లో గుఱ్ఱాలు, రాగి, సీసం, గాజు, తగరం చెప్పుకోదగ్గవి. కొయంబత్తూరు, తిరువాన్కూరు, పుదుక్కోట జిల్లాలో అసంఖ్యాకంగా లభించిన రోమన్ బంగారు నాణాలు తమిళకం సాగించిన వాణిజ్యానికి నిదర్శనాలు.

**1.5.3 సామాజిక పరిస్థితులు:** ఈ యుగం నాటికి సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. పురనానూర్ కావ్యం తుడియన్, పాణన్, పరైయన్, కడంబన్ అనే చాతుర్వర్ణాలను పేర్కొంది. సంఘంలో బ్రాహ్మణులకు అత్యంత గౌరవ స్థానం ఇవ్వబడింది. నాటి బ్రాహ్మణులు వేదాధ్యయనపరులు. వారు నిష్ఠ గల జీవితాన్ని గడిపి, ఇతరులకు ఆదర్శ ప్రాయులయ్యారు. స్త్రీకి గౌరవస్థానం ఉంది. స్త్రీలు ఆదర్శ ప్రాయులుగా, పతి వ్రతలుగా ఉన్నత స్థానం సంపాదించుకొన్నారు. అవ్వయ్యార్, నాచెల్లియార్లు కవయిత్రులుగా రాణించారు. ఆర్య సంప్రదాయాల ప్రవేశంతో వివాహ వ్యవస్థ క్లిష్టతరమయింది. వివాహాలు ధర్మశాస్త్రాలనుసారం జరిగేవి. నాటి సంగం వాఙ్మయం ఎనిమిది రకాల వివాహాలను పేర్కొంది. సహపంక్తి భోజనాలు, వితంతు వివాహాలు లేవు. వితంతువులు జీవితం దుర్భరంగా ఉండేది. సతీ సహగమనం అమల్లో ఉంది. నాటి సమాజంలో బానిసలు ఉండేవారని తెలుస్తుంది. ప్రజలకు శకునాలు, జ్యోతిష్యం పై నమ్మకముంది. చెడు జరగకుండా ఉండేందుకు పిల్లలకు తాయెత్తులు కట్టేవారు. దేవుళ్ళు మర్రిచెట్టు పై నివసిస్తారనే నమ్మకంతో, దాన్ని పూజించేవారు. మొత్తం మీద తమిళ సమాజం విందులు, వినోదాలతో ఉల్లాసంగా ఉండేదని సంగం వాఙ్మయం వల్ల తెలుస్తుంది. ఈ కాలంలో సంగీత, నాట్య కళలకు విశేషాదరణ లభించింది. మృదంగం, యాళి, విరళి మొదలైన వాయిద్యాల పేర్లు నాటి వాఙ్మయంలో కనిపిస్తాయి.

**1.5.4 మతం:** సంగం యుగం నాటికి దక్షిణాపథంలో వైదిక మతం స్థిరపడింది. ప్రభువుల ఆదరణ, ప్రోత్సాహాల వల్ల ఆ మతం బలపడింది. తమిళ రాజులు అనేక రకాల యజ్ఞయాగాలను నిర్వహించేవారు. సన్యాసాన్ని స్వీకరించిన వారికి సమాజంలో గౌరవ స్థానముండేది. ప్రకృతి శక్తులతో పాటు శివుడు, మురుగన్ (సుబ్రహ్మణ్యస్వామి), విష్ణువు ఆరాధించబడ్డారు. మురుగన్‌ను ప్రధాన దైవంగా ఆరాధించి, దేవాలయాలను నిర్మించినట్లు సంగం వాఙ్మయం పేర్కొంటుంది. మణిమేఖలై, శిలప్పాధికారాలలో సరస్వతీదేవి, ఇంద్రుడి దేవాలయాల ప్రస్తావన ఉంది. పూహార్‌లో ఇంద్రుడి కుమారుడైన కామన్ దేవాలయం ఉంది. మధురై, పూహార్ వద్ద కామన్, ఇంద్రుడి పేర ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరిగేవి. దిక్పాలకులుగా ఇంద్రుడు, యముడు, వరుణుడు, సోముడు ప్రజల పూజలనందుకొన్నారు. పితృ దేవతలకు పిండం పెట్టే ఆచారముంది. జైన, బౌద్ధ మతాలు కూడా ఆదరించబడి, వైదిక మతంతో సమాన స్థాయిని పొందాయి.

తమిళ సారస్వతానికి జైన, బౌద్ధ మతాచార్యులు అపారమైన కృషి చేశారు. ప్రసిద్ధ నీతి కావ్యమైన 'కురళ్' రచయిత తిరువళ్ళువార్ జైనుడని ప్రతీతి. జీవిక చింతామణి మరొక జైన గ్రంథం. సంగం సాహిత్యానికి మణిపూసలైన మణిమేఖలై, శిలప్పాధికారం బౌద్ధమత గ్రంథాలు.

**1.5.5 సాహిత్యం:** సంగం యుగం తమిళ వాఙ్మయ, సాహిత్యాలకు స్వర్ణ యుగం. సంగం సాహిత్యంలో తొల్కప్పియం, ఎత్తుతోగై, పట్టుపట్టు, శిలప్పాదికారం, మణిమేఖలై, తిరుక్కురళ్ సాటిలేని మేటి గ్రంథాలు. అవి ఈనాటికి తమిళదేశంలో ప్రజాదరణ పొందుతున్నాయి. 'తొల్కాప్పియం' అనే తమిళ వ్యాకరణ గ్రంథాన్ని అగస్త్య మహాముని శిష్యుడైన తొల్పాప్పియార్ రచించాడు. ఈ గ్రంథం నాటి సమాజం, ఆచారాలను గురించిన విలువైన సమాచారాన్నందిస్తుంది. 'తిరుక్కురుళ్' కావ్యాన్ని తిరువళ్ళువార్ వ్రాశాడు. దీనిని తమిళ దేశం బైబిల్‌గా అభివర్ణిస్తారు. ఇది నాటి జీవన విధానాన్ని, నైతిక విలువలను ప్రతిబింబ చేసే ఉత్తమ రచన. దీనిని దేశ, విదేశాలలోని అనేక భాషల్లోకి అనువదించడం జరిగింది.

శిలప్పాదికారం, మణిమేఖలై, జీవక చింతామణి తమిళ ఇతిహాసాలు. ఇందులో శిలప్పాధికారం అతి ప్రాచీనమైంది. ఇళంగో ఆదిగళ్ దీని రచయిత. పుహార్ వర్తకుడైన కోవలన్, అతడి భార్య కణ్ణగిల విషాదాంత ప్రేమ కావ్యం శిలప్పాధికారం. శిలప్పాదికారానికి బౌద్ధ అనుబంధమే 'మణిమేఖలై'. మధురైకి చెందిన సత్తనార్ దీనిని రచించాడు. మరో ఇతిహాసమైన 'జీవక చింతామణి'ని తిరుతక్క దేవార్ సంస్కృతంలో వ్రాశాడు. ఇది గొప్ప వైద్య గ్రంథం. కంబన్ రాసిన తమిళ రామాయణం తమిళ జాతికి అత్యంత ప్రీతిపాత్రమైన కావ్యం.

## 1.6 సారాంశం:

సంగం యుగం తమిళ సంస్కృతిలో తొలి దశను సూచిస్తుంది. క్రీ.శ. తొలి మూడు శతాబ్దాలుగా పరిగణించబడే ఈ కాలంలో ప్రాచీన తమిళ రాజ్యాలైన చోళ, చేర, పాండ్యులను గురించి తమిళ సాహిత్యంలో వివరించడం జరిగింది. త్రై రాజ్యాలైన చోళ,చేర, పాండ్య రాజ్యాలు స్వతంత్ర్యంగా ఉన్నట్లు అశోకుడి శాసనాల ద్వారా తెలుస్తుంది. తమిళకం పై ఆధిపత్యం కోసం ఆ రాజ్యాల మధ్య తరచుగా యుద్ధాలు జరిగేవి.

## 1.7 మాదిరి ప్రశ్నలు:

1. సంగం యుగ సంస్కృతిని తెలియ చేయండి.
2. తమిళకం పై ఆధిపత్యం కోసం చోళ, చేర, పాండ్య రాజ్యాల మధ్య పోరాటాన్ని వివరించండి.

## 1.8 ఉపయుక్త గ్రంథాలు:

1. Gopalachari K. - Early History of the Andhra Country
2. Nilakanta Sastri K.A. - History of South India
3. Sharma R.S. - Aspects of political ideas and institutions in Ancient India

పాఠ్యభాగ రచయిత
డా॥ బాలినేని వాణి

## పాఠం - 2

# శాతవాహనుల రాజకీయ చరిత్ర

## 2.0 లక్ష్యం:

శాతవాహన సామ్రాజ్య స్థాపన, పుట్టుపూర్వోత్తరాలు, ఆ సామ్రాజ్య రాజకీయ చరిత్ర అధ్యయనం చేయడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:


2.1 ఉపోద్ఘాతం
2.2 ఆధారాలు
2.3 శాతవాహనుల పుట్టు-పూర్వోత్తరాలు
2.4 జన్మస్థలం
2.5 రాజకీయ చరిత్ర
2.5.1 శాతవాహనుడు
2.5.2 శ్రీముఖుడు
2.5.3 మొదటి శాతకర్ణి
2.5.4 రెండో శాతకర్ణి
2.5.5 కుంతల శాతకర్ణి
2.5.6 హాలుడు
2.5.7 గౌతమీ పుత్ర శాతకర్ణి
2.5.8 యజ్ఞశ్రీ శాతకర్ణి
2.6 సామ్రాజ్య క్షీణత
2.7 సారాంశం
2.8 మాదిరి ప్రశ్నలు
2.9 ఉపయుక్త గ్రంథాలు


## 2.1 ఉపోద్ఘాతం:

దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యాన్ని స్థాపించిన పాలకులు శాతవాహనులు. నిజానికి దక్కన్‌లో రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక జీవనం శాతవాహనులతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. మౌర్య సామ్రాజ్య పతనానంతరం, ఆ రాజ్య శిథిలాలపై నిర్మించబడి, రమారమి మూడు శతాబ్దాలపాటు కొనసాగి, పరిపాలన, సంస్కృతి, కళా రంగాలలో విశేషమైన కృషి జరిపి, ఉజ్జ్వలంగా సాగిన సామ్రాజ్యం శాతవాహన రాజ్యం.

దక్షిణ భారతదేశ చరిత్ర శాతవాహనులతోనే ప్రారంభమైందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఉత్తరాపథం శక, యవన, పహ్లవుల వంటి విదేశీ దాడులతో సంక్షోభితమవుతున్న తరుణంలో, దక్షిణాపథాన్ని సమైక్యం చేసి,

శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనులు శాతవాహనులు. ఆర్యావర్తం నుంచి దక్షిణ భారతదేశంలోకి విస్తరించి, ఉభయ ప్రాంతాల మధ్య వారధియైన సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, తద్వారా భారతదేశంలో సాంస్కృతికంగా ఏకత్వాన్ని సాధించడంలో చారిత్రకమైన పాత్రను నిర్వహించిన వారు శాతవాహనులని అభిప్రాయపడ్డ ఫణిక్కర్ వాదనలో ఎంతో సత్యం కనిపిస్తుంది.

## 2.2 ఆధారాలు:

శాతవాహనుల చరిత్రను అధ్యయనం చేసేందుకు అనేక ఆధారాలు లభిస్తున్నాయి. ఆ కాలంలో వేయించబడ్డ నానాఘాట్, కన్హేరి, నాసిక్, కార్లే, భాజాలలో లభించిన శాసనాలు; కళింగ ఖారవేలుని హాతిగుంఫా శాసనం, రుద్రదాముని జునాఘడ్ శాసనం నాటి పరిస్థితులను గురించి తెలుసుకోవడానికి ఉపకరిస్తున్నాయి. అలాగే వాఙ్మయాధారాలైన మత్స్య, వాయు, విష్ణు, బ్రహ్మాండ పురాణాలు; గుణాఢ్యుని బృహత్కథ, హాలుని గాథా సప్తశతి, వాత్స్యాయనుని కామసూత్రాలు, మెగస్తనీస్ ఇండికా, పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి, ప్లినీ, టాలమీ రచనలు; శాతవాహనులు ముద్రించిన నాణాలు వారి చరిత్ర అధ్యయనానికి ఉపయోగపడుతున్నాయి. శాతవాహన చరిత్రకు అనేక ఆధారాలు లభ్యమైనప్పటికి, అవి అసమగ్రం గాను, సందిగ్ధం గాను ఉన్నందు వల్ల వారికి సంబంధించిన అనేక విషయాలలో చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 2.3 శాతవాహనుల పుట్టు పూర్వోత్తరాలు:

భారతదేశ ప్రజలలో అతి ప్రాచీనులలో ఆంధ్రులొకరు. వీరిని గురించి మొదటిగా ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో ప్రస్తావించడం జరిగింది. పురాణాలు వీరిని ఆంధ్రులని వర్ణించగా, శాసనాలలో శాతవాహనులని పేర్కొనడం జరిగింది. పురాణాలలో ఆంధ్ర అనే శబ్దం ఉండడంతో వారు శాతవాహనులేనా? అనే అనుమానం కలుగుతుంది. కానీ, పురాణాలు, శాసనాలలో ప్రస్తావించబడ్డ పేర్లు ఒక్కటే కావడంతో వారిని శాతవాహనులుగా భావిస్తున్నారు.

ఆంధ్ర అనేది దేశ నామమై ఉండవచ్చు. జాతిని బట్టి దేశానికి, దేశాన్ని బట్టి జాతికి పేర్లు రావడం చరిత్రలో సాధారణమైన విషయం. ఆంధ్ర అనే శబ్దాన్ని ఐతరేయ బ్రాహ్మణంలో జాతిపరంగానే వాడడం జరిగింది. అందువల్ల ఆంధ్ర జాతి నుంచే ఆంధ్ర దేశానికి ఆ పేరు వచ్చి ఉండవచ్చు.

'శాతవాహన' అనేది వంశ నామం. ఈ పదాన్ని 'సప్తవాహన' అంటే సూర్యునకు పర్యాయ పదంగా కొందరు భావించారు. అందుచే ఈ వంశపు రాజులు సూర్యోపాసకులుగా పరిగణించబడ్డారు. 'శాతవాహన' అంటే వంద (శత) వాహనాలు పొందినవాడని మరికొందరు అభిప్రాయపడ్డారు. 'సాత' అనే యక్షుని వాహనంగా గలవాడగుటచే, శాతవాహనుడయ్యెనని 'కథాసరిత్సాగరం' కథనం. అయితే, నాణాల వల్ల శాతవాహనుడనే రాజు ఒకడున్నాడని తెలుస్తుంది. ఈ ప్రాచీన ప్రభువు పేరు వల్ల ఈ వంశానికి శాతవాహన వంశమనే పేరు సంక్రమించి ఉండవచ్చు.

## 2.4 జన్మ స్థలం:

శాతవాహనుల జన్మస్థలం గురించి కూడా అనేక వాదనలున్నాయి. వారి జన్మస్థలం బళ్ళారి ప్రాంతమని కొందరు, విదర్భ దేశమని మరికొందరు, ఆంధ్రదేశమని ఇంకొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. అయితే పై మూడింటిలో చివరి అభిప్రాయాన్నే ఎక్కువ మంది చరిత్రకారులు ఆమోదించడం జరిగింది.

శాతవాహనులు బ్రాహ్మణ నాగజాతికి చెందినవారని దత్తాంశ పుత్తాలికలో చెప్పడమైంది. కాని నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి ఏక బ్రాహ్మణుడని వర్ణించడమైంది. అందువల్ల శాతవాహనులు బ్రాహ్మణులని భావిస్తారు.

శాతవాహనుల పాలనాకాలాన్ని గురించి కూడా అనేక సిద్ధాంతాలున్నాయి. ఎక్కువమంది ఆమోదించిన సిద్ధాంతం ప్రకారం, వారు క్రీ.పూ. 3వ శతాబ్దం నుంచి క్రీ.శ. 3వ శతాబ్దం వరకు పాలించారు.

## 2.5 రాజకీయ చరిత్ర:

పురాణాలు 30 మంది శాతవాహన రాజులు 450 సంవత్సరాలు పరిపాలించినట్లు తెలియచేస్తున్నాయి. వారిలో శ్రీముఖుడి నుంచి గౌతమీపుత్ర శాతకర్ణి వరకు తొలి శాతవాహనులని, తరవాత పరిపాలించిన పాలకులను మలి శాతవాహనులని విభజింపవచ్చు.

**2.5.1 శాతవాహనుడు:** పురాణాలు శాతవాహనుల మూల పురుషుడిగా శ్రీముఖుడిని పేర్కొంటున్నాయి. కానీ జైన సాహిత్యం, కథాసరిత్సాగరం శాతవాహనుల మూల పురుషుడు శాతవాహనుడని విశదీకరిస్తున్నాయి. అయితే ఇటీవల కొండాపూర్‌లో జరిగిన త్రవ్వకాలలో శాతవాహన అనే పేరుతో నాణెం లభ్యమయ్యింది. దాంతో జైన సాహిత్యం, కథా సరిత్సాగరం పేర్కొన్న అంశాలు నిజమని ఋజువయ్యాయి. శాతవాహనుడు బహుశా అశోక చక్రవర్తి సామంతుడిగా పాలించి ఉండవచ్చు. అతడు స్వతంత్ర పాలకుడు కానందు వల్ల పురాణాలు అతడిని రాజ్యస్థాపకుడిగా పేర్కొని ఉండకపోవచ్చునని పండితుల అభిప్రాయం.

**2.5.2 శ్రీముఖుడు (క్రీ.పూ. 235-213):** ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యానికి పునాది వేసిన వాడు శ్రీముఖుడు. మౌర్య చక్రవర్తి అశోకుడి మరణానంతరం అతడు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నాడు. సిముఖుడనే రాజు కాణ్వాయన సుశర్మను వధించి, మగధనాక్రమించాడని వాయు పురాణం పేర్కొంది. శ్రీముఖుడు పరిసర రాజ్యాలను జయించి, ప్రతిష్ఠాన పురాన్ని రాజధానిగా చేసుకొన్నాడు. రథికుల రాకుమారి నాగానికను తన కుమారుడు మొదటి శాతకర్ణితో వివాహం జరిపించి, రథికుల సహకారాన్ని పొంది, భోజక, పీఠినిక, పుళిందులను ఓడించాడు. అనంతరం అతడి సోదరుడు కృష్ణుడు (కన్హ) రాజై (క్రీ.పూ. 212-195) నాసిక్ వరకు జయించి, తమ సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు.

**2.5.3 మొదటి శాతకర్ణి (క్రీ.పూ. 194-184):** కృష్ణుడి అనంతరం మొదటి శాతకర్ణి రాజ్యానికి వచ్చి శాతవాహన రాజ్యాన్ని 10 సంవత్సరాలు పరిపాలించాడు. శాతకర్ణి తొలి శాతవాహనులలో గొప్ప పాలకుడు. ఇతడిని అప్రతిహత వీరుడని, దక్షిణాపథపతి అని నానాఘాట్ శాసనం వర్ణిస్తుంది. శాతకర్ణి పుష్యమిత్ర శుంగుడు, కళింగ ఖారవేలుడికి సమకాలికుడు. ఖారవేలుడు తన హాతిగుంఫా శాసనంలో శాతకర్ణిని లెక్కచేయక, అతడి రాజ్యంగుండా సైన్యాన్ని నడిపి మూషిక నగరాన్ని, పిథుండ నగరాన్ని ధ్వంసం చేసినట్లు చెప్పుకున్నాడు. శాతకర్ణి వైదిక మతాభిమాని. రెండు అశ్వమేథ యాగాలను, ఒక రాజసూయ యాగాన్ని నిర్వహించి, 'దక్షిణా పథపతి'గా కీర్తి పొందాడు. మొదటి శాతకర్ణి మరణానంతరం అతడి కుమారుడు బాలుడైనందు వల్ల భార్య నాగానిక రాజ్యపాలనా భారాన్ని వహించింది. ఈ సమయంలోనే శాతవాహన రాజ్యం శకుల దండయాత్రలకు గురయింది.

**2.5.4 రెండో శాతకర్ణి:** రెండో శాతకర్ణి రాజై 56 సంవత్సరాలు రాజ్యం చేశాడు. ఇతడు శకులనోడించి, కళింగ, మగధలను జయించినట్లు తెలుస్తుంది.

**2.5.5 కుంతల శాతకర్ణి:** కుంతల శాతకర్ణి మాళ్వ, మహారాష్ట్ర ప్రాంతాలను స్వాధీనం చేసుకొన్నాడు. అతడే సుశర్మను వధించి, మగధనాక్రమించాడని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడగా, మరి కొందరు పులోమావి ఆ ఘన కార్యాన్ని సాధించాడని భావించారు.

**2.5.6 హాలుడు:** శాతవాహన రాజులలో 17వ చక్రవర్తి అయిన హాలుడి కాలంలో సారస్వత వికాసం జరిగింది. హాలుడి పాలనానంతరం శకుల దండయాత్రల కారణంగా, శాతవాహన సామ్రాజ్యం క్షీణించసాగింది.

**2.5.7 గౌతమీ పుత్ర శాతకర్ణి (క్రీ.శ. 78-102):** శాతవాహన పాలకులలోనే గాక దక్షిణ భారతదేశ చక్రవర్తులలో కూడా అగ్రగణ్యుడు గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతడు శాతవాహన పాలకులలో 23వ రాజు. 24 సంవత్సరాలు రాజ్యం చేశాడు. గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనం, అతడి విజయాలను వివరిస్తుంది. శాతకర్ణి సింహాసనాన్ని అధిష్టించే నాటికి శాతవాహన రాజ్యం ప్రతిష్ఠాన పురానికి తూర్పున ఆంధ్ర ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. అనేక దిగ్విజయ యాత్రలను నిర్వహించి, ఆ రాజ్యాన్ని సువిశాల సామ్రాజ్యంగా రూపొందించాడు. శక, యవన, పహ్లవ, క్షహరాట వంశాన్ని నిరవశేషం చేశాడు. తన 18వ రాజ్య సంవత్సరంలో క్షాత్రపుల పై దండెత్తి, నహపాణుని వధించి, అతడి నాణాలను తన పేర పునర్ముద్రించినట్లు జోగెల్ తంబి నాణాల ద్వారా తెలుస్తుంది. పర్యవసానంగా ములక, అస్మక, అసిక, విదర్భ, అనూప, అపరాంత, కుకుర, అవంతి, ఉజ్జయిని ప్రాంతాలు శాతకర్ణి అధీనంలోకి వచ్చాయి. దాంతో గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యం ఉత్తరాన రాజస్థానం నుంచి దక్షిణాన కర్ణాటకం లోని వైజయంతి, తమిళనాడు లోని కడలూరు వరకు విస్తరించింది. అతడికి త్రిసముద్రతోయపీత వాహన, క్షత్రియ దర్పయాన మర్థన, ఆగమ నిలయ, ఏక బ్రాహ్మణ అనే బిరుదులున్నట్లు నాసిక్ ప్రశస్తి పేర్కొంటుంది.

**2.5.6 యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ.శ. 174-203):** కడపటి శాతవాహన చక్రవర్తులలో గొప్పపాలకుడు యజ్ఞశ్రీ శాతకర్ణి. ఇతడు క్షీణిస్తున్న శాతవాహన రాజ్యాన్ని పునరుద్దరించాడు. మహారాష్ట్ర, మధ్య భారత్ నుంచి శకులను పారదోలాడు. ఇతడి నాణాల పై ఓడ ముద్రింపబడి ఉండడంతో సముద్రాంతర దేశాలతో వర్తక వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందాయని భావించవచ్చు. పటిష్టమైన నౌకాదళాన్ని నిర్మించి, 'సముద్రాధిపతి' అనే బిరుదు పొందాడు. ఆచార్య నాగార్జునుడు ఇతడి సమకాలికుడు.

## 2.6 సామ్రాజ్యం క్షీణత:

యజ్ఞశ్రీ తరవాత బలహీనులైన రాజుల పాలనలో ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యం క్షీణించింది. కడపటి పాలకుడైన మూడో పులోమావి మరణానంతరం శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిన్నమై, తూర్పు ప్రాంతం ఇక్ష్వాకులు, ఆగ్నేయ ప్రాంతం పల్లవులు, నైరుతి ప్రాంతం చుటు వంశీయులు, పశ్చిమోత్తర ప్రాంతం అభీరుల పరమయింది.

## 2.7 సారాంశము:

దక్షిణాపథంలో మొట్టమొదట సామ్రాజ్య స్థాపకులు శాతవాహనులు. మౌర్య సామ్రాజ్య పతనానంతరం దాదాపు మూడు శతాబ్దాలకు పైగా దక్కన్‌ను పరిపాలించి రాజకీయ సమైక్యతకు పాటుపడిన పాలకులు శాతవాహనులు. ఉత్తరాపథం శక, యవన, పహ్లవుల వంటి విదేశీదాడులతో సంక్షోభతను ఎదుర్కొన్న సమయంలో దక్షిణాపథాన్ని సమైక్యం చేసి, శాంతిభద్రతలను కాపాడిన ఘనత శాతవాహనులది. శాతవాహన పాలకులలో అందరి కంటే గొప్పవాడు గౌతమీ పుత్ర శాతకర్ణి.

## 2.8 మాదిరి ప్రశ్నలు:

1. శాతవాహనుల రాజకీయ చరిత్రను పేర్కొనండి.
2. శాతవాహనుల పుట్టుపూర్వోత్తరాల గురించి నీకేమి తెలియును?
3. గౌతమీ పుత్ర శాతకర్ణి గొప్పతనాన్ని అంచనా వేయండి.

## 1.7 ఉపయుక్త గ్రంథాలు:


1. Altakar A.S. - State and Government in Ancient India
2. Basham A.L. - The Wonder that was India
3. Gopalachari K - Early History of Andhra Country
4. Mukherji R.K. - Chandra Gupta Mourya and His Times
5. Thapar Romilla - Asoka and the Decline of Mouryas
6. Yazdani - G (Ed.) - Early History of Deccan



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

## పాఠం - 3

# శాతవాహనులు - పరిపాలన - సంస్కృతి

### 3.0 లక్ష్యం:

మౌర్య సామ్రాజ్య పతనానంతరం దక్కన్‌లో అతి పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించిన వారు శాతవాహనులు. దాదాపుగా మూడు దశాబ్దాలకు పైగా పాలించిన శాతవాహనుల పరిపాలనా విధానం, సంస్కృతి గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### పాఠ్య నిర్మాణ క్రమం:


**3.1 ఉపోద్ఘాతం**

**3.2 పరిపాలన**

**3.2.1 రాజు - మంత్రి మండలి**

**3.2.2 మంత్రి మండలి**

**3.2.3 పరిపాలనా వికేంద్రీకరణ**

**3.2.4 గ్రామం**

**3.2.5 నిగమ సభలు**

**3.2.6 భూమి శిస్తు**

**3.2.7 సైనిక బలం**

**3.3 సామాజిక వ్యవస్థ**

**3.3.1 కుటుంబాలు**

**3.3.2 స్త్రీ స్థానం**

**3.3.3 ఆభరణాలు - అలంకరణ**

**3.4 ఆర్థిక పరిస్థితులు**

**3.4.1 వ్యవసాయం**

**3.4.2 వృత్తులు**

**3.4.3 శ్రేణులు**

**3.4.4 వాణిజ్యం**

**3.5 మతం**

**3.5.1 వైదిక మతం**

**3.5.2 బౌద్ధ మతం**

**3.5.3 జైనం**

**3.6 భాష, సారస్వతం**

**3.6.1 ప్రాకృత భాష**

**3.6.2 సంస్కృత భాష**

**3.6.3 దేశీ భాష**

**3.7 వాస్తు శిల్పం**

3.7.1 స్థూపం
3.7.2 చైత్యం
3.7.3 విహారం
3.7.4 అమరావతి శైలి
3.8 చిత్ర లేఖనం
3.9 సారాంశము
3.10 మాదిరి ప్రశ్నలు
3.11 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 ఉపోద్ఘాతం:

సుస్పష్టమైన దక్షిణ భారతదేశ చరిత్ర ఆంధ్ర శాతవాహనులతోనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. దక్షిణాపథానికి రాజకీయ ఐక్యత సాధించి, విదేశీ శకుల దండయాత్రల నుంచి రక్షించి, శాంతి భద్రతలను చేకూర్చడమేకాక, కె.ఎం. ఫణిక్కర్ చెప్పినట్లు "ఆర్యావర్త ద్రావిడ దేశాల మధ్య సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, ఉత్తర దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక సమన్వయం సాధించడంలో శాతవాహనులు చారిత్రాత్మకమైన పాత్రను నిర్వహించారు''.




శాతవాహన సామ్రాజ్యం

## 3.2 పరిపాలన:

శాతవాహనులు గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించడమే గాక, అందులో పటిష్ఠమైన పాలనా వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. వారి పాలనా విధానం మౌర్యుల అడుగు జాడలలో నడచి, పల్లవులు మొదలుగా గల తరవాతి రాజ వంశాలకు మార్గదర్శకమయింది. ధర్మ శాస్త్రాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం వారికి మార్గదర్శకాలయ్యాయి.

**3.2.1 రాజు:** రాజు దైవాంశ సంభూతుడనే భావం శాతవాహనుల కాలంలోనే ప్రారంభమైనట్లు తెలుస్తుంది. రాజు సర్వాధికారి. అయినప్పటికీ నిరంకుశుడు కాదు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలించారు. రాచరికం వారసత్వంగా సంక్రమించేది. యువరాజుగా ఉన్నపుడే పరిపాలనకు అవసరమైన విద్యలలో శిక్షణనిచ్చేవారు.

**3.2.2 మంత్రి మండలి:** పాలనలో సహాయపడేందుకు మంత్రి మండలి ఉండేది. వారి సలహాలను రాజు పాటించేవాడు. మంత్రులతో పాటు భాండాగారిక, హైరణిక, ప్రతీహార, లేఖక, నిబంధనాకార వంటి పేర్లుగల ఉద్యోగులుండేవారు. వీరికి జీతాలు ధనరూపంలోనే చెల్లించేవారు.

**3.2.3 పరిపాలనా వికేంద్రీకరణ:** పరిపాలనా సౌలభ్యం కోసం, రాజ్యాన్ని సామంత రాజ్యాలుగా విభజించారు. వాటి పాలకులను రాజు, మహారథి, మహాభోజ అని పిలిచేవారు. సామంత రాజ్యాలను జన పదాలనేవారు. జన పదాలను ఆహార్యాలుగా విభజించారు. గోవర్థనాహార, మమలాహార, సోపారాహార, కోడూరాహారాలనే పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి. ఆహార్యానికి అధిపతి అమాత్యుడు.

**3.2.4 గ్రామం:** చిట్టచివరి పాలనాంశం గ్రామం. గ్రామణి గ్రామానికి పెద్ద. గ్రామ పాలనలో గ్రామసభలు సలహాలిచ్చేవి.

**3.2.5 నిగమ సభలు:** భట్టిప్రోలు శాసనంలో కనిపించే 'నిగమసభ' వల్ల నగరాలలో, మౌర్య సామ్రాజ్యంలో లాగా పౌర సభలు పరిపాలన నిర్వహించినట్లు తెలుస్తుంది. ఈ నిగమ సభలు నాటి ప్రధాన పట్టణాలైన పైఠాన్, ధాన్యకటకం, బరుకచ్చం, కళ్యాణి, సోపార వంటి నగరాలను పాలించేవి. ఇందలి సభ్యులను 'గహపతులు' అనేవారు. నాటి నగరాలకు రక్షణ కోటలుండేవి. ఆంధ్రదేశంలో 30 రక్షణ దుర్గాలున్నట్లు మెగస్తనీస్ ''ఇండికా'లో రాశాడు.

**3.2.6 భూమి శిస్తు:** ప్రభుత్వానికి ప్రధాన ఆదాయం భూమి శిస్తు. దేశంలోని అన్ని పంట పొలాలకు రాజు యజమాని కాదు. రాజకంఖేట (రాజు భూమి) అన్నమాటను బట్టి రాజు కొంత పొలానికి మాత్రమే యజమాని అని తెలుస్తుంది. భూమిని దానం చేయాల్సివచ్చినపుడు రాజు భూమిని కొని, దానం చేసిన సందర్భాలు శాసనాలలో కనిపిస్తాయి. పంటలో రాజు భాగాన్ని 'భోగ' అని పిలిచారు. భూమి పన్నుతోపాటు రహదారి సుంకాలు, వృత్తి పన్నులు వసూలు చేయబడ్డాయి.

**3.2.7 సైనిక బలం:** చక్రవర్తులు సాగించిన జైత్ర యాత్రల వల్ల శాతవాహనులకు పటిష్టమైన సైనిక బలం ఉన్నట్లు తెలుస్తుంది. హాతిగుంఫా శాసనం చతురంగ బలాలను గురించి ప్రస్తావించింది. అమరావతి శిల్పాన్ని బట్టి నాటి సైనిక వ్యూహ రచనను ఊహించవచ్చు. మహా సేనాధిపతి సైన్యాధ్యక్షుడైనప్పటికీ, తరచుగా రాజులే స్వయంగా యుద్ధ భూమికి సైన్యాలను నడిపేవారు. శాసనాలలో కటక, స్కందావార పదాలు కనిపిస్తాయి. స్కందావారమంటే తాత్కాలిక శిబిరం కాగా; కటకమంటే సైన్యాగారం. యుద్ధ సమయాల్లో సాధారణంగా పౌరజనాన్ని హింసించేవారు కాదు. కాని, కొన్ని సమయాలలో విజేతలు క్రూరంగా ప్రవర్తించిన సందర్భాలు లేకపోలేదు. కళింగ ఖారవేలుడు పిథుండ నగరాన్ని గాడిదలతో దున్నించి, ధ్వంసం చేయగా, గౌతమీపుత్ర శాతకర్ణిని 'క్షహరాట వంశ నిరవశేషకర' (క్షహరాట వంశాన్ని నిర్మూలించినవాడు) అని గర్వంగా వర్ణించడం జరిగింది.

## 3.3 సామాజికవ్యవస్థ:

ఈ కాలం నాటికి సమాజంలో వర్ణ వ్యవస్థ స్థిరపడినట్లు కనిపించదు. గౌతమీపుత్ర శాతకర్ణి వర్ణ సాంకర్యాన్ని నిలిపానని చెప్పుకొన్నప్పటికీ, విదేశీయులైన శక, యవన, పహ్లావుల రాక వల్ల, జైన, బౌద్ధ మతాల ప్రభావం కారణంగా, వర్ణ ధర్మాలు సరళతరమైనట్లు కనిపిస్తుంది. శక, యవనులు జైన, బౌద్ధ మతాలను స్వీకరించి, భారతీయ పేర్లను ధరించి, ఆచార వ్యవహారాల ద్వారా భారతీయులయ్యారు. వారిని క్షత్రియులుగా పరిగణించి, శాతవాహనులు వారితో వివాహ సంబంధాల నేర్పరచుకొన్నారు.

బ్రాహ్మణులు వైదిక విద్యలనభ్యసించి, వైదిక కర్మలు చేసేవారు. వైశ్యులు వర్తక, వాణిజ్యాలు కొనసాగించారు. శూద్ర వర్ణంలో హాలక, గోలకాదులైన ఉప వర్గా లేర్పడ్డాయి. వర్ణవ్యవస్థ రూపొందినప్పటికీ వృత్తి మార్పిడి జరిగింది. బ్రాహ్మణులు, వైశ్యులు ఉద్యోగాలు నిర్వహించడం, క్షత్రియులు వాణిజ్యాన్ని కొనసాగించడం జరిగింది.

**3.3.1 కుటుంబాలు:** కుటుంబాలు సమిష్ఠిగా ఉండేవి. కుటుంబ సభ్యులందరూ కలసి దానాలు చేసేవారు. నాటి కుటుంబం పితృస్వామ్య విధానంపై ఆధారపడి ఉంది.

**3.3.2 స్త్రీ స్థానం:** స్త్రీలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉంది. నాగానిక, గౌతమీ బాలశ్రీ వంటి స్త్రీలు రాజ్య వ్యవహారాలను నిర్వహించడం జరిగింది. స్త్రీలకు సొంత ఆస్తి ఉండేది. వారు స్వయంగా దాన ధర్మాలు చేపట్టినట్లు ఆధారాలున్నాయి. స్త్రీలు విద్యావంతులై చర్చలు, సభలలో పాల్గొనేవారు. గాథా సప్తశతిలోని అనేక కథలను స్త్రీలే రచించారు. రాజుల్లో బహు భార్యాత్వం ఉండేది. మాతృ సంజ్ఞల ధారణకు అది ఒక కారణంగా భావించవచ్చు. వివాహం పవిత్రంగా భావించబడింది. వితంతు వివాహాలు లేవు. వితంతువులు నియమబద్ధమైన, పవిత్రజీవనం గడిపేవారు.

**3.3.3 ఆభరణాలు - అలంకరణ:** స్త్రీ పురుషులు ఉభయులు తక్కువ దస్తులు - ఎక్కువ ఆభరణాలు ధరించేవారు. అలంకరణ పట్ల వారికి ఆసక్తి ఎక్కువ. వారు కేశాలంకరణకు, సౌందర్య పోషణకు అధిక ప్రాధాన్యాన్నిచ్చేవారు. నృత్య, సంగీతాలు వారి వినోదాలు. ఈ యుగంనాటి స్త్రీలు తమ భర్త పదవుల పేర్లను తమ పేర్లతో కలిపి పెట్టుకొనేవారు. మహాసేనాపత్ని, మహాభోజకి, మహారథిని వంటి పేర్లు శాసనాల్లో కనిపిస్తాయి. నాటి గ్రామ జీవనం నిరాడంబరంగాను, నగర జీవనం సుసంపన్నంగాను ఉండేది. మొత్తం మీద ప్రజలు ఉల్లాసకర జీవనం గడిపినట్లు హాలుని గాథా సప్తశతి వివరిస్తుంది.

## 3.4 ఆర్థిక పరిస్థితులు:

శాతవాహనయుగంలో ఆంధ్ర దేశంతో సహా దక్షిణాపథం యావత్తూ సిరిసంపదలతో తులతూగింది. దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లోను; దేశీయ, విదేశీయ వ్యాపారాలలోను గణనీయమైన ప్రగతిని సాధించింది.

**3.4.1 వ్యవసాయం:** నాటి ఆర్థికవ్యవస్థకు మూలాధారం వ్యవసాయం. భూమిశిస్తు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం. దీంతోపాటు వృత్తిపన్నులు, రహదారి సుంకాలు, రేవులపై సుంకాలను వసూలు చేసేవారు. నదీ తీరాలలో డెల్టా భూములలో పంటలెక్కువగా పండేవి. వరి, చెరకు, జొన్న, జనుము, నువ్వు పంటలను గురించిన ప్రస్తావన గాథా సప్తశతిలో కనిపిస్తుంది. పండిన పంటలో ఆరో వంతు ప్రభుత్వానికి శిస్తుగా చెల్లించేవారు. వ్యవసాయ పనులకు ఎద్దులను, గాడిదలను ఉపయోగించేవారు. పంట పొలాలలో స్త్రీ, పురుషులిద్దరు కలసి పనిచేసేవారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ పట్ల కూడా ప్రజలు శ్రద్ధ వహించేవారు.

**3.4.2 వృత్తులు:** సమకాలీన శాసనాలు అనేక చేతివృత్తులవారిని ప్రస్తావించాయి. వారిలో కోలిక (చేనేత వృత్తి, Weavers), కులారిక (కుమ్మరి potters), తిలపిసక (నూనెను తయారుచేసేవారు (oil dressers), కమర (కంసాలి, Iron workers), సువర్ణకార (స్వర్ణకారులు, Goldsmiths), వధిక (వడ్రంగి, Carpenters), బదయంత్రిక

(నీటి యంత్ర కార్మికులు. Working of water machienes) ముఖ్యులు. వీటివల్ల దేశంలో ఆయా పరిశ్రమలు విరివిగా సాగినట్లు తెలుస్తుంది.

**3.4.3 శ్రేణులు:** ప్రతి పరిశ్రమకు చెందిన పని వారందరూ శ్రేణులుగా ఏర్పడ్డారు. శ్రేణి నాయకుడు శ్రేష్ఠి. అతడి కార్యస్థానం నిగమసభ. ఈ శ్రేణులు సుసంఘటితాలై నేటి బ్యాంకుల లాగా పనిచేసేవి. ఇవి ధనాన్ని నిల్వ ఉంచి, దానిపై 12 శాతం వరకు వడ్డీ చెల్లించేవి. అంతేగాక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను సైతం అవి నిర్వహించేవి. గోవర్ధన పట్టణంలోని కులికశ్రేణి, రుషభదత్తుడు చెల్లించిన 2000 కార్షాపణాలపై వచ్చే వడ్డీతో బౌద్ధ సన్యాసులకు ప్రతి సంవత్సరం వస్త్ర దానం చేసేదని నాసిక్ శాసనం పేర్కొంది.

**3.4.4 వాణిజ్యం:** శాతవాహన యుగంలో దక్షిణాపథంలో దేశీయ, విదేశీ వాణిజ్యం విరివిగా సాగినట్లు ప్లినీ, స్ట్రాబో రచనలవల్ల తెలుస్తుంది. ప్రతిష్ఠానపురం, తగర, జున్నార్, నాసిక్, గోవర్ధన, వైజయంతి, ధాన్యకటకం, కోడూర, విజయపురి నాటి ప్రముఖ వర్తక కేంద్రాలు. వీటిని రేవు పట్టణాలతో కలుపుతూ రహదారులుండేవి. ఎడ్లబండి నాటి ముఖ్య ప్రయాణ సాధనం. వర్తకులు బిడారులుగా (గుంపులుగా) ఏర్పడి ప్రయాణం సాగించేవారు. నదులు సైతం రవాణాకు ఉపయోగపడేవి. నాటి వాణిజ్యాన్ని, నౌకాశ్రయాలను గ్రీకు గ్రంథం 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ' వర్ణిస్తుంది. పశ్చిమతీరంలో బరుకచ్ఛం, సోపార, కళ్యాణి; తూర్పు తీరంలో కోడూర, ఘంటసాల, మైసోలియా ప్రధాన రేవు పట్టణాలు. సారాయి, మణులు, వజ్రాలు, వెండి, బంగారం, నాట్యకత్తెలు దిగుమతులు కాగా, దంతపు సామాన్లు, పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు ఆనాటి ముఖ్య ఎగుమతులు.

రోమ్ మార్కెట్లలో దక్షిణ భారతదేశ వస్తువులకు మంచి గిరాకి ఉండేది. విదేశీ వ్యాపారం ద్వారా దక్షిణాపథం ఆర్జించిన లాభాలకు పుదుచ్చేరి, అరికమేడు, ధాన్యకటకం, కొండాపూర్, నాగార్జునకొండలలో లభించిన రోమన్ నాణాలే నిదర్శనం. ఈ వాణిజ్యం ఫలితంగా వర్తకులు విదేశాలలో వలసలు స్థాపించి, భారతీయ సంస్కృతి వ్యాప్తికి కృషి చేయడం జరిగింది.

## 3.5 మతం:

శాతవాహనులు విజృంభించే నాటికి ఉత్తరాది మతాలైన వైదిక, జైన, బౌద్ధాలు దక్షిణాది మతాలుగా స్థిరపడ్డాయి. ఈ మతాలు స్థానిక ప్రజల విశ్వాసాలు, ఆచారాలతో సమన్వయం పొంది, పరస్పర సహనంతో పురోగమించాయి.

**3.5.1 వైదిక మతం:** తొలి శాతవాహన పాలకులు వైదిక మతస్థులై, వైదిక మతోద్ధరణకు కారకులయ్యారు. రెండో శాతకర్ణి అశ్వమేధ-రాజసూయాది వైదిక క్రతువులు నిర్వహించి, వేలకొలది గోవులను, కార్షాపణాలను బ్రాహ్మణులకు దానమిచ్చి తృప్తిపరచినట్లు నానాఘాట్ శాసనం పేర్కొంటుంది. గౌతమీపుత్ర శాతకర్ణి వర్ణ ధర్మాన్ని కాపాడి, బ్రాహ్మణులను సంరక్షించి ఆగమ నిలయ, ఏక బ్రాహ్మణ బిరుదులను పొందాడు. రాజులు ధరించిన యజ్ఞశ్రీ వంటి పేర్లు కూడా వారి వైదిక మతాభిమానాన్ని సూచిస్తాయి. విదేశీయులైన శకులు, యవనులు వైదిక ధర్మాలను అనుసరించి, భారతీయ సమాజంలో కలసిపోయారు. శాసనాలలో కనిపిస్తున్న ఇంద్ర, సంకర్షణ, వాసుదేవ, చంద్ర, సూర్య, యమ, వరుణ దేవతల ప్రార్థనలు, మతం వైదికం నుంచి పౌరాణికానికి మార్పు చెందడాన్ని సూచిస్తాయి. శైవ, వైష్ణవ మతాలు ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయి. ఈ మతాలకు భక్తి, దాన ధర్మాలు, వర్ణవ్యవస్థ, వ్రత తీర్థాటనలు ముఖ్య లక్షణాలు. పురాణాలు వీటికి ప్రామాణికాలయ్యాయి. శాతవాహనుల కాలంలోనే పౌరాణిక వాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది.

**3.5.2 బౌద్ధ మతం:** శాతవాహన పాలకులు వైదిక మతాభిమానులైనప్పటికి, పరమత సహనం ప్రదర్శించినందువల్ల బౌద్ధ మతం మహోజ్వల దశను అనుభవించింది. వాస్తవానికి ఈ కాలంలో బౌద్ధ మత ప్రజా ఉద్యమంగా సాగింది. వర్తకులు, పాటక జనం, స్త్రీ జనం బౌద్ధ మతాన్ని ఆదరించి, పోషించడం జరిగింది. వారి ఆదరణ

వల్ల చైత్యాలు, స్థూపాలు, విహారాలు భట్టిప్రోలు, అమరావతి, నాగార్జున కొండ, జగ్గయ్యపేట, నాసిక్, కార్లే, బేడ్సా, అజంతాలలో నిర్మించబడ్డాయి.

యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో ఆచార్య నాగార్జునుడు శ్రీ పర్వతంలో ఉంటూ మహాయాన బౌద్ధ మతాన్ని రూపొందించి, ప్రచారం చేసినట్లు చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు ఆంధ్ర దేశంలోని వేదని అనే గ్రామంలో జన్మించాడు. మాధ్యమిక వాదాన్ని ప్రవేశపెట్టాడు. ప్రజ్ఞాపారమిత శాస్త్రం, రసరత్నాకరం, ఆరోగ్య మంజరి, సుహృల్లేఖ ఇతడి రచనలు. నాగార్జునుడి శూన్యవాదం, శంకరాచార్యుడి మాయా వాదానికి ప్రాతిపదిక అని తత్వవేత్తలు భావిస్తారు.

**3.5.3 జైనం:** బౌద్ధంతో పాటు జైన మతం కూడా శాతవాహనుల కాలంలో అభివృద్ధి చెందింది. నాటి జైన మతాచార్యులలో ప్రముఖుడైన కొండ కుందాచార్యుడు రచించిన 'సమయసార' శ్వేతాంబర, దిగంబర శాఖల వారందరికీ ఆదరణీయమయింది.

## 3.6 భాష, సారస్వతం:

ఆంధ్రశాతవాహనులు భాష, సారస్వతాలకు ఎనలేని సేవలనందించారు.

**3.6.1 ప్రాకృత భాష:** వీరు ప్రాకృత భాషను రాజ భాషగా కొనసాగించారు. నాటి శాసనాలన్నీ ప్రాకృత భాషలోను, బ్రాహ్మీలిపిలోను లిఖించబడ్డాయి. బౌద్ధమత గ్రంథాలు కూడా చాలా వరకు ప్రాకృత భాషలోనే వ్రాయబడ్డాయి. నిజానికి ప్రాకృత భాషా చరిత్రలో శాతవాహన యుగం 'స్వర్ణ యుగం' అని చెప్పవచ్చు. హాలుడు స్వయంగా కవి. అతడికి 'కవివత్సలుడు' అనే బిరుదు ఉంది. హాలుడి ఆస్థానంలో అనేకమంది కవులు-కవయిత్రులు ఉన్నట్లు అతడు సంకలనం చేసిన 'గాథా సప్తశతి' వల్ల తెలుస్తుంది. గాథా సప్తశతి వల్ల నాటి ఆంధ్రులు ఎంతటి శృంగార ప్రియులో తెలుస్తుంది. అమాయక గ్రామీణ జీవితం, ప్రకృతి తోడి ప్రజల సాన్నిహిత్యం ఇందులో ప్రతిబింబిస్తాయి. 'బృహత్కథ'ను రాసిన గుణాఢ్యుడు కూడా ఈ కాలానికి చెందినవాడే. బృహత్కథ రామాయణంతో సమానమైన కావ్యమని విమర్శకుల అభిప్రాయం. బృహత్కథలో అధికభాగం నష్టం కాగా, మిగిలిన ఒక్క 'లంబకం' సంస్కృత 'కథా సరిత్సాగరానికి' మాతృక అయింది.

**3.6.2 సంస్కృత భాష:** శాతవాహన యుగం ఉత్తరార్థంలో సంస్కృత భాష రాజాదరణ పొందింది. సంస్కృతం సులభంగా నేర్చుకోవడానికి శర్వవర్మ 'కాతంత్ర వ్యాకరణాన్ని' రచించాడు. 'ఆగమ నిలయ' అనే బిరుదును బట్టి గౌతమీపుత్ర శాతకర్ణి సంస్కృత భాషాభిమాని అని చెప్పవచ్చు. అతడి కాలంలో జరిగిన బ్రాహ్మణ మతోద్ధరణ సంస్కృత భాషకు మంచి ప్రోత్సాహాన్నిచ్చి ఉండవచ్చు. బౌద్ధులు సైతం తమ సిద్ధాంత గ్రంథాలను సంస్కృతంలోనే వ్రాయసాగారు. ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుల రచనలు సంస్కృతంలోనే ఉన్నాయి. నాగార్జునుడి 'సుహృల్లేఖ' జనాదరణ పొందింది. సుహృల్లేఖను ప్రతి విద్యార్థి కంఠస్థం చేసేవాడని, అందులోని విషయాలు పండితులు జీవితాంతం చర్చిస్తూ ఉండేవారని చైనా యాత్రికుడు ఇత్సింగ్ వ్రాశాడు. వాత్సాయనుడి కామ సూత్రాలు ఈ కాలంలోనే రూపొందినట్లు కొంతమంది పండితుల అభిప్రాయం.

**3.6.3 దేశీ భాష:** ప్రాకృత, సంస్కృత భాషలతో పాటుగా 'దేశి' అనే మరో భాష కూడా వాడుకలో ఉన్నట్లు బృహత్కథ వల్ల తెలుస్తుంది. దేశీ అనే మాటకు స్థానిక ప్రజల భాష అని అర్థం చెప్పవచ్చు. ఇది నేటి తెలుగు, కన్నడ భాషలకు మాతృక అయి ఉంటుంది. దేశభాష తెలుగుకు సన్నిహితంగా ఉందని డి.సి. సర్కార్ అభిప్రాయపడ్డారు.

## 3.7 వాస్తుశిల్పం:

వాస్తు శిల్పకళల్లో కూడా మౌర్యుల వారసత్వాన్ని సంక్రమించుకున్న శాతవాహనులు, వాటికి మరిన్ని మెరుగులతో ఆంధ్ర వాస్తుశిల్ప రీతుల్ని తీర్చిదిద్దారు. నాటి వాస్తు శిల్పానికి మతమే ప్రధాన ప్రేరకం. ఆనాటి లౌకిక నిర్మాణాల అవశేషాలు లభ్యం కాలేదు. హాలుడి గాథా సప్తశతిలో గౌరి, గణేశ, ఇంద్రాది దేవతల ఆలయాల ప్రస్తావన ఉంది. చిత్తూరు జిల్లా గుడిమల్లంలో ఇటీవల జరిపిన తవ్వకాలలో బయల్పడిన దేవాలయ శిథిలాలు శాతవాహన యుగానికి చెందినవనే అభిప్రాయం ఉంది. కాని, వీటి ద్వారా నాటి ఆలయాల పూర్తి స్వరూపం గ్రహించడం కష్టం. ఇక నాటి వాస్తు శిల్పరంగాల్లో ఆంధ్రుల ప్రతిభను గ్రహించడానికి మిగిలింది బౌద్ధ నిర్మాణ శిథిలాలే. బౌద్ధుల నిర్మాణాలలో ప్రధానమైనవి స్థూపాలు, చైత్యాలు, విహార సంఘారామాలు.

**3.7.1 స్థూపం:** బుద్ధుడు లేదా ప్రసిద్ధ ఆచార్యుల శారీరక అవశేషాలపై నిర్మించబడ్డ స్మారక చిహ్నాలే స్థూపాలు. అమరావతి, నాగార్జున కొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట, ఘంటసాలలో ఇటుకలతో స్థూపాలు నిర్మించి, వాటిపై శిల్ప సమన్వితమైన పాలరాతి ఫలకాలను అమర్చారు. ఆంధ్రదేశ స్థూపాలన్నిటిలో అమరావతి స్థూపం అద్భుత నిర్మాణం. ఇందులో బుద్ధుడి జీవితంలో ఐదు ముఖ్యమైన సంఘటనలు, ఇందులో కొన్ని ప్రతీకల ద్వారా సూచించబడ్డాయి. కమలం బుద్ధుడి పుట్టుకను, గుఱ్ఱం మహాభి నిష్క్రమణాన్ని, బోధి వృక్షం జ్ఞాన జ్యోతి దర్శనాన్ని, ధర్మ చక్రం అతడి దివ్య సందేశాన్ని, స్థూపం మహా పరినిర్వాణాన్ని తెలుపుతాయి.

**3.7.2 చైత్యం:** పూజా వస్తువుగా చైత్యం లేదా బుద్ధుడి విగ్రహం ఉండి, నిత్యార్చనకు ఉపయోగించే ఆలయం చైత్యాలయం. కార్లే, నాసిక్, కన్హేరి, బేడ్సలలో వీటి నిర్మాణం జరిగింది. వీటిలో కార్లే చాలా అందమైన గుహాలయం.

**3.7.3 విహారం:** విహారాలు బౌద్ధ భిక్షువుల నివాసాలు. వీటిని పశ్చిమ ప్రాంతంలో రాతిలో మలిచారు. అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జున కొండలలో ఇటుకలతో వీటి నిర్మాణం జరిగింది.

**3.7.4 అమరావతి శైలి:** నాటి శిల్పుల కళా కౌశల్యం సాంచీ స్థూప ద్వార తోరణాలలోను, అమరావతి, నాగార్జునకొండ శిల్పాలలోను పరాకాష్టకు చేరిందని పండితుల అభిప్రాయం. ఆంధ్రదేశంలోని బౌద్ధ క్షేత్రాలన్నింటిలో ఎక్కువ ప్రసిద్ధి నొందింది అమరావతి. అమరావతి స్థూప శిల్ప పద్ధతులే ఇతర శిల్పాలలో కూడా ప్రతిఫలించాయి. అందువల్ల నాటి ఆంధ్ర శిల్పానికి 'అమరావతి శైలి' అనే పేరొచ్చింది. ఇందులో సాంచి-బార్హుత్ శిల్పంతో సాన్నిహిత్యం, గాంధార శిల్ప ఛాయలు కనిపిస్తాయి. కాని, కళా నైపుణ్యంలో, భావ ప్రకటనలో, సాంకేతిక లక్షణాలలో అమరావతి శిల్పం తనదైన ప్రత్యేకతను సంతరించుకొంది.

## 3.8 చిత్రలేఖనం:

నాడు శిల్పంతోపాటు చిత్రలేఖనం కూడా అభివృద్ధి చెందింది. అజంతా 10వ గుహలోని 'శ్వేత గజ జాతక' చిత్రం ఈ యుగానిదే. ఆనాటి ప్రజలు తమ ఇండ్ల గోడల పై రామాయణ, భాగవతాది పురాణ గాథలను చిత్రీకరించుకొనేవారు.

## 3.9 సారాంశము:

శాతవాహనులు క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి క్రీ.శ. 3వ శతాబ్దం వరకు పాలించడం జరిగింది. పరిపాలన మౌర్యుల అడుగుజాడలలో నడచి, పల్లవుల వంటి తరువాత రాజ వంశాలకు మార్గదర్శకమయింది. సాంఘీక, మత విషయాలలో శాతవాహనులు ప్రదర్శించిన చొరవ, సమర్థత ప్రశంసలందుకుంది. వారు వైదిక మతాన్ని పాటించినప్పటికీ, పరమత సహన విధానాన్ని కొనసాగించారు. శాతవాహనుల కాలంలోనే ఉత్తర, దక్షిణ భేదాలు తొలగి, భారతదేశం మొత్తం ఏక సంస్కృతి అభివృద్ధి చెందడానికి దోహదపడింది.

## 3.10 మాదిరి ప్రశ్నలు:

1. శాతవాహనుల పరిపాలనా విధానాన్ని అంచనా వేయండి.
2. శాతవాహనుల కాలం నాటి ప్రజల ఆర్థిక, సాంఘీక పరిస్థితులను గురించి వ్యాసం వ్రాయండి.
3. శాతవాహనుల మత విధానం ఎట్టిది?

## 3.11 ఉపయుక్త గ్రంథాలు:


1. Altakar A.S. - State and Government in Ancient India
2. Basham A.L. - The Wonder that was India
3. Gopalachari K - Early History of Andhra Country
4. Mukherji R.K. - Chandra Gupta Mourya and His Times
5. Thapar Romilla - Asoka and the Decline of Mouryas
6. Yazdani - G (Ed.) - Early History of Deccan



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

## పాఠం - 4

# పల్లవులు

## 4.0 లక్ష్యం:

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం దక్షిణ భారతదేశంలో విభిన్న రాజ్యాలు ఆవిర్భవించాయి. అలా ఆవిర్భవించిన రాజ్యాలలో తొలి పల్లవులు కొంత కాలం మరుగుపడినప్పటికీ అనంతర కాలంలో నవీన పల్లవులు లేదా బృహత్పల్లవులు అనే పేరుతో గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించడం జరిగింది. తొలి పల్లవుల, నవీన లేక బృహత్పల్లవుల రాజకీయ చరిత్రను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:

**4.1 ఉపోద్ఘాతము**

**4.2 పల్లవుల వంశోత్పత్తి**

**4.3 వంశ వృక్షం**

**4.4 ప్రాచీన పల్లవులు**

**4.5 నవీన పల్లవులు**

- **4.5.1 సింహ విష్ణువు**
- **4.5.2 మొదటి మహేంద్ర వర్మ**
- **4.5.3 మొదటి నరసింహ వర్మ**
- **4.5.4 రెండవ మహేంద్ర వర్మ**
- **4.5.5 రెండవ పరమేశ్వరమ్మ**
- **4.5.6 మూడో నంది వర్మ**

**4.6 సారాంశము**

**4.7 మాదిరి ప్రశ్నలు**

**4.8 ఉపయుక్త గ్రంథాలు**

## 4.1 ఉపోద్ఘాతము:

శాతవాహనుల తరవాత దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన రాజ వంశాలలో ప్రముఖమైనది పల్లవ వంశం. దాదాపు 600 సంవత్సరాల వీరి పరిపాలనా కాలంలో రాజకీయ, మత, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో వినూత్న ప్రగతిని సాధించింది. ఈ కారణంగానే "ఉత్తర భారతదేశానికి గుప్తులు ఎటువంటి సేవ చేశారో దక్షిణ భారతదేశానికి పల్లవులు అటువంటి సేవ చేశారని" కె.పి. జయస్వాల్ పేర్కొన్నాడు.

## 4.2 పల్లవుల వంశోత్పత్తి:

శాతవాహన సామ్రాజ్య పతనం తరవాత పల్లవులు కంచిని రాజధానిగా చేసుకొని 6 శతాబ్దాల కాలం పాలించారు. పల్లవుల వంశోత్పత్తి గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. సింహళదేశ బౌద్ధ గ్రంథం మహావంశంలో కృష్ణా నదీ తీరంలో పల్లవ బొగ్గ అనే ప్రదేశాన్ని పేర్కొంటున్నది. ఆ ప్రదేశమే నేటి గుంటూరు జిల్లాలోని పలనాడు. తొలి పల్లవుల శాసనాలు అయిన మంచికల్లు, మైదవోలు శాసనాలు ఈ ప్రాంతంలోనే లభించాయి. అందువల్ల పల్లవులు ఆంధ్రులే అని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. వీరి సిద్ధాంతం ప్రకారం పల్లవుల ప్రథమ నివాస స్థలం పల్నాడని, అక్కడ నుంచి వారు తోండైమండలం పోయి నాగ వంశీయులతో వైవాహిక సంబంధాలు చేసుకొని అక్కడ స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు.

అశోకుని శాసనాలలో పేర్కొన్న పాలర్లు లేదా పుళిందులే పల్లవులని సత్యనాథ్ అయ్యర్ అభిప్రాయం. పర్షియా నుంచి వలస వచ్చి, స్థిరపడిన పహ్లవులు లేదా పార్థియన్ లే పల్లవులని లూయీరైస్, డూబ్రే, విన్సెంట్ స్మిత్, వెంకయ్య మొదలయినవారు అభిప్రాయపడ్డారు. కె.పి. జయస్వాల్ పల్లవులు కూడా వాకాటకుల లాగా బ్రాహ్మణులని, భరద్వాజ గోత్రికులు, సంస్కృత భాషాభిమానులు కావడం వల్ల పల్లవులు వాకాటక వంశ శాఖగా భావించారు. కృష్ణ స్వామి అయ్యంగార్ పల్లవ పదం తొండై పదానికి సంస్కృతీకరణగా భావించి పల్లవులు తొండై మండలానికి చెందిన వారని అభిప్రాయపడ్డాడు.

## 4.3 వంశ వృక్షం:

పల్లవుల వంశోత్పత్తి మాదిరి వారి వంశ వృక్షాన్ని గురించి కూడా అనేక వాదాలున్నాయి. శాసనాలను ఆధారంగా చేసుకొని ప్రాచీన పల్లవులు, నవీన పల్లవులు లేదా బృహత్పల్లవులు అనే రెండు ముఖ్య వంశాలున్నట్లు అందరూ అంగీకరిస్తున్నారు. ప్రాచీన పల్లవులకు చెందిన 20 శాసనాలు లభించాయి. వీటిలో నాలుగు ప్రాకృతంలోను, మిగిలినవి సంస్కృతంలోను ఉన్నాయి.

## 4.4 ప్రాచీన పల్లవులు:

ప్రాచీన పల్లవులకు మూల పురుషుడు సింహ వర్మ. సింహ వర్మ కుమారుడు శివస్కంధ వర్మ. ఇతడు శాతవాహనరట్ట, తొండై మండలం, కుంతల రాజ్యాలను జయించి పల్లవ రాజ్యాన్ని కృష్ణ - కావేరి నదుల మధ్య వరకు విస్తరింప చేశాడు. ఇతనికి ధర్మ మహారాజాధిరాజు అనే బిరుదు ఉంది. ఇతని తరవాత ప్రాచీన పల్లవుల చరిత్ర స్పష్టంగా లేదు. సముద్రగుప్తుని అలహాబాదు ప్రశస్తి కాంచీపురాన్ని విష్ణుగోపుడు పరిపాలిస్తున్నాడని తెలియజేస్తున్నది. ఇతని తరవాత కుమార విష్ణువు, సింహవర్మ, నందివర్మ పరిపాలించారు. నంది వర్మతో ప్రాచీన పల్లవ వంశం అంతరించింది.

## 4.5 నవీన పల్లవులు:

**4.5.1 సింహ విష్ణువు:** తమిళ దేశంలో పల్లవుల అధికారాన్ని క్రీ.శ. 575లో పునరుద్ధరించిన వాడు సింహ విష్ణువు. ఇతనికి ప్రాచీన పల్లవులకు ఉన్న సంబంధం ఎటువంటిదో తెలియదు. ఇతని సంతతి వారే నవీన పల్లవులని ప్రసిద్ధులయ్యారు. తమిళకంలో అలజడికి కారకులైన కల భ్రులను అణచి ఇతడు కావేరీ వరకు తన రాజ్యాన్ని విస్తరింపచేశాడు. చోళ, పాండ్య, కేరళ ప్రభువులు ఇతని సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు. ఇతనికి 'అవనీసింహ' అనే బిరుదున్నది.

**4.5.2 మొదటి మహేంద్ర వర్మ (క్రీ.శ 600-63):** సింహవిష్ణువు కుమారుడైన మొదటి మహేంద్రవర్మ పల్లవ రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణానది వరకు విస్తరింపచేశాడు. ఇతడి పాలనాకాలంలో ఒక వైపు పాండ్యులతోను,

మరొక వైపు బాదామి చాళుక్యులతోను వైరం ప్రారంభమయ్యింది. ఇతడు పాండ్యులను ఓడించి కావేరీ నదీ ప్రాంతంలోని డెల్టా భూములను ఆక్రమించాడు.

క్రీ.శ **630**లో రెండవ పులకేశి పల్లవ రాజ్యం పై దండెత్తి పుల్లలూరు యుద్ధంలో మహేంద్ర వర్మను ఓడించి పల్లవ రాజ్యంలోని ఉత్తర ప్రాంతాలను ఆక్రమించాడు. పుల్లలూరు యుద్ధం తరవాత అనతికాలానికే మహేంద్రవర్మ మరణించాడు. మహేంద్రవర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. మొదట జైనుడైనప్పటకీ అప్పర్ బోధనల వల్ల శైవుడయ్యాడు. తాను రాసిన 'మత్తవిలాస ప్రహసనంలో జైన, బౌద్ధమతాలతో పాటు కాపాలిక, కాలాముఖుల వంటి తీవ్రవాద శైవశాఖలను విమర్శించాడు. సంగీతంపట్ల ఇతనికి ఆసక్తి ఉంది. రుద్రాచార్యుని వద్ద సంగీతం ర్చుకున్నాడు. చెరువులు తవ్వించి వ్యవసాయాన్ని ప్రోత్సహించాడు. తమిళదేశంలో గుహాలయాల నిర్మాణం ఇతని కాలంలో ప్రారంభమయ్యింది. ఇటుక, కలప, లోహం, అడుసులతో సంబంధం లేకుండా ఆలయాలను నిర్మించినట్లు ఇతని శాసనాలు పేర్కొంటున్నాయి. తిరుచినాపల్లి, చెంగల్పట్టులలో ఆలయాలు, మల్లవరం, మామండూర్, దళవానూ గుహాలయాలు ఇతని కాలం నాటివే. సిత్తన్న వాసల్ గుహలలో ఇతని కాలం 'నాటి వర్ణచిత్రాలున్నాయి. ఈ విధంగా సాహిత్య, సంగీత, వాస్తుశిల్ప కళారంగాలలో ఆసక్తితో పాటుగా ఆరంగాలలో నూతన ధోరణులను ప్రారంభించినందున మహేంద్రవర్మ విచిత్ర చిత్తుడు, చిత్రకారపులి, గుణభారుడు, లలితాంకురుడు అని కీర్తి పొందాడు.

**4.5.3 మొదటి నరసింహవర్మ (క్రీ.శ 630-668):** మొదటి మహేంద్రవర్మ తరవాత అతని కుమారుడు మొదటి నరసింహవర్మ రాజయ్యాడు. ఇతడు పల్లవులలో అగ్రగణ్యుడు. ఇతడు రాజ్యాధికారం స్వీకరించిన కొద్దికాలానికి చాళుక్య దండయాత్రను ఎదుర్కొనవలసి వచ్చింది.

ఇతడు క్రీ.శ **643**లో వేయించిన బాదామి శాసనం వల్ల నరసింహవర్మ చాళుక్యులతో చేసిన యుద్ధ వివరాలు తెలుస్తున్నాయి. మొదటి నరసింహవర్మ క్రీ.శ **642**లో పల్లవ రాజ్యం పై దండెత్తి వచ్చిన రెండవ పులకేశిని ఓడించాడు. అంతేకాకుండా చిరుతొండ పరంజ్యోతి నాయకత్వంలో పల్లవ సేనలు పులకేశిని బాదామి వరకు తరిమి బాదామిని ముట్టడించి రెండవ పులకేశిని వధించి బాదామిని దోచుకున్నాయి.

ఈ దండయాత్రలో సింహళరాజుమార వర్మ ఎంతో సహాయపడ్డాడు. ఈ సహాయానికి కృతజ్ఞతగా నరసింహ వర్మ సింహళ రాజ్యం పై రెండుసార్లు దండయాత్రలు జరిపి మార వర్మను సింహళ రాజుగా పునఃప్రతిష్ఠించాడు. ఇతడు చోళపాండ్య, చేర, కలభ్రులను జయించినట్లు శాసనాలలో చెప్పుకున్నాడు. ఈ విజయాలకు సూచనగా ఇతడు వాతాపి కొండ, మహామల్ల అనే బిరుదులను ధరించాడు.

మహామల్ల పేరు మీదుగా మా మల్లపురాన్ని నిర్మించాడు. సాహిత్య వాస్తు కళా పోషణలో నరసింహవర్మ తన తండ్రి విధానాలనే అనుసరించాడు. మహాబలిపురంలో రాతి రథాలుగా ప్రసిద్ధికెక్కిన ఏకశిలా నిర్మాణాలలో ఎక్కువగా భాగం ఇతడు నిర్మించినవే. సంస్కృతంలో కిరాతార్జునీయాన్ని రచించిన భారవిని ఇతడు ఆదరించి పోషించాడు. నరసింహవర్మ పాలనాకాలంలోనే హుయాన్‌త్సాంగ్ కాంచీపురాన్ని దర్శించాడు. కాంచీపురంలో ఆ సమయంలో బౌద్ధ, జైన, హిందూ మతాల రాజ పోషణ పొందున్నట్లు ఆయా మతాలు ఆలయాలు ఎన్నో ఉన్నట్లు హుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు.

**4.5.4 రెండవ మహేంద్ర వర్మ:** నరసింహవర్మ తరవాత పల్లవ - చాళుక్య వైరం తీవ్రరూపం దాల్చింది. నరసింహవర్మ కుమారుడైన రెండవ మహేంద్రవర్మ చాళుక్య రాజు విక్రమాదిత్యుని చేతిలో ఓడిపోయారు. ఈ ఓటమి వల్ల రేనాటి చోళులు మొదలయిన సామంతులు అనేకులు చాళుక్య సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. రెండవ మహేంద్రవర్మ కుమారుడైన పరమేశ్వర వర్మకాలంలో విక్రమాదిత్యుడు కాంచీపురాన్ని జయించడటమే కాక తిరుచినాపల్లి సమీపంలోని ఉరయూరు వరకు పురోగమించాడు. కాని పరమేశ్వరవర్మ పెరువళనల్లూరు యుద్ధంలో విక్రమాదిత్యుడిని ఓడించడమే కాక చాళుక్య రాజ్యం పై కూడా దాడి చేశాడు. ఇతని కుమారుడైన

రెండవ నరసింహవర్మ (క్రీ.శ 700-728) పాలనాకాలం ప్రశాంతంగా గడిచింది. ఇతనికి రాజసింహ అనే బిరుదు ఉంది. ఇతడు ఎన్నో శివాలయాలను నిర్మించాడు.

**4.5.5 రెండవ పరమేశ్వర వర్మ:** రాజసింహుని కుమారుడు రెండవ పరమేశ్వర వర్మ (క్రీ.శ 728-731) కాలంలో చాళుక్య యువరాజు రెండవ విక్రమాదిత్యుడు పల్లవ రాజ్యం పై దండెత్తి కాంచీపురాన్ని దోచుకున్నాడు. ఈ దండయాత్రలో చాళుక్యులకు సహాయం చేసిన పశ్చిమ గాంగులను శిక్షించేందుకు పరమేశ్వర వర్మ వారి పై దండెత్తాడు. కానీ క్రీ.శ 731లో జరిగిన విళందె యుద్ధంలో మరణించాడు. రెండవ పరమేశ్వర వర్మ మరణించడంలో సింహవిష్ణువు వంశం అంతరించింది. సింహాసనం కొరకు పల్లవ వంశ శాఖల మధ్య ఘర్షణ ప్రారంభయ్యింది.

**నంది వర్మ:** పల్లవ సామంతులు, కాంచీపుర ఘటికా స్థానంలోని విద్వాంసులు సమావేశమై పల్లవ వంశ శాఖకు చెందిన నంది వర్మను రాజుగా ఎన్నుకొన్నారు. నంది వర్మకు పల్లవ మల్ల అనే బిరుదున్నది. ఇతని కాలంలో పల్లవరాజ్యం శత్రురాజుల దండయాత్రలకు గురయింది. క్రీ.శ 733లో రెండవ విక్రమాదిత్యుడు మరొకసారి దండెత్తి వచ్చి కాంచీపురాన్ని దోచుకున్నాడు. పాండ్యులతోను, పశ్చిమ గాంగులతోను కూడా నందివర్మ యుద్ధాలు చేయవలసి వచ్చింది. రాష్ట్రకూటరాజు దంతిదుర్గుడు దండెత్తి వచ్చి నందివర్మను ఓడించాడు. ఇతని పాలనాకాలం చివరలో చాళుక్య యువరాజు కీర్తి వర్మ కాంచీపురం పై దాడి చేసి దోచుకున్నాడు. నందివర్మ పాలనాకాలంలోనే పల్లవరాజ్య పతనం ప్రారంభమయ్యింది. నందివర్మ కుమారుడు దంతివర్మ కాలంలో రాష్ట్రకూట రాజైన గోవిందుడు క్రీ.శ 804లో కాంచీపురాన్ని దోచుకున్నాడు. పల్లవుల బలహీనత లోకవిదితమై పాండ్యులు కూడా విజృంభించి రాజ్య విస్తరణకు పూనుకొన్నారు.

**4.5.6 మూడవ నది వర్మ:** దంతివర్మ కుమారుడైన మూడవ నందివర్మ సామంతుల సహాయంతో పాండ్యులను ఓడించాడు. ఇతని తరవాత నృపతుంగవర్మ రాజయ్యాడు. ఇతని తరవాత రాజైన అపరాజితవర్మ పల్లవ రాజులలో చివరి వాడు. ఇతడు పల్లవరాజ్యాన్ని కాపాడుటకు ప్రయత్నించాడు. పశ్చిమ గాంగులు, చోళుల సహాయంతో అపరాజితవర్మ క్రీ.శ 880లో శ్రీ పురాంబియం యుద్ధంలో పాండ్యులను ఓడించాడు. పాండ్యుల ఓటమితో అదిత్యచోళుడు ధైర్యం చేసి అపరాజిత వర్మ పై దండెత్తాడు. క్రీ.శ 885లో అపరాజితవర్మ యుద్ధంలో ఓడి మరణించాడు. ఇతని మరణంతో పల్లవ సార్వభౌమత్వం అంతరించింది. తొండై మండలం చోళులకు స్వాధీనమయ్యింది. తరవాతి కొంతకాలం వరకు పల్లవ రాకుమారులు చోళులకు సామంతులుగా ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది.

## 4.6 సారాంశము:

శాతవాహన సామ్రాజ్యం అంతరించిన తర్వాత, దక్షిణ భారతదేశంలో పల్లవులు కంచి రాజధానిగా క్రీ.శ. 6వ శతాబద్ధం నుండి 9వ శతాబ్దం వరకు పరిపాలించడం జరిగింది. పల్లవులలో మొదటి మహేంద్ర వర్మ, మొదటి నరసింహ వర్మ సుప్రసిద్ధ పాలకులు. అపరాజిత వర్మ పల్లవులలో చివరి పాలకుడు. క్రీ.శ. 885లో ఆధిత్య చోళుడితో జరిగిన యుద్ధంలో ఓడి, మరణించడంతో పల్లవుల అధికారం అంతమైంది.

## 4.7 మాదిరి ప్రశ్నలు:

1. పల్లవుల రాజకీయ చరిత్రను వివరించండి.

2. పల్లవ రాజు మొదటి నరసింహ వర్మ గొప్పతనాన్ని వివరించండి.

## 4.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Altakar A.S. - State and Government in Ancient India
2. Basham A.L. - The Wonder that was India
3. Gopalachari K - Early History of Andhra Country
4. Mukherji R.K. - Chandra Gupta Mourya and His Times
5. Thapar Romilla - Asoka and the Decline of Mouryas
6. Yazdani - G (Ed.) - Early History of Deccan



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

**పాఠం - 5**

# పల్లవుల సాంస్కృతిక సేవ

## 5.0 లక్ష్యం:

పల్లవుల పాలనా వ్యవస్థను ఆర్థిక, సాంఘీక, మత పరిస్థితులను మరియు సాంస్కృతిక పరిస్థితులను తెలియ చేయడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:

**5.1 ఉపోద్ఘాతము**
**5.2 పల్లవుల పరిపాలన**
- **5.2.1 పాలనా విభాగాలు**

**5.3 ఆర్థిక పరిస్థితులు**
- **5.3.1 వ్యవసాయం**
- **5.3.2 పరిశ్రమలు**
- **5.3.3 ఎగుమతి - దిగుమతులు**
- **5.3.4 భూమి శిస్తు**

**5.4 సాంఘీక పరిస్థితులు**
- **5.4.1 బ్రాహ్మణులు**
- **5.4.2 క్షత్రియులు**
- **5.4.3 వైశ్యులు**
- **5.4.4 శూద్రులు**

**5.5 మత పరిస్థితులు**
- **5.5.1 నాయనార్లు**
- **5.5.2 ఆళ్వార్లు**

**5.6 విద్య - ఘటికలు**
**5.7 సారస్వతం**
**5.8 సంగీతం - నాట్యం**
**5.9 వాస్తు శిల్ప కళలు**
**5.10 వివిధ దశలు**
- **5.10.1 మొదటి దశ**
- **5.10.2 రెండవ దశ**
- **5.10.3 మూడవ దశ**
- **5.10.4 నాల్గవ దశ**

**5.11 శిల్పాలు**
**5.12 చిత్రకళ**
**5.13 సారాంశము**
**5.14 మాదిరి ప్రశ్నలు**
**5.15 ఉపయుక్త గ్రంథాలు**

## 5.1 ఉపోద్ఘాతము:

శాతవాహన సామ్రాజ్య పతనం తర్వాత దక్షిణ భారతదేశంలో వివిధ రాజ్యాలు ఆవిర్భవించాయి. వాటిలో పల్లవులు విశాల సామ్రాజ్యాన్ని స్థాపించడం జరిగింది. అంతేగాక చక్కని పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేశారు. సాంఘీక, ఆర్థిక, మత, సాంస్కృతిక రంగాలలో వీరి కాలం అభివృద్ధి పథాన నడిచింది.

## 5.2 పల్లవుల పరిపాలన:

పల్లవుల పరిపాలనా విధానం చాలా వరకు శాతవాహనుల పాలనా విధానాలను పోలి ఉంది. పల్లవులు 'రాజాధిరాజు', 'ధర్మమహారాజాధిరాజ' అనే బిరుదులు ధరించారు. పల్లవుల సామ్రాజ్యంలో అధికభాగం రేనాటి చోళ, గాంగ, చోళ మొదలయిన సామంతుల పాలనలో ఉండేది. మిగిలిన ప్రాంతాలను అమాత్య, యువరాజు, రహస్యాధికృత, రథిక, మాడబ, దేశాధికృత మొదలయిన ఉద్యోగుల సహాయంతో రాజే స్వయంగా పరిపాలించేవాడు. దూత, సంచరంతకులనే ఉద్యోగులను నియమించి రాజ్యం నలుమూలల నుంచి రాజులు సమాచారాన్ని సేకరించేవారు.

**5.2.1 పాలనా విభాగాలు:** పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని రాష్ట్రాలుగాను, రాష్ట్రాలను విషయాలుగాను, విషయాలను భోగాలుగాను, భోగాలు గ్రామాలుగాను విభజించారు. రాష్ట్రాన్ని వ్యాపృతుడు అనే ఉద్యోగి పాలించేవాడు. గ్రామ పాలనకు గ్రామ సభలుండేవి. సభ, ఉర్, నగరం అనే గ్రామసభలుండేవి. తోటలు, ఆలయాలు, స్నాన ఘట్టాలు, తటాకాలు వంటివాటి నిర్వహణను గ్రామసభ నిర్వహించేది.

గ్రామ సభకు న్యాయవిచారణాధికారం కూడా ఉంది. గ్రామాల సరిహద్దులను గుర్తించడం గ్రామాల ఆదాయ వ్యయాలను నమోదు చేయడం చేసేవారు. ఇటువంటి విధానమే భోగాలు, విషయాలు రాష్ట్రాలలో అమలులో ఉండేది. గ్రామస్థాయిలో వీరు దేవాలయం, అర్చకుడు, రైతు, భూమి అనే నాలుగు అంగాల సమన్వయంతో కూడిన నూతన గ్రామీణ ఆర్థిక - సాంస్కృతిక వ్యవస్థకు పునాదులు వేశారు. ఈ గ్రామీణ వ్యవస్థను తరవాతి కాలంలో చోళులు మరింత అభివృద్ధి పరచి స్థానిక స్వపరిపాలనగా మెరుగులుదిద్దారు.

## 5.3 ఆర్థిక పరిస్థితులు:

**5.3.1 వ్యవసాయం:** ప్రజలలో ఎక్కువమంది గ్రామాలలో నివసించేవారు. వారి ముఖ్య వృత్తి వ్యవసాయం. గ్రామాలకు పొలిమేరలు, పంటపొలాలకు గట్లు వేసుకొనేవారు. పల్లవులు వ్యవసాయాభివృద్ధికి నీటిపారుదల సౌకర్యాలు కల్పించి బంజరు భూములను సాగులోకి తెచ్చారు. అనేక రకాల పండ్లు, ధాన్యాలు, కూరగాయలు పండించేవారు. కుమ్మరి, కమ్మరి, సాలె, భజంత్రీలు మొదలయిన గ్రామసేవకులకు, ఆలయ దాసదాసీ జనానికి మాన్యాలు ఇవ్వడం ఆచారంగా ఉండేది.

**5.3.2 పరిశ్రమలు:** ఆనాడు ఎన్నో రకాల కుటీర పరిశ్రమలుండేవి. ప్రతి కుటీర పరిశ్రమ ఒక సంఘం లేదా శ్రేణిగా ఏర్పడ్డాయి. అనేకరకాల వర్తక సంఘాలుండేవి. వాటిలో నానాదేశి, మణిగ్రామం అనే వర్తక సంఘాలు ముఖ్యమైనవి. ఈ వర్తక సంఘాలు చైనా, ఆగ్నేయాసియా దేశాలతో ఎక్కువగా వాణిజ్యసంబంధాలు కలిగి ఉండేవి. మహామల్లపురం, నాగపట్టణం మొదలయిన రేవు పట్టణాల ద్వారా విదేశీ వాణిజ్యం జరుగుతుండేది.

**5.3.3 ఎగుమతులు - దిగుమతులు:** నరసింహవర్మ కాలంలో చైనాకు దౌత్య సంబంధాలు ఏర్పడి వాణిజ్యాభివృద్ధి జరిగింది. యాలకులు, మిరియాలు, ముత్యాలు మొదలగునవి ముఖ్యమైన ఎగుమతులు కాగా గుర్రాలను దిగుమతి చేసుకొనేవారు. ఈ వాణిజ్య ఫలితంగా వర్తకులు ఆగ్నేయ ఆసియా రాజ్యాలలో వలసలు స్థాపించి తద్వారా భారతీయ సంస్కృతిని ఆ రాజ్యాలలో విస్తరింపచేశారు.

**5.3.4 భూమి శిస్తు:** భూమిశిస్తు ప్రభుత్వానికి ముఖ్యమైన ఆదాయ మార్గం. పంటలో 1/10 వంతు లేదా పుటనంతు పన్నుగా వసూలు చేసేవారు. పల్లవుల శాసనాలలో కనిపించే అష్టాదశ పరిహార అనే దానిని బట్టి ఆ కాలంలో ప్రభుత్వం 18 రకాల పన్నులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. వృత్తి, వివాహం పన్ను, ఉప్పు, చక్కెర మొదలయిన పదార్థాల తయారీ పై పన్నులు విధించేవారు ఇవే కాకుండా ప్రభువులకు, ప్రభుత్వోద్యోగులకు, పాలు, పెరుగు, కూరగాయలు, కట్టెలు, పశుగ్రాసం, ఇవ్వడం సాధారణమైన విషయం. దేశ పర్యటనలో రాజు శిబిరానికయ్యే ఖర్చును గ్రామాల ప్రజలే భరించాలి.

## 5.4 సాంఘిక పరిస్థితులు:

సంగం యుగంలో తమిళకంలో ప్రవేశించిన వైదిక మత ప్రభావం వల్ల వర్ణాశ్రమ ధర్మాలు పల్లవుల కాలంలో కూడ కొనసాగాయి. పల్లవులు వర్ణాశ్రమ ధర్మాన్ని కొనసాగించారు. సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు ప్రధానమైనవి.

**5.4.1 బ్రాహ్మణులు:** బ్రాహ్మణులకు సంఘంలో అధిక గౌరవం లభించింది. వీరు యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, పరిగ్రహణ అనే షట్కర్మలను నిర్వహించారు. వీరు షట్కర్మలేకాక అవసరాన్ని బట్టి గ్రామంలోని దేవాలయంలో అర్చకుని మొదలు కొని చక్రవర్తి పరివారంలోని మహామంత్రి, దండనాయకుడు, సంధివిగ్రహకుడు మొదలయిన వివిధ లౌకిక వృత్తులను నిర్వహించారు. ఈ కారణంగా సమాజంలో బ్రాహ్మణుల పాత్రలు బహుముఖంగా విస్తరించింది. ఈ కాలంలో బ్రాహ్మణుడు సార్వభౌమాధికారాన్ని అట్టడుగు వర్గాల వరకు అందచేసే పని ముట్టుగా రూపొందారు. అందువల్లనే వీరు శస్త్రాస్త్ర విద్యలలో ప్రావీణ్యం పొంది మంత్రాంగంలోను, యంత్రాంగం లోను తమ విధులను నిర్వహించారు. పల్లవుల శాసనాలవల్ల వైదిక విద్యలు, ఇతర శాస్త్రాలలోను పండితులైన బ్రాహ్మణులకు భూములను, గ్రామాలను అగ్రహారాలుగా, చతుర్వేది మంగళాలు గాను దానం ఇచ్చినట్లు తెలుస్తున్నది.

**5.4.2 క్షత్రియులు:** క్షత్రియులు పాలకవర్గం. పాలకులైన పల్లవులను కొంతమంది చరిత్రకారులు బ్రాహ్మణులని మరికొంతమంది చరిత్రకారులు శూద్రులని పేర్కొన్నారు. పల్లవులు తమ పేర్ల చివర 'వర్మ' అనే క్షత్రియ సూచక పదాన్ని చేర్చుకున్నారు. తాము ద్రోణ, అశ్వత్థామ వంశానికి చెందినవారమని చెప్పుకొన్నందువల్ల వీరిని బ్రాహ్మణులని చరిత్రకారులు నిర్ణయించారు.

**5.4.3 వైశ్యులు:** వైశ్యులు అని వైదిక సంప్రదాయంలో పేర్కొన్న వర్గం దాదాపుగా దక్షిణాపథంలోని సమాజంలో లేరని చెప్పవచ్చు. వివిధ సంఘాలు లేదా శ్రేణుల ద్వారా వర్తక వాణిజ్యాలను నిర్వహించిన వర్గాన్ని వైశ్యులు అని పేరు పెట్టలేం. కాని ఈ వర్గం వైశ్యులు గా చలామణి అయ్యారు.

**5.4.4 శూద్రులు:** శూద్రకులాల గురించి పల్లవుల కాలంనాటి ఆధారాల వల్ల స్పష్టంగా తెలియడం లేదు. అయితే శూద్రులు, చండాలురు అనే వర్గాలు బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య వర్గాలకు వ్యవసాయం, కూలి, సైనిక సేవలు అందిస్తూ సమాజంలో అథమ స్థానంలో ఉన్నారు.

## 5.5 మత పరిస్థితులు:

పల్లవులు వైదిక మతాభిమానులు. కలియుగ దోషాల వల్ల నష్టమై. ధర్మాన్ని ఉద్ధరించడానికి తాము సర్వదా సంసిద్ధులమని పల్లవ రాజులు శాసనాలలో ఖల పాట్నారు. శివస్కంధవర్మ, నందివర్మలు అశ్వమేధాది వైదిక క్రతువులు చేసి వైదిక మతాభిమానాన్ని చాటుకున్నారు. వైదికమతంతో పాటు జైన, బౌద్ధమతాలున్నాయి. అయితే జైన బౌద్ధమతాల ప్రాముఖ్యత తగ్గింది.

హుయాన్‌త్సాంగ్ రచనల వల్ల కాంచీపురంలో 10000 మంది బిక్షువులున్న 100 బౌద్ధ సంఘా రామాలున్నాయని, నిగ్రంథులు (జైనులు) కూడా ఉన్నారని తెలుస్తున్నది. నలందా విశ్వవిద్యాలయ అధ్యక్షుడైన ధర్మపాలుని జన్మస్థలం కాంచీపురం అని చరిత్రకారుల అభిప్రాయం.

జైన మతానికి కంచి బౌద్ధమతానికి కంచి, నాగపట్టణం కేంద్రాలుగా ఉండేవి. పల్లవరాజులలో ఎక్కువమంది శైవులు. పల్లవరాజు మొదటి మహేంద్ర వర్మ మొదట జైన మతావలంబకుడు. అప్పర్ బోధనల వల్ల తరువాత శైవమతాన్ని స్వీకరించాడు.

శైవంలో పాశుపత, కాలాముఖ, కాపాలిక వంటి తీవ్రవాద శాఖలున్నాయి. మహాబలిపురం శిల్పాలలో దుర్గకు రక్తబలి సమర్పించే దృశ్యాలు, తలలు నరికి దుర్గకు సమర్పించే దృశ్యాలున్నాయి. విచిత్రచిత్త బిరుదున్న మహేంద్రవర్మ తన 'మత్త విలాస ప్రహసనం'లో ఇటువంటి చర్యలకు పాల్పడే కాలాముఖ, కాపాలికాది శైవులతో బాటు, బౌద్ధ, జైన మతాల వారి జీవన పద్ధతులను తీవ్రంగా విమర్శించాడు. ఇతని కాలంలో నుంచే నాయనార్ల బోధనలవల్ల శైవం భక్తి ప్రధానమయ్యింది.

**5.5.1 నాయనార్లు:** 63 మంది నాయనార్లలో అప్పర్, జ్ఞాన సంబంధర్, సుందర మూర్తి, మాణిక్య వాచగర్ మొదలయినవారు పల్లవ యుగంలో ఉన్నారు.

**5.5.2 ఆళ్వార్లు:** వైష్ణవ ఆచార్యులైన 'ఆళ్వార్లు' వైష్ణవాన్ని ప్రచారం చేశారు. పోయిగై, తిరుమంగై, తొండరడిప్పొడి (విప్రనారాయణ) మొదలయిన ఆళ్వారులు పల్లవుల కాలంలోని ఆళ్వారులలో ప్రముఖులు. తమిళ భాషను ప్రధానంగా ఉపయోగించి నాయనార్లు 'తేవారం' అనే భక్తి గీతాలను, ఆళ్వారులు 'నాయిలార్ ప్రభంధం' మొదలైన వాటి ద్వారా తమ మత ప్రచారం చేసి సామాన్య ప్రజలలో సాత్వికభక్తిని, నైతిక విలువలను పెంపొందించారు. ఈ కాలంలో తిరుపతి, శ్రీరంగం, కంచి మొదలయినవి పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి చెంది భక్తులను ఆకర్షించాయి.

## 5.6 విద్య - ఘటికలు:

ప్రాచీన పల్లవుల కాలంలోనే సంస్కృతం రాజభాష అయింది. నవీన పల్లవుల శాసనాలు సంస్కృతంలోనే ఉన్నాయి. దీని వల్ల పల్లవులు వైదిక మంతంతోపాటు సంస్కృత భాషను కూడా ఆదరించినట్లు తెలుస్తున్నది. పల్లవులు ఘటికలు స్థాపించి సంస్కృత భాషను, వైదిక విద్యలను పోషించారు. పల్లవ రాజ్యంలోని ఘటికాస్థానాలలో కాంచీపుర ఘటికాస్థానం ప్రముఖమైనది. ఈ ఘటికా స్థానంలో విద్యనభ్యసించుటకు దూరప్రాంతాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చేవారు. ఈ ఘటికలలో చతుర్విద విద్యలు అంటే అన్వీక్షకి (తత్వశాస్త్రం) త్రయీ (మూడు వేదాలు), వార్తా (ఆర్థికశాస్త్రం), దండనీతి (రాజనీతిశాస్త్రం) బోధన జరిగేవి. కొన్ని ఘటికలలో అష్టాదశ విద్యలలో అంటే నాలుగు వేదాలు, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, కల్పం, జ్యోతిష్యం, తర్కం, మీమాంస, ధర్మశాస్త్రాలు, పురాణాలు, ఆయుర్వేదం, ధనుర్వేదం, శిల్పవేదం, గాంధర్వవేదం పరిశ్రమ జరిగేది.

## 5.7 సారస్వతం:

పల్లవుల కాలంలో సాహిత్యాభివృద్ధి ఇతోధికంగా జరిగింది. సంస్కృతంతో పాటు తమిళభాషలోను సాహిత్య సృష్టి జరిగింది. పల్లవ రాజులలో మొదటి మహేంద్ర వర్మ స్వయం కవి. ఇతడు మత్త విలాస ప్రహసనం రచించారు. సింహవిష్ణువు ఆస్థానంలో ఉన్నట్లు భావించిన భారవి 'కిరాతార్జునీయం' శిశుపాలవధ అనే కావ్యాలను రచించాడు. కిరాతార్జునీయం సంస్కృతంలోని పంచకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందింది. మొద నరసింహవర్మ ఆస్థానంలో ఉన్న దండి 'దశకుమార చరితమ్' అనే వచన గ్రంథాన్ని, 'కావ్యాదర్మ అనే సాహిత్య విమర్శ గ్రంథాన్ని రాశాడు.

పల్లవుల కాలంలో నాయనార్లు, ఆళ్వార్ల మత ప్రచార వల్ల తమిళ భాషా సాహిత్యం అభివృద్ధి చెందింది. తిరువళ్ళార్ రచించిన 'కురల్' తమిళ సాహిత్యంలో ప్రసిద్ధి పొందింది. అప్పార్, జ్ఞాన సంబంధర్, సుందరమూర్తి అనే నాయానార్లు వ్రాసిన 1000కి పైగా గల భక్తి గీతాలు 'తేవారామ్' అనే పేరుతో ప్రసిద్ధి పొందాయి. ఆళ్వారుల రాసిన 4000 భక్తి స్తోత్రాలు నాలాయిర దివ్యప్రభంధం అనే పేరుతో తమిళ సాహిత్యం ప్రఖ్యాతి పొందింది. ఈ భక్తి వాఙ్మయం ద్వారా సామాన్య ప్రజలలో అక్షరాస్యతా వ్యాప్తికి అవకాశం కలిగింది.

## 5.8 సంగీతం - నాట్యం:

పల్లవుల పాలనలో విద్యలతో బాటు నాట్యసంగీతాలలో విశేషమైన కృషి జరిగింది మృదంగం, యాళి, విరళి, వీణ మొదలైన సంగీత వాయిద్యాలను ఆనాటి శాసనాలు, సాహిత్య పేర్కొంటున్నాయి. 'కుడిమియామిలై' గుహలోని శాసనంలో వీణ పై సాధన చేయడానికి ఉద్దేశించిన సంగీత పాఠాలున్నాయి. ఈ పాఠాలను మొదటి మహేంద్ర వర్మ రచించాడు.

## 5.9 వాస్తు - శిల్ప కళలు:

దేవాలయ వాస్తు శిల్ప కళా చరిత్రలో పల్లవులకు ప్రత్యేక స్థానముంది. దక్షిణ భారతదేశపు వాస్తు శిల్పకళా చరిత్ర పల్లవులతోనే ప్రారంభమవుతుందని విన్సెంట్ స్మిత్ అభిప్రాయం శాతవాహన, ఇక్ష్వాకుల ఆలయవాస్తు శిల్పకళా రీతుల పురోగతి పల్లవుల వాస్తు కళల్లో కనిపిస్తుంది ఆ వాస్తు శిల్పమే తరవాత కాలంలో ద్రావిడ వాస్తు శైలిగా పరిణామం చెందిందని పెర్సిబ్రౌన్ భావించాడు. పల్లవుల వాస్తు శిల్పకళ మొదటి మహేంద్ర వర్మ కాలంలో ప్రారంభమై చివరి పల్లవరాజు అపరాజితవర్మ కాలం వరకు కొనసాగి, ఆలయ నిర్మాణ పద్ధతులు పరిపూర్ణ రూపాన్ని పొందాయి.

## 5.10 వివిధ దశలు:


పల్లవుల వాస్తు శిల్పకళ నాలుగు దశలలో అభివృద్ధి చెందింది. పల్లవుల వాస్తుశిల్ప కళాభివృద్ధికి కృషి చేసిన మహేంద్రవర్మ, నరసింహవర్మ, రాజసింహ, నందివర్మల పేరు మీదుగా ఈ నాలుగు దశలను వాస్తు శిల్ప చరిత్ర కారులు పేర్కొంటున్నారు. అవి 1. మహేంద్రవర్మ శైలి, 2. మామల్ల శైలి, 3. రాజసింహశైలి, 4. నందివర్మ శైలి.

5.10.1 **మొదటి దశ:** మహేంద్రవర్మ శైలి మహేంద్ర వర్మ కాలానికి చెందింది. ఇతడు ఆంధ్రదేశంలోని కృష్ణా నదీతీరంలో గల ఉండవల్లి గుహాలయాను అనుసరించి కొండలను తొలచి ఆలయాలను నిర్మించే పద్ధతిని తమిళదేశంలో ప్రవేశపెట్టాడు. ఈ దశలో మహాబలిపురం లోని వరాహ, దుర్గ మండపాలు, మహేంద్రవాడి, మందగపట్టు, పల్లం, పల్లవరం, మామండూరు, దళవానూరలలో గృహలయాలు నిర్మించబడ్డాయి. ఇటుక, మట్టి, కలప, లోహం లేకుండా మందగప్పట్టులో ఒక ఆలయాన్ని బ్రహ్మ, విష్ణు, శివుల కంకితంగా నిర్మించారు. చెన్నై సమీపంలోని పల్లవరం దగ్గర 5 గదుల విశాలమైన గుహాలయాన్ని మహేంద్రవర్మ తొలపించారు. మహేంద్రవాడిలోని విష్ణుగృహం, పేరున్న గుహాలయం, ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని శృంగవరం దగ్గర రంగనాధస్వామి ఆలయాలు ఇతని కాలంలో నిర్మించినవే. స్తంభమండప సహిత గుహాలయాలు, పరిమితమైన రూప శిల్పాలంకరణ మహేంద్రశైలి లక్షణాలు.

5.10.2 **రెండవ దశ:** మామల్ల శైలి నరసింహవర్మ కాలానికి చెందింది. నరసింహవర్మ కాలంలోని పల్లవుల నిర్మాణాలను గుహాలయాలు, ఏకశిలా రథాలు, వర్ణచిత్రాలని మూడు వర్గాలుగా విభజించవచ్చు.

మహాబలిపురంలోని పంచపాండవ రథాలు, గంగావతరణ శిల్పం మొదలయినవి నరసింహవర్మ కాలానికి చెందిన నిర్మాణాలు. మహాబలిపురంలోని ధర్మరాజ, భీమ, అర్జున, ద్రౌపది, సహదేవ రథాలను పాండవుల రథాలంటారు. ఇవి ఏక శిలారథాలు. అర్జున రథం సమీపంలో ఒకే అధిష్టానం పై ద్రౌపది రథం కూడా

నిర్మించారు. ఇవి పూర్తిగా గుడిసె ఆకారపు కప్పుతో ద్రావిడ విమాన భాగాలలో ముఖ్యమైన దేవకోష్టాన్ని పోలి ఉంటాయి. ఇవేకాక పిడారి రథాలు రెండు, గణేశరథం, వలయ్యాని కుట్టి రథం, మరొక అసంపూర్తి రథాలను మహాబలిపురంలో చూడవచ్చు. మహాబలిపురంలోని పదిశిలామండపాలు కూడా నరసింహవర్మ కాలానికి చెందినవే. అవి ధర్మరాజు మండపం, కొటికల్ మండపం, మహిషాసుర మండపం, కృష్ణమండపం, పంచపాండవ మండపం, వరాహమండపం, రామానుజ మండపం, రెండు గదులు శైవ మండపం, రెండు అసంపూర్ణ మండపాలు.



**మహాబలిపురంలోని ఏకశిలారథాలు**

**5.10.3 మూడవ దశ:** పల్లవ వాస్తు కళాచరిత్రలో 3వ దశ రాజసింహదశ. ఇది రెండవ నరసింహవర్మకాలానికి చెందింది. మహాబలిపురంలోని తీర దేవాలయం, ఈశ్వరాలయం, ముకుందాలయం కాంచీపురంలోని కైలాసనాథ ఆలయం, వైకుంఠ పెరుమాళ్ ఆలయం, దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని నిరుణమలై ఆలయం ఈ దశకు చెందినవి. తీర దేవాలయం, కైలాసనాథాలయం, వైకుంఠ పెరుమాళ్ ఆలయాలు పల్లవవాస్తుశైలి పరిణామంలో రాజసింహ శైలికి చెందిన అతిముఖ్యమైన ఉదాహరణలు. తీరదేవాలయ నిర్మాణ ప్రధానోద్దేశం ఉదయించే సూర్యుడి కిరణాలు ఆలయాన్ని స్పర్శించడం. తీర దేవాలయం దక్షిణ భారతదేశ ఆలయాలలో మకుటాయ మానమైనది. ముగ్గురు మూర్తులున్నందువల్ల ఈ ఆలయాన్ని త్రిమూర్తి కోయిల్ అన్నారు. తూర్పు దిశలో క్షత్రియ సింహ పల్లవేశ్వర గృహం', పశ్చిమాన ' రాజసింహ పల్లవేశ్వర గృహం', మధ్యలో సమతల కప్పుగల 'నరపతి సింహపల్లవ విష్ణు గృహం' ఉన్నాయి. ఆలయానికి అంతరాళం, గర్భగృహం ఉన్నాయి. స్తంభాల కింది భాగంలో సింహాలున్నాయి. ఈ ఆలయం పై అసంఖ్యాకమైన శిల్పాలున్నాయి. నాలుగు అంతస్తులతో సమచతుస్రాకారపు ద్రావిడ విమానం ఉంది. ప్రాకారాన్ని ఆనుకొని చిన్న ఆలయాలు ఎన్నో ఉన్నాయి.

**5.10.4 నాల్గవ దశ:** నందివర్మ, అపరాజితవర్మ కాలానికి చెందినది. కంచిలోని ముక్తేశ్వ, మతంగేశ్వరాలయాలు, ఒగ్గడంలోని వాడమల్లేశ్వరాలయం, తిరుత్తణిలోని విరత్తనేశ్వరాలయం, గుడిమల్లంలోని పరమేశ్వరాలయం మొదలయినవి ఈ దశకు చెందిన ఆలయాలలో ముఖ్యమైనవి.

## 5.11 శిల్పాలు:

పల్లవులు దేవాలయాలతో పాటు అద్భుతమైన శిల్పాలను సృష్టించారు. పల్లవుల శిల్పాలలో ముఖ్యమైనవి దుర్గ, మహిషాసురమర్ధని, వరాహ, శివ, విష్ణు, గజలక్ష్మి, గణేశ, సప్త మాతృకలు ముఖ్యమైనవి. పల్లవుల శిల్పాలన్నింటిలో సుప్రసిద్ధమైనది మహాబలిపురంలోని గంగావతరణశిల్పం. దీనినే కొంతమంది అర్జునుని తపస్సుగా భావించారు. గ్రూసెట్ అనే ప్రసిద్ధ శిల్పకళా విమర్శకుడు గంగావతరణ శిల్పాన్ని శిలలో రూపొందించిన కుడ్య చిత్రమని ప్రశంసించాడు. గంగ అవతరణ కోసం భగీరథుడు తపస్సు చేసిన దృశ్యాన్ని, గంగావతరణను, ఈ శిల్పంలో పొందుపరచారు. పై భాగంలో చంద్ర, సూర్య, గంధర్వ, అప్సరస, యక్షిణి మొదలయిన వారి శిల్పాలున్నాయి. శిల్పం కింది భాగాన ఏనుగులు, కోతుల గుంపులు ఉన్నాయి.

## 5.12 చిత్ర కళ:

పల్లవులు శిల్ప కళతో బాటు చిత్రకళను కూడా ఆదరించారు. చిత్తన్న వాసల్ గుహలోని వర్ణచిత్రాలు మామల్లపురం (ఆదివరాహగుహాలయం), మామండూరు, కంచిలోని వైకుంఠ పెరుమాళ్ ఆలయంలోని వర్ణచిత్రాలు పల్లవులు కాలంనాటివే. ఈ చిత్రాలు అజంతా చిత్ర శైలిని గుర్తుకు తెచ్చే విధంగా రూపొందించబడ్డాయి. మహేంద్రవర్మ కాలంలో ప్రారంభమయిన పల్లవ శిల్ప సంప్రదాయాలు అభివృద్ధి చెంది, చోళుల కాలం నాటికి మరింత వికసించాయి.

## 5.13 సారాంశము:

పల్లవుల పరిపాలనా విధానం చాలా వరకు శాతవాహనులపాలనా విధానాన్ని పోలి ఉంది. పాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని వివిధ పాలనా విభాగాలుగా విభజించారు. పల్లవ రాజ్యంలో గ్రామ సభలుండేవి. ప్రజల ముఖ్యవృత్తి వ్యవసాయం. పల్లవ రాజులు వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల వసతులు కల్పించారు. ఆ నాడు ఎన్నో కుటీర పరిశ్రమలుండేవి. శ్రేణులు ఏర్పడ్డాయి. భూమి శిస్తు రాజ్యానికి ప్రధాన ఆదాయ మార్గం. అష్టాదశ పన్నులను వసూలు చేయడం జరిగింది.

పల్లవులు వర్ణాశ్రమ ధర్మాలను కొనసాగించారు. వీరు వైదిక మతాభిమానులు. వైదిక మతంతోపాటు జైన, బౌద్ధ మతాలున్నాయి. అయితే వాటి ప్రాధాన్యం తగ్గింది. నాయనార్లు, ఆళ్వార్లు శైవం, వైష్ణవ మతాలను ప్రచారం చేశారు.

సంస్కృత భాష రాజ భాషగా కొనసాగింది. వీరి కాలంలో సాహిత్యం ఇతోధికంగా అభివృద్ధి జరిగింది. మహేంద్ర వల్ల స్వయంగా కవి, మత్త విలాస ప్రహసనం రచించాడు. భారవి కిరాతార్జునీయం, దండి దశకుమార చరిత్రమ్ ఈ కాలం నాటివే. పల్లవులు రాతితో మలచిన గుహాలయములకు ప్రసిద్ధి చెందారు. మహాబలి పురంలోని సముద్ర తీర దేవాలయం, కంచిలోని కైలాసనాథ్ దేవాలయం పల్లవుల కాలం నాటి ప్రసిద్ధి దేవాలయములు.

## 5.14 మాదిరి ప్రశ్నలు:

1. పల్లవుల కాలం నాటి ఆర్థిక, సాంఘీక పరిస్థితులను వివరించండి.
2. పల్లవుల కాలం నాటి మత పరిస్థితులను తెలియపరచండి.
3. దక్షిణ భారత సంస్కృతికి పల్లవుల సేవ ఎట్టిది?

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1. మహాబలి పురం గురించి తెలియపరచండి.
2. పల్లవుల పాలనా వ్యవస్థను పేర్కొనండి.

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. పల్లవుల రాజధాని ( )

   ఎ) కంచి బి) తంజావూరు సి) మధుర డి) మహాబలి పురం

2. కిరాతార్జునీయం రచయిత ( )

   ఎ) దండి బి) భారవి సి) తిరువళ్ళూర్ డి) మహేంద్ర వర్మ

3. ఆళ్వార్లు ప్రచారం చేసిన మతం ( )

   ఎ) శైవం బి) వైష్ణవం సి) జైనం డి) బౌద్ధం

**ఖాళీలను పూరించండి:**

1. పల్లవుల కాలం నాటి విద్యా సంస్థలు ..................

2. పల్లవుల రాజ భాష .........................

3. పంచ పాండవ రథాలు .................................లో నిర్మించబడ్డాయి.

## 5.15 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - A History of South India
2. Romila Thapar - History of India
3. Srinivasan K.R. - South Indian Temples
4. Yazdani G. (Ed.) - The Early History of The Deccan



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ బాలినేని వాణి**

**UNIT - IV**

**భారతదేశం**
**(క్రీ.శ. 3వ శతాబ్దం నుండి క్రీ.శ. 8వ శతాబ్దం వరకు)**

**పరిచయం:**

భారతదేశ చరిత్రలో మరొక ముఖ్య ఘట్టము క్రీ.శ. 3వ శతాబ్దంలో గుప్త సామ్రాజ్యం ఏర్పడటం. గుప్తులు క్రీ.శ. 3వ శతాబ్దం నుంచి క్రీ.శ. 6వ శతాబ్దం వరకు పరిపాలించి, పతనమైన తరువాత మరొక పర్యాయం హుణులు దండయాత్ర చేసి, రాజ్యాలను చిన్నాభిన్నం చేశారు. క్రీ.శ. 7వ శతాబ్దం (క్రీ.శ. 606)లో పుష్యభూతి వంశానికి చెందిన హర్షుడు దాదాపు 40 సంవత్సరాలు పరిపాలించి, ఉత్తర భారతదేశాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకొని, 'సకలోత్తరాపథీశ్వర' అనే బిరుదు పొందినా, ఇది తాత్కాలికమే. హర్షుని తరువాత క్రీ.శ. 712లో భారతదేశం పై మొదటిసారిగా అరబ్బులు దండయాత్ర చేయటంతో దేశంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. ఇదే సమయంలో రాజులతోటి తన అంతర్గత కలహాలతో 8 కుటుంబాలుగా విడిపోయి పరిపాలించారు. ఉదా॥ పాల వంశీయులు, ప్రతీహారులు, ఛందేలులు మొదలగున్నవి.

ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితి భూస్వామ్య పరిస్థితులతో దిగజారిపోయి, గ్రామాలు స్వయం పోషకాలై, ప్రాంతీయ సంస్కృతులు, ప్రాంతీయ భాషలు, ప్రాంతీయ మత శాఖలు బయలుదేరినవి. దీనికి తోడు విదేశీ సంస్కృతి ప్రభావం భారతదేశ సమాజం, సంస్కృతుల పై బాగా చూపించినది. ఈ కాలం ముఖ్యంగా సైనిక దృక్పథపరంగా నడిచింది. మతాధిక్యత పెరిగినది.

----------------

## యూనిట్ - 4

## పాఠం - 1

# గుప్త సామ్రాజ్యం

### 1.0 లక్ష్యం:

గుప్త సామ్రాజ్యం ఆవిర్భావం, గుప్త రాజుల చరిత్ర వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

### పాఠ్య నిర్మాణ క్రమం:


1.1 ఉపోద్ఘాతము
1.2 ఆధారాలు
1.3 పుట్టుపూర్వోత్తరాలు
1.4 శ్రీ గుప్తుడు
1.5 మొదటి చంద్ర గుప్తుడు
1.6 సముద్ర గుప్తుడు
1.7 దండ యాత్రలు
1.7.1 మొదటి ఆర్యావర్త దండయాత్ర
1.7.2 రెండో ఆర్యావర్త దండయాత్ర
1.7.3 దక్షిణ దేశ దండయాత్ర
1.7.4 ఆటవిక రాజ్యాలు
1.7.5 సరిహద్దు రాజ్యాలు
1.7.6 గణ రాజ్యాలు
1.7.7 విదేశీ రాజ్యాలు
1.7.8 బౌద్ధ విహారానికి అనుమతి
1.7.9 అశ్వమేధ యాగం
1.8 సామ్రాజ్య విస్తీర్ణం
1.9 మత సహనం
1.10 గుణ గణాలు
1.11 రెండో చంద్ర గుప్త విక్రమాదిత్యుడు
1.11.1 సింహాసనం అధిష్టించుట
1.11.2 వివాహ సంబంధాలు
1.11.3 విజయాలు
1.11.4 ఫాహియాన్ రాక
1.11.5 నవరత్నాలు
1.12 సామ్రాజ్య క్షీణత
1.13 ఫాహియాన్
1.14 సారాంశము
1.15 మాదిరి ప్రశ్నలు
1.16 ఉపయుక్త గ్రంథాలు

## 1.1 ఉపోద్ఘాతము:

గుప్తుల పాలనాకాలానికి భారతదేశ చరిత్రలో ఒక విశిష్టమైన స్థానం ఉంది. కుషాణ్ రాజ్య పతనానంతరం భారతదేశంలో ప్రత్యేకించి, ఉత్తర భారతదేశంలో క్రీ.శ. నాల్గవ శతాబ్దం వరకు సామ్రాజ్యాధికార స్థాపనకు ఏ రాజవంశం కృషి చేయలేదు. ఈ పరిస్థితులలో క్రీ.శ. నాల్గో శతాబ్ది ప్రథమభాగంలో మగధలో గుప్తరాజ్య స్థాపన జరిగింది. గుప్తరాజ్య స్థాపన జరిగేనాటికి ఉత్తర భారతదేశంలో చిన్న చిన్న రాజ్యాల స్థాపన జరిగింది. ఇటువంటి చిన్న రాజ్యాల పాలకుల అసమర్ధతవల్ల, రాజకీయ అనైక్యత నెలకొని ఉంది. రాజకీయాధిక్యత కోసం రాజులు తరచుగా యుద్ధాలు చేస్తూ ఉండేవారు.

రాజకీయ అనైక్యత నెలకొని ఉన్న అలాంటి పరిస్థితులలో రాజకీయ సమైక్యతను ఏర్పరచి, రాజకీయంగా, సాంస్కృతికంగా, శాస్త్ర సాంకేతికరంగాలలో, వాస్తుకళా నైపుణ్యంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించి, హిందూ మతాన్ని పునరుజ్జీవింపచేసి నాల్గో శతాబ్దం నుంచి ఆరో శతాబ్దం వరకు అవిచ్ఛిన్నంగా పాలించిన పాలకులే గుప్తులు. తద్వారా ఉత్తర భారతదేశంలో ఒక ప్రత్యేకమైన విశిష్ట సంస్కృతి ఏర్పడడానికి గుప్తులు కారకులయ్యారు. అందువల్ల కొందరు చరిత్రకారులు గుప్తుల కాలాన్ని స్వర్ణయుగంగా వర్ణించారు.




గుప్త సామ్రాజ్యం

## 1.2 ఆధారాలు:

గుప్తుల చరిత్రను అధ్యయనం చేయడానికి అనేక వాఙ్మయ, పురావస్తు ఆధారాలు లభ్యమవుతున్నాయి. గుప్తుల వంశ క్రమాన్ని, పాలనా కాలాన్ని గురించి మత్స్య, వాయు, విష్ణు పురాణాలు తెలియచేస్తున్నాయి. విశాఖదత్తుని ముద్రారాక్షసం, దేవీ చంద్రగుప్తం, కాళిదాసు అభిజ్ఞానశాకుంతలం, రఘువంశం, చైనా యాత్రికుడు పాహియాన్ రచనలు, బాణుని హర్షచరిత్ర ఆనాటి కాల పరిస్థితులను వివరిస్తాయి. కాత్యాయన, నారద, బృహస్పతి స్మృతులు, ధర్మశాస్త్రాలు నాటి న్యాయ విధానం, ప్రజల ధర్మాలు, కట్టుబాట్లు తెలుసుకొనేందుకు ఆధారంగా ఉన్నాయి. అలాగే గుప్తుల కాలంలో నాటి అలహాబాద్, ఇరాన్, ఉదయగిరి, సాంచి, సారానాథ్, మధుర, బితారి, జునాగడ్ ప్రాంతాలలో లభించిన శాసనాలు, గుప్త రాజులు జారీ చేసిన బంగారు, వెండి, రాగి, నాణాలు ఆనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు తెలుసుకొనేందుకు సాయపడుతున్నాయి. గుప్త ప్రభువులు నిర్మించిన దేవాలయాలు, ఉపయోగించిన ముద్రలు, అజంతా, ఎల్లోరా గుహల్లోని చిత్రాలు ఆకాలంనాటి వాస్తుశిల్పం, చిత్రలేఖనాలను గురించి అధ్యయనం చేసేందుకు తోడ్పడుతున్నాయి.

## 1.3 పుట్టుపూర్వోత్తరాలు:

గుప్తవంశ ప్రారంభ చరిత్ర గురించిగానీ, వారి పుట్టుపూర్వోత్తరాల విషయంలోగాని చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. గుప్తుల ప్రస్తావన శుంగ, శాతవాహన వంశపు రాజుల శాసనాల్లో కనిపిస్తుంది. అయితే ఈ శాసనాల్లోని గుప్తులకు, సామ్రాజ్యాన్ని స్థాపించిన గుప్తులకు సంబంధం ఉందా లేదా అనే విషయం స్పష్టంగా తెలియరావడం లేదు. కానీ వీరికి, శాతవాహనకాలం నాటి గుప్త పేరుగల వారికి సంబంధం ఉందని రాయ్ చౌదరి అభిప్రాయపడ్డాడు. గుప్తులు పంజాబ్ లోని జాట్ తెగవారని జయస్వాల్ అభిప్రాయం. గుప్తులను క్షత్రియులుగా చటోపాధ్యాయ వర్ణించాడు. వీరిని వైశ్యులుగా కొంతమంది, బ్రాహ్మణులుగా మరికొంత మంది భావించారు. గుప్తుల పుట్టుపూర్వోత్తరాలు అస్పష్టంగా ఉన్నాయని, వారు తొలుత సంపన్నులైన భూస్వాములై ఉండి, క్రమంగా మగధ ప్రాంతంలో రాజకీయాధికృతను పొంది ఉండవచ్చని, వారిది రాచ పుట్టుకకాదని రొమిల్లా థాపర్ అభిప్రాయపడ్డారు. అయితే నిర్దిష్టమైన ఆధారాలు లభించేవరకు వారి పుట్టుపూర్వోత్తరాలు, జన్మస్థలం మొదలయినవాటిని గురించి నిర్ణయించడం సమంజసం కాదని ఎక్కువ మంది చరిత్రకారుల అభిప్రాయం.

## 1.4 శ్రీగుప్తుడు:

గుప్తవంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. ఇతడు పాటలీపుత్రం, దాని పరిసర ప్రాంతాలలో స్వతంత్రపాలన సాగించినట్లు తెలుస్తుంది. శ్రీగుప్తుడు మహారాజ బిరుదాంకితుడు. అందువల్ల అతడు సామంతరాజై ఉండాలి. అయితే ఎవరికి సామంతరాజు అనే విషయం స్పష్టంగా తెలయడంలేదు. చైనా యాత్రికుల కోసం శ్రీగుప్తుడు మృగశిఖవనంలో ఒక దేవాలయాన్ని నిర్మించి, దాని నిర్వహణకు **24** గ్రామాలు దానం చేసినట్లు ఇత్సింగ్ పేర్కొన్నాడు. శ్రీగుప్తుని కుమారుడు ఘటోత్కచ గుప్తుడు. ఇతడు క్రీ.శ. **319** వరకు పాలించాడు. ఘటోత్కచుని కుమారుడే మొదటి చంద్రగుప్తుడు.

## 1.5 మొదటి చంద్రగుప్తుడు (క్రీ.శ. 319-335):

గుప్త వంశంలో మొదటి స్వతంత్ర పాలకుడు మొదటి చంద్రగుప్తుడు. ఇతడికి 'మహారాజాధిరాజ' అనే బిరుదు ఉంది. ఈ బిరుదే చంద్రగుప్తుని స్వతంత్రపాలనకు, సార్వభౌమత్వానికి ప్రతీక. లిచ్ఛవుల రాకుమారి కుమారీ దేవిని వివాహమాడడంవల్ల, క్షత్రియులైన లిచ్ఛవీ వంశస్థుల సహకారం చంద్రగుప్తుడికి లభించింది. లిచ్ఛవులతో బాంధవ్యం కారణంగా గుప్త సామ్రాజ్యానికి సుస్థిరత ఏర్పడిందని చెప్పవచ్చు. చంద్రగుప్తుడు ముద్రించిన బంగారు

నాణాల వల్ల నాటి ఆర్థికపరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని తెలుస్తుంది. నాణాల పై ఒకవైపు తన బొమ్మను - రెండో వైపున రాణి కుమారదేవి బొమ్మను ముద్రింపచేశాడు. చంద్రగుప్తుడు క్రీ.శ. 319లో గుప్త శకాన్ని ప్రారంభించి, క్రీ.శ. 335 వరకు పరిపాలించాడు.

## 1.6 సముద్రగుప్తుడు (క్రీ.శ. 335-380):

సముద్రగుప్తుడు గుప్త పాలకులందరిలో అగ్రగణ్యుడు. సువిశాల సామ్రాజ్య నిర్మాత, యోధుడు, రాజనీతి దురంధరుడు. మొదటి చంద్రగుప్తుడి అనంతరం అతని కుమారుడైన సముద్రగుప్తుడు గుప్త సింహాసనాన్ని అధిష్టించాడు. కానీ, కచ అనే సోదరుడితో వారసత్వ యుద్ధం జరిగిందని, విజయం సాధించిన సముద్రగుప్తుడు సింహాసనాన్ని అధిష్టించాడని కొందరు చరిత్రకారులు భావించగా, మరికొందరు కచ అనేది సముద్రగుప్తుని బిరుదని, కచుడు - సముద్రగుప్తుడు ఒక్కరేనని అభిప్రాయపడ్డారు.

## 1.7 దండయాత్రలు:

సముద్రగుప్తుడు గొప్ప సామ్రాజ్య నిర్మాత. భారతదేశాన్నంతటినీ జయించాలనేది అతడి ఆశయం. అందుకోసం అతడు అనేక దిగ్విజయ యాత్రలు జరిపాడు. హరిసేనుడు సంకలనం చేసిన అలహాబాద్ స్థంభశాసనం సముద్రగుప్తుడి విజయాలను, సమకాలీన రాజకీయ పరిస్థితులను గురించి వివరిస్తుంది.

**1.7.1 మొదటి ఆర్యావర్త దండయాత్ర:** తన దండయాత్రలలో భాగంగా సముద్రగుప్తుడు మొదట ఆర్యావర్తం పై దండెత్తి అచ్యుతనాగ, నాగసేన, గణపతినాగలను ఓడించాడు. తరువాత శ్రావస్థని పాలిస్తున్న కోట వంశస్థులను ఓడించి, వారి రాజ్యాన్ని తన రాజ్యంలో విలీనం చేసుకున్నాడు.

**1.7.2 రెండవ ఆర్యావర్త దండయాత్ర:** అనంతరం ఉత్తర భారతదేశంలో తొమ్మిది మంది రాజులు రుద్రదేవుని నాయకత్వంలో కూటమిగా ఏర్పడగా, సముద్రగుప్తుడు రెండో ఆర్యావర్త దండయాత్రను ప్రారంభించి, కౌశాంబి యుద్ధంలో వారిని ఓడించి, ఉత్తరభారతదేశం పై తన అధికారాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. ఈ యుద్ధంలో రుద్రదేవుడు వధించబడ్డాడు. విష్ణు పురాణంలో పేర్కొనబడ్డ నవ నాగులు ఈ కూటమిలోని 9 మంది రాజులేనని రాప్సన్ పండితుడి అభిప్రాయం.

**1.7.3 దక్షిణదేశ దండయాత్ర:** అనంతరం దక్షిణాపథం పై దండెత్తి 12 మంది రాజులను ఓడించి, వారిని తన సామంతులుగా చేసుకొని, వారి రాజ్యాలను తిరిగి వారికే అప్పగించాడు. వారు 1. కోసల మహేంద్రుడు, 2. మహాకాంతార వ్యాఘ్రరాజు, 3. కురాల మంతరాజు, 4. పిఠాపురం మహేంద్ర, 5. గిరికొత్తూర రాజ్యం స్వామిదత్తుడు, 6. ఎరండవల్లి దమనుడు, 7. కంచి విష్ణుగోపుడు, 8. అవముక్త రాజ్యం నీలరాజు, 9. వేంగి హస్తివర్మ, 10. పాలక్కన్ రాజు ఉగ్రసేనుడు, 11. దేవరాష్ట్రం కుబేరుడు, 12. కుశస్థలపురం ధనుంజయుడు.

దక్షిణ దేశంలో తాను ఆక్రమించిన రాజ్యాలను సామ్రాజ్యంలో విలీనం చేయకుండా ఆయా రాజ్యాల నుండి సముద్ర గుప్తుడు కప్పం మాత్రమే స్వీకరించి, వారిని తన సామంతులుగా చేసుకున్నాడు. ఈ విధంగా సముద్ర గుప్తుడు "గ్రహణం - మోక్షం - అనుగ్రహం" అనే విధానాన్ని పాటించడం జరిగింది.

**1.7.4 ఆటవిక రాజ్యాలు:** దక్షిణదేశ దిగ్విజయ యాత్రల తరవాత సముద్రగుప్తుడు తన దృష్టిని ఆటవిక రాజ్యాల పై కేంద్రీకరించాడు. ఈ దాడిలో ఉత్తర, దక్షిణ దేశాల మధ్యనున్న 18 ఆటవిక రాజ్యాలను ఓడించి, ఆక్రమించడం జరిగిందని ఎరాన్ శాసనంలో చెప్పబడింది.

**1.7.5 సరిహద్దు రాజ్యాలు:** సముద్రగుప్తుని విజయాలను విని, సరిహద్దు రాజ్యా లైన సమతత, దావక, కామరూప, నేపాల్, కర్తిపుర ప్రభువులు సముద్రగుప్తుని సామంతత్వాన్ని అంగీకరించడం జరిగింది.

**1.7.6 గణ రాజ్యాలు:** అలాగే గణ రాజ్యాలైన అర్జునాయనులు, యౌధేయులు, మద్రకులు, మాళవులు, అభీరులు, ప్రార్జునులు, సనకనికులు, కాకలు, ఖర పరికులు సముద్ర గుప్తుని సామంతత్వాన్ని అంగీకరించారు. వీరు సముద్ర గుప్తుడికి కప్పం చెల్లించి, అతడి ఆజ్ఞలను పాటించటం జరిగింది.

**1.7.7 విదేశీ రాజ్యాలు:** సముద్ర గుప్తుని విజయాలను, పేరు ప్రఖ్యాతులను గాంచిన అనేక మంది విదేశీ పాలకులు సైతం అతడితో మైత్రిని కాంక్షించి, కానుకలు సమర్పించి స్నేహ సంబంధాలను కోరుకోవడం జరిగింది. అలాంటి వారిలో కాబూల్‌ను పాలించు కుషాణులు, సౌరాష్ట్రాన్ని ఏలు శకులు, సింహళ రాజు మేఘవర్ణుడు, జావా, సుమిత్ర అధిపతులు ముఖ్యులు.

**1.7.8 బౌద్ధ విహారానికి అనుమతి:** సింహళ పాలకుడు మేఘవర్ణుడు, బుద్ధగయలో బౌద్ధ విహారాన్ని సముద్రగుప్తుడి అనుమతితో నిర్మించాడని చైనా ఆధారాలవల్ల తెలుస్తుంది.

**1.7.9 అశ్వమేథ యాగం:** ఈ విజయాలకు సూచికంగా సముద్రగుప్తుడు అశ్వమేధయాగాన్ని నిర్వహించి, యాగాశ్వ ప్రతిమతో బంగారు నాణాలను ముద్రించాడు. ఇట్టి పరాక్రమవంతుడైనందునే విన్సెంట్ స్మిత్ సముద్రగుప్తుడ్ని 'ఇండియన్ నెపోలియన్' అని పేర్కొన్నాడు. వాస్తవ దృష్టితో ఆలోచిస్తే సముద్రగుప్తుడు, నెపోలియన్ కంటే గొప్పవాడు, ఓటమి ఎరుగని ధీరుడు.

## 1.8 సామ్రాజ్య విస్తీర్ణం:

అనేక విజయాల కారణంగా సముద్ర గుప్తుని సామ్రాజ్యం ఉత్తరాన హిమాయాల నుండి దక్షిణాన నర్మద నది వరకు, పడమర తూర్పు పంజాబ్, చంబల్ నదీ లోయ నుండి తూర్పున బ్రహ్మపుత్ర నది వరకు విస్తరించి, విశాల సామ్రాజ్యంగా అవతరించింది.

## 1.9 మత సహనం:

సముద్ర గుప్తుడు వైష్ణవ మతాభిమాని. అయినప్పటికీ పరమత సహన విధానాన్ని అనుసరించాడు. ప్రఖ్యాత బౌద్ధ పండితుడు వసుబంధుడు సముద్ర గుప్తుడిచే ఆదరించబడ్డాడు. అలాగే బుద్ధ గయలో బౌద్ధ విహారం నిర్మాణానికి సింహళ రాజు మేఘవర్ణుడిని అనుమతినివ్వడం జరిగింది.

## 1.10 గుణ గణాలు:

అలహాబాద్ ప్రశస్తి ద్వారా సముద్ర గుప్తుడు సునిశిత మేధో ప్రజ్ఞ కలవాడని తెలుస్తుంది. ఇతడు స్వయంగా కవి, కవి రాజ బిరుదాంకితుడు. వీణ వాయిస్తున్నట్లు ఉన్న సముద్ర గుప్తుడి ప్రతిమ గల బంగారు నాణేల వల్ల అతడికి సంగీతం పట్ల అభిమానం, అభినివేశం కలదని తెలుస్తుంది.

సముద్ర గుప్తుడు గొప్ప విజేత, పాలనాదక్షుడు, యోధుడు, కవి, సంగీత విద్వాంసుడు. అతడి సైనిక విజయాలు ఎంత ఘనమైనవో, వ్యక్తిగత గుణగణాలు కూడా అంతకంటే ప్రశంసనీయమైనవి.

## 1.11 రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడు (క్రీ.శ. 380-414):

గుప్త చక్రవర్తుల్లోనే గాక భారతదేశాన్ని పాలించిన పాలకులలో ప్రముఖుడు రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడు. ఇతడు విక్రమాదిత్య, పరమ భాగవత, సాహసాంక, శకారి బిరుదులు ధరించాడు. దేవగుప్త, దేవశ్రీ, దేవరాజు అనే పేర్లు కూడా ఇతడికి ఉన్నాయి.

**1.11.1 సింహాసనం అధిష్టించుట:** సముద్రగుప్తుడి మరణానంతరం అతడి పెద్ద కుమారుడైన రామగుప్తుడు సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు దుర్బులుడు. శకులతో ఓడి, తన భార్య ధృవాదేవిని శకరాజు వశం చేయడానికి అంగీకరించగా, తమ వంశ ప్రతిష్టను కాపాడేందుకై రామగుప్తుని సోదరుడు రెండో చంద్రగుప్తుడు,

రామగుప్తుడ్ని హతమార్చి, శకులను పారద్రోలి, ధృవాదేవిని రక్షించాడని విశాఖదత్తుని "దేవీ చంద్రగుప్తం" అనే కావ్యంవల్ల తెలుస్తుంది. ఇందులో చారిత్రక సత్యమెంతో చెప్పడం కష్టం.

**1.11.2 వివాహ సంబంధాలు:** వివాహ సంబంధాలు చంద్రగుప్తుని జీవితంలో కీలకపాత్ర పోషించాయి. ఇతడు నాగవంశపు రాకుమార్తె కుబేరనాగను వివాహమాడినందువల్ల, మధ్య భారతంలో బలవంతులైన నాగరాజుల సహాయ సంపత్తులు అతడికి లభించాయి. అలాగే తన కుమార్తె ప్రభావతి గుప్తను వాకాటకరాజైన రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం జరిపించాడు. దీంతో వాకాటకుల నుంచి గుప్తరాజ్యానికి ఎటువంటి ప్రమాదం లేకుండాపోయింది. ఈ వివాహ సంబంధాల గుప్తుల అధికారాన్ని, వైభవాన్ని పెంపొందించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

**1.11.3 విజయాలు:** రెండో చంద్రగుప్తుడు మొదట మాళ్వాను జయించి, తన రాజధానిని పాటలీపుత్రం నుంచి ఉజ్జయినికి మార్చాడు. అనంతరం శకరాజు రుద్ర సింహుడి పై దండెత్తి ఘనవిజయం సాధించాడు. గుజరాత్, సింధు రాజ్యంపై దండయాత్ర జరిపి, వాటి పాలకులైన శకక్షాత్రపులను ఓడించి, ఉత్తరభారతదేశంలో రాజకీయ ఐక్యతను సాధించాడు. మెహరౌలి శాసనంలో చంద్రగుప్తుడు వంగరాజ్యకూటమిని అణచివేశాడని, సప్తసింధును దాటి బాక్ట్రియా రాజ్యాన్ని జయించాడని చెప్పడం జరిగింది.

**1.11.4 పాహియాన్ రాక:** చంద్రగుప్తుడి కాలంలోనే చైనా బౌద్ధ యాత్రికుడు పాహియాన్ (క్రీ.శ. 399-414) భారతదేశాన్ని సందర్శించడం జరిగింది.

**1.11.5 నవ రత్నాలు:** రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడి ఆస్థానంలో 'నవరత్నాలు' అనే కవులున్నారని ప్రతీతి. కాళిదాసు వారందరిలోను అగ్రగణ్యుడు. విన్సెంట్ స్మిత్ అతడిని "ఇండియన్ షేక్ స్పియర్"గా అభివర్ణించాడు. కాళిదాసు రచించిన కావ్యాలలో 'రఘువంశం', 'కుమారసంభం', 'మేఘసందేశం' ప్రజాదరణ పొందాయి. నాటకాలలో 'అభిజ్ఞాన శాకుంతలం', 'విక్రమోర్వశీయం', 'మాళవికాగ్నిమిత్రం' సుప్రసిద్ధమైనవి. అభిజ్ఞానశాకుంతలం మహాభారతంలోని కథనాధారంగా తీసుకొని, శకుంతల దుష్యంత చక్రవర్తుల సమాగమ వృత్తాంతాన్ని చిత్రీకరించడం జరిగింది. ప్రపంచ సారస్వతంలోని మొదటి నూరు గ్రంథాలలో అభిజ్ఞానశాకుంతలం ఒకటి అని విమర్శకుల అభిప్రాయం. రెండో చంద్రగుప్తుడి ఆస్థానాన్ని అలంకరించిన నవరత్నాలలో కాళిదాసుతోపాటు క్షపణికుడు, అమరసింహుడు, బేతాళభట్టు, ఘటకర్పరుడు, ధన్వంతరి, శంఖు, వరాహమిహిరుడు, ఆర్యభట్టు, వరరుచి, వసుబంధుడు, సుబంధుడు, బ్రహ్మగుప్తుడు ఉన్నట్లు భావించినా, వారందరూ గుప్త రాజుల ఆస్థానంలో వేర్వేరు కాలాలలో ఉన్నట్లు అనేకులు భావిస్తున్నారు.

## 1.12 సామ్రాజ్య క్షీణత/పతనం:

రెండో చంద్రగుప్తుడి అనంతరం కుమారగుప్తుడు, స్కందగుప్తుడు రాజ్యపాలన చేశారు. వీరికాలంలో గుప్త సామ్రాజ్యక్షీణత ప్రారంభమైంది. స్కందగుప్తుడి తరవాత పురుగుప్తుడు, నరసింహగుప్తుడు పరిపాలించడం జరిగింది. విష్ణుగుప్తుడు గుప్తవంశంలో చివరి పాలకుడు, అనాగరికులు, క్రూరులైన హూణులు తోరమాణుడి, మిహిరకులుడి నాయకత్వంలో గుప్త సామ్రాజ్యం పై తరచుగా జరిపినదాడుల ప్రభావంవల్ల రాజ్య క్షీణత ప్రారంభమైంది. అటు హూణుల దాడులతో పాటు రాష్ట్ర పాలకుల తిరుగుబాట్లు, పొరుగు రాజ్యాల దాడులు గుప్త సామ్రాజ్య పతనాన్ని త్వరితం చేశాయి.

## 1.13 పాహియాన్ (399-414 A.D.):

పాహియాన్ చైనా యాత్రికుడు. రెండో చంద్ర గుప్త విక్రమాధిత్యుడి కాలంలో భారత దేశాన్ని సందర్శించాడు. బుద్ధుడి జన్మ స్థలమైన భారతదేశంలో బౌద్ధ పవిత్ర క్షేత్రాలను సందర్శించి, బౌద్ధ మత గ్రంథాలను, బౌద్ధ ధాతువులను సేకరించేందుకు భారత దేశాన్ని సందర్శించడం జరిగింది.

పాహియాన్ 399లో చైనా నుండి బయలుదేరి దాదాపు 30 దేశాల గుండా, ఆరు సంవత్సరాలు ప్రయాణించి, పామీర్ పర్వత శ్రేణులను దాటి, తక్షశిల ద్వారా పెషావర్ చేరుకున్నాడు.

మూడేండ్ల పాటు పాటలీపుత్రంలో ఉండి, సంస్కృత భాషను నేర్చుకున్నాడు. అనంతరం ఆర్యావర్తంలో పర్యటించి, మధుర, తక్షశిల, పెషావర్, కపిలవస్తు, కుశి నగరం, నలందా, కాశీ నగరాలను దర్శించాడు. తాను చూసిన వీటన్నింటినీ, తన రచనలలో చక్కగా వివరించాడు. పాహియాన్ గ్రంథాలలో 'పాహియాన్ యాత్ర లేక రికార్డ్స్ ఆఫ్ బుద్ధిస్ట్ కింగ్ డమ్స్ (Records of Buddist Kingdoms) ప్రధానమైనది.

పాహియాన్ భారత పర్యటన కేవలం మతపరమైనది కావడంతో ఎక్కడా ఆనాటి గుప్త చక్రవర్తి రెండో చంద్ర గుప్తుడు విక్రమాదిత్యుడి పేరును ప్రస్తావించ లేదు. పాహియాన్ రచనల వల్ల ఆ నాటి దేశ పరిస్థితులు సవివరంగా తెలుస్తున్నాయి.

**షాహియాన్ రచనల్లో ముఖ్యాంశాలు:**

1. గుప్త చక్రవర్తులు ప్రజారంజకంగా పాలించారని, నాటి ప్రజలు సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో ప్రశాంత జీవనం సాగించారని తెలిపాడు.
2. పన్ను భారం తక్కువగా ఉండేదని, దేశంలో దొంగల బెడద లేదని, ప్రజలు అహింసాపరులని, శాఖాహారులని, వెల్లుల్లి, ఉల్లిని విసర్జించే వారని కీర్తించాడు.
3. ప్రజలు నీతివంతులని, ఇచ్చి పుచ్చుకోవడంలో ఎలాంటి పత్రాలు ఉపయోగించే వారు కారని పేర్కొన్నాడు.
4. శిక్షా స్మృతి కఠినంగా లేదని, సంఘంలో అస్పృశ్యత లేదని, మాంస భక్షణ చేసిన, మద్యం సేవించే వారిని ఛండాలురనే వారని, వారు నగరాలకు దూరంగా నివసించే వారని తెలిపాడు.
5. పట్టణాలలో ధనవంతులు, ప్రభువులు నెలకొల్పిన ఉచిత వైద్యశాలలుండేవని, రహదారుల పై సత్రాలు నిర్మించే వారని వ్రాశాడు.
6. గుప్తుల రాజధాని పాటలీపుత్రం మానవ మాత్రులచే కాక, దేవతలచే నిర్మించి ఉంటారని ప్రశంసించాడు.
7. పాటలీపుత్రంలో బౌద్ధారామాలున్నాయని, అక్కడ బౌద్ధ పండించులతో చర్చలు జరిగేవని తెలిపాడు.
8. గయ నిర్మానుష్యంగా ఉందని, శ్రావస్తి నగరంలో రెండు వందల కుటుంబాలు మాత్రమే మిగిలి ఉన్నాయని, పవిత్ర స్థలాలైన కపిలవస్తు, కుశి నగరాలు తమ శోభను కోల్పోయాయని పేర్కొన్నాడు.
9. బెంగాల్, బీహార్‌లలో బౌద్ధ మతం ఆదరణలో ఉన్నప్పటికీ, ఇతర ఆర్యావర్తంలో హిందూ మతం అభివృద్ధిలో ఉందని, ప్రజలలో ఇతర మతాల పై వ్యతిరేకత లేదని తెలిపాడు.

బౌద్ధ మతానికి చెందిన పవిత్ర గ్రంథాలను కొన్నింటిని సేకరించి, సింహళం, జావా ద్వీపాల మీదుగా పయనించి, 414లో పాహియాన్ స్వదేశం చైనా చేరుకున్నాడు. పాహియాన్ రచనలు భారతదేశ చరిత్ర పునఃర్నిర్మాణానికి ఎంతో ఉపకరిస్తున్నాయి.

## 1.14 సారాంశము:

భారతదేశ చరిత్రలో గుప్తుల యుగం ఒక నూతన అధ్యయనాన్ని సృష్టించింది. మొదటి చంద్రగుప్తుడు గుప్త సామ్రాజ్య నిర్మాత. సముద్ర గుప్తుడు అనేక విజయాల ద్వారా దాదాపు ఉత్తర భారతదేశాన్నంతా జయించాడు. దక్షిణ భారతదేశంలోని అనేక మంది రాజులను ఓడించి, విశాల సామ్రాజ్యాన్ని నిర్మించాడు. రెండో చంద్ర గుప్తుడు

గుప్తులలో గొప్ప రాజు. ఇతని కాలంలో 'నవరత్నాలు' అనే కవులున్నారని భావిస్తారు. రెండో చంద్ర గుప్తుడి కాలంలోనే పాహియాన్ భారతదేశాన్ని సందర్శించాడు. స్కంద గుప్తుడి తర్వాత గుప్త సామ్రాజ్యం అంతరించింది.

## 1.15 మాదిరి ప్రశ్నలు:

1. సముద్ర గుప్తుడి విజయాలను వివరించండి.
2. రెండో చంద్ర గుప్త విక్రమాదిత్యుడి గొప్పతనాన్ని అంచనా వేయండి.

**సంక్షిప్త ప్రశ్నలు:**

1. మొదటి చంద్ర గుప్తుడిని గూర్చి వ్రాయండి.
2. పాహియాన్ గురించి తెలపండి.
3. 'నవరత్నాలు' వివరాలు తెలపండి.

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. గుప్త వంశ స్థాపకుడు ...... ( )

ఎ) శ్రీ గుప్తుడు బి) సముద్ర గుప్తుడు సి) మొదటి చంద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

2. ఇండియన్ నెపోలియన్ అని ఎవరిని పిలుస్తారు? ( )

ఎ) శ్రీ గుప్తుడు బి) సముద్ర గుప్తుడు సి) మొదటి చంద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

3. నవరత్నాలు అనే కవులు ఎవరి ఆస్థానంలో ఉన్నారని భావిస్తారు? ( )

ఎ) శ్రీ గుప్తుడు బి) సముద్ర గుప్తుడు సి) మొదటి చంద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

4. అలహాబాద్ స్తంభ శాసనం ఎవరి విజయాలను వివరిస్తుంది? ( )

ఎ) శ్రీ గుప్తుడు బి) సముద్ర గుప్తుడు సి) మొదటి చంద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

5. పాహియాన్ ఎవరి పాలనా కాలంలో భారతదేశాన్ని సందర్శించాడు. ( )

ఎ) శ్రీ గుప్తుడు బి) సముద్ర గుప్తుడు సి) మొదటి చంద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

**జతపరచండి:**

| | | |
|---|---|---|
| 1. అభిజ్ఞాన శాకుంతలం | ( ) | ఎ) హరిసేనుడు |
| 2. అలహాబాద్ ప్రశస్తి | ( ) | బి) కాళిదాసు |
| 3. దేశీ చంద్ర గుప్తము | ( ) | సి) శూంద్రకుడు |
| 4. అమరకోశం | ( ) | డి) విశాఖదత్తుడు |
| 5. మృచ్ఛకటకం | ( ) | ఇ) అమర సింహుడు |

**ఖాళీలను పూరించండి.**

1. అశ్వమేథ యాగాన్ని నిర్వహించిన గుప్త రాజు ..................................
2. గుప్తుల చివరి పాలకుడు ........................
3. ధృవాదేవి ఎవరి భార్య? .............................
4. పంచ తంత్రం రచయిత .................................
5. శ్రీ గుప్తుని కుమారుడు ..........................

## 1.16 ఉపయుక్త గ్రంథాలు:


1. Gopal S.R. - A History of the Imperial Gupthas
2. Jha D. N. - Ancient India, An Introductory Outline
3. Majundar R.C. (Ed.) - The Age of Inperial Unity
4. Mookerji R.K. - The Gupta Empire
5. Nilkanta Sastri K.A. - Comprehensive History of India
6. Romila Thaper - A Hisotry of India
7. Sathiyanatha Aiyar R. - History of India



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

పాఠం - 2

# గుప్తుల పరిపాలన

## 2.0 లక్ష్యం:

గుప్తుల కాలం నాటి పరిపాలనా విధానాన్ని వివరించడమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:


2.1 ఉపోద్ఘాతము
2.2 ఆధారాలు
2.3 చక్రవర్తి
2.4 సామంతులు
2.5 మంత్రి పరిషత్
2.6 ఉద్యోగ వర్గం
2.7 పాలనా విభాగాలు
 2.7.1 భుక్తులు
 2.7.2 విషయాలు
 2.7.3 నగరపాలన
 2.7.4 గ్రామపాలన
 2.7.5 సైనిక పాలన
 2.7.6 ఆదాయ వ్యయాలు
 2.7.7 న్యాయ పాలన
 2.7.8 ముగింపు
2.8 సారాంశము
2.9 మాదిరి ప్రశ్నలు
2.10 ఉపయుక్త గ్రంథాలు


## 2.1 ఉపోద్ఘాతము:

గుప్తులు విశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించడమేగాక, అందు సమర్థవంతమైన పరిపాలనా వ్యవస్థను కూడా ప్రవేశపెట్టడం జరిగింది. వీరి పటిష్టమైన పరిపాలనలో రాజ్యం సర్వతోముఖాభివృద్ధిని సాధించింది. గుప్తుల పరిపాలనా విధానానికి ప్రాచీన పాలనా వ్యవస్థలే పునాది. పరిపాలనా విధానంలో గుప్తులు వినూత్నమైన మార్పులను ప్రవేశ పెట్టినప్పటికీ, మౌర్యుల పాలనావ్యవస్థను కాలానుగుణమైన మార్పులతో పటిష్టంగా రూపొందించడం జరిగింది.

## 2.2 ఆధారాలు:

గుప్తుల పాలనా విధానాన్ని తెలుసుకునేందుకు అనేక ఆధారాలు లభిస్తున్నాయి. వారి కాలంలోని శాసనాలు, పాహియాన్ రచనలు, కామందకుని నీతి శాస్త్రం మొదలైన ఆధారాలు గుప్తుల కాలం నాటి పరిపాలనా విధానాన్ని వివరిస్తున్నాయి.

## 2.3 చక్రవర్తి:

చక్రవర్తి సర్వాధికారి. రాజు దైవాంశ సంభూతుడని ప్రజల విశ్వాసం. చక్రవర్తి పదవి వంశపారంపర్యం. సాధారణంగా రాజు జ్యేష్ఠ పుత్రుడే రాజ్యానికి వారసుడు. కానీ, యోగ్యత, సమర్ధతను బట్టి వారసులను నిర్ణయించే ఆచారం అమల్లో ఉంది. సైనిక, న్యాయ, పరిపాలనాధికారాలన్నీ రాజు వద్దే కేంద్రీకరించబడి ఉండేవి. నిరంకుశ అధికారాలున్నప్పటికి, రాజు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ధర్మబద్ధుడై పరిపాలించేవాడు. గుప్తరాజులు పరమభట్టారక, విక్రమాదిత్య, రాజాధిరాజు, మహారాజాధిరాజు, పృధ్వీపాల, పరమేశ్వర, సామ్రాట్, చక్రవర్తి అనే బిరుదులు ధరించారు. ప్రజారక్షణ, ధర్మరక్షణ రాజు కర్తవ్యంగా భావించడం జరిగింది. రాజనేవాడు దండధారియై, దోషుల్ని తగు విధంగా, నిష్పక్షపాతంగా శిక్షించాలని కామందకుని 'నీతిసారం' ప్రబోధిస్తుంది. రాజు ప్రజలకు ఆదర్శప్రాయుడై, వారి జీవనం సక్రమంగా సాగిపోయేందుకు పాటుపడాలని, లేనట్లయితే పతనం అనివార్యమనే నమ్మకముంది.

## 2.4 సామంతులు:

గుప్తరాజుల పాలనావ్యవస్థ రాచరిక కేంద్రీకృత వ్యవస్థ. వీరి పాలనాకాలం మొదటి దశలో అంటే క్రీ.శ. 400 వరకు కేంద్రంలో రాచరిక వ్యవస్థ ఉన్నప్పటికీ, పంజాబ్, రాజపుత్ర స్థానాలలో మాత్రకులు, యౌధేయులు, అర్జునాయనులు, మాళవులు, అభీరులు మొదలైన సామంత పాలకులు గణతంత్ర రాజ్య వ్యవస్థను కొనసాగించారు.

## 2.5 మండల పరిషత్:

రాజు సర్వాధికారి అయినప్పటికీ, రాజ్యపాలనలో అతడికి సహాయపడేందుకు ఒక మంత్రి పరిషత్ ఉండేది. మంత్రి పరిషత్ సంఖ్య పరిమితంగా ఉండేది. మంత్రి పదవులు చాలావరకు వంశపారంపర్యం. కామందకుని నీతిసారంలో మంత్రి పరిషత్ విధులు, సమావేశాల నిర్వహణా విధానం మొదలైన అంశాలను వివరించడం జరిగింది. రాజు మంత్రి పరిషత్ సమావేశాలకు అధ్యక్షత వహించేవాడు. అమాత్యుడు లేదా సచివుడు మంత్రి పరిషత్ లో ముఖ్యుడు. మహాదండనాయక, వినయసూర, స్థపతి, సామ్రాట్, సంధివిగ్రహ, ప్రతికర్తక, మహాకుమారామాత్య, మహాసామంత, మహా రాజామాత్య ఇతర సభ్యులు. సాధారణంగా మంత్రిమండలి సలహాను రాజు పాటించేవాడు. కాని పాటించాలనే నిబంధన ఏదిలేదు.

## 2.6 ఉద్యోగ వర్గం:

పరిపాలనా వ్యవహారాలు నిర్వహించేందుకు మంత్రిమండలితో పాటుగా ఉన్నత ఉద్యోగవర్గం కూడా ఉండేది. వీరిలో వినయ స్థితి స్థాపకుడు, మహా ప్రతీహార, భటాశ్వపతి, రణభాండాగారిక, కంచుకి ముఖ్యులు. కులమత వ్యత్యాసాలను పాటించక, సామర్థ్యాన్ని బట్టి ఉద్యోగుల నియామకం జరిగేది. ఉన్నతోద్యోగులకు ధనరూపేణా, చిన్న ఉద్యోగులకు భూముల రూపేణా వేతనాలు చెల్లించేవారు.

## 2.7 పాలనా విభాగాలు:

పరిపాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్రాలు రెండు విధాలుగా ఉండేవి. రాష్ట్రస్థాయిలోని సామంత రాజ్యాల పాలన, గుప్త సామ్రాజ్యంలో అంతర్భాగమైన ప్రదేశాల పాలనకు భిన్నంగా ఉండేది.

**2.7.1 భుక్తులు:** రాష్ట్రానికి భుక్తి లేదా రాజ్యం అని పేరు. శాసనాలలో అహిచ్ఛత్రభుక్తి, నాగభుక్తి, పుండ్రవర్ధనభుక్తి, తీరభుక్తి అనే వివిధ రాష్ట్రాల పేర్లు ప్రస్తావించబడ్డాయి. రాష్ట్రాధిపతిని ఉపరిక, భోగిక, భోగపతి, గోప్త, రాజస్థానీయ అనే పేర్లతో వ్యవహరించేవారు. వీరిని రాజులే స్వయంగా నియమించేవారు. సాధారణంగా రాకుమారులు, రాజబంధువులు రాష్ట్రపాలకులుగా నియమితులయ్యే వారు. రాష్ట్ర పాలనా కేంద్రాన్ని అధికరణం అనేవారు. రాష్ట్రపాలనలో రాష్ట్రాధిపతికి తగిన స్వేచ్ఛ ఇవ్వడమైంది.

**2.7.2 విషయాలు:** భుక్తులు విషయాలుగా లేదా ప్రదేశాలుగా విభజింపబడ్డాయి. విషయానికి అధిపతి విషయపతి. ఇతడిని ఉపరిక నియమించేవాడు. విషయపతికి నగరసభ సహాయపడేది. అందులో నగరశ్రేష్టి ప్రథమకులికుడు, సార్ధవాహుడు, ప్రధమకాయస్థుడు, పుస్తపాలుడు సభ్యులుగా ఉండేవారు. నగరపాలనను పురపాలుడనే అధికారి నిర్వహించేవాడు. ప్రజారోగ్యం , పారిశుధ్యం, ప్రాథమిక విద్య నగరపాలనా పరిధిలోని అంశాలు.

**2.7.3 నగర పాలన:** గుప్తుల నగర పాలనకు ప్రత్యేక యంత్రాంగం ఉంది. నగరానికి అధిపతిని నగరాధ్యక్షుడు లేదా పురపాలకడు అని వ్యవహరించేవారు. దీని పాలనా నిర్వహణకు ఒక సంఘం, మరి కొందరు ఉద్యోగులు నియమించబడ్డారు. నగర శ్రేష్ఠి, ప్రథమ కులిక, సార్థవాహ, ప్రథమకాయస్థ సంఘ సభ్యులు.

**2.7.4 గ్రామ పాలన:** పాలనా వ్యవస్థలో చిట్టచివరి భాగం గ్రామం. గ్రామికుడు గ్రామపాలనకు బాధ్యత వహించేవాడు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడడం ఇతడి బాధ్యత. గ్రామపాలనలో గ్రామికుడికి గ్రామ పెద్దలతో కూడిన పంచ మండల సభ' సహాయపడేది. గ్రామపాలనలో ప్రభుత్వం జోక్యం చేసుకోదు. గ్రామాల స్వయంప్రతిపత్తి గుప్తుల అధికార కేంద్రీకరణను సూచిస్తుంది.

**2.7.5 సైనిక పాలన:** గుప్త సైన్యంలో గజ, అశ్వ, రథ, పదాలు దళాలుండేవి. నౌకాదళం కూడా ఉన్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది. అయితే గుప్తులకు బలమైన సిద్ధ సైన్యం ఉన్నట్లుగా చరిత్ర ఆధారాలు తెలపడం లేదు. సముద్రగుప్తుడు ఇతర రాజ్యాల పై సాధించిన విజయాలకు అతడి సామంతుల తోడ్పాటే కారణమై ఉండవచ్చు. గుప్తులు సైన్యం విషయంలో తమ సామంతులపై ఆధారపడినట్లు తెలుస్తుంది. ఆ కారణంగానే అనంతర గుప్తుల కాలంలో సామంత ప్రభువుల తిరుగుబాట్లను అణచలేక సామ్రాజ్యం క్షీణించడం జరిగింది. యుద్ధాల్లో విల్లంబులు, గండ్రగొడ్డలి, ఈటె, బల్లెం, కత్తి ఆయుధాలుగా ఉపయోగించేవారు. గుప్తుల ఆదాయంలో అధిక భాగం సైన్య పోషణకే ఖర్చయ్యేది.

**2.7.6 ఆదాయ వ్యయాలు:** భూమి శిస్తు రాజ్యానికి ప్రధాన ఆదాయం. పండిన పంటలలో ఆరవ భాగం శిస్తుగా వసూలు చేసేవారు. శిస్తు ధన రూపేణా లేదా ధాన్యం రూపేణా చెల్లించవచ్చు. సామంతులు, కప్పం చెల్లించే వారు, వాటితోపాటు ఎగుమతి దిగుమతి సుంకాలు రాజ్యానికి ఆదాయ వనరులు.

**2.7.7 న్యాయ పాలన:** ఈ కాలానికి న్యాయవ్యవస్థ అంతకుముందుకంటే మెరుగుపడింది. నారద, యజ్ఞవల్క్య, బృహస్పతి, స్మృతులు ఈ కాలంలోనే రూపొందాయి. ధర్మాన్ని కాపాడడం రాజు ప్రధాన విధిగా భావించడం జరిగింది. సివిల్, క్రిమినల్ నేరాలకు ప్రత్యేక చట్టాలు ఏర్పడ్డాయి. న్యాయశాఖలో మహాదండనాయక, మహాక్షపటలక వంటి న్యాయాధికారులుండేవారు. శిక్షలు కఠినంగా లేవని పాహియాన్ పేర్కొన్నాడు. అయితే చరిత్రకారులు ఈ అభిప్రాయంలో ఏకీభవించలేదు. నవరత్నాలలో ప్రసిద్ధుడైన కాళిదాసు, ముద్రారాక్షసం రచయిత విశాఖదత్తుడు రచనలవల్ల నాటి శిక్షా విధానం కఠినంగా ఉందని తెలుస్తుంది. దేశద్రోహం, రాజద్రోహం చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించేవారు. మరణదండన తప్పనిసరి అయినపుడు, ఏనుగులతో తొక్కించి చంపేవారు. పూర్వకాలంలోలాగా ఈ కాలంలో కూడా కులాన్ని బట్టి శిక్షలు అమలయ్యేవి.

**2.7.8 ముగింపు:** గుప్తుల పాలన కేంద్రీకృత పాలన. వీరి పాలనా కాలంలోనే భూస్వామ్య లక్షణాలు ప్రవేశ పెట్టబడ్డాయి. వీరి రాజ్యం ఎక్కువగా సామంతుల పాలనలోనే ఉండేది. వారు చక్రవర్తి ప్రతినిధులుగా పాలన చేపట్టేవారు. ఏది ఏమైనప్పటికీ గుప్త రాజుల పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారని చెప్పవచ్చు.

## 2.8 సారాంశము:

గుప్తుల పాలనా కాలానికి భారతదేశ చరిత్రలో ఒక విశిష్ట స్థానం ఉంది. కుషాన్ రాజ్య పతనానంతరం భారతదేశంలో విశాల సామ్రాజ్యాన్ని స్థాపించడమే గాకుండా, రాజకీయ ఐక్యతను సాధించడం జరిగినది. వీరి పరిపాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించడం జరిగింది.

## 2.9 మాదిరి ప్రశ్నలు:

1. గుప్తుల పరిపాలనలో ముఖ్య లక్షణాలను పేర్కొనండి.
2. గుప్తుల కాలం నాటి న్యాయ పాలనను వివరించండి.

## 2.10 ఉపయుక్త గ్రంథాలు:


1. Gopal S.R. - A History of the Imperial Gupthas
2. Jha D. N. - Ancient India, An Introductory Outline
3. Majundar R.C. (Ed.) - The Age of Imperial Unity
4. Mookerji R.K. - The Gupta Empire
5. Nilkanta Sastri K.A. - Comprehensive History of India
6. Romila Thapar - A Hisotry of India
7. Sathiyanatha Aiyar R. - History of India


పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

## పాఠం - 3

# గుప్తుల కాలం నాటి సాంఘీక - ఆర్థిక - మత - పరిస్థితులు

### 3.0 లక్ష్యం:

గుప్త యుగంలో సాంఘీక, ఆర్థిక, మత పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో తెలియజేయటమే ఈ పాఠం లక్ష్యం.

### పాఠ్య నిర్మాణ క్రమం:

- 3.1 ఉపోద్ఘాతము
- 3.2 ఆధారాలు
- 3.3 సాంఘీక పరిస్థితులు
  - 3.3.1 వర్ణ వ్యవస్థ
  - 3.3.2 అంటరానితనం
  - 3.3.3 ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
  - 3.3.4 స్త్రీ స్థానం
  - 3.3.5 అలంకరణ
  - 3.3.6 వినోదాలు
  - 3.3.7 బానిసత్వం
- 3.4 ఆర్థిక పరిస్థితులు
  - 3.4.1 వ్యవసాయం
  - 3.4.2 పరిశ్రమలు
  - 3.4.3 వృత్తి సంఘాలు - శ్రేణులు
  - 3.4.4 వ్యాపార - వాణిజ్యాలు
  - 3.4.5 రేవు పట్టణాలు
  - 3.4.6 నాణేలు
- 3.5 మతం
  - 3.5.1 బ్రాహ్మణ మతం
  - 3.5.2 వైష్ణవం
  - 3.5.3 శైవ మతం
  - 3.5.4 మత సహనం
  - 3.5.5 బౌద్ధ మత క్షీణత
- 3.6 సారాంశము
- 3.7 మాదిరి ప్రశ్నలు
- 3.8 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 ఉపోద్ఘాతము:

భారతదేశంలో గుప్తులు సువిశాల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే గాకుండా దేశంలో రాజకీయ ఐక్యతను సాధించి, దాదాపు ఒకటిన్నర శతాబ్దాల కాలం పాటు శాంతి, సుస్థిరతను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా సుభిక్ష పాలన అందించి, మత సామరస్యాన్ని పాటించి, ఆర్థికాభ్యుదయాన్ని సాధించారు.

## 3.2 ఆధారాలు:

గుప్తుల కాలం నాటి సాంఘీక, ఆర్థిక, మత పరిస్థితులను తెలుసుకునేందుకు అనేక ఆధారాలు లభ్యమవుతున్నాయి. గుప్తుల శాసనాలు, పాహియాన్ రచనలు, నాటి స్మృతి గ్రంథాలు, కావ్యాలు, నాణేలు, దేవాలయములు, శిల్ప చిత్ర లేఖనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

## 3.3 సాంఘిక పరిస్థితులు:

గుప్తుల కాలం నాటి సామాజిక వ్యవస్థను తెలుసుకొనేందుకు పాహియాన్ రచనలు, కాళిదాసు నాటకాలు, కావ్యాలుబీ నాటి నాణాలు, ఆనాటి శిల్ప చిత్రలేఖనం ఎంతో ఉపయోగపడుతున్నాయి. రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలంలో భారతదేశంలో పర్యటించిన పాహియాన్ ఆనాటి సామాజిక అంశాలను వర్ణించాడు. ప్రజల సుగుణవంతులు, స్థితిపరులనిబీ పట్టణాలలో జనబాహుళ్యం అధికంగా ఉందని, ప్రజలలో అధి కులు శాఖాహారులు, అహింసాపరులని పాహియాన్ పేర్కొన్నాడు.

**3.3.1 వర్ణ వ్యవస్థ:** నాటి సంఘం వర్ణ వ్యవస్థ పై ఆధారపడి ఉంది. బ్రాహ్మణ మత పునరుజ్జీవనం వర్ణ బేధాలను గట్టిపరచింది. వాటిని పాటించనివారు వెలివేయబడి, శిక్షలకు గురయ్యారు. వర్ణధర్మాలను రక్షించడం రాజుల బాధ్యత అయింది. ఈ కాలంలోనే హిందూ ధర్మశాస్త్రమైన మనుధర్మశాస్త్రం క్రోడీకరించడం జరిగింది. సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యత పెరిగింది. వారికి కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. క్షత్రియులు ఆయుధోప జీవులు. బ్రాహ్మణులతో పాటు వీరు కూడా 'ద్విజ'లుగా పరిగణింపబడ్డారు. విదేశీయులనేకులు భారతదేశం వచ్చి స్థిరపడినందువల్ల, సమాజంలో కులాల సంఖ్య పెరిగింది. ప్రతి వృత్తి కులంగా ఏర్పడింది. అయినప్పటికీ కులవృత్తులను వదలి ఇతర వృత్తులను స్వీకరించడం జరిగింది. బ్రాహ్మణులు యుద్ధ విద్యలను అభ్యసించారు. వర్తక వ్యాపారాలను కూడా వారు నిర్వహించారు.

**3.3.2 అంటరానితనం:** సమాజంలో అంటరానితనం ఆచరణలో ఉంది. చండాలురు దుర్భర జీవితాన్ని గడిపారు. గ్రామంలో ప్రవేశించే ముందు గంటను మోగించేవారు. బ్రాహ్మణులకు చండాలురు ఎదురుపడితే దోషమని, ఆ దోష నివారణకు ప్రత్యేక కర్మలను చేసేవారని పాహియాన్ పేర్కొన్నాడు. ఈ తారతమ్యాలు ఇతర రంగాలకు కూడా పాకాయి. ఒక్క చండాలురు తప్ప తక్కిన హైందవులు మాంసాహారులు కారని, వారు మద్యపానాన్ని సేవించరని పాహియాన్ వ్రాశాడు.

కాలక్రమంలో దేశంలో స్థిరపడిన విదేశీయులను సంఘంలోని ఉన్నత కులాలలో చేర్చుకోవడంతో వర్ణ వ్యవస్థ కఠినత తగ్గింది. "ప్రజలు నీతివర్తునులని, అహింసా విధానాన్ని పాటించేవారని, క్రయ విక్రయాలలో పత్రాలు ఉపయోగించేవారు కాదని, చోర భయం లేదని, ప్రజలు తమ ఇళ్ళకు తాళాలు వేసేవారు కారని పాహియాన్ తెలిపాడు.

**3.3.3 ఉమ్మడి కుటుంబ వ్యవస్థ:** వివాహ సంబంధ బాంధవ్యాలతో ఏర్పడ్డ కుటుంబం సమాజానికి ప్రాతిపదిక. ఉమ్మడి కుటుంబ వ్యవస్థనాటి సమాజ ముఖ్య లక్షణం. పితృస్వామిక వ్యవస్థలో కుటుంబానికి తండ్రి పెద్ద. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిలో తండ్రికి, కుమారులకు సమానహక్కులుండేవి.

**3.3.4 స్త్రీ స్థానం:** నాటి సమాజంలో స్త్రీకి ప్రాధాన్యత తగ్గింది. పెద్దల నిర్ణయంతోనే వివాహాలు జరిగేవి. సాధారణంగా సవర్ణ వివాహాలు వాడుకలో ఉన్నప్పటికి, వర్ణాంతర వివాహాలు కూడా జరిగినట్లు తెలుస్తుంది. బహు భార్యత్వం ఉంది. అయితే బహుభర్తృత్వం లేదు. బాల్య వివాహాలు జరిగేవి. వితంతు వివాహాలు లేవు. సతీసహగమనం వాడుకలోకి వచ్చింది. ఎరన్ (%జుతీఖఅ%) శాసనం సతీసహగమనాన్ని గురించి ప్రస్తావించింది. స్త్రీకి విద్య పరిమితంగా ఉండేది. రాజ కుటుంబానికి చెందిన స్త్రీలు మాత్రమే విద్యను గడించారు. స్త్రీలకు ఆస్తిలో హక్కులేదు. దేవదాసీలకు, నర్తకీలకు సమాజంలో ఆదరణ ఉంది. ఉజ్జయినీలోని మహంకాళి ఆలయంలో దేవదాసీలున్నట్లు, కాళిదాసు తన రచనల్లో పేర్కొన్నాడు.

**3.3.5 అలంకరణ:** శరీరాలంకరణలో స్త్రీ, పురుషులకు మంచి ఆసక్తి ఉండేది. ఇరువురు అనేక ఆభరణాలను ధరించేవారు. పురుషులు అంగవస్త్రాన్ని, ధోవతినిబీ స్త్రీలు చీర, రవికెలను ధరించారు. సుగంధ ద్రవ్యాలను సంపన్నులు విరివిగా వాడేవారు.

**3.3.6 వినోదాలు:** చదరంగం, వేట, కోళ్ళపందాలు పొట్టేళ్ళ పందాలు, పాచికలాట పురుషులకుబీ సంగీతం, నృత్యం స్త్రీలకు; కందుక క్రీడ (బంతులాట) పిల్లలకు వినోదాలు.

**3.3.7 బానిసత్వం:** ఈకాలంలో బానిసత్వం ఉన్నట్లు తెలుస్తుంది. యుద్ధ ఖైదీలు, దివాళా తీసిన వారు, పరాజిత జూదరులు బానిసలయ్యే వారు. అయితే వారికి విముక్తులై స్వేచ్ఛ పొందే అవకాశం కూడా ఉండేది.

## 3.4 ఆర్థిక పరిస్థితులు:

గుప్తుల కాలంలో దేశం సిరి సంపదలతో తులతూడినట్లు పాహియాన్ రచలవల్ల తెలుస్తుంది. "ప్రజలు భాగ్యవంతులనీ, దానధర్మాలు చేయడంలోను, సాటివారికి సాయపడడంలోను, భోగభాగ్యాలను అనుభవించడంలోను, ఒకరితో ఒకరు పోటీపడే వారిని అతడు తెలిపాడు.

**3.4.1 వ్యవసాయం:** వ్యవసాయం ప్రజల ముఖ్య వృత్తి. ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేది. బంజరు భూముల సాగువల్ల వ్యవసాయ భూమి విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయం వర్షాధారం. అయినప్పటికీ ప్రభుత్వం వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యం కల్పించినట్లు స్కందగుప్తుడి కాలంనాటి సుదర్శన తటాక మరమ్మత్తుల వల్ల విశదమవుతుంది. బావులు, చెరువుల నుంచి పారశీక నీటి చక్రం (%జూవతీంఱుఅ ఎష్త్రవవశ్రీ%) ద్వారా నీటిని పొలాలకు మళ్ళించేవారు.

రైతుల పరిస్థితి దుర్భరంగా ఉండేది. బ్రాహ్మణులకు, ప్రభుత్వ ఉద్యోగులకు విరివిగా భూములు దానం చేసేవారు. ఇది భూస్వామ్య వ్యవస్థకు దారితీసింది. భూస్వామి తనకు ఇష్టం వచ్చినట్లుగా భూములను కౌలుకిచ్చేందుకు, కౌలు రేటు పెంచేందుకు అధికారం ఉండేది. రైతులు భూస్వామికి, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు వెట్టిచాకిరి చేయవలసి వచ్చేది. భూస్వాములు, సైనికులు తమ సరకుల రవాణా నిమిత్తం గ్రామ ప్రజల బళ్ళను, పశువులను ఉచితంగా ఉపయోగించుకొనేవారు. వరి, గోధుమ పంటలు విరివిగా పండించడం జరిగింది. చెరకు, పప్పు, బార్లి, నూనెగింజలు, అల్లం, కూరగాయలు, పండ్లు ఇతర పంటలు.

**3.4.2 పరిశ్రమలు:** వస్త్ర పరిశ్రమ నాటి పరిశ్రమలలో ప్రధానమైనది. నూలు, పట్టు వస్త్రాల ఉత్పత్తి విరివిగా జరిగింది. ఇవి విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. లోహ పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. కంచును విరివిగా వాడేవారు. రాగి, ఇనుము, కంచు మొదలైన లోహాలతో వివిధ రకాలైన పరికరాలను తయారుచేసేవారు. ఢిల్లీ సమీపంలోని మెహరౌలి వద్దనున్న ఇనుప స్తంభం గుప్తుల కాలంలో పోతపోయబడినదే. ఎండకు ఎండి, వానకు తడిసినప్పటికీ నేటికి అది తుప్పుపట్టక పోవడం ఆధునిక శాస్త్రజ్ఞులకు సైతం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**3.4.3 వృత్తి సంఘాలు - శ్రేణులు:** వృత్తి పనివారు వృత్తి సంఘాలుగా ఏర్పడి, అనేక కుటీర పరిశ్రమలు స్థాపించారు. ఈ సంఘాలు యువకులకు వారివారి వృత్తులలో శిక్షణా కేంద్రాలుగా ఉండేవి. వర్తకులు కూడా శ్రేణులు (Guilds)గా ఏర్పడ్డారు. ఈ శ్రేణులు నేటి బ్యాంకులుగా పనిచేసేవి. ఈ శ్రేణులను నిగమలు అనేవారు. కొన్ని నిగమలు కలసి ఒక బృహత్ సంఘంగా ఏర్పడి ఉండేవి. శ్రేణులు తమ లాభాల్లో కొంత భాగాన్ని ప్రజోపయోగ కార్యకలాపాలపై ఉపయోగించేవి.

**3.4.4 వ్యాపార వాణిజ్యాలు:** గుప్తుల కాలంలో స్వదేశీ, విదేశీ వ్యాపారం చురుగ్గా సాగింది. తూర్పు, పశ్చిమ సముద్రాల పర్యంతం తమ సామ్రాజ్యం విస్తరించడంతో గుప్త చక్రవర్తులు విదేశీ వాణిజ్యాన్ని బాగా ప్రోత్సహించారు. తూర్పున తామ్రలిప్తి, పశ్చిమాన బరుకచ్చం నాటి ప్రధాన రేవుపట్టణాలు. తామ్రలిప్తి ద్వారా ఆగ్నేయాసియా, చైనా దేశాలతోను, బరుకచ్చి ద్వారా రోమ్ మొదలైన పశ్చిమదేశాలతోను విదేశీ వ్యాపారం జరిగేది. రత్నాలు, సుగంధ ద్రవ్యాలు, నీలిమందు, ఔషదాలు, దంతం వస్తువులు ఎగుమతి చేసిబీ బంగారం, వెండి, రాగి, మేలుజాతి అశ్వాలు దిగుమతి చేసుకొనేవారు. భూమిశిస్తు వల్ల రాజ్యానికి ఆదాయం వచ్చినప్పటికీ, ప్రభుత్వ ప్రోత్సాహంవల్ల వర్తకులు, వ్యాపారులు రాజ్యానికి విశేషంగా పన్నులు చెల్లించి, దేశ ఆర్థికాభ్యుదయానికి పాటుపడ్డారు. దేశంలోని పెద్ద నగరాలన్నీ రహదారులతో అనుసంధానం గావించబడి, వ్యాపారాభివృద్ధికి దోహదం చేయబడ్డాయి. రహదారులలో బౌద్ధారామాలు, సంఘాలు వ్యాపారులకు విడుదులుగా ఉపయోగపడ్డాయి.

**3.4.5 రేవు పట్టణాలు:** రేవు పట్టణాలు, నదీతీరాలు ఎగుమతి, దిగుమతులకు అనువుగా అభివృద్ధి చెంది, వ్యాపారస్తులకు ఎంతో ఉపకరించాయి. ఉజ్జయిని, కాశి, ప్రయాగ, మధుర, వైశాలి, గయ ఆనాటి ప్రముఖ వర్తక కేంద్రాలయ్యాయి. అలాగే కృష్ణ, గోదావరి, గంగ, బ్రహ్మపుత్ర నదులు వ్యాపారాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాయి.

**3.4.6 నాణేలు:** గుప్తుల కాలంలో అసంఖ్యాకంగా అనేక బంగారునాణాలు ముద్రించబడ్డాయి. ఇవి ఆనాటి ఆర్థిక ఔన్నత్యానికి తార్కాణాలు. బంగారు నాణాలతో పాటుగా అనేక వెండి, రాగి నాణాలు కూడా వాడుకలో ఉపయోగించడం జరిగింది. బంగారు నాణాలను సువర్ణమని, వెండి నాణాలను రూపకమని పిలిచేవారు. ఒక బంగారు నాణానికి పదిహేను వెండి నాణాలు సమానం. గవ్వలు కూడా చెలామణిలో ఉన్నట్లు పాహియాన్ పేర్కొన్నాడు.

## 3.5 మతం:

గుప్తుల కాలం నాటి శాసనాలు, ఆలములు, కళా ఖండాలు మత పరిస్థితులను తెలుపుతున్నాయి. సాంచి, సారనాథ్‌లలోని శాసనాలు నాచి బౌద్ధ మత పరిస్థితిని వివరిస్తున్నాయి. గుప్తుల కాలం నాటికి బ్రాహ్మణ మతం ప్రాధాన్యత కలిగి ఉంది. జైన, బౌద్ధ మతాలు రాజాదరణ కోల్పోయాయి. అవి వ్యాపార వర్గాల పై ఆధారపడవలసి వచ్చింది.

**3.5.1 బ్రాహ్మణులు:** గుప్త సామ్రాట్టులు బ్రాహ్మణ మతాభిమానులు. వీరికాలంలో హైందవ మతం పునరు జ్జీవనం జరిగింది. రాజులకు, ప్రజలకు యజ్ఞయాగాదులపట్ల ఆసక్తి అధికమయింది. సముద్రగుప్తుడు, కుమారగుప్తుడు అశ్వమేథయాగాలను నిర్వహించారు. వీటి మూలంగా బ్రాహ్మణులు తమ పూర్వపు ఔన్నత్యాన్ని పొందారు. గుప్తుల ఆదరణ, అభిమానం హిందూ మతానికి నూతనోత్సాహాన్ని కలిగించింది. అయితే ఈ కాలంలో పూర్వపు హింసాకాండతో కూడిన బ్రాహ్మణ మతం ఆధునిక హైందవ మతంగా మారింది.

**3.5.2 వైష్ణవం:** వీరికి విష్ణు అవతారాల మీద అభిమానం పెరిగింది. వైష్ణవ సంప్రదాయానికి అనుగుణంగా భక్తి సిద్ధాంతం బయలుదేరింది. విష్ణుమూర్తి అనేక అవతారాలెత్తి ప్రజలను రక్షిస్తాడనే అవతార సిద్ధాంతం ఈ కాలంలోనే ప్రారంభమయింది. దశావతారాలకు ఆదరణ లభించడంతో రామాయణ, పురాణేతిహాసాలు

ప్రజాదరణ పొందాయి. కర్మ సిద్ధాంతం పట్ల ప్రజలలో విశ్వాసం పెరగడంతో, భగవద్గీత హిందువులకు పవిత్ర గ్రంథంగా మారింది.

మతానికి ఆలయం ప్రధాన కేంద్రమయింది. మతాభిమానం గల ప్రజలు తమ మతాభిమానాన్ని చాటుకునేవారు. గుడులు, గోపురాలు నిర్మించి, దేవతామూర్తులకు ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. పురాణ శ్రవణం, పుణ్యక్షేత్రాలు దర్శనం, దానధర్మాలు చేయడం పుణ్యకార్యాలుగా భావించబడ్డాయి. తాము నమ్మిన దేవతలకు విగ్రహాలు చెక్కించడమేగాక, దేవాలయాలను కూడా నిర్మించడం జరిగింది.

వైష్ణవ మతాన్ని స్వీకరించి విదేశీయులైన శకులు, యవనులు, కుషాణ్ జాతులవారు హిందూ మతస్తులయ్యారు. విష్ణువు, శివుడు, కృష్ణుడు, కార్తికేయుడు, గణేషుడు, లక్ష్మి, పార్వతి, దుర్గ, భవాని నాటి ముఖ్యదేవతలు.

**3.5.3 శైవ మతం:** ఈ కాలంలో శైవమత భాగమైన పాశుపతశాఖ ఆదరించబడింది. గుప్తుల కాలంలో యోగముద్రలో ఉన్న శివుడి ఆరాధన జరిగింది. లింగరూపంలో శివారాధన, నంది పూజలు జరిగేవి. ఒక్క కాళి, దుర్గలను మాత్రం జంతుబలులతో ఆరాధించి, సంతృప్తిపరచేవారు.

**3.5.4 మత సహనం:** గుప్త పాలకులు హైందవ మతావలంబులైనప్పటికీ, జైన, బౌద్ధ మతాలపట్ల సహనభావం చూపారు. ఆ మతాల అభివృద్ధికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను తోడ్పడ్డారు. హిందువులు, బౌద్ధులు పరస్పరం ఎంతో మైత్రితో ఉన్నట్లు పాహియాన్ చెప్పాడు. గుప్త పాలకులు బౌద్ధులకు సైతం ఉద్యోగావకాశాలు కల్పించారు. బౌద్ధ మతస్థుడైన వసుబంధుడ్ని సముద్రగుప్తుడు ఆదరించగా, బౌద్ధుడైన అమరకర దేవుడ్ని రెండో చంద్రగుప్తుడు తన సేనానిగా నియమించుకొన్నాడు.

**3.5.5 బౌద్ధ మత క్షీణత:** కుమారగుప్తుడు నలంద బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. మధుర, నలంద, సారానాథ్ లో గుప్తులనాటి జైన, బౌద్ధ విగ్రహాలు ఆకాలపు మత సహనానికి చక్కని నిదర్శనాలు. దేశమంతా పరివ్యాప్తమైన మహాయాన బౌద్ధమతం ప్రజానీకాన్ని ఆకర్షించింది. కాని, క్రమంగా అది తన ప్రత్యేకతను కోల్పోయింది. బ్రాహ్మణమతం విదేశీయులను తనలో విలీనం చేసుకోగలిగిననాటి నుంచి బౌద్ధం తన ప్రాభవాన్ని కోల్పోవడం ప్రారంభించింది. కపిలవస్తు, కుశినగరం, గయలలో బౌద్ధమత క్షీణతను పాహియాన్ ప్రస్తావించాడు. బౌద్ధమతం క్రమంగా హిందూమతంలో లీనమవడం ఈ కాలంలోనే ప్రారంభమయింది. బుద్ధుడు కూడా దశావతారాల్లో ఒకడుగా భావించడం జరిగింది. క్రీ.శ. 454లో జైనమతం వల్లభిలో సమావేశమై, జైనమత గ్రంథాలను క్రోడీకరించే ప్రయత్నం చేసింది. మధుర, వల్లభి శ్వేతాంబర శాఖకు కేంద్రాలుగా, పుండ్రవర్ధన దిగంబర శాఖకు కేంద్రంగా ఉంది.

## 3.6 సారాంశము:

గుప్తుల కాలంలో దేశం ఆర్థిక సంపదలతో తులతూగుతుందని, ప్రజల జీవన ప్రామాణాలు అధిక స్థాయిల్లో ఉన్నాయని, విదేశీ యాత్రికుల వల్ల తెలుస్తున్నది. నాటి సమాజంలో బ్రాహ్మణులు అత్యున్నత స్థాయిలో ఉన్నారని, అయితే స్త్రీల పరిస్థితి దిగజారిందని, సమాజంలో సతీ సహగమనం ఆచారం మరియు బానిసత్వం ఉన్నదని తెలుస్తుంది. హైందవ మత పునరుజ్జీవనం జరిగింది. విష్ణు అవతారాల మీద అభిమానం పెరిగింది. అలాగే మతానికి, ఆలయం ప్రధాన కేంద్రమయ్యింది. లింగ రూపంలో శివారాధన, నంది పూజలు జరిగాయి. మత సహనం పాటించబడింది. అయితే జైన, బౌద్ధ మతాల క్షీణత జరిగి, అవి తన ప్రత్యేకతలను కోల్పోయాయి.

## 3.7 మాదిరి ప్రశ్నలు:

1. గుప్తుల కాలం నాటి సాంఘీక పరిస్థితులను తెలియ జేయండి.
2. గుప్తుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులు పై వ్యాసం వ్రాయండి.
3. గుప్తుల మత విధానం ఎట్టిది?

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1. గుప్తుల కాలంలో స్త్రీ స్థానం ఎలా ఉంది?
2. గుప్తుల కాలంలోని శ్రేణులను గూర్చి వ్రాయండి.

## 3.8 ఉపయుక్త గ్రంథాలు:


1. Gopal S.R. - A History of the Imperial Gupthas
2. Jha D. N. - Ancient India, An Introductory Outline
3. Majundar R.C. (Ed.) - The Age of Imperial Unity
4. Mookerji R.K. - The Gupta Empire
5. Nilkanta Sastri K.A. - Comprehensive History of India
6. Romila Thapar - A Hisotry of India
7. Sathiyanatha Aiyar R. - History of India



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ బాలినేని వాణి**

పాఠం - 4

# గుప్తులు విద్య - సాహిత్యం - శాస్త్ర సాంకేతిక వికాసం

## 4.0 లక్ష్యం:

గుప్తుల కాలంలో జరిగిన సాహిత్యాభివృద్ధి, కళలు, శాస్త్రాభివృద్ధి మరియు సాంస్కృతిక వికాసాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:


4.1 ఉపోద్ఘాతము

4.2 విద్య

4.3 సాహిత్యము

4.3.1 నవ రత్నాలు

4.3.2 పురాణాలు

4.4 వైజ్ఞానిక శాస్త్రాభివృద్ధి

4.4.1 గణిత, ఖగోళ శాస్త్రాలు

(ఎ) ఆర్యభట్టు

(బి) వరాహమిహిరుడు

(సి) బ్రహ్మ గుప్తుడు

4.4.2 వైద్య శాస్త్రం

4.4.3 కళా వైభవం

(ఎ) దేవాలయాలు

(బి) గుహాలయాలు

4.4.4 శిల్ప కళ

(ఎ) హిందూ విగ్రహాలు

(బి) బౌద్ధ శిల్పం

4.4.5 చిత్ర కళ

(ఎ) కుడ్య చిత్రాలు

4.4.6 సంగీతం - నృత్యం

4.4.7 నాటకం

4.4.8 లోహకార విశిష్టత

4.5 నాణేలు

4.6 సాంస్కృతిక వికాసం

4.6.1 ముగింపు

4.7 సారాంశము

4.8 మాదిరి ప్రశ్నలు

4.9 ఉపయుక్త గ్రంథాలు

## 4.1 ఉపోద్ఘాతము:

గుప్తుల కాలంలో సాహిత్యం, కళలు, శాస్త్రాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయి. వారి పోషణలో హిందూ సంస్కృతి సంపూర్ణ వికాసాన్ని పొందింది. అందువల్ల గుప్త యుగాన్ని చరిత్రకారులు 'స్వర్ణయుగం'గా ప్రశంసించారు. ఈ యుగాన్ని గ్రీసు చరిత్రలో పెరిఫెస్ యుగంతోను, రోమ్ చరిత్రలో అగస్టస్ యుగంతోను, ఇంగ్లాండ్ చరిత్రలో ఎలిజిబెత్ యుగంతోను పోలుస్తారు.

## 4.2 విద్య:

నాటి విద్యా విధానం గురుశిష్య సంబంధంగా, మౌఖికంగా జరిగింది. వేదాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు, వ్యాకరణం, గణితం, తర్కశాస్త్రం, రాజ్యతంత్రం, దండనీతి, యుద్ధవిద్య వంటి సుమారు 72 రకాల విద్యలను బోధించేవారు. గురుకులాలు విద్యాకేంద్రాలయ్యాయి. నలందాతోపాటు తక్షశిల, వల్లభి గొప్ప విద్యాకేంద్రాలుగా భాసిల్లాయి. పాటలీపుత్రం, ఉజ్జయిని, కాశి, అయోధ్య, హిందూ, బౌద్ధ విద్యాకేంద్రాలుగా ఖ్యాతి గడించాయి. రాజులు, రాణులు, వర్తక ప్రముఖులు, ధనికుల ప్రోత్సాహంవల్ల విద్యా కేంద్రాలు విరాజిల్లాయి.



**నలంద విశ్వ విద్యాలయం**

## 4.3 సాహిత్యం:

గుప్త చక్రవర్తులందరూ సాహితీ ప్రియులే. వారు అనేకమంది కవి పండితులను ఆదరించి, శాశ్వత కీర్తిని గడించారు. సాహితీ వికాసానికి వారు గావించిన సేవ ప్రశంసనీయమైనది.

సముద్రగుప్తుడు స్వయంగా కవి. 'కవిరాజ' బిరుదాంకితుడు. అయితే అతడి రచనలు మాత్రం లభ్యం కావడంలేదు. సంస్కృత భాష రాజభాషగా ఆదరణ పొందింది. హిందూమత పునరుజ్జీవనం వల్ల ఆ భాషకు ఎనలేని ప్రోత్సాహం లభించింది. సంస్కృత సాహిత్య సృష్టి ఈ యుగంలో పరాకాష్టనందుకొన్నది. రాజశాసనాలన్నీ సంస్కృత భాషలోనే లిఖించబడ్డాయి. అలహాబాద్ స్తంభశాసనాన్ని సంకలనం గావించిన హరిసేనుడు, కుమారగుప్తుడి దశపుర శాసనాన్ని రాసిన వత్సభట్టి నాటి శాసన రచయితలలో పేరెన్నికగన్నవారు.

బౌద్ధ పండితులు కూడా తమ మత గ్రంథాలను సంస్కృత భాషలోనే రాశారు. పాణిని, 'అష్టాధ్యాయి' అనే సంస్కృత వ్యాకరణ గ్రంథాన్ని రచించగా, పతంజలి 'మహాభాష్యాన్ని' రాశాడు.

**4.3.1 నవరత్నాలు:** రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడి ఆస్థానంలో 'నవరత్నాలు' అనే కవులున్నారని ప్రతీతి. కాళిదాసు వారందరిలోను అగ్రగణ్యుడు. విన్సెంట్ స్మిత్ అతడిని "ఇండియన్ షేక్ స్పియర్"గా అభివర్ణించాడు. కాళిదాసు రచించిన కావ్యాలలో 'రఘువంశం', 'కుమారసంభం', 'మేఘసందేశం' ప్రజాదరణ పొందాయి. నాటకాలలో 'అభిజ్ఞానశా కుంతలం', 'విక్రమోర్వశీయం', 'మాళవికాగ్నిమిత్రం' సుప్రసిద్ధమైనవి. అభిజ్ఞానశాకుంతలం మహాభారతంలోని కథనాధారంగా తీసుకొని, శకుంతల దుష్యంత చక్రవర్తుల సమాగమ వృత్తాంతాన్ని చిత్రీకరించడం జరిగింది. ప్రపంచ సారస్వతంలోని మొదటి నూరు గ్రంథాలలో అభిజ్ఞానశాకుంతలం ఒకటి అని విమర్శకుల అభిప్రాయం. రెండో చంద్రగుప్తుడి ఆస్థానాన్ని అలంకరించిన నవరత్నాలలో కాళిదాసుతోపాటు క్షపణికుడు, అమరసింహుడు, బేతాళభట్టు, ఘటకర్పరుడు, ధన్వంతరి, శంఖు, వరాహమిహిరుడు, ఆర్యభట్టు, వరరుచి, వసుబంధుడు, సుబంధుడు, బ్రహ్మగుప్తుడు ఉన్నట్లు భావించినా, వారందరూ గుప్త రాజుల ఆస్థానంలో వేర్వేరు కాలాలలో ఉన్నట్లు అనేకులు భావిస్తున్నారు.

ఈ యుగంలో పేరొందిన మరో రచయిత విశాఖదత్తుడు. దేవీచంద్రగుప్తం, ముద్రారాక్షసం ఇతడి రచనలు. మృత్స్యకటకం రాసిన శూద్రకుడు కూడా ఈ కాలానికి చెందినవాడేనని కొందరి అభిప్రాయం. వాసవదత్త రచయిత సుబంధు, అమరకోశాన్ని రచించిన అమరసింహుడు, దశకుమార చరిత్రను రాసిన దండి ఈ కాలానికి చెందినవారే. హితోపదేశానికి మూలమైన పంచతంత్రం ఈ కాలంనాటిదే. ఇది విష్ణుశర్మ వ్రాయగా, అనేక స్వదేశీ, విదేశీ భాషల్లోకి అనువదించడం జరిగింది. నాటి సామాన్య ప్రజల భాష ప్రాకృతం. అందువల్ల బౌద్ధులు, జైనులు తమ మత ప్రచారాన్ని ప్రాకృత భాషలోనే చేయడం జరిగింది.

**4.3.2 పురాణాలు:** గుప్త యుగానికి పూర్వం ప్రచారంలో ఉన్న పురాణాలు ఈ యుగంలో సంస్కరించబడ్డాయి. అవి విజ్ఞాన సర్వస్వాలుగా వ్యవహరించబడ్డాయి. బ్రహ్మాండ, వాయు, విష్ణు, మత్స్య, శివ, స్కంధ పురాణాలు ఈ యుగానికే చెందినవిగా భావిస్తున్నారు. మహాభారతం కూడా సంస్కరించడం జరిగింది. మొదట దీనిలో 24,000 శ్లోకాలుండగా, క్రమేణా అది లక్ష శ్లోకాల గ్రంథమయింది. ధర్మశాస్త్రాలు తిరిగి రచించబడ్డాయి. మనుధర్మశాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని గుప్తుల కాలంలో అనేక స్మృతి గ్రంథాలు వెలువడ్డాయి. నారద, వాత్సాయన, బృహస్పతి స్మృతులు ఈ కాలానికే ఆపాదింపబడ్డాయి. బౌద్ధ వేదాంతులైన బుద్ధపాలితుడు, భావవివేకుడు, వసుబంధుడు, భారతీయ తర్క శాస్త్రానికి పితామహుడైన దిజ్ఞగుడు గుప్త యుగంలో విలసిల్లారు.

## 4.4 వైజ్ఞానిక శాస్త్రాభివృద్ధి:

ఈ యుగంలో సాహిత్య, సారస్వతాలతోపాటు, వాటికి ధీటుగా వైజ్ఞానిక శాస్త్రాభివృద్ధి కూడా జరిగింది. ఉద్ధరణ జరిగిన వైదిక మతం కారణంగా, విజ్ఞానశాస్త్రాల పట్ల ప్రజలలో ఆసక్తి పెరిగింది. అలాగే గ్రీసు వంటి దేశాలతో సంబంధాలు, సంపర్కాల వల్ల శాస్రాభివృద్ధికి దోహదం కలిగింది. జంతుబలుల వల్ల, శాస్త్రజ్ఞులు శరీర అంతర్భాగాలను, అవయవాలను పరిశీలించడంవల్ల వైద్యశాస్త్ర, రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందాయి.

**4.4.1 గణిత, ఖగోళ శాస్త్రాలు:** అలాగే గణిత, ఖగోళ శాస్త్రాలలోను గొప్ప అభివృద్ధి జరిగింది. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు గుప్తయుగ గణిత శాస్త్రజ్ఞుల్లో సుప్రసిద్ధులు.

**(ఎ) ఆర్యభట్టు:** భూభ్రమణాన్ని గురించి మొదట ప్రపంచానికి చాటి చెప్పినవాడు ఆర్యభట్టు. సూర్యచంద్ర గ్రహణాలు ఎలా ఏర్పడతాయో తన 'సూర్య సిద్ధాంతం' గ్రంథం ద్వారా ఇతడు శాస్త్రీయంగా నిరూపించాడు. చుట్టుకొలతకు, వ్యాసానికి ఉన్న సంబంధాన్ని 'ఆర్యభట్టీయం' గ్రంథంలో వివరించాడు. అలాగే స్థానభేదం వల్ల సున్నా విలువ ఎలా మారుతుందో వివరించి, దశాంశ పద్ధతికి నాంది పలికాడు. సున్నా విలువ ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన అపూర్వ కానుక.

**(బి) వరాహమిహిరుడు:** వరాహమిహిరుని 'బృహత్సంహిత'ను విజ్ఞాన సర్వస్వంగా భావిస్తారు. ఆ గ్రంథంలో ఖగోళ, భూగోళ, జ్యోతిష్య, వృక్షశాస్త్రాలు వివరించబడ్డాయి. పాశ్చాత్య ఖగోళశాస్త్రం నుంచి మనదేశం ఎంతో గ్రహించినట్లు బృహత్ సంహితవల్ల తెలుస్తుంది. వరాహమిహిరుడి పంచసిద్ధాంతిక' ఖగోళ శాస్త్రాన్ని వివరించగా అతడి 'బృహత్ జాతకం', 'లఘుజాతకం' ప్రసిద్ధ జ్యోతిష్య గ్రంథాలుగా పేరొందాయి.

**(సి) బ్రహ్మ గుప్తుడు:** భూమ్యాకర్షణ శక్తిని గూర్చి సిద్ధాంతీకరించిన ఘనత బ్రహ్మగుప్తుడికి దక్కుతుంది.

**4.4.2 వైద్య శాస్త్రం:** శస్త్ర చికిత్సా పారంగతుడిగా పేరొందిన శుశ్రుతుడు గుప్తుల కాలానికి చెందినవాడే. ఇతడు 'శుశ్రుత సంహిత'ను రచించాడు. 'అష్టాంగ సంగ్రహం', వాగ్భటుడి రచన. ఇది వైద్యశాస్త్రాన్ని గురించి వివరిస్తుంది. 'చరక సంహిత' రచించిన చరకుడు, 'హస్త్యాయుర్వేద' గ్రంథం ద్వారా పశువైద్యాన్ని అభివృద్ధిపరచిన పాలకవ్య, ధన్వంతరి గుప్తయుగంలో విరాజిల్లారు. వీరందరి కృషి కారణంగా, శాస్త్ర రంగంలో భారతీయులకు జిజ్ఞాస పెరగడమే కాకుండా, శాస్త్ర పురోభివృద్ధి జరిగి, అది విదేశీయులను సైతం ఆకర్షించింది.

**4.4.3 కళావైభవం:** గుప్తుల కళా వైభవం మహోన్నత శిఖరాలనందుకొంది. గుప్త పాలకులు వస్తుకళ మీద ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రదర్శించి, అనేక భవనాలను, దేవాలయాలను నిర్మించడం జరిగింది. వాటిలో కొన్ని హూణ, మహ్మదీయ దాడుల ఫలితంగా ధ్వంసమైనప్పటికి, మిగిలిన నిర్మాణాలు భారతీయ ప్రాచీన సంస్కృతికి వారసత్వాలుగా నిలిచాయి.

**(ఎ) దేవాలయాలు:** హిందూదేవాలయాల నిర్మాణానికి రూపకల్పన చేసిన తొలి పాలకులు గుప్త చక్రవర్తులనే చెప్పవచ్చు. దేవఘర్ లోని దశావతార దేవాలయం, భూమ్రాలోని శివాలయం, టిగా వాలోని విష్ణాలయం, నాచన కుఠారాలోని పార్వతీ ఆలయం, సాంచి సారనాథ్ గయలలోని బౌద్ధ దేవాలయాలు. బీత గామ్ లోని ఆలయాలు గుప్తుల కాలంలో నిర్మించబడి, వారి కళాసంపదను చాటుతూ, నేటికి నిలచి ఉన్నాయి. నాటి కళారంగం ప్రత్యేకతను సంతరించుకొని, విదేశీయత నుంచి బయటపడి, స్వచ్ఛతతోను, భారతీయతతో'ను ప్రకాశించింది. అంతేగాక సున్నితత్వంతోను, భావ ప్రస్ఫుటతలోను సాటిలేని మేటిదిగా దేశ, విదేశీయుల ప్రశంసలనందుకొంది.

**(బి) గుహాలయాలు:** గుప్తుల తొలి ఆలయాలు రాతితో నిర్మించబడగా, మలి ఆలయాలు రాయి, ఇటుకలతో నిర్మించబడ్డాయి. తొలి ఆలయాలలో చతురస్రాకార గర్భగృహం నిర్మించబడి, దానికి ముందు స్తంభాల మండపం ఉండి, ఆలయ పైకప్పు సమతలంగా ఉండేది. మలి ఆలయాలకు గర్భగృహం, ప్రదక్షిణాపథం, గర్భగృహం పై భాగంలో శిఖరం నిర్మించబడ్డాయి. ఆలయాల స్తంభాల పైభాగం పూర్ణకుంభాకారంతోను, సింహద్వారానికి ఇరువైపుల గంగ-యమున శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. గుప్తుల వస్తుకళ అతి సామాన్యంగా, నిరాడంబరంగా ప్రారంభమై, క్రమంగా అనేక మార్పులకు లోనై, నగరశైలికి శ్రీకారం చుట్టబడింది. కనకనే భారతదేశ వస్తుచరిత్రలో గుప్తుల కాలంలో నూతన శకం ఆరంభమైందని ఎస్.కె. సరస్వతి ప్రశంసించారు.

**4.4.4 శిల్ప కళ:** ఈ కాలంనాటి శిల్పకళలో కొన్ని మార్పులు సంభవించడం జరిగింది. విదేశీ గాంధార శిల్పకళా లక్షణాల నుంచి, నాటి శిల్పకళ విముక్తి పొందింది. దాని పై దేశీయమైన బారుత్ సంప్రదాయ ప్రభావం అధికమయింది. అందువల్లనే ఆనాటి భారతీయ శిల్పానికి స్వతంత్ర వ్యక్తిత్వం ఏర్పడిందని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

ఈ వ్యక్తిత్వమే సారనాథ్ బౌద్ధ శిల్పంలోను, శివవైష్ణవుల వంటి ఇతర దేవతా శిల్పాలలోను కనిపిస్తుంది. గుప్తుల శిల్పం భారతీయమైందని, ప్రతి అంశంలోను సంప్రదాయమైందని, అది మధురశైలి నుంచి ఉద్భవించిందని గ్రీకు లేదా మరే ఇతర ప్రభావం దానిపై లేదని ఆర్.సి. మంజుదార్ అభిప్రాయపడ్డాడు.

**(ఎ) హిందూ విగ్రహాలు:** ఉదయగిరిలోని వరాహశిల్పం, ఎరాలోని వరాహ విగ్రహం, భూమాలోని గణేశ, ఏకముఖ లింగాలు, బ్రహ్మ, యవ, కుబేర, కార్తికేయ, సూర్య, ఇంద్ర, విష్ణు, శివ ప్రతిమలు నాటి ప్రధాన శిల్పాలు. గుప్తులు నిర్మించిన దేవతా విగ్రహాలు దైవ భక్తికి, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి చిహ్నాలు.

ఈ కాలంలో శివతత్వానికి రూపకల్పన జరిగింది. శివునికి ఏకముఖ, చతుర్ముఖ, బహుముఖ, లింగాకృతి కల్పించబడింది. అర్ధనారీశ్వర రూపం కూడా ఇవ్వబడింది. మధుర, సారనాథ్, వారణాసి, పాటలీపుత్రం నాటి ప్రధాన శిల్ప కళాకేంద్రాలు.

**(బి) బౌద్ధ శిల్పం:** మధుర, సాంచి, సారనాథ్ లో లభించిన బుద్ధ, బోధిసత్వుల విగ్రహాలు నాటి బౌద్ధ శిల్పుల పనితనానికి నిదర్శనాలు. ఎల్లోరా, బాగ్, ఉదయగిరి గుహలు ఈ కాలంలో నిర్మించబడ్డ గుహాలయాలు. ఎర్రమట్టితో బొమ్మలను (Terra Cotta) తయారుచేసే కళ కూడా గుప్తుల కాలంలో విలసిల్లింది. ఈ కళ సాధారణంగా సామాన్య, బీద ప్రజలలో ఎక్కువగా కనిపిస్తుంది. విష్ణువు. సూర్యుడు, దుర్గ, గంగ, యమున బొమ్మలుబీ రకరకాల స్త్రీపురుష బొమ్మలు, అనేక రకాల జంతువుల బొమ్మలు లభించాయి.

**4.4.5 చిత్ర కళ:** గుప్తయుగంలో శిల్పకళతో పాటు చిత్రకళ కూడా పరిపక్వత చెందింది. ప్రభుత్వమే చిత్రశాలలు స్థాపించి, చిత్రలేఖనాన్ని పోషించి, చిత్రకళాభివృద్ధికి పాటుపడింది. చక్రవర్తులు, ధనవంతులు, కళాభిమానులు కూడా చిత్రకళాభివృద్ధికి దోహదపడ్డారు. కాళిదాసు, దండి, బాణుడు చిత్రశాలలను గురించి తమ రచనల్లో ప్రస్తావించారు.

**(ఎ) కుడ్య చిత్రాలు:** అజంతాలోని 16, 17, 19 గుహలలో గల కుడ్య చిత్రాలు, గ్వాలియర్లోని బాగ్, సింహళంలోని సిగిరియా గుహలనందుగల వర్ణచిత్రాలు ప్రపంచ కుడ్య చిత్రాలలో సంపూర్ణమైనవని చరిత్రకారులు ప్రశంసించడం జరిగింది. నాటి చిత్రకారులు రంగుల ద్వారా తమ భావాలను ప్రకటించడంలో సిద్ధహస్తులు. వృక్షాలు, జంతువులు, పుష్పాలు, లతలు, గంధర్వులు, పక్షులు, అప్సరసలు మొదలైన కథా వస్తువులను ఇతివృత్తంగా తీసుకొని జీవం ఉట్టిపడేటట్లు తమ చిత్రాలను చిత్రీకరించారు. అజంతా గుహలోని 16వ సంఖ్యగల గుహలోని మరణశయ్య పై గల రాకుమారి చిత్రం విదేశీయులైన గ్రిఫిత్, ఫెర్గూసన్, బర్జె ప్రశంసలందుకొంది. 17వ గుహ లోని చిత్రాలను అద్భుతమైన చిత్ర ప్రదర్శనశాలగా వర్ణిస్తారు. అందులో బుద్ధుడి జననం, జీవనం, మరణాలను చక్కగా చిత్రీకరించడం జరిగింది. బాగ్ గుహలోని చిత్రాలు అజంతా చిత్రాలకు అనుకరణలు.

**4.4.6 సంగీతం - నృత్యం:** గుప్తుల కాలంలో సంగీత, నృత్యం రాజదరణ పొంది పురోగమించాయి. సముద్రగుప్తుడు గొప్ప విద్వాంసుడు. అతడి నాణాల పై తాను వీణ వాయిస్తున్నట్లు ముద్రించుకొన్నాడు. ఆకాలంలో నృత్య సంగీతాలలో శిక్షణనిచ్చేందుకు సంగీత, నృత్యశాలలుండేవని తెలుస్తుంది. దేవదాసీలు నాట్య సంగీతాలలో మంచి ప్రావీణ్యాన్ని కలిగి ఉండేవారు. రాజు ఆస్థానంలో రాజనర్తకులు, గాయకులుండేవారు. ఆ కాలపు అనేక నాట్యభంగిమలు, సంగీత వాయిద్యకారుల చిత్రాలు భూమ్రాలోని శివాలయంలోను, అజంతాలోని 17వ విహారంలోను చూడవచ్చు. వీణ, మృదంగం, వేణువు వంటి వాయిద్యాల ప్రస్తావననాటి సాహిత్యంలో కనిపిస్తుంది.

**4.4.7 నాటకం:** నాటకరంగానికి కూడా మంచి ఆదరణ లభించింది. అభిజ్ఞానశాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, మత్స్యకటికం వంటి నాటకాలు తరచుగా ప్రదర్శింపబడేవి.

**4.4.8 లోహకార విశిష్టత:** లోహాలను కరిగించి పోతపోసే పరిశ్రమ కూడా గుప్తుల కాలంలో అభివృద్ధి చెందింది. బంగారం, వెండి, రాగి, ఉక్కు, కంచు మొదలైన లోహాలను ఉపయోగించి, అనేక వస్తువులను, ఆభరణాలను, దేవతా ప్రతిమలను తయారుచేసేవారు. నలందాలోని 8 అడుగుల బుద్ధ విగ్రహం గుప్తుల లోహకార

కళానైపుణ్యానికి నిదర్శనం. ఢిల్లీలోని మెహరౌలి వద్ద చంద్రరాజు ఉక్కుస్తంభం 23.8 అడుగుల ఎత్తు, 1.4 అడుగుల వ్యాసం కలిగి, 6 టన్నుల బరువుతో నిర్మించబడింది. ఇది నాటి నుంచి నేటి వరకు ఎండకు ఎండి, వానకు తడిసినప్పటికి తుప్పుపట్టకపోవడం శాస్త్రజ్ఞులను సైతం ఆశ్చర్యపరుస్తుంది.



**మెహరౌలి స్థూపం**

## 4.5 నాణేలు:

గుప్తులు ముద్రించి, జారీచేసిన బంగారు, వెండి నాణాలు కూడా ఆనాటి లోహకార పనితనానికి నిదర్శనం. నాణాలపై వారు చిత్రించిన రాజుల, దేవతల బొమ్మలు, గుప్తుల కళాకౌశల్యానికి గీటురాళ్ళు.

## 4.6 సాంస్కృతిక వికాసం:

గుప్త చక్రవర్తులు విదేశీయులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. ఈ కాలంలో మధ్య ఆసియా, ఆగ్నేయాసియా, సింహళం, చైనా, రోమ్, ఈజిప్ట్ దేశాలతో సాంస్కృతిక సంబంధాలేర్పడ్డాయి. రోమన్ పాలకులు తమ దేశ రాయబారులను భారతదేశానికి పంపడం జరిగింది. భారతీయ నాణాల పై రోమన్ సంప్రదాయ ప్రభావం కనిపిస్తుంది.

**4.6.1 ముగింపు:** గుప్త ప్రభువులు రాజకీయ సమైక్యతకు కృషిచేసి, దేశ సమైక్యతకు పాటుపడ్డారు. బ్రాహ్మణ మతాన్ని ఆదరించినప్పటికి, పరమత సహన విధానాన్ని పాటించారు. ఈ కాలంలో హిందూమతంలో భక్తి ఉద్యమానికి ప్రాధాన్యత పెరిగింది. దేవాలయాల నిర్మాణం విరివిగా జరిగింది. వీరి పోషణలో సంగీత, సాహిత్య, సృష్టి పరాకాష్టనందుకొంది. శాస్త్ర విజ్ఞానంలో అద్భుత ప్రగతి జరిగింది. కనకనే గుప్తుల పాలనాకాలాన్ని 'స్వర్ణయుగం' గా పరిగణిస్తారు.

## 4.7 సారాంశము:

గుప్తుల కాలంలో విద్య, సాహిత్యం, కళలు, శాస్త్రాలు సర్వతోముఖాభివృద్ధి చెందాయి. వారి పోషణలో హిందూ సాంప్రదాయాలు, సంస్కృతి సంపూర్ణ వికాసాన్ని పొందింది. ఆ కారణంగానే గుప్తుల కాలాన్ని భారతదేశ చరిత్రలో స్వర్ణ యుగంగా పిలుస్తారు.

గుప్తుల కాలంలో విద్యా విధానం గురు-శిష్య సంబంధంగా, మౌఖికంగా జరిగింది. సుమారు 72 రకాల విద్యలను బోధించేవారు. నలంద, తక్షశిల, వల్లభ గొప్ప విద్యా కేంద్రాలుగా భాసిల్లాయి. గుప్త చక్రవర్తులందరూ సాహితీ ప్రియులు. సముద్ర గుప్తుడు స్వయంగా కవి. కవిరాజ బిరుదాంకితుడు. చంద్ర గుప్త విక్రమాదిత్యుడి కాలంలో 'నవ రత్నాలు' అనే కవులుండే వారని ప్రతీతి. కాళిదాసు వారిలో అగ్రగణ్యుడు. విశాఖదత్తుడు, శూద్రకుడు ఈ కాలానికి చెందినవారే. గుప్తుల కాలంలో పురాణాలు, మహాభారతం, ధర్మశాస్త్రాలు తిరిగి వ్రాయబడ్డాయి. వీరి కాలంలో సంస్కృత భాష, సాహిత్యం అభివృద్ధి చెందాయి.

గుప్త యుగంలో విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఆర్యభట్టు, వరాహమిహిరుడు ఆ కాలం నాటి ఖగోళ శాస్త్రజ్ఞులు. గొప్ప వైద్యులైన శుశ్రుతుడు ఈ కాలానికి చెందిన వాడే. గుప్తుల కాలంలో అనేక దేవాలయాలు నిర్మించబడ్డాయి. అజంతాలోని కొన్ని చిత్రాలు ఈ కాలానికి చెందినవే.

## 4.8 మాదిరి ప్రశ్నలు:

1. గుప్తుల కాలాన్ని స్వర్ణ యుగం అని ఎందుకు పిలుస్తారు?
2. నవ రత్నాల గురించి వివరించండి.

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1. ఆర్యభట్టు
2. కాళిదాసు
3. వరాహమిహిరుడు

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. మృచ్ఛికటికం రచయిత .......... ( )

ఎ) కాళిదాసు బి) శూద్రకుడు సి) విశాఖ దత్తుడు డి) విష్ణుశర్మ

2. కవి రాజు బిరుదు గల చక్రవర్తి............ ( )

ఎ) చంద్ర గుప్తుడు బి) శ్రీ గుప్తుడు సి) సముద్ర గుప్తుడు డి) రెండో చంద్ర గుప్తుడు

3. ఇండియన్ షేక్ స్పియర్ అనే బిరుదు ఎవరిది? ( )

ఎ) కాళిదాసు బి) శూద్రకుడు సి) విశాఖదత్తుడు డి) విష్ణు శర్మ

**జతపరచండి:**

| | | |
|---|---|---|
| 1. దిజ్ఞాగుడు | ( ) | ఎ) సూర్య సిద్ధాంతము |
| 2. ఆర్యభట్టు | ( ) | బి) భూమ్యాకర్షణ శక్తి |
| 3. బ్రహ్మ గుప్తుడు | ( ) | సి) అష్టాంగ సంగ్రహం |
| 4. వాగ్భటుడు | ( ) | డి) చరక సంహిత |
| 5. చరకుడు | ( ) | ఇ) తర్క శాస్త్రం |

**ఖాళీలను పూరింపుము:**

1. పంచ తంత్రం గ్రంథ కర్త ...........................................
2. బృహత్ సంహిత రచించినది ..................................
3. గుప్తుల కాలంలో రాజ భాష ........................................

## 4.9 ఉపయుక్త గ్రంథాలు:


1. Gopal S.R. - A History of the Imperial Gupthas
2. Jha D. N. - Ancient India, An Introductory Outline
3. Majundar R.C. (Ed.) - The Age of Imperial Unity
4. Mookerji R.K. - The Gupta Empire
5. Nilkanta Sastri K.A. - Comprehensive History of India
6. Romila Thapar - A Hisotry of India
7. Sathiyanatha Aiyar R. - History of India



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

## పాఠం - 5

# హర్షవర్ధనుడు

## 5.0 లక్ష్యం:

* క్రీ.శ. 5వ శతాబ్దంలో గుప్త సామ్రాజ్యం విచ్ఛిన్నం తరువాత ఉత్తర భారతదేశంలో వివిధ ప్రాంతాలను వివిధ రాజ వంశాల వారు పరిపాలన చేశారు. స్థానేశ్వర్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలించిన వారు పుష్యభూతి వంశం వారు. కనౌజ్‌ను మౌఖరీ వంశం, వల్లభిని మైత్రికులు, మాళవను గౌడ వంశం వారు పరిపాలించడం జరిగింది. అయితే పుష్యభూతి వంశం వారికే ఉత్తర భారతంలో ఎక్కువ ప్రాధాన్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:

**5.1 ఆధారాలు**

**5.2 వర్ధన వంశం**

**5.3 హర్షుడి సైనిక విజయాలు**

**5.4 హర్షుడి పాలన**

**5.5 హర్షుని భాషా సేవ**

**5.6 హర్షుని మతము**

**5.7 హర్షుని దానశీలత**

**5.8 సారాంశము**

**5.9 మాదిరి ప్రశ్నలు**

**5.10 ఉపయుక్త గ్రంథాలు**

## 5.1 ఆధారాలు:

1. బాణుని హర్ష చరిత్ర
2. హ్యూయాన్‌త్సాంగ్ సి-యు-కి గ్రంథం
3. బన్స్‌పార, మధుబన్ శాసనాలు.

## 5.2 వర్ధన వంశం:

తూర్పు పంజాబ్‌లోని స్థానేశ్వరం రాజధానిగా కొంత ప్రాంతాన్ని పరిపాలించడంలో వర్ధన వంశ పరిపాలన ఆరంభం అయ్యింది. మూల పురుషుడు 'పుష్యభూతి'. ప్రధానమైన రాజు ప్రభాకర వర్ధనుడు. వీరు మొదట్లో గుప్త రాజుల సామంతులు.

ప్రభాకరుడి మరణం తరువాత అతని జేష్ట కుమారుడు రాజ్య వర్ధనుడు ధానేశ్వర్‌కు రాజయ్యాడు. సింహాసనం అధిష్టించినప్పటి నుండి ఇతనికి కష్టకాలమే. మగధ, మాల్వాను పాలిస్తున్న గుప్త రాజు దేవ గుప్తుడు గౌడ రాజైన శశాంకుడి సహాయంతో కనౌజ్ పై దాడి చేసి, రాజ్య వర్ధనుడి సోదరి రాజశ్రీ భర్తయైన గృహవర్మను చంపి, రాజశ్రీని

బంధించాడు. రాజ్య వర్ధనుడు దేవ గుప్తుడిని చంపాడు. కానీ శశాంకుడు చేతిలో హతమయ్యాడు. రాజశ్రీ తప్పించుకొని అడవులలోకి పారిపోయినది.

ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో ప్రభాకర వర్ధనుడి చిన్న కుమారుడు హర్షవర్ధనుడు సింహాసం అధిష్టించాడు. రాజశ్రీని రక్షించి, తన బావ గారి హత్యకు కారకులైన వారి పై దండెత్తి శశాంకుడిని ఓడించి, కనౌజ్‌ను ఆక్రమించుకొనెను. ఉత్తర భారతంలోని పంజాబ్, కనౌజ్, బెంగాల్ లోని కొంత భాగాన్ని, ఒరిస్సా, మిథిల ప్రాంతాలను ప్రత్యక్ష పాలనలోనికి తెచ్చుకున్నాడు.

## 5.3 హర్షుడి సైనిక విజయాలు:

1. హర్షుడు వల్లభ సామ్రాజ్యాధినేత రెండో ధృవసేనుణ్ణి జయించాడు. వల్లభ రాజ్య విజయంతో ఉత్తర భారతదేశంలో ఎదురులేని సామ్రాట్‌గా నిలిచాడు.

2. గౌడ రాజులతో వైవాహిక సంబంధాలు నెలకొల్పి, బాగా బలవంతుడయ్యాడు.

3. రెండో పులకేశికి, హర్షుడికి లాట, మాల్వా, ఘూర్జర ప్రాంతాలకై అధికారం కోసం పోరాటం సల్పినారు. ఈ యుద్ధ ఏర్పాట్లపై హ్యూయాన్‌త్సాంగ్ రచనలు వివరణ ఇస్తున్నవి. కాని యుద్ధ ఫలితం వ్రాయబడలేదు. పులకేశి ఆస్థాన కవి రవికీర్తి రచించిన ఐహోల్ శాసనాన్ని బట్టి హర్షుడు పులకేశి చేతిలో ఓడిపోయినట్లు తెలుస్తుంది. అయితే స్పష్టమైన ఆధారాలు లభించనందు వల్ల నిష్పాక్షికమైన ఆధారాల వల్ల ఇద్దరు పరస్పరం ఒప్పందం కుదుర్చుకొని యుండవచ్చు అనే అంశం ధృవీకృతమౌతుంది.

4. హర్షుడు పల్లవ రాజైన ఒకటో మహేంద్ర వర్మను కూడా ఓడించాడు. మరి కొందరు దక్షిణ పాలకులను కూడా ఓడించారని చెబుతారు. ఇందుకు ఖచ్చితమైన సాక్ష్యాధారాలు కష్టమే.

5. కళింగను ఓడించినట్లు కూడా తెలుస్తుంది. అందుకు ఒరిస్సాలో హర్ష శకాన్ని పాటించటమే ఇందుకు తార్కాణం.

6. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సాలలో ప్రత్యక్షపాలన, కాశ్మీరు, సింధు వల్లభ, కామరూప రాజుల సామంతులుగా ఏలుబడిలోనికి వచ్చారు.

## 5.4 హర్షుడి పాలన:

హర్షుడు గుప్తుల పద్ధతిలో పరిపాలన గావించాడు. అయితే భూస్వామ్య ధోరణి ఎక్కువైంది. హర్షుడి సైన్యం లక్ష మంది అశ్వికులు, 60 వేల గజ దళం, ప్రతి సామంతుడు తనకు కేటాయించిన అశ్విక దళాలను, పదాతి దళాలను చక్రవర్తి కోరినపుడు పంపించాలి.

హర్షుని కాలంలో రాజ్యం మండల వ్యవస్థగా పరిగణించడం జరిగింది. ఒక రాజ్యం చుట్టూ దగ్గర గాను, దూరం గాను, పొరుగు రాజ్యాలతో ఏర్పడిన విస్తృతమైన మండల వ్యవస్థగా పేర్కొన్నారు. కేంద్ర రాజ్యంగా రాజును భావిస్తే అతని చుట్టూ ఏర్పడిన వలయం 12 మంది రాజులు పరస్పర అంతః రాజ్య సంబంధాలతో ఉండేవారు. వాటిలో ముఖ్యమైనది సంధి, విగ్రహ, ఆసన, యాన, సంశ్రమ, ద్వైవభావ మొదలైన మండల వ్యవస్థల వల్ల బలమైన కేంద్రీకృత వ్యవస్థగా ఏర్పడింది.

హర్షుని కాలమున శిక్షా స్మృతి కఠినతరముగా ఉండెను. దేశ ద్రోహమునకు యావజ్జీవ కారాగారము, సాంఘీక నియమాలకు అంగ విచ్ఛేదము, దేశ బహిష్కరణ, చిన్న చిన్న నేరాలకు జరిమానాలు, సాధారణ శిక్షలు, నేర నిరూపణకు దివ్య పరీక్షలు కలవు. శిక్షలు కఠినముగా ఉన్నను నేరములు తగ్గలేదు. దారి దోపిడీ దొంగలు హ్యూయాన్‌త్సాంగ్‌ను ఒకటి రెండు పర్యాయాలు దోచుకుని పోయారని హ్యూయాన్‌త్సాంగ్ వ్రాశారు.

## 5.5 హర్షుని భాషా సేవ:

నలందా విశ్వ విద్యాలయమునకు 100 గ్రామాలు దానం చేసెను. హర్షుడు స్వతహాగా కవి, నాగా నందం, ప్రియదర్శిక, రత్నావళి అనే సంస్కృత నాటకములు వ్రాసెను. రాజ్య ఆదాయంలో 1/4వ వంతు ఆదాయం కవులను పోషించుట కొరకే వినియోగించినారు. హర్ష చరిత్ర, కాదంబరి రచించిన బాణుడు హర్షుని ఆస్థాన కవి, సుభాషిత శతక కారుడు భర్తృహరి, సూర్య శతకము వ్రాసిన మయూరుడు, జయసేనుడు, మలింగ, దివాకురుడు ముఖ్యమైన వారు.

## 5.6 హర్షుని మతము:

హర్షుడు శైవ మతస్థుడు. బన్స్‌పార, మధుబన్ శాసనాలలో అతడు మహేశ్వరుడుగా పిలవబడెను. తదుపరి రాజశ్రీ, హ్యూయాన్‌త్సాంగ్‌ల ప్రభావం వలన బౌద్ధ మతమునకు ఆకర్షింపబడెను. కానీ బౌద్ధ మతము స్వీకరింప లేదు.

జంతు వధను నిషేధించెను. బౌద్ధ స్థూపములను, ఆరామాలను కట్టించెను. కాశ్మీరు రాజు నుండి బుద్ధ దాతువును పొంది, ఒక స్థూపమును కట్టించినట్లు తెలియుచున్నది. మహా యానము ప్రాశస్త్యమును చాటుటకు కనౌజ్‌లో పరిషత్తును ఏర్పరచి, హ్యూయాన్‌త్సాంగ్‌ను అధ్యక్షునిగా చేసి, ఈ సందర్భంగా ఒక గోపురంను నిర్మించి, నిలువెత్తు బంగారంతో బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది. అన్య మతములను దూషించ లేదు, విడనాడ లేదు. బౌద్ధులతో పాటు శైవులకు, బ్రాహ్మణులకు, జైనులకు కూడా దాన, ధర్మములు చేసెను.

## 5.7 హర్షుని దానశీలత:

దాన, ధర్మములలో హర్షుడు కర్ణుడు యంతటి వాడు. ప్రజాహిత కార్యక్రమాలను అనేకం చేపట్టాడు. సత్రాలు, వైద్యశాలలు నెలకొల్పి, ప్రజలకు ఉచిత విద్య, వైద్య, భోజన సదుపాయాలు కల్పించెను. ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైన మహామోక్ష పరిషత్తును నిర్వహించి, ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి రాజ్య ఖజానానంతయు ప్రజలకు దానధర్మములు చేసేడి వాడని సి-యు-కి గ్రంథం వలన తెలుస్తున్నది. హర్షవర్ధనుడు పంచి, కట్టుగుడ్డలతో రాజధాని మరలి వెళ్ళేవాడట. తన సోదరి దగ్గరి నుండి బట్టలు తీసుకొని కట్టుగుడ్డలను సైతం దానం చేసేవాడు. ఇట్టి విశాల హృదయం కల రాజు ప్రపంచ చరిత్రలో మచ్చుకైనా కానరారు.

## 5.8 సారాంశము:

యోధుడుగా, పరిపాలనా దక్షుడిగా ప్రజా క్షేమము కొరకు నిర్విరామముగా కృషి చేసిన ప్రజా సేవకుడుగా ఖ్యాతి నొందినాడు. దానశీలుడుగా, సాహితీ ప్రియుడుగా, కవిగా, చరిత్ర పుటలలో వెలుగొందిన గొప్ప ఉజ్జ్వల మూర్తిగా హర్షవర్ధనుడు పేరు గాంచాడు.

## 5.9 మాదిరి ప్రశ్నలు:

1. హర్షుని ఘనతకు కారణాలు?
2. హ్యూయాన్‌త్సాంగ్ రచనలు హర్షుని సమకాలీన పరిస్థితులు తెలుసుకొనుటకు ఎట్లు తోడ్పడుచున్నవి?
3. హర్ష వర్ధనుని పాలనా విశేషాలు తెలపండి.

**లఘు ప్రశ్నలు**

1. గౌడ శశాంకుడు
2. ప్రభాకర వర్ధనుడు
3. రాజ్య వర్ధనుడు
4. రాజశ్రీ

**ఖాళీలను పూరింపుము.**

1. హర్షుని ఓడించిన రాజు ........ ( )

   ఎ) శశాంకుడు బి) దేవ గుప్తుడు సి) రెండవ పులకేశి డి) కీర్తివర్మ

2. హర్షుడు కాలమున పర్యటించిన చైనా యాత్రికుడు ( )

   ఎ) పాహియాన్ బి) హుయాన్‌త్సాంగ్ సి) ఇత్సింగ్ డి) హులి

**జతపరచుము:**

1. బాణుడు ( ) ఎ) నీతి శతకం
2. హర్షుడు ( ) బి) సూర్య శతకం
3. మయూరుడు ( ) సి) సి-యు-కీ
4. భర్తృహరి ( ) డి) హర్ష చరిత్ర
5. హుయాన్‌త్సాంగ్ ( ) ఇ) నాగానందం

**మీకిచ్చిన పటంలో క్రింది ప్రదేశాలను గుర్తించండి.**

1. ఉజ్జయిని 2. మాళ్వా 3. కనౌజ్ 4. గయ 5. ప్రతిస్థానపురం

## 5.10 ఉపయుక్త గ్రంథాలు:


1. R.K. Mookerji - Harsha
2. Devahuti - Harsha, A Political Study
3. B.S.L. Hanumantha Rao - తెలుగు అకాడమీ
4. Tripathi R.S. - History of Kanuj



పాఠ్యభాగ రచయిత

డా॥ షేక్ రమీ బేగం

పాఠం - 6

# అరబ్బు దండయాత్రలు

## 6.0 లక్ష్యం:

* ఈ పాఠంలో అరబ్బులు చేసిన దండయాత్రలు గురించి మీరు అధ్యయనం చేస్తారు.

## పాఠ్య నిర్మాణ క్రమం:


6.1 ఉపోద్ఘాతం

6.2 అరబ్బు దండయాత్రకు కారణాలు

6.2.1 ముఖ్య కారణము

6.2.2 తొలి ప్రయత్నము

6.2.3 అరబ్బుల దండయాత్ర నాటికి సింధ్ పరిస్థితి

6.3 అరబ్బుల దండయాత్రలు

6.3.1 సింధ్ ఆక్రమణ

6.3.2 ఖాసిం పతనం

6.4 అరబ్బుల దండయాత్రల ఫలితం

6.5 మహమ్మద్ ఘజినీ

6.5.1 దండయాత్ర ఉద్దేశాలు

6.5.2 దండయాత్రలు

6.5.3 దండయాత్ర ఫలితాలు

6.5.4 మహమ్మద్ ఘనత

6.5.6 సారాంశం

6.6 మహమ్మద్ ఘోరి

6.6.1 ఘోరీ దండయాత్రలకు గల కారణాలు

6.6.2 ఘోరి దండయాత్రల నాటికి భారతదేశ పరిస్థితులు

6.6.3 దండయాత్రలు

6.6.4 యుద్ధ ప్రాముఖ్యము

6.6.5 చివరి దండయాత్రలు

6.7 కుతుబుద్దిన్ ఐబక్

6.7.1 సారాంశం

6.8 మాదిరి ప్రశ్నలు

6.9 ఉపయుక్త గ్రంథాలు

## 6.1 ఉపోద్ఘాతం:

భారతదేశము పై దండెత్తిన ముస్లింలలో మొదటివారు అరబ్బులు. ప్రాచీన కాలం నుండి కూడా అరబ్బులతో వ్యాపారం చేస్తుండే వారు భారతీయులు. కానీ 6వ శతాబ్దంలో మహమ్మద్ ప్రవక్త, అతని అనుచరులైన ఖలీఫాల బోధనల వలన అరబ్బులలో ఐకమత్యం పెంపొంది, మతావేశముతో, విప్లవకారులై అరబ్ సామ్రాజ్య విస్తరణకు, ఇస్లాం మత ప్రచారానికి దిగ్విజయ యాత్రలు ప్రారంభించారు.

## 6.2 అరబ్బు దండయాత్రకు కారణాలు:

సామ్రాజ్య విస్తరణ కొరకు, అరబ్బులు ఆర్థికంగా వెనుకబడుట వలన భారతదేశ సిరిసంపదలను కొల్లగొట్టుటకు ఇస్లాం మత వ్యాప్తి కొరకు దండయాత్రలు చేసిరి. అరబ్బులు మతావేశపరులై, భారతదేశమున ప్రబలి ఉన్న విగ్రహారాధనను నిర్మూలించవలెననే ధృఢ సంకల్పం వారికి కల్గినది.

**6.2.1 ముఖ్య కారణము:** ఇటువంటి పరిస్థితులలో సింహళం నుండి ఖలీఫాకు పర్షియా రాజు హజ్జాజ్ కానుకలు తీసుకొనిపోయే ఓడను సింధు నది ముఖ ద్వారం దగ్గర దొంగలు దోచుకున్నారు. హజ్జాజ్ సింధు రాజు దాహిర్‌కు ఓడ దొంగలను అణచి, తన నౌకలకు నష్ట పరిహారం ఇవ్వాల్సిందని వర్తమానం పంపెను. దాహిర్ దీనిని తిరస్కరించడంతో హజ్జాజ్ సింధ్‌ను ఆక్రమింపదలచెను.

**6.2.2 తొలి ప్రయత్నము:** క్రీ.శ. 363 నుండి ఠాణా, బ్రోచ్, దేబిల్ ప్రాంతాల పై దాడులు జరిపారు. కాని, వాటిని జయింపలేకపోయారు. అందువలన అరబ్బుల భారతదేశమును జయింపవలెనని కోరిక ఎక్కువైనది.

**6.2.3 అరబ్బుల దండయాత్ర నాటికి సింధ్ పరిస్థితి:** అరబ్బుల దండయాత్ర నాటికి సింధ్ రాజైన దాహిర్ పై ప్రజలకు వ్యతిరేక భావములు కల్గి యున్నవి. బలహీనుడు, పరమత ద్వేషి, బౌద్ధులను తీవ్రముగా హింసించుట వలన బౌద్ధుల బద్ధ శత్రువులైరి. సామంతులు స్వార్థపరులై అధికారము కోసం తాపత్రయ పడినారు.

## 6.3 అరబ్బుల దండయాత్రలు:

దాహిర్ హజ్జాజ్ విన్నపాన్ని మన్నించకపోవుట వలన, శిక్షింపదలచి ఖలీఫా మొదటి వాలిద్ అనుమతితో హజ్జాజ్ బబైదుల్లా, బదాయిల్ అను వాని నాయకత్వంలో రెండుసార్లు సింధ్ పై దాడులకు పంపెను. దాహిర్ వీరిని తరిమికొట్టి, ఇద్దరిని చంపివేసెను. దీనితో ఉగ్రుడైన హజ్జాజ్ పెద్ద సైన్యమును సమకూర్చుకుని 17 సంవత్సరాలు తన అల్లుడు మహమ్మద్ బిన్ ఖాసిం న్యాయకత్వంన సింధ్ రాజ్యము పై దాడికి పంపెను. ఇతను గొప్ప యోధుడు.

**6.3.1 సింధ్ ఆక్రమణ:** ఖాసిం బెలుచిస్థాన్ గుండా దేబల్, నీరూన్, సెహ్వాన్ నగరాలను ఆక్రమించెను. దాహిర్ ఉద్యోగులు ఖాసింకు సింధు నదిని దాటుటకు సహాయపడిరి. క్రీ.శ. 712లో 20వ తేదీన దేవార్ యుద్ధమందు దాహిర్‌ను అంతము చేసెను. అపుడు దాహిర్ పట్టమహిషియైన రాణిభాయి అరబ్బులతో వీరోచితముగా పోరాడి జౌహర్ పాటించినది. ఈ దిగ్విజయంతో రేనార్, బ్రాహ్మణబాదు, సింధ్, అలోర్ ఖాసిం వశమయ్యెను. సింధు పాదాక్రాంతమయ్యెను.

**6.3.2 ఖాసిం పతనం:** ఖాసిం ముల్తాన్‌ను ఆక్రమించెను. ముల్తాన్ ఆక్రమణ పిమ్మట ఖాసిం కనౌజ్, కాశ్మీర్‌ల పైకి దాడులు చేసెను. అది పూర్తిగాక మునుపే హజ్జాజ్ మరణించుట వలన, ఖలీఫా హజ్జాజ్ కుటుంబంపట్ల బద్ధ వైరుధ్యము వలన ఖాసిం సింధ్ నుండి పిలువబడి ఖలీఫా చేతిలో దుర్మరణం పాలయ్యెను.

ఖాసిం తరువాత జునైద్, కాశ్మీర్, కనోజ్‌ల జయింప యత్నించెను. కానీ కాశ్మీరు ప్రభువు అయిన లలితాధిత్యుడు కనోజ్ రాజగు యశోవర్మ దాడులను అరికట్టెను.

క్రీ.శ. 750 సం॥లో సంభవించిన రాజకీయ విప్లవం నందు ఖలీఫా పదవి నుండి ఉమర్ వంశీయులను తొలగించి, అబ్బాస్ వంశీయులు ఖలీఫా పదవి కైవసం చేసుకున్నారు. ఈ వంశం వారే రాజధానిని డెమాస్కస్

నుండి బాగ్దాద్‌కు మార్చారు. అబ్బాస్ వంశం వారు భారతదేశం పట్ల అంత శ్రద్ధ వహించలేదు. అందువలనే మరల ముల్తాన్, సింధ్ సామంతులు స్వతంత్రులైరి. ఈ రెండు మహమ్మదీయ రాజ్యాలేర్పడెను. 11వ శతాబ్దంలో ఘజనీ మహమ్మద్ జయించి ఈ రెండింటిని ఆక్రమించుకొనెను. అరబ్బుల పాలన ముల్తాన్, సింధ్‌లలో అంతమయ్యెను.

## 6.4 అరబ్బుల దండయాత్రల ఫలితం:

అరబ్బుల దండయాత్ర భారతదేశ చరిత్ర పై పెద్ద ప్రభావం ఏమీ చూపలేదు. ఎందుకంటే సింధు ముల్తాన్‌ను ఆక్రమించుకున్నా, ఎక్కువ కాలం పరిపాలించకపోవుట వలన. కాని భారతీయులు పరదేశీ దాడులను చూసి కూడా రాజులలో ఐకమత్యం లేదు. హిందు సంఘము కూడా ఎట్టి మార్పులకు లోను కాలేదు. జిజియా పన్ను మాత్రమే వసూలు చేసి, స్వాతంత్ర్యము ఇచ్చిరి. అరబ్బు వ్యాపారం దిగ్విజయమానంగా వెలుగొందింది. సాంస్కృతికంగా అరబ్బులు వెనుకబడి యుండిరి. భారతీయులు గణిత, వైద్య శాస్త్ర, వేదాంత శాస్త్రాలను నేర్చుకొనిరి. ఈ వేదాంతం వలనే సూఫీ సిద్ధాంతం బయలుదేరినది. బ్రహ్మ సిద్ధాంతం, చరక సంహిత, పంచ తంత్రం మొదలైన గ్రంథాలు అరబ్బీలోనికి తర్జుమా చేసుకొనినారు. బాగ్దాద్ ఖలీఫాలు హిందు పండితులను, చరిత్రకారులను పోషించారు. లలిత కళలను అభిమానించారు. హరున్ ఆర్ రషీద్ అను ఖలీఫా ఆస్థానమున మంకా, సలేహ అను ఇద్దరు భారతీయ వైద్యులు కలరు.

ఇట్లు అరబ్బుల ఏ రంగమున భారతదేశ చరిత్ర - సంస్కృతి పై ఎట్టి ప్రభావమును చూపలేక పోయింది.

## 6.5 మహమ్మద్ ఘజినీ:

అరబ్బుల తరువాత భారతదేశము పై దండెత్తి వచ్చిన వారు తురుష్కులు. క్రీ.శ. 962లో పర్షియా రాజ ఉద్యోగి అలప్తజిన్ అనే తురుష్కుడు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఘజనీని ఆక్రమించాడు. ఇతని తరువాత ఇతని అల్లుడు అయిన సబక్తజిన్ పంజాబును పరిపాలించే జయపాలుని ఓడించి, రసపుత్ర కూటమిని విచ్ఛిన్నం చేసి లాంఘన్, పెషావర్‌లను ఆక్రమించెను.

సబక్తజిన్ మరణం తరువాత అతని కుమారుడైన ఇస్మాయిల్‌ను బంధించి మహమ్మద్ సింహాసనం అధిష్టించాడు. ఖలీఫా ఇతనికి యామిన్ ఉద్దౌలా, అమీన్ ఉల్‌మిల్లత్ అనే బిరుదులు ప్రధానం చేశాడు. ఖలీఫానే మహమ్మద్‌కు ప్రతి సంవత్సరం భారతదేశం పై దండెత్తమని చెప్పినట్లు తెలుస్తుంది. సర్ హెన్రీ ఎలియట్ మహమ్మద్ 17 సార్లు భారతదేశం పై దండయాత్ర చేశాడని తెలిపాడు.

**6.5.1 దండయాత్ర ఉద్దేశాలు:** భారతదేశంలో విగ్రహారాధనను నిర్మూలించి, ఇస్లాం మత వ్యాప్తి చేయటం దండయాత్ర ఉద్దేశం. అందువల్లనే అనేక దేవాలయాలను ధ్వంసం చేసి, అపార ధనరాశులను కొల్లగొట్టినట్లు తెలుస్తుంది. అనేక వేల మంది హిందువులను, ఇస్లాంలోనికి మార్చాడని మహమ్మద్ ఆస్థాన పండితుడు ఉద్బి పేర్కొన్నాడు.

సామ్రాజ్యాన్ని విస్తరింప చేయాలని ఆశించాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. 17 సార్లు దండెత్తిన ఒక్క పంజాబ్‌ను తప్ప ఇతర ప్రాంతాలను తన రాజ్యంలో కలుపుకోలేదు. శాశ్వతంగా స్థిరపడాలనే ఆలోచన లేదు.

**6.5.2 దండయాత్రలు (క్రీ.శ. 1000 - 1026):** ఘజనీ సింహాసనం అధిష్టించిన తరువాత ఆంతరంగిక పరిస్థితులకు ఎలాంటి ప్రమాదం లేదని తెలుసుకున్న తరువాతనే భారతదేశం పైకి దండయాత్రలను కొనసాగించినాడు.

1. క్రీ.శ. 1000లో దండయాత్ర ప్రారంభమైనది. కైబర్ కనుమ ప్రాంతంలోని కొన్ని కోటలను ఆక్రమించాడు.
2. క్రీ.శ. 1001లో పంజాబు రాజైన జయపాలుడిని పెషావర్ వద్ద ఓడించాడు. జైపాలుడు అనేక ధనరాశులను సమర్పించుకున్నాడు. కప్పం కట్టడానికి అంగీకరించాడు. అయితే అవమానం భరించలేక రాజ్యాన్ని తన కుమారుడు ఆనందపాలునికి ఇచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు.

3. క్రీ.శ. 1003లో భాటియా రాజ్యం పై దాడి చేసి, బిజైరాయ్‌ను ఓడించి, అపార ధన రాశులను దోచుకుని, రాజును ఇస్లాం మతంలోనికి మార్చాడు.
4. క్రీ.శ. 1006లో ముల్తాన్ రాజైన ఫతేదావూద్ పై దండెత్తి ఓడించాడు. అతడికి సహాయం వచ్చిన ఆనందపాలుని ఓడించాడు. జైపాలుడు మనుమడైన సుఖపాలున్ని ఇస్లాంలోనికి మార్చి, 'నవాసాషా' అనే పేరు పెట్టి, ముల్తాన్‌కు పాలకునిగా చేశాడు.
5. సుఖపాలుని బంధించి ముల్తాన్‌ను ఆక్రమించెను. మహమ్మద్ గజనీకి తరలిన తరువాత సుఖపాలుడు స్వతంత్రించి ఇస్లాం మతాన్ని విడిచి పెట్టాడు. అందువలనే ముల్తాన్‌ను ఆక్రమించాడు.
6. ఫతేదావూద్‌కు సాయం చేసినందుకు ఆనందపాలుని వైహింద్ యుద్ధమందు ఓడించాడు.
7. తదుపరి 7, 8, 9, 10, 11వ దండయాత్రలలో నాగర్ కోట, నారాయణ్‌పూర్, కాశ్మీర్, స్థానేశ్వర్, మధుర మొదలగు నగరాలను దోచుకొనెను. 700 మణుగుల బంగారం, 7 లక్షల బంగారు దీనారులు, 200 మణుగుల వజ్రవైఢూర్యాలు దోచుకొనెను. ఆనందపాలుని కుమారుడైన త్రిలోచనాపాలుని ఓడించి 'నందనా'ను ఆక్రమించెను. పంజాబు నందు హిందు సాహి వంశం అంతమయ్యెను.
8. 12వ దాడిలో కనౌజ్ పై దండెత్తగా ప్రతీహార రాజ్య పాలకుడు కనౌజ్‌ను వదలి పారిపోయెను. ఇది సహించని చందేల విద్యాధరుడు రాజ్యపాలన అంతము చేసెను. మహమ్మద్ కనౌజ్‌ను దోచుకొనెను.
9. 13 హిందువుల పుణ్య క్షేత్రాలైన అనేక దేవాలయాలు ఉన్న మధురా పై దాడి చేసి విలువైన వస్తువులను దోచుకొనెను.
10. 14, 15వ దాడులలో బుంధేల్‌ఖండ్‌ని పరిపాలిస్తున్న విద్యాధరుని శిక్షింప ప్రయత్నించాడు. కాని విద్యాధరుడు విజయవంతంగా త్రిప్పి కొట్టెను. మహమ్మద్ విద్యాధరునితో సంధి చేసుకొనెను. మహమ్మద్‌ను ఎదుర్కొనిన ఏకైక రసపుత్ర వీరుడు విధ్యాధర.
11. 16వ దాడి సోమనాథ దేవాలయ దోపిడి. కథియవాడ్‌ను పాలించే భీమదేవుని ఓడించి, సోమనాథ్ దేవాలయమును కొల్లగొట్టెను. ఈ ఆలయము నందు 500 మంది నాట్యకత్తెలు, 1000 మంది పూజారులు, 200 మంది గీత వాయిద్యాల వారు కలరట. 5000 మందిని పొట్టన పెట్టుకుని, అందలి శివ లింగంను ముక్కలుముక్కలుగా చేసి మక్కా మదీనాకు, ఘజనీకి పంపెను.
12. చివరి దండయాత్రలో సోమనాథ దేవాలయమును దోచుకుని స్వదేశమునకు తరలినపుడు మధ్యలో జాటుల దాడి చేసినందుకు వారిని శిక్షించి, వారి గ్రామములను దోచుకొనెను. క్రీ.శ. 1030లో మహమ్మద్ మరణించెను.

**6.5.3 దండయాత్ర ఫలితాలు:**

1. ఈ దండయాత్రల వలన పంజాబ్ నందు హిందుషాహి పాలన, ముల్తాన్, మన్సురాలందున్న అరబ్బుల పాలన, కనూజ్ నందు ప్రతిహారుల పాలన అంతమయ్యెను.
2. ఉత్తరాపథమున అనేక పట్టణములందలి ధన, కనక రాశులను దోచుకొనిపోవుట వలన భారతదేశ సంపద తరగిపోయెను.
3. తరచూ మహమ్మద్ దండయాత్రల వలన రాజపుత్రుల సైన్యము క్షీణించి, తదుపరి విదేశీ దాడులను ఎదుర్కొనుటకు సైన్యం లేక బలహీనులైరి.
4. వాయువ్య సరిహద్దున గల అనేక కోటలను, నగరాలను ధ్వంసం చేసి, మహమ్మదీయ రాజ్య స్థాపనకు తగు అనుకూల పరిస్థితులేర్పరచెను. ఘోరి దీనిని సద్వినియోగం చేసుకొనెను.
5. మధుర, బృందావనం, కనూజ్, సోమనాథ్ మొదలగు చోట్ల హిందూ దేవాలయాలను ధ్వంసం చేయుట వలన భారతీయ వాస్తు శిల్ప కళలకు తీరని నష్టము కల్గించెను.
6. భారతదేశంన ఇస్లాం వ్యాప్తి జరిగినది.

**6.5.4 మహమ్మద్ ఘనత:** యుద్ధ వీరుడే గాక సారస్వత కళాభిమాని. అతని ఆస్థానమున ఫిరదౌసి, అలెబెరూనీ, ఉట్బీ మొదలగు పండితులు కలరు. ఫిరదౌసి పారశీక భాషకు హోమర్ లాంటివాడు. ఫిరదౌసి వ్రాసిన షానామా మహమ్మద్ జీవితమును, విజయాలను తెలుసుకొనుటకు సహాయపడింది. ఘజనీ నందు ఒక కళాశాలను స్థాపించి, పోషించెను. కొల్లగొట్టిన ధనంతో ఘజనీని సుందరంగా తీర్చిదిద్దాడు. మహమ్మద్ తాను జయించిన రాజ్యాల నుండి కళాకారులను తన రాజధానికి తీసుకొనిపోయెను.

**6.5.6 సారాంశం:** మహమ్మదీయులకు ఆరాధ్య దైవం, అవతార పురుషుడు, హిందువులకు ఒక బంధిపోటు దొంగ, కాల యముడు, గొప్ప పరిపాలనాదక్షుడు కాదు. అతని సామ్రాజ్యం అచిర కాలముననే అంతమయ్యెను. సారస్వత కళాభిమాని న్యాయ సింహుడు.

## 6.6 మహమ్మద్ ఘోరి:

ఆఫ్ఘనిస్తాన్ నందు ఘజనీ, హీరట్‌లకు మధ్య ఉన్న ప్రాంతమే ఘోరీ. ఘోరీను పాలించిన వారు ఆఫ్ఘనులు కానీ, పారశీకులు కాని అయ్యి ఉండవచ్చు. భారతదేశంలో వాస్తవంగా ముస్లిం సామ్రాజ్య స్థాపన చేసినాడు. మొమిజుద్దీన్ ఖాన్ సమ్. ఇతడే హియాబుద్దీన్ మహమ్మద్ ఘోరిగా ప్రసిద్ధికెక్కాడు.

ఘోరీ ప్రాంతాన్ని మొదట మొహమ్మద్ ఘజనీ జయించాడు. మహమ్మద్ మరణానంతరం ఘోరి రాజ్యం విజృంభించింది. ఇందులో ముఖ్యుడు సైఫా ఉద్దీన్. కొంత కాలం ఘజనీ ఇతని ఆధీనంలో ఉన్నది. ఇతని మరణానంతరం అల్లావుద్దీన్ హుస్సేన్ ఘజనీ నగరాన్ని ఆక్రమించి, దగ్ధం చేశాడు. అతని తరువాత ఘియాస్ ఉద్దీన్ మహమ్మద్ ఘజనీని స్వాధీనపర్చురొని తన సోదరుడు హియాబుద్దీన్ క్రీ.శ. 1173లో రాష్ట్ర పాలకుడుగా నియమించాడు.

**6.6.1 ఘోరీ దండయాత్రలకు గల కారణాలు:**

1. ఘజనీ వారసుడుగా, ఘజనీ ఆక్రమించిన ప్రాంతాలను పునః కైవసం చేసుకొనుట.
2. భారతదేశమున ముస్లిం సామ్రాజ్యం ఏర్పరచటం.
3. ఇస్లాం మతాభిమానిగా, ఇస్లాంను వ్యాప్తి చేయుట.

**6.6.2 ఘోరి దండయాత్రల నాటికి భారతదేశ పరిస్థితులు:** ఘోరీ దండయాత్ర కాలం నాటికి భారతదేశము అనేక స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడినది.

1. ముల్తాన్, సింధ్, పంజాబ్ ఘజనీ పాలకులకు ఆధీనమందుండెను.
2. ఢిల్లీ, అజ్మీర్, చౌహాన్ వంశస్థుడైన పృథ్వీరాజు.
3. కనూజ్‌ను గహద్వుల వంశస్థుడైన జయ చంద్రుడు.
4. గుజరాత్‌ను సోలంకిలు పాలిస్తున్నారు.
5. బెంగాల్ సేన వంశీయుడు లక్షణ సేనుడు.

వీరిలో అనైఖ్యత ప్రబలి యుండుట చేత ఘోరీ దాడులను అరికట్ట లేకపోయింది.

**6.6.3 దండయాత్రలు:** మొదటి దండయాత్ర క్రీ.శ. 1175లో ముల్తాన్ పై జరిగింది. తరువాత 'డచ్' రాజ్యాన్ని క్రీ.శ. 1176లో ఆక్రమించుకున్నాడు. క్రీ.శ. 1179లో గుజరాత్ పై దండెత్తి సోలంకి రాజు 2వ మూలరాజు చేతిలో ఘోరంగా ఓడిపోయి వెనుదిరిగాడు. తరువాత 20 సంవత్సరాల వరకు గుజరాత్ వైపు చూడలేదు. క్రీ.శ. 1179లో పెషావర్‌ను, 1185లో సియాల్ కోటను వశపరుచుకున్నాడు. క్రీ.శ. 1186లో ఘోరీ లాహోర్‌ను పాలించే రాజులను ప్రత్యక్షంగా ఎదుర్కొనలేక మోసగించి, ఖైద్ చేసి ఆక్రమించుకున్నాడు. కొంతకాలం తరువాత ఖుస్రూ మాలికను వధించాడు. దీనితో ఘజనీ వంశం అంతమయ్యెను.

**స్థానేశ్వర్ లేక తరైన్ యుద్ధములు:**

**మొదటి స్థానేశ్వర్ యుద్ధం:** పంజాబ్ ఆక్రమణతో ఘోరీ సామ్రాజ్యం, సట్లెజ్ నది వరకు విస్తరించెను. ఈ నదిని దాటి ఖటిండాను ఆక్రమించుకొనెను. అంతట పృథ్వీరాజ్ 2 లక్షల అశ్వక దళంతో, 3000 గజ బలంతో ఘోరీని ఎదుర్కొన్నాడు. క్రీ.శ. 1191 సం॥ మొదటి స్థానేశ్వర్ యుద్ధము నందు ఓడించి, తరిమికొట్టగా ఘోరీ బ్రతుకు జీవుడా అని పారిపోయెను.

**రెండవ స్థానేశ్వర్ యుద్ధం:** పరాభవమునకు ప్రతీకారముగా మరుసటి సంవత్సరమే పెద్ద సైన్యాన్ని సమకూర్చుకొని పృథ్వీరాజ్ పై దండెత్తెను. అప్పుడు పృథ్వీరాజ్ ఉత్తర భారతదేశంలోకి రాజపుత్రులను సమీకరించుకొని కూటమిగా ఏర్పడి, మరల స్థానేశ్వరము నందు పోరాటము చేశాడు. ఈ కూటమిలో కనూజ్ రాజు జయ చంద్రుడు, గుజరాత్ రాజు రెండవ మూల రాజు చేరకుండుట శోచనీయము. యుద్ధమున పృథ్వీరాజు బంధీయై వధించబడెను. ఢిల్లీ, అజ్మీర్‌లను ఘోరీ ఆక్రమించుకున్నాడు. చేహక్ వంశం అంతరించెను.

**6.6.4 యుద్ధ ప్రాముఖ్యము:**

1. రాజపుత్రుల రాజ్యాధికారము దెబ్బ తీసెను. రాజపుత్రులు అనేక అవమానములకు గురియై నైతికముగా దిగజారి మహమ్మదీయ దాడులను ఎదుర్కొనుటకు సాహసింప లేకపోయిరి.
2. అంతిమ విజయం మహమ్మదీయులదే. ఆ తరువాత జరుగబోయే యుద్ధము లన్నింటికీ స్థానేశ్వర యుద్ధం నాంది అయ్యింది.
3. కనూజ్ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయి దాని స్థానమున ఢిల్లీ ఆక్రమించెను.
4. మహమ్మద్ ఘోరీ కాలము నుండి భారతదేశమున 1857 సిపాయిల తిరుగుపాటు వరకు మహమ్మదీయులే ఢిల్లీ పాలకులుగా, ముస్లిం రాజులే ఉండిరి.
5. ఘోరీ ఆక్రమించిన ఢిల్లీ, అజ్మీర్ ప్రాంతాలను వారి వారసులనే సామంతులుగా చేసుకొని కప్పమును తీసుకొనెను.
6. భారతదేశమునకు తన సేనానియగు కుతుబుద్దీన్ తన ప్రతినిధిగా నియమించి, మహమ్మద్ స్వదేశమను చేరెను.

**6.6.5 చివరి దండయాత్రలు:** క్రీ.శ. 1193లో చందావార్ యుద్ధమున కనూజ్‌ను పాలించే జయచంద్రుని వధించి, కాశీ వరకు తన రాజ్యమును విస్తరింప చేసెను. కనూజ్, కాశీలందు హిందు దేవాలయములను కూలగొట్టెను. 1195లో ఘోరీ బయానా, గ్యాలియర్‌లను ఆక్రమించుకొనెను. క్రీ.శ. 1205లో జీలం - చీనాబ్ నదుల మధ్య గల ప్రదేశం ఖోఖర్‌ల పై ఘోరీ, కుతుబుద్దీన్ సంయుక్తంగా దాడి జరిపి, వారిని వేధించారు. కొంత మందిని బానిసలుగా చేసుకున్నారు. ఈ తిరుగుబాటును అణచి స్వదేశానికి తిరిగి వెళుతుండగా, షియా తిరుగుబాటుదారులు ఖోఖారుల చేతిలో క్రీ.శ. 1206లో వధింపబడ్డాడు. ఘోరీ శవాన్ని గజనీకి తీసుకుపోయి రాజధానిలో ఖననం చేశారు.

## 6.7 కుతుబుద్దిన్ ఐబక్:

మహమ్మద్ ఘోరీ తాను జయించిన ప్రాంతాలకు అధిపతిగా, కుతుబుద్దీన్ ఐబక్‌ను నియమించాడు. ఇతను అనేక దండయాత్రలు కొనసాగించాడు. బేహను, తోమరులు తిరుగుబాటులను అణిచాడు. వీరిని ఓడించి హన్సి, మీరట్‌లను ఆక్రమించాడు. కోయల్, అలీఘర్‌లను స్వాధీనపరుచుకున్నాడు. చందోలులను ఓడించి, కలింజర్, మహోబాను వశపరుచుకున్నాడు. మహమ్మద్ మరొక సేనానియైన ఇఖియార్ ఉద్దీన్, బీహార్, బెంగాలు పై దాడి చేశాడు. ఉదంతపురి, నలందా, విక్రమ శిలను దోచుకున్నాడు. బౌద్ధారామాలను ధ్వంసం చేసి, వేల సంఖ్యలో బౌద్ధులను వధించాడు. బెంగాల్ రాజు లక్ష్మణసేనుడు పారిపోయాడు.

**6.7.1 సారాంశం:** ఘజనీ కంటే ఘోరీ యోధాగ్రేసరుడు. మహమ్మదీయ రాజ్య స్థాపన చేసినవాడు ఘోరీయే. ఘోరీ మహమ్మద్ తన దిగ్విజయ యాత్రల వలన ఆఫ్ఘనిస్తాన్ నుండి బెంగాల్ వరకు గల రాజ్యమును సంపాదించెను. ఘోరీ మహమ్మద్ సామ్రాజ్య నిర్మాతయేకాక, గొప్ప సారస్వతాభిమాని. ఇతడు ఫక్రుద్దీన్, రజి, నిజామె, ఉరూజీ అను పండితులను పోషించెను. సారస్వతాభిమానిగా, సామ్రాజ్య స్థాపకుడుగా వెలుగొందాడు.

## 6.9 మాదిరి ప్రశ్నలు:

**వ్యాసరూప ప్రశ్నలు:**

1. భారతదేశంలో ఘజనీ మహమ్మద్ సాధించిన విజయాలను వివరించండి.
2. మహమ్మద్ ఘోరీ దండయాత్రలను వర్ణింపుము.

**లఘురూప ప్రశ్నలు:**

1. తురుష్కుల చేతిలో హిందువుల ఓటమికి కారణాలను వివరించండి.
2. ఘోరి ఆశయాలను వివరింపుము.

**ఈ క్రింది ప్రశ్నలకు సరియైన సమాధానం ఇవ్వండి.**

1. భారతదేశంను జయించిన మొదటి మహమ్మదీయులు ఎవరు? ( )

   ఎ) అరబ్బులు బి) తురుష్కులు సి) గజనీ మహమ్మద్ డి) మహమ్మద్ ఘోరీ

2. అరబ్బులు భారతదేశంను ఎప్పుడు జయించిరి? ( )

   ఎ) 612 బి) 712 సి) 700 డి) 708

3. సోమనాథ్ దేవాలయం ముట్టడి జరిగిన సం॥ ( )

   ఎ) 1026 బి) 1022 సి) 1024 డి) 1025

## 6.10 ఉపయుక్త గ్రంథాలు:

1. B.L. Hanumantha Rao - Indian History and Culture Vol. I
2. A.L. Basham - The Wonder that was India
3. Ray Chowdary - Political History of Ancient India

**పాఠ్యభాగ రచయిత**
**డా॥ షేక్ రమీ బేగం**

## UNIT - V

**దక్షిణ భారతదేశ చరిత్ర & సంస్కృతి**
**(క్రీ.శ. 9వ శతాబ్దం నుండి క్రీ.శ. 13వ శతాబ్దం వరకు)**

**పరిచయం:**

దక్షిణ భారతదేశంలోని దక్కన్ ప్రాంతంలో ప్రధానంగా రాష్ట్ర కూటులు, పశ్చిమ, తూర్పు చాళుక్యులు పతనమైన తరువాత వారి దగ్గర ఉద్యోగులుగా పని చేసిన కాకతీయులు సామ్రాజ్య స్థాపకులైనారు. వీరికి సమాంతరంగా దేవగిరి (మహారాష్ట్ర)లో యాదవులు సామ్రాజ్య స్థాపకులైనారు. కాకతీయులు క్రీ.శ. 1000 - 1323 వరకు నేటి తెలంగాణా నుండి ఆంధ్ర తీర ప్రాంతం వరకు పాలించారు. వీరు శిల్ప, వాస్తు నిర్మాణ సంస్కృతులలో అద్వితీయమైన కృషి చేశారు. వీరి కాలంలో వైదిక మతంలోని శైవ, వైష్ణవ మతాల మధ్య విపరీతమైన శతృత్వం ఏర్పడింది. కాకతీయులు శైవ మతాన్ని అవలంభించి, అనేక శైవాలయాలను నిర్మించారు. ఉదా॥ వేములవాడ శైవాలయం, శ్రీశైలం వీరి కాలంలో పేరు గాంచినవి. అంతేగాక వీరి కాలంలో తెలుగు సాహిత్యం బాగా ప్రాచుర్యం పొందింది. వీరి పతనానంతరం, ఆంధ్ర ప్రాంతాన్ని రెడ్డి రాజులు, ముసునూరి నాయకులు, రేచర్ల రాజులు పాలించారు. రెడ్డి రాజులు రాజకీయంగా కొంత కాలం పరిపాలించారు. వీరి కాలంలో తెలుగు సాహిత్యం బాగా అభివృద్ధి చెందినది. రెడ్డి రాజులు స్వయంగా కవులు. విజయనగర రాజులు పరిపాలించి, తెలుగును ఇంకా అభివృద్ధి చేశారు.

సుదూర దక్షిణ భారతదేశంలో పల్లవుల తర్వాత ఏర్పడిన గొప్ప వంశం చోళులు. చోళులు, పల్లవుల సంస్కృతిని అభివృద్ధి చేసిన వీరు స్థానిక స్వపరిపాలనలో తమదైన ముద్ర వేశారు. వీరు కూడా భూస్వామ్య పద్ధతిని అనుసరించినారు. వీరి కాలంలో కూడా శైవ మత ప్రచారకులు నాయనార్లు, వైష్ణవ మత ప్రచారకులు ఆళ్వార్లు తమ తమ మత శాఖలను అభివృద్ధి చేసుకున్నారు. పల్లవుల కాలం నుండి చోళుల కాలం వరకు ఈ నాటి దక్షిణ తూర్పు ఆసియా దేశాలైన మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, సుమత్రా, బాలి, జావా ప్రాంతాలతో వర్తక, వ్యాపారాలు కొనసాగిస్తూ, అక్కడే స్థిరపడిపోయి, ఆ దేశాలలో హిందూ మతాన్ని ప్రచారం చేశారు.

----------

## యూనిట్ - 5

## పాఠం - 1

# చోళులు

### 1.0 లక్ష్యం:

దక్షిణ భారతదేశంలో క్రీ.శ. 6వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు చాళుక్యులు, చోళులు, రాష్ట్ర కూటులు వంటి అనేక రాజ వంశాలు పరిపాలన కొనసాగించాయి. ఆ రాజ వంశాలలో ప్రముఖమైన చోళుల రాజకీయ చరిత్రను వివరించటమే ఈ పాఠం ముఖ్య లక్ష్యము.

### పాఠ్య నిర్మాణ క్రమం:


1.1 ఉపోద్ఘాతము

1.2 విజయాలయుడు

1.3 మొదటి పరాంతకుడు

1.4 రాజ రాజ చోళుడు

1.5 మొదటి రాజేంద్రుడు

1.6 చాళుక్య - చోళ పాలన

1.7 రాజ్య పతనం

1.8 సారాంశము

1.9 మాదిరి ప్రశ్నలు

1.10 ఉపయుక్త గ్రంథాలు


### 1.1 ఉపోద్ఘాతము:

చోళుల ప్రస్తావన మొదటిగా మనకు సంగం యుగ సాహిత్యంలో కనిపిస్తుంది. వీరు తమిళ భాషా పరమైన పేర్లతో ఆసాహిత్యంలో పేర్కొనబడ్డారు. అటువంటివారిలో పెరుంకిళి, కరికాలుడు మొదలయినవారు ముఖ్యులు. కలభ్రుల దాడి తరవాత తమిళకంలో కలిగిన సంక్షోభం తరవాత జాడకానరాని వీరు సంస్కృత భాషాపరమైన పేర్లతో క్రీ.శ. 7వ శతాబ్దంలో మరల కనిపిస్తున్నారు. వీరిని చరిత్రకారులు నవీన చోళులుగా వ్యవహరిస్తున్నారు.

ఇటీవలి కాలంలో వీరిపాలన గురించి, రాజ్యం గురించిన వాదోపవాదాలు దక్షిణ భారత చరిత్ర అధ్యయనంలో ప్రముఖంగా కనిపిస్తున్నాయి. వలసవాదకాలం నాటి చరిత్రకారులు వీరిని కూడా ప్రాచీన నిరంకుశ మూసలో వేస్తే, జాతీయవాద చరిత్రకారులైన ఆచార్య నీలకంఠశాస్త్రి మొదలయిన వారు వీరిని ప్రజాశ్రేయస్సు కోరే నిరంకుశులుగా పేర్కొంటూ, వీరి కాలాన్ని స్థానిక సంస్థలకు స్వయం ప్రతిపత్తి గల కాలంగా పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో బర్టన్ స్టీన్ అనే అమెరికా చరిత్రకారుడు 'చోళరాజ్యాన్ని ఖండితరాజ్యం'గా పేర్కొంటు చోళరాజుల కాలంలో నిజానికి సార్వభౌమాధికారం నాటి 'నాడు' వ్యవస్థ కింద ఉండేదని చోళరాజుల నిజమైన సార్వభౌమాధికారం కావేరి పరివాహక ప్రాంతానికి మాత్రమే పరిమితమై మిగిలిన ప్రాంతాల పై వారికి నామమాత్రమైన

అధికారమనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ నామమాత్రపు అధికారాన్ని నిలబెట్టుకోవడానికే శైవమతాన్ని వాడుకున్నారని చెప్పి అంతకుముందు రచించిన చోళచరిత్రలోని లోపాలను బయటపెట్టాడు. తరవాత వామపక్ష చరిత్రకారులు స్టెయిన్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించి చోళరాజ్యం కూడా ఒక ఫ్యూడల్ వ్యవస్థేనని ప్రకటించారు. కరాషిమా, సుబ్బరాయలు వీరితో విభేదించి చోళరాజ్యకాలాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి భాగంలో అంటే రాజరాజు కాలం వరకు అది ఖండితరాజ్యమని, మొదటి రాజరాజు కాలం నుంచి మొదటి కులోత్తుంగుని కాలం వరకు చోళులు తమ సార్వభౌమత్వాన్ని నాడులపై ప్రతిష్టించుటకు ప్రయత్నించిన కాలమని, తరవాత కాలం ఫ్యూడల్ వ్యవస్థ కాలమని విభజించారు.

## 1.2 విజయాలయుడు:

కలభ్రులు, పల్లవుల మొదలయినవారి దాడుల వల్ల సంగం యుగం నుంచి అధికారంలో ఉన్న చోళుల రాజ్యం పతనం అయింది. మరల చోళులు క్రీ.శ. 9 శతాబ్దం నుంచి తమ అధికారాన్ని పునరుద్ధరించారు. నవీన చోళులుగా పిలిచిన వీరికి విజయాలయుడు మూలపురుషుడని చరిత్ర కారుల అభిప్రాయం. కరికాలునికి విజయాలయునికి గల సంబంధమెటువంటిదో ఇతమిత్థంగా తెలియదు. విజయాలయ క్రీ.శ. 850-871 సంవత్సరాల మధ్య పరిపాలించాడు.

విజయాలయుని తరవాత పరిపాలించిన రాజులలో ఆదిత్య చోళుడు మొదటి పరాంతకుడు (క్రీ.శ 907-955), మొదటి రాజరాజు (క్రీ.శ 985-104), మొదటి రాజేంద్రుడు (క్రీ.శ 1012-1044), కులోత్తుంగ చోళుడు (క్రీ.శ 1070-1120) ప్రసిద్ధులు.

## 1.3 మొదటి పరాంతకుడు:

మొదటి పరాంతకుడు రాజ్యాధికారం చేపట్టిన వెంటనే పాండ్యరాజ్యం పై దండెత్తి 'మధురై'ను జయించి 'మధురై కొండ' బిరుదును ధరించాడు. ఈ ఓటమికి ప్రతీకారంగా పాండ్య రాజు రెండవ రాజ సింహుడు సింహళరాజైన ఐదవ కస్సప సహాయంతో దండెత్తిరాగా వెల్లూర్ యుద్ధంలో పరాంతకుడు వారిని పూర్తిగా ఓడించాడు. రాజసింహుడు సింహళానికి పారిపోవడంతో పాండ్యరాజ్యం పూర్తిగా స్వాధీనమైనది. ఇదే సమయంలో కన్నరదేవునకు, పరాంతకునకు మధ్య విభేదాలు రాగా రాష్ట్రకూట కృష్ణుడు తన మనమడైన కన్నర దేవునికి సహాయంగా బాణ వైదుంబులతో కలిసి క్రీ.శ 916లో చోళరాజ్యం పై దాడి చేశాడు. పరాంతకుడు గాంగరాజు సహాయంతో వల్లాల యుద్ధంలో ఆ కూటమిని ఓడించి బాణుల రాజ్యాన్ని గాంగ పృధ్వీ పతికి ఇచ్చాడు. పృధ్వీపతి మరణం తరవాత రాజైన రెండవ బూతుగ రాష్ట్ర కూటులకు అనుకూలంగా వ్యవహరించాడు. పరాంతకునిచే ఓడించబడిన బాణ వైదుంబులు కూడా వారితో కలిశారు. వారిని ఎదుర్కోవడానికి పరాంతకుడు తన కుమారుడైన రాజాధిత్యుడిని పంపగా యుద్ధంలో యువరాజు రాజాధిత్యుడు మరణించాడు. క్రీ.శ 944నాటికి తొండై మండలం రాష్ట్ర కూట రాజ్యంలో భాగమైంది. క్రీ.శ 955లో పరాంతకుడు మరణించే నాటికి చోళనాడు మాత్రమే చోళుల అధీనంలో ఉన్నది. పరాంతకుని తరవాత క్రీ.శ 985 వరకు చోళ సామ్రాజ్యం బలహీనమై అస్తవ్యస్తంగా మారింది. క్రీ.శ 985 మొదటి రాజరాజు రాజ్యా ధికారం చేపట్టడంతో చోళరాజ్యం తిరిగి శక్తివంతమైన రాజ్యంగా రూపొందింది.

## 1.4 రాజ రాజ చోళుడు (క్రీ.శ 985-1014):

రాజ రాజ చోళుడు రెండవ పరాంతక సుందర చోళుని కుమారుడు. ఇతడు క్రీ.శ 985లో రాజ్యాధికారం స్వీకరించిన తరవాత చోళుల వైభవం పునరుద్ధరించబడింది. ఇతడు రాష్ట్ర కూటులు విచ్ఛిన్నం చేసిన రాజ్యాన్ని గొప్ప సామ్రాజ్యంగా తీర్చిదిద్దాడు. ఇతనికి ముమ్మడి చోళదేవ, జయంగొండ, చోళ మార్తాండ అనే బిరుదులున్నాయి.

రాజ రాజు గొప్ప యోధుడే కాక రాజనీతి విశారదుడు కూడ. సింహాసన సమధిష్టించినప్పటి నుంచి శత్రువులతో

తలపడి పారిని ఓడించి చోళ సార్వభౌమత్వాన్ని పునఃప్రతిష్ఠించాడు. మొదటి విజయం చేరరాజు భాస్కర వర్మపై సాధించాడు. కందలూరు శాలాయ్ నౌకాయుద్ధంలో భాస్కరవర్మను ఓడించి కొల్లం, ఉదగై ప్రాంతాలను ఆక్రమించాడు. మధుర పై దండెత్తి పాండ్యరాజు అమర భుజంగ పాండ్యుని బంధించి మధుర, కొడుమలై ప్రాంతాలను స్వాధీనపరచుకొన్నాడు. పెద్దనౌకాబలంతో దండెత్తి ''మాలై'' దీవులను ఆక్రమించాడు. సింహళంపై దండెత్తి అనూరాధపురాన్ని ధ్వంసం చేసి పోలోన్నురువాను ఆ ప్రాంతానికి రాజధానిగా చేసి అక్కడ ఒక శివాలయాన్ని నిర్మించాడు. ఉత్తర సింహళానికి ముమ్మడి చోళమండలం' అని పేరు పెట్టి చోళసామ్రాజ్యంలో కలిపివేశాడు. క్రీ.శ 991లో గంగవాడి, నోళంబవాడిలను జయించాడు. ఈ దాడులలోనే చాళుక్యరాజు రెండవ తైలపుడ్ని ఓడించి క్రీ.శ 1003లో రట్టవాడిని ఆక్రమించాడు. క్రీ.శ 1007లో రాజరాజు కుమారుడైన రాజేంద్రుడు దోనూరును జయించి అక్కడ స్త్రీ, బాల, బ్రాహ్మణ భేదం లేకుండా అందరినీ వధించాడు. రాజరాజు కాలంలోనే వేంగీ విషయమై కల్యాణ చాళుక్యులకు చోళు లకు ఘర్షణ ప్రారంభమైనది. వేంగీ చాళుక్య రాజైన శక్తి వర్మకు ఆశ్రయం ఇచ్చి అతని తమ్ముడైన విజయాధిత్యుడికి తన కుమార్తె కుందవ్వనిచ్చి వివాహం చేశాడు. వేంగీ రాజకీయాలలో జోక్యం కలిగించుకుంటున్న కళింగగాంగులను కూడా రాజరాజు ఓడించాడు.

రాజ రాజు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించుటమే కాక, ఆ రాజ్యంలో క్రమబద్ధమైన పరిపాలన ప్రవేశపెట్టాడు. రాజరాజు శివభక్తుడు. శివపాద శేఖరమనే బిరుదు ధరించాడు. తంజావూరులో రాజరాజేశ్వరాలయమను పేరున్న బృహదీశ్వరాలయాన్ని నిర్మించాడు. శైవుడైనప్పటికి రాజరాజు పరమత సహనాన్ని ప్రదర్శించాడు.

శ్రీ విజయ రాజ్యానికి చెందిన శైలేంద్ర వంశీయుడైన శ్రీమార విజయోత్తుంగవర్మతో మైత్రి ఏర్పరచుకొని అతనికి నాగపట్టణంలో బౌద్ధ విహారం నిర్మించడానికి అనుమతిని ఇవ్వడమేకాక, ఆ విహారానికి ఒక గ్రామాన్ని దానంగా ఇచ్చాడు. క్రీ.శ 1000లో భూమిని సర్వే చేయించి శిస్తు వసూళ్ళను పునర్వవస్థీకరించాడు. గ్రామ స్వపరిపాలనను ప్రోత్సాహించాడు.

## 1.5 మొదటి రాజేంద్రుడు (క్రీ.శ. 1014-1044):

రాజు రాజు కుమారుడైన మొదటి రాజేంద్ర చోళుడు తండ్రిని మించిన శూరుడు. యువరాజుగా ఉన్నప్పుడే చాళుక్య రాజ్యం పై దండెత్తి ఘన విజయం సాధించాడు. రాజేంద్రుని పాలనాకాలంలో చోళ సామ్రాజ్య వైభవం పరాకాష్ట నందుకొన్నది. క్రీ.శ 1018లో సింహళ దండయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని సింహళరాజైన ఐదవ మహేంద్రుడిని బందిగా తెచ్చాడు. క్రీ.శ. 1019లో పాండ్య, చేర రాజ్యాల పై చోళ సార్వభౌమత్వాని ప్రకటించి తన కుమారుడు మొదటి రాజేంద్రుడిని రాజప్రతినిధిగా 'చోళపాండ్య' బిరుదుతో నియమించాడు. క్రీ.శ 1020 నుంచి కల్యాణ చాళుక్యులను అనేకసార్లు ఓడించి వేంగి రాజ్యం పై చోళులు ప్రాబల్యానికి తిరుగులేకుండా చేశాడు. వేంగిరాజైన రాజరాజ నరేంద్రునికి తన కుమార్తె అమ్మంగదేవి నిచ్చి వివాహం చేశాడు. రాజరాజనరేంద్రుడ్ని వేంగి సింహాసనంపై ప్రతిష్టించే సందర్భంలోనే రాజేంద్రుడు కళింగ రాజ్యం పై దండెత్తాడు. ఆ తరవాత గంగానది వరకు పురోగమించి బెంగాలును పాలిస్తున్న మహీపాలుడిని ఓడించాడు.ఈ విజయానికి సూచనగా రాజేంద్రుడు 'గంగైక్కొండన్' అనే బిరుదు ధరించాడు. తరవాత మలయా దీవులకు దక్షిణాపథానికి జరిగే వాణిజ్యాన్ని పెంపొందించేందుకు పెద్ద నౌకాబలంతో శ్రీ విజయరాజ్యం పై దండెత్తి శైలేంద్ర వంశీయుడైన సంగ్రామ విజయోత్తుంగ వర్మను ఓడించి అతడి రాజధాని కడారంను ఆక్రమించాడు. ఈ విజయానికి సూచనగా రాజేంద్రుడు 'కడారం గొండ' అనే బిరుదును ధరించాడు.

ఇతని చివరి కాలంలో రాజ్యంలో తిరుగుబాట్లు సంభవించాయి. పాండ్య, చేర రాజ్యాలలో జరిగిన తిరుగుబాట్లను రాజాధిరాజు అణచివేశాడు. సింహళంలో విక్రమ బాహువు చోళులు అధికారం పై తిరుగుబాటు చేశాడు. క్రీ.శ 1041లో రాజాధిరాజు సింహళం పై దండయాత్ర చేశాడు. రాజేంద్ర చోళుని కాలంలోనే రాజాధిరాజు ఆహవమల్ల

సోమేశ్వరునిపై విజయాన్ని సాధించాడు.

రాజేంద్రుడు 'గంగైకొండ చోళపురం' అనే నగరాన్ని నిర్మించి రాజధానిగా చేసుకున్నాడు. ఆ పట్టణ సమీపంలో గొప్ప తటాకాన్ని తవ్వించాడు. వేద, వ్యాకరణ, మీ మాంస, న్యాయ శాస్త్రాల బోధనకు 14 మంది ఉపాధ్యాయులను నియమించాడు.

## 1.6 చాళుక్య - చోళ పాలన:

రాజేంద్రుని తరవాత వరసగా మొదటి రాజాధిరాజు (క్రీ.శ 1044-1052) రెండవ రాజేంద్రుడు (క్రీ.శ 1052-1064) వీర రాజేంద్రుడు (క్రీ.శ 1064-1070), అధి రాజేంద్రుడు (క్రీ.శ 1070) పరిపాలించారు. వీరి పాలనా కాలమంతా కల్యాణ చాళుక్యులతో యుద్ధాలతోనే గడచిపోయింది. క్రీ.శ. 1070లో రాజరాజ నరేంద్రునికి, అమ్మంగదేవికి జన్మించిన కులోత్తుంగుడు రాజగుటతో విజయాలయ చోళవంశమంతరించి చాళుక్య - చోళపాలన మొదలయ్యింది. కులోత్తుంగుడు (క్రీ.శ 1070-1120) పాలించిన 50 సంవత్సరాలు చోళ సామ్రాజ్యం దక్షిణ భారత దేశం పై పూర్తి ఆధిపత్యాన్ని కొనసాగించి చైనా, సింహళ, శ్రీవిజయ రాజ్యాలతో దౌత్య సంబంధాలను నెలకొల్పి చోళవైభవాన్ని మరొకసారి పతాక స్థాయికి చేరుకున్నది. కులోత్తుంగుని తరవాత విక్రమచోళ (క్రీ.శ 1120-1133), రెండవ కులోత్తుంగుడు (క్రీ.శ 1133-1150), రెండవ రాజరాజు (క్రీ.శ 1150-1173), రెండవ రాజాధిరాజు (క్రీ.శ1173-1178) మూడువ కులోత్తుంగుడు (క్రీ.శ1178-1216) మూడవ రాజరాజు (క్రీ.శ. 1216-1256) పరిపాలించారు.

## 1.7 రాజ్య పతనం:

మూడవ రాజేంద్రుడు (క్రీ.శ 1256-1270) ఈ వంశంలో చివరివాడు. కాకతీయ గణపతి దేవుడు ఇతడ్ని ఓడించి కంచివరకు గల ప్రాంతాన్ని ఆక్రమించాడు. కులశేఖర పాండ్యుని కాలంలో పాండ్యులు విజృంభించి చోళ, హొయసాల, కాకతీయుల ఓడించి నెల్లూరు వరకు ఆక్రమించారు. చోళ మండలాన్ని పాండ్యులు ఆక్రమించుటతో చోళుల పరిపాలన అంతమైంది.

## 1.8 సారాంశము:

విజయాలయుడు చోళుల మూల పురుషుడు. ఇతడు పల్లవుల సామంతుడు. పాండ్యులనోడించి, తంజావూరును ఆక్రమించాడు. ఇతడి తరువాత ఆదిత్య చోళుడు, మొదటి పరాంతకుడు, రాజ రాజు, మొదటి రాజేంద్రుడు, కులోత్తుంగ వంటి ప్రసిద్ధ రాజులు చోళ రాజ్యాన్ని విస్తరించి, పాలించారు. తంజావూరు వీరి రాజధాని. మూడో రాజేంద్రుడు ఈ వంశంలోని చివరి పాలకుడు. ఇతని తదనంతరం చోళ రాజ్యం అంతమైంది.

## 1.9 ప్రశ్నలు:

1. చోళుల రాజకీయ చరిత్రను వివరించండి.
2. రాజ రాజు గొప్పతనాన్ని అంచనా వేయండి.

## 1.10 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - The Cholas.
2. Majundar R.C. (Ed.) - The History and Culture of The Indian People
3. Romila Thapar - History of India
4. Yazdani G. (Ed.) - The Early History of The Deccan



**పాఠ్యభాగ రచయిత**

**డా॥ బాలినేని వాణి**

**పాఠం - 2**

# చోళుల పరిపాలన

## 2.0 లక్ష్యం:

చోళులు గొప్ప సామ్రాజ్య నిర్మాతలే గాక, గొప్ప పరిపాలనా దక్షులు కూడా. వీరు ఆదర్శవంత పాలనను రూపొందించడం జరిగింది. చోళుల పాలన ప్రపంచానికే ఆదర్శం. అది యావద్భారత దేశ చరిత్రలో గొప్ప ప్రశంశలు అందుకొంది. చోళుల ఆదర్శ గ్రామపాలనను వివరించటమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:


2.1 ఉపోద్ఘాతము
2.2 రాజు
2.3 మంత్రి పరిషత్
2.4 భూమి శిస్తు
2.5 ఇతర పన్నులు
2.6 పన్నుల భారం
2.7 వ్యయం
2.8 సైనిక పాలన
2.9 న్యాయ వ్యవస్థ
2.10 పాలనా వికేంద్రీకరణ
2.11 సామంతులు
2.12 గ్రామ పాలన
- 2.12.1 ఆధారాలు
- 2.12.2 గ్రామ సభలు
  - (ఎ) ఊర్
  - (బి) సభ
  - (సి) నగరం

2.13 ఎన్నిక
- 2.13.1 అర్హతలు
- 2.13.2 అనర్హతలు

2.14 ఎన్నిక విధానము
- 2.14.1 సంఘాలు
- 2.14.2 పదవీ కాలం

2.15 విధులు
2.16 సారాంశము
2.17 మాదిరి ప్రశ్నలు
2.18 ఉపయుక్త గ్రంథాలు

## 2.1 ఉపోద్ఘాతము:

భారతదేశ చరిత్రలో వినూత్నమైన పరిపాలనా పద్ధతులను ప్రవేశ పెట్టిన వారిలో చోళులకు ప్రముఖ స్థానముంది. మౌర్యులు, గుప్తుల పరిపాలనా వ్యవస్థ కంటే వీరి పరిపాలన ఉదాత్తమైనది. వీరు పరిపాలనలో నిర్దిష్టమైన, క్రమబద్ధమైన విధానాలను రూపొందించారు. ముఖ్యంగా చోళుల స్థానిక స్వయంపాలనా పద్ధతిని ఆధునిక స్థానిక పరిపాలన కంటే కూడా ఉన్నతమైనదిగా భావించవచ్చు. నిరంతరం యుద్ధాలలో నిమగ్నమై ఉన్నప్పటికీ చోళులు ప్రజాభీష్టానికను గుణంగా పటిష్టమైన పాలనా విధానాన్ని ప్రవేశపెట్టారు.

## 2.2 రాజు:

అన్ని నిరంకుశరాజరికాలలో లాగా చోళుల పరిపాలనలో కూడా రాజే సర్వాధికారి. సర్వ సైన్యాధిపతి, ప్రధాన న్యాయాధికారి కూడా రాజే. రాజ్య విస్తరణతో పాటు రాజు అధికారం హోదా పెరిగింది. రాజును " దేవరాజు"గా భావించేవారు. అంటే రాజును దైవంగా కొలిచేవారు. లేదా ఆలయాలలోని దేవాయాలకు రాజుల పేర్లను జోడించేవారు. తొండమనాడు దగ్గర ఉన్న ఆదిత్యేశ్వర, రాజేశ్వర దేవాలయాలలోని విగ్రహాలు ఇటువంటివే. రాజుల విగ్రహాలతో పాటు రాణుల విగ్రహాలను కూడా ప్రతిష్టించేవారు. సాధారణంగా చోళ వంశంలో వారసత్వంగానే రాజ్యాధికారం చేపట్టేవారు. అయితే పరిపాలనా ఆవశ్యకత, రాజ్య భద్రతల దృష్ట్యా కొన్ని మినహాయింపులు అప్పుడప్పుడు ఉండేవి. కొన్ని సమయాలలో కుమారులను యువరాజులగా చేసి రాజ్యాధికారాన్ని ఇచ్చేవారు. రాజ్యపాలనలో, యుద్ధ నిర్వహణలో కూడా యువరాజులు పాల్గొనే వారు. రాజులు తమకు నిరపేక్షాధికారాలున్నప్పటికీ మంత్రి పరిషత్, ఇతర అధికారుల సలహాలను తీసుకొనేవారు.

## 2.3 మంత్రి పరిషత్:

పరిపాలనలో రాజుకు సహాయపడుట కు మంత్రి పరిషత్ ఉండేది. ఓళయునాయకంతోపాటు పెరుందరమ్, సిరుతరమ్, విద్యాధికారి అనే పేర్లు శాసనాలతో కనిపిస్తున్నాయి. వీరి పాలనలో గల వివిధ తరగతుల ఉద్యోగులను 'కోరు మిగల్' అని పనితుక్కల్ అని వ్యవహరించనట్లు తెలుస్తున్నది. మంత్రులకు, ఉన్నతోద్యోగులకు భూములను బిరుదులను ఇచ్చి గౌరవించేవారు.

## 2.4 భూమి శిస్తు:

భూమిశిస్తు, వాణిజ్యపన్నులు, వృత్తి పన్నులు, ఇతర పన్నులు మొదలైనవి ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు. సాధారణంగా పంట పొలాలను సర్వే చేయించి పంటలో 1/6 వంతు పన్నుగా వసూలు చేసేవారు. అయితే మొదటి రాజరాజు కాలంలో పంటలో 1/3వంతు పన్నుగా విధించారు. వరిన్ - పొట్టగమ్ అనే భూమి శిస్తు సంబంధించిన రికార్డును ఏర్పరచిని వివరాలను నమోదు చేసేవారు, భూమిశిస్తును ధనరూపం లేదా వస్తు రూపంలోను లేదా రెండు రూపాలలోను గ్రామ సభలు వసూలు చేసేవి. భూములు వ్యక్తిగత భూములు, ప్రభుత్వ భూములు అని రెండు రకాలుగా ఉండేవి. భూస్వాములకు ఎక్కువశాతం భూమి పై అధికారం ఉండేది.

## 2.5 ఇతర పన్నులు:

భూమి శిస్తుతోపాటు తలైయిరై(మగ్గంపన్ను), శెక్కిరై(తెలికవారి పై పన్ను) తట్టార పొట్టం(స్వర్ణకారుల పై పన్ను) వంటి వృత్తి పన్నులుండేవి. ఇవేకాకుండా అడువుల పైనా, వరక్కువార్ పట్టం (నీటి వనురు పైనా) అంగాడిపట్టం(సంతల పైనా), శెట్టిరామ్ (వర్తక సుంకాలు) ఉప్పాయం (ఉప్పుపన్ను) మొదలగు పన్నులను వసూలు చేసేవారు. పాడి కావలి కూలి (రక్షకభట పన్ను) కొన్ని ప్రాంతాలలో వసూలు చేసే వారు.

## 2.6 పన్నుల భారం:

ఈ పన్నులు వివరాలను పరిశీలించినప్పుడు చోళుల కాలంలో పన్నుల భారం ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తుంది. పన్నుల భారం భరించలేని కొంతమంది రైతులు తమ గ్రామాలను వదలివెళ్ళేవారు. అటువంటి వారి భూములను ప్రభుత్వం వేలం వేయించి, ఇండ్లను జప్తు చేసేది. దేవాలయ భూములకు కూడా పన్నుల నుంచి మినహాయింపు లేదు. కులోత్తుంగుని కాలంలో దేవాలయ భూములకు పన్ను మినహాయించారు.

## 2.7 వ్యయం:

ప్రభుత్వాదాయంలో ఎక్కువ భాగం, నౌకా బలానికి, సైన్యానికి రాజదర్బారుకు ఖర్చు అయ్యేది. ఉద్యోగుల జీతాలు, రహదారుల నిర్మాణం,చెరువులు, కాలువలు తవ్వించడానికి, దేవాలయ నిర్మాణాలకు, వాటి నిర్వహణ ఇతర మతపరమైన ఖర్చులు మొదలయినవి ముఖ్య వ్యయాలుగా చెప్పవచ్చు.

## 2.8 సైనిక పాలన:

చోళులు తమ రాజ్యావసరాలకనుగుణంగా పెద్ద సైన్యాన్ని పోషించారు. ఆ సైన్యంతోనే సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరి సైన్యంలో అశ్వదళం, గజబలం, పదాతిదళాలున్నాయి. వీరి సైన్యంలో ముఖ్యమైనది నావికాదళం. సైన్యంలో చక్రవర్తి సైన్యం, సామంతుల సైన్యం ఉండేవి. చోళులు 150000 సైన్యాన్ని పోషించారు. రాజు లేదా యువరాజులు సాధారణంగా సైన్యానికి నాయకత్వం వహించేవారు. నాయక, సేనాపతి, మహాదండనాయక అనే వివిధ స్థాయిలలో సైనికాధికారులుండేవారు. వీరిలో ఎక్కువమంది బ్రాహ్మణులున్నారు. తరవాత స్థానం వెల్లాల కులస్థులది. యుద్ధభూమిలో సాహస పరాక్రమాలను ప్రదర్శించిన వారికి 'క్షత్రియ శిఖామణి' అనే బిరుదునిచ్చి సత్కరించేవారు.

## 2.9 న్యాయ వ్యవస్థ:

న్యాయ వ్యవస్థలో రాజే ఉన్నత న్యాయాధికారి. రాజు తీర్పే అంతిమ తీర్పు. దానిపై పునర్విచారణ లేదు. రాజాస్థానమే ఉన్నత న్యాయస్థానం. వివిధ స్థాయిలలో న్యాయాధిపతులుండేవారు. గ్రామాలలో 'న్యాయత్తార్' అనే గ్రామసభ నేరాలను, తగాదాలను విచారించి తీర్పులు ఇచ్చేది. శిక్షలు కఠినంగా ఉండేవి.

## 2.10 పాలనా వికేంద్రీకరణ:

పాలనా సౌలభ్యం కోసం చోళులు తమ రాజ్యాన్ని మండలాలుగా విభజించారు. మండలాలను వళనాడులుగా, వళనాడులను కుట్టం లేదా కొట్టం గాను విభజించారు. గ్రామం పాలనావ్యవస్థలో చివరిది. కొన్ని పెద్ద గ్రామాలను తనియూరు అని శాసనాలలో వ్యవహరించారు. రాజ రాజు కాలంలో 8 మండలాలుండేవి. మండలపాలనకు రాజప్రతినిధిని నియమించేవారు. సాధారణంగా యువరాజు లేదా రాజ బంధువులు రాజప్రతి నిధులుగా నియమింపబడేవారు. కొన్ని మండలాలను సామంతులు పరిపాలించేవారు.

## 2.11 సామంతులు:

హొయసాలలు, పాండ్యులు, నెల్లూరు తెలుగు చోడులు, వెలనాటి రాజులు ఇటువంటి మాండలిక సామంతులలో ముఖ్యులు. మండల పాలకుడు రాజుకు అందుబాటులో ఉండడం, అవసరమైన సమాచారం అందచేయడం, రికార్డులను భద్రపరచడం మొదలైనవి మండలపాలకుని బాధ్యలు. వళనాడులో నాటార్ అనే స్వపరిపాలనా సభ పాలనా వ్యవహారాలను నిర్వహిస్తుంది. ఈ సభలో గ్రామసభలు లేని గ్రామాలకు ప్రాతినిధ్యం ఇచ్చేవారు. నాట్టుక్కోన్, నాడు కిళవన్, ఊరుడైయాన్ అనే వారు వలనాడులో ప్రధానాధికారులు. పెద్ద పెద్ద పెట్టణాలలో నగరత్తార్ అనే సభ పట్టణ ప్రజలకు ప్రాతినిధ్యం వహించేది.

## 2.12 గ్రామ పరిపాలన:

భారతదేశ చరిత్రలో గ్రామ పాలనకు పేరు గాంచిన వారు చోళులు. చోళుల గ్రామ పాలన పలువురి ప్రశంశలందుకొంది. విదేశీ చరిత్రకారులు సైతం వీరి గ్రామ పాలనను ఘనంగా శ్లాఘించారు. గ్రామ సభలకు చోళులు సంపూర్ణ అధికారాలు ఇవ్వడం జరిగింది.

**2.12.1 ఆధారాలు:** గ్రామపాలనకు చోళుల కాలంలో విశిష్ట స్థానముంది. చోళుల గ్రామపరిపాలనా స్వరూపం గురించిన వివరాలు పరాంతకుని ఉత్తరమేరూర్, శాసనంలోను, కులోత్తుంగుని శాసనాలలోను లభ్యమవుతున్నాయి. చోళుల పాలనలో దాదాపుగా అన్ని గ్రామాల్లో స్వయం పరిపాలనా విధానం అమలులో ఉన్నది.

**2.12.2 గ్రామ సభలు:** గ్రామంలోని ప్రజలంతా కలిసి గ్రామ సభగా ఏర్పడే వారు. ఇటువంటి వాటిని సభ, మహాసభ లేదా పెరుంగూటి మహాసభ అని వ్యవహరించేవారు. సభ్యులను పెరుమక్కల్ అని వ్యవహరించేవారు.

ఈ గ్రామ సభల స్వరూప స్వభావాలు గ్రామాలను బట్టి మారుతుంటాయి. చోళుల శాసనాల వల్ల మూడు రకాలైన గ్రామసభలున్నట్లు తెలుస్తున్నది. అవి:

**(ఎ) ఉర్:** ఉర్ అనేది ప్రధానంగా బ్రాహ్మణేతరులైన రైతు ప్రతినిధులతో కూడిన సభ.

**(బి) సభ:** సభ అనేది బ్రాహ్మణులు నివసించే అగ్రహారాలలో సభ.

**(సి) నగరం:** నగరం అనే సభలో వర్తక సంఘాల ప్రతినిధులు ఉండేవారు.

## 2.13 ఎన్నిక:

ప్రతి గ్రామం పాలనా సౌలభ్యం కోసం, గ్రామ వ్యవహారాలను నిర్వర్తించడానికి 30 కుడుంబులు (వార్డులు)గా విభజించారు. ప్రతి కుడుంబు నుంచి ఒకరిని గ్రామ సభకు సభ్యునిగా ఎన్నుకుంటారు.

**2.13.1 అర్హతలు:** సభ్యుడిగా ఎన్నికయ్యే వ్యక్తికి కొన్ని అర్హతలుండాలి. 1 1/2 ఎకరం భూమి ఉండాలి, స్వంత ఇల్లు ఉండాలి. వయస్సు 35 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల లోపు ఉండాలి. వేదమంత్రాలు, బ్రాహ్మణాలు ధర్మశాస్త్రాల పరిజ్ఞానం ఉండాలి. ఒక వేళ ఆ వ్యక్తి 1/8 వంతు భూమి ఉన్నట్లయితే ఒక వేదంలో నాలుగు భాష్యాలలో పూర్తి ప్రావీణ్యం కలిగి ఉండాలి.

**2.13.2 అనర్హతలు:** కొన్ని అనర్హతలు కూడా శాసనాలలో చెప్పబడ్డాయి. గతమూడు సంవత్సరాలుగా సభ్యులుగా ఎన్నికయిన వారు తిరిగి ఎన్నుకొనుటకు అనర్హులు. దుర్వ్యసనాలు ఉండకూడదు. అక్రమంగా ఆస్తులు సంపాదించిన వారు అనర్హులు. గతంలో సభ్యుడిగా ఉండి లెక్కలు సరిగా సమర్పించని వారు వారి బంధువులు కూడా అనర్హులే. పంచమహాపాపాలు చేసిన వారు, వారి బంధువులు అర్హులు కారు. ఎవరైనా దుస్సాంగత్యం కలిగి ఉండి ప్రాయశ్చిత్తం చేసుకోనట్లయితే వారు, వారి బంధువులు అనర్హులు. మానసిక రుగ్మతలున్నవారు, ఇతరుల ఆస్తిని దొంగిలించినవారు, నిషిద్ధాహారం స్వీకరించినవారు, పాపాలు చేసి ప్రాయశ్చిత్తం చేసుకోని వారు అనర్హులు.

## 2.14 ఎన్నిక విధానం:

ఈ విధంగా అనర్హులను తొలగించి మిగిలిన వారిలో గ్రామంలో పన్నెండు వీధులు (సెరి) నుంచి 30 కుటుంబులకు అభ్యర్థుల పేర్లను తాటాకు ముక్కల పై రాసి చిన్నమూతిగల కుండలో వేసేవారు. సభ్యుల ఎన్నిక జరిగే సమయంలో గ్రామంలోని వారంతా ఒక చోట సమావేశం అయ్యేవారు. ఆ గ్రామంలోని అర్చకులంతా ఖచ్చితంగా ఆ సమావేశానికి హాజరుకావాలి. ఆలయార్చకులలో వృద్ధుడు నిలబడి అభ్యర్థుల పేర్లు గల తాటాకు ముక్కులున్న కుండను అందరికి కనిపించేటట్లు నిలబడి ఎత్తిపట్టుకోవాలి. అక్కడ ఏమి జరుగుతుందో, కుండలో ఏముందో తెలియని బాలుడు కుండను బాగా కదిపి ఒక తాటాకు ముక్కును తీసి వేరే ఖాళీ కుండలో వేసి వ్యవహర్తకు ఇవ్వాలి. అప్పుడు ఆ వ్యవహార లేదా మధ్యవర్తి ఆ తాటాకును అరచేతిలో ఉంచుకొని అందులో రాయబడిన పేరును బిగ్గరగా

చదవాలి. అక్కడే ఉన్న ఆలయ అర్చకులంతా ఆ పేరును బిగ్గరగా ప్రకటిస్తారు. సమావేశంలో ప్రజలు ఆ పేరున్న వ్యక్తిని సభ్యుడిగా అంగీకరిస్తారు. ఈ విధంగా 30 కుడుంబులకు సభ్యులను ఎన్నుకొంటారు. ఈ ఎన్నిక ప్రక్రియను 'కుడవోలై' అంటారు.

**2.14.1 సంఘాలు:** ఈ విధంగా ఎన్నికైన 30 మంది సభ్యులు వివిధ సంఘాలు ఏర్పడేవారు. అవి 1. గ్రామ సమిష్టి వ్యవహారాలుబీ 2. చెరువుల అజమాయిషీ (ఏరివారియం)బీ3. ఉద్యానవనాల పెంపకం (తోట వారియం), 4. దేవాలయాల నిధుల నిర్వహణ : 5. నీటి పారుదల సౌకర్యాలను సమకూర్చడం: 6.న్యాయవిచారణ.

కొన్ని శాసనాలలో మరికొన్ని వివరాలున్నాయి. ఎన్నికైన 30 మంది సభ్యులలో అనుభవం, విద్యావంతులు, వయోవృద్ధులైన 12 మందిలో వార్షిక సంఘం ఏర్పడుతుంది. మిగిలిన వారిలో కొంత మంది ఉద్యానవన సంఘానికి, మరి కొంత మంది చెరువుల అజమాయిషీ సంఘానికి సభ్యులుగా వ్యవహరిస్తారు.

**2.14.2 పదవీ కాలం:** వీరి పదవీ కాలం 360 రోజులు మాత్రమే.. ఎన్నికైన సభ్యుల పదవీ కాలం ముగిసిన తరవాత మరల న్యాయాధికార సంఘం మధ్యవర్తి సహాయంతో మరల ఎన్నిక ప్రక్రియను కొనసాగిస్తుంది. ఈ ఆరు రకాల సంఘాలకు సభ్యులను ఎన్నుకోవడంలో ఇదే విధానాన్ని అనుసరిస్తారు.

## 2.15 విధులు:

ఉత్తర మేరూర్ శాసనంలో లభ్యమౌతున్న పైన పేర్కొన్న గ్రామపరిపాలనా విధానం చోళరాజ్యంలోని ఒక ప్రత్యేకతను చాటి చెబుతున్నది. ఇంచుమించు అన్ని గ్రామాలలో ఇటువంటి పాలనావ్యవస్తే ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం. ఈ సంఘాలు గ్రామస్థాయిలో పన్నుల విధింపు, వసూలు రికార్డులను నిర్వహించడం, వ్యవసాయపరమైన, భూమి తగాదాలను తీర్చడం, తోటలు, చెరువులను సక్రమంగా నిర్వహించడం. గ్రామరక్షణ వంటి విధులను నిర్వహించేది. గ్రామ రక్షణకు ఒక స్థానిక ప్రభువును కాని, అధికారిని గాని ఎన్నుకొని పాడికావలి కూలి అనే పన్నును వసూలు చేసి ఆ ప్రభువుకు లేదా అధికారికి చెల్లించేవారు. ఈ విధంగా గ్రామాల పరిపాలన గ్రామస్తులే స్వయంగా నిర్వహించుకునేవారు.

చోళ ప్రభుత్వాధికారులు, కేవలం సలహాదారులుగాను పరిశీలకులుగాను గ్రామ వ్యవహారాలలో పాల్గొన్నారే కాని గ్రామ పాలకులుగా వ్యవహరించలేదు. గ్రామంలోని మొత్తం భూమిపై గ్రామసభలకు అధికారం ఉండేది. పన్నులను వసూలు చేసి ప్రభుత్వానికి అప్పగించడం, ప్రజలకు న్యాయాన్ని సమకూర్చడం అవసరానికి ఉ పయోగపడటానికి ధర్మనిధులు ఏర్పాటు చేయడం, దేవాలయ నిర్మాణాలు, ఉద్యానవనాలు, వ్యవసాయాభివృద్ధి మొదలైన బాధ్యతలు గ్రామసభలకు ఉండేవి. ఈ విధంగా చోళుల గ్రామపరిపాలనా వ్యవస్థ చరిత్రలో ప్రముఖ స్థానాన్ని పొందింది.

## 2.16 సారాంశము:

చోళుల స్థానిక స్వపరిపాలనకు ఎంతో విశిష్ట స్థానం ఉంది. ప్రాచీన యుగంలో మౌర్యుల పాలనా వ్యవస్థ భారతదేశ రాజ వంశాలకు ఏ విధంగా ఆదర్శప్రాయమైందో, అదే విధంగా మధ్య యుగంలో చోళుల గ్రామ పాలనా విధానం కూడా దక్షిణ దేశ రాజ వంశాలకు మార్గదర్శకమైంది.

చోళుల పరిపాలనలో అత్యంత ప్రధాన అంశం గ్రామ పాలన. ఊర్, సభ, నగరం అనే మూడు రకాల సభలు గ్రామ పాలనను నిర్వహించేవి. వాటికి సభ్యులను ఎన్నుకొనే అధికారం ఉంది. ఆనాటి గ్రామాలు స్వయం పోషకాలు.

## 2.17 మాదిరి ప్రశ్నలు:

1. చోళుల స్థానిక పరిపాలనా ప్రధాన లక్షణాలను వివరించండి.
2. చోళుల పాలనలోని కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తెల్పండి.
3. చోళుల పాలనలో సభ పాత్ర ఎట్టిది?

**ఖాళీలను పూరింపుము.**

1. చోళుల గ్రామ పాలన స్వరూపాన్ని తెలిపే శాసనం ......................
2. వర్తక సంఘాల ప్రతినిధులుండే చోళుల కాలం నాటి సభ ..............................
3. రైతు ప్రతినిధులుండే చోళుల కాలం నాటి సభ ...................................

## 2.18 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - The Cholas.
2. Majundar R.C. (Ed.) - The History and Culture of The Indian People
3. Romila Thapar - History of India
4. Yazdani G. (Ed.) - The Early History of The Deccan



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

పాఠం - 3

# చోళుల కాలం నాటి సాంఘీక - ఆర్థిక - మత - సాంస్కృతిక పరిస్థితులు

## 3.0 లక్ష్యం:

చోళుల కాలం నాటి సాంఘీక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో తెలియ చేయటమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:

3.1 ఉపోద్ఘాతము
3.2 సాంఘీక పరిస్థితులు
 3.2.1 వర్ణాశ్రమ ధర్మాలు
 3.2.2 బ్రాహ్మణులు
 3.2.3 వర్తకులు
 3.2.4 శూద్రులు
 3.2.5 బానిసలు
 3.2.6 స్త్రీ స్థానం
 3.2.7 వేశ్యలు
3.3 ఆర్థిక పరిస్థితులు
 3.3.1 వ్యవసాయం
 3.3.2 పంటలు
 3.3.3 రహదారులు
 3.3.4 విదేశీ వాణిజ్యం
 3.3.5 దౌత్య సంబంధాలు
3.4 మత పరిస్థితులు
3.5 విద్య
3.6 సాహిత్యం
 3.6.1 తమిళ భాష
 3.6.2 సంస్కృత భాష
3.7 వాస్తు శిల్ప కళలు
 3.7.1 వివిధ దశలు
 3.7.2 తొలి దశ
 3.7.3 రెండో దశ
  (ఎ) బృగదీశ్వరాలయం
 3.7.4 మూడవ దశ
 3.7.5 ముగింపు
3.8 సారాంశము
3.9 మాదిరి ప్రశ్నలు
3.10 ఉపయుక్త గ్రంథాలు

## 3.1 ఉపోద్ఘాతము:

దక్షిణ భారతదేశ రాజ వంశాల్లో అతి ప్రాచీనమైన పాలకులు చోళులు, చోళుల దక్షిణ భారత చరిత్రలో గొప్ప సామ్రాజ్య నిర్మాతలుగా, పాలనాదక్షులుగానే గాక, సాంస్కృతిక రంగంలో సైతం అపూర్వ ఖ్యాతిని గడించారు. సముద్రాలను దాటి, వర్తక వ్యాపారాలను కొనసాగించడం, తూర్పు ఆసియా రాజ్యాలతో సంబంధాలనేర్పరచుకోవటం, చోళుల కాలంలోనే చూడవచ్చు. చోళుల కాలంలోనే ఆసియాలోని అతి పెద్ద ఆలయం బృహదీశ్వరాలయం నిర్మితమైంది.

## 3.2 సాంఘీక పరిస్థితులు:

చోళుల కాలం నాటి సమాజాన్ని గురించి తెలుసుకొనుటకు మనకు లభిస్తున్న ఆధారాలు స్వల్పంగా ఉన్నాయి. నాటి శాసనాలు కాని సాహిత్యం కాని ప్రజాజీవనం గురించిన సమాచారం ఎక్కువగా అందించడం లేదు. లభ్యమవుతున్న సమాచారం ప్రకారం సాంఘిక అసమానతలున్నట్లు తెలుస్తుంది.

**3.2.1 వర్ణాశ్రమ ధర్మాలు:** నాటి ప్రజలు వర్ణాశ్రమ ధర్మాలను అనుసరిస్తున్నట్లు, పాలకులు కూడా వర్ణాశ్రమ ధర్మాన్ని కొనసాగించుటకు ప్రయత్నిస్తున్నట్లు నాటి శాసనాల వల్ల తెలుస్తున్నది. ఈ కాలంలోనే 'వలంగై', 'ఇడంగై' అనే వర్గాల విభజన వృత్తి పనివారిలో ఉండడం చోళ సమాజంలోని ప్రత్యేకత. ఈ రెండు వర్గాల మధ్య తరచు ఘర్షణలు జరుగుతుండేవి. ఈ రెండు వర్గాలు తిరిగి అనేక ఉపకులాలుగా విభజించబడ్డాయి. ఇటువంటి విభజన మొదటి కులోత్తుంగుని కాలంలో ప్రారంభమైనట్లు కొన్ని శాసనాల ద్వారా తెలుస్తున్నది.

**3.2.2 బ్రాహ్మణులు:** ఆనాడు రాజ్యంలో రాజు, రాజ కుటుంబంతో పాటు బ్రాహ్మణులకు, వర్తకులకు విశేష గౌరవం ఉండేది. విద్వాంసులైన బ్రాహ్మణులకు భూములు, అగ్రహారాలను, బ్రాహ్మ దేయాలుగా ఇచ్చేవారు. ఇటువంటి భూములకు, గ్రామాలకు పన్నుమినహాయింపు ఉండేది. దానంగా పొందిన ఈ ఆస్తి వీరి తరవాత వారి సంతానానికి చెందుతుంది.

**3.2.3 వర్తకులు:** వర్తకులు సంఘంలో ఉన్నత వర్గంగా ప్రాధాన్యతను పొందారు. చైనా, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియా రాజ్యాలతో వర్తక వాణిజ్యాలు కొనసాగించారు. వీరంతా మణి గ్రామమనే సంఘంగా ఏర్పడి సామూహిక వ్యాపారాలు. నిర్వహించేవారు.

మిగిలిన వర్గాల ప్రజలలో పట్టణాలలోని వృత్తిపని వారు, గ్రామాలలో పనిచేసే రైతులు, కూలీల పరిస్థితి దయనీయంగా ఉండేది. రాజానుగ్రహం పొంది వారికి సేవ చేయడమే వీరి బాధ్యత.

**3.2.4 శూద్రులు:** శూద్రుల పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. దేవాలయ భూములలో కష్టించి సాగుచేసి పంటలు పండించినా దేవాలయ నిర్మాణాలలో సహాయపడినా వారికి ఆలయ ప్రవేశం లేదు.

**3.2.5 బానిసలు:** నిరు పేదలు బానిసలుగా అమ్ముడుపోయేవారు. యుద్ధ ఖైదీలు, జన్మతః బానిసలు, నేరాలు చేసిన వారు అప్పులు తీర్చలేని వారు బానిసలుగా ఉండేవారు.

**3.2.6 స్త్రీ స్థానం:** స్త్రీల స్థితిగతులు మరీ హీనంగా ఉండేవి. సతీసహగమనం ఆచారం ఉండేది. దేవాలయాలలో దేవదాసీలు అధిక సంఖ్యలో ఉండేవారు.

**3.2.7 వేశ్యలు:** కాలక్రమేణా దేవదాసీ వ్యవస్థలో మార్పు వచ్చి దేవదాసీలను వేశ్యలుగా మార్చారు. ఆలయ ధర్మకర్తలు వేశ్యాధనాన్ని వసూలు చేసేవారు. రాజాస్థానంలో నర్తకికి దేవదాసీ లాగా కాక కొంత గౌరవ మర్యాదలుండేవి. సామాన్య గృహిణుల లాగా కాక వీరు సాంఘిక సంప్రదాయాలను, ధిక్కరించి కొంత స్వాతంత్ర్యాన్ని పొందగా మిగిలిని స్త్రీలు వంటింటి గోడల మధ్య, పంట పొలాల్లో చాకిరి చేసేవారు.

## 3.3 ఆర్థిక పరిస్థితులు:

**3.3.1 వ్యవసాయం:** ప్రజలలో ఎక్కువ మందికి వ్యవసాయమే ప్రధాన వృత్తి. వ్యవసాయాభివృద్ధికి ఎక్కువ ప్రాముఖ్యత లభించింది. బంజరు భూములను సాగుకు అనుకూలంగా చేయడం, అడవులను నరికి వ్యవసాయ భూములుగా మార్చడం, నీటి పారుదల సౌకర్యాలు కల్పించడ నాటి గ్రామ సభల భాధ్యతగా ఉండడం మొదలయినవి చోళులు వ్యవసాయాభివృద్ధికి ఇచ్చిన ప్రాముఖ్యతను తెలియచేస్తున్నాయి.

**3.3.2 పంటలు:** వరి, జొన్న, పత్తి, పండ్లు, కొబ్బరి, కూరగాయలు ఆనాటి ముఖ్యమైన పంటలు. వృత్తిపనులలో కంసాలి, కుమ్మరి వంటి వృత్తిపనుల వారికి విశేష ఆదరణ ఉండేది. రాగి, పంచలోహాలతో పాత్రలు, విగ్రహాలు తయారుచేయడంలో వీరు ప్రసిద్ధి కెక్కారు.

**3.3.3 రహదారులు:** దేశీయ విదేశీ వాణిజ్యం సక్రమంగా సాగటానికి విస్తృతమైన రవాణా సౌకర్యాలుండేవి. చోళరాజ్యం నుంచి ఆంధ్ర, కర్ణాటక, కొంగురాజ్యాలకు 24 అడుగుల వెడల్పుగల రవాదారులుండేవి. వీటిని పెరువళి (Great Road) అని శాసనాలలో పేర్కొన్నారు. వడుగ పెరువళి (ఆంధ్రాపథం), కొంగ పెరువళి, కల్యాణపురపెరువళి, తంజాపూరు పెరువళి అనే రహదారుల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి.

**3.3.4 విదేశీ వాణిజ్యం:** సైనికావసరాలకు నౌకాదళ నిర్మాణంలో చోళులు చూపిన శ్రద్ధ వల్ల ఆగ్నేయాసియా, చైనా, పశ్చిమ ఆసియా రాజ్యాలకు రవాణా సౌకర్యాలు పెరిగి తద్వారా విదేశీ వాణిజ్యం అభివృద్ధి చెందింది. వర్తకులు, శ్రేణులుగా ఏర్పడి వ్యాపారం సాగించారు. అటువంటి శ్రేణులలో వళంజీయర్, మణిగ్రామం, నానాదేశ దిశైయ్యాయిరత్తుఐన్నూరువర్ (నానాదేశముల నుంచి ఏర్పడిన 500మంది వర్తకుల సమితి) మొదలగునవి ముఖ్యమైనవి.

**3.3.5 దౌత్య సంబంధాలు:** విదేశీ వాణిజ్య కారణంగా విదేశాలతో దౌత్య సంబంధాలు అభివృద్ధి చెందాయి. ఫలితంగా చోళులు క్రీ.శ. 1015, 1027, 1033 సంవత్సరాలలో చైనా చక్రవర్తి ఆస్థానానికి రాయబారులను పంపారు. దేవాలయాలు కూడా ఆర్థిక వ్యవహారాలలో తమవంతు పాత్రను నిర్వహించాయి. దేవాలయాలు తమకు వచ్చే ధనాన్ని వ్యాపార సంస్థలకు, గ్రామ సభలకు సంవత్సరానికి 12% వడ్డీకి ఇస్తుండేవి. ఈ విధంగా చోళు ల కాలంలో ప్రభుత్వానికి అధిక ఆదాయం వచ్చి రాజ్యం సంపన్నవంతంగా మారడానికి ఆర్థిక పరిస్థితులు దోహదపడ్డాయి.

## 3.4 మత పరిస్థితులు:

చోళుల పాలనకాలంలో అనేక మతోద్యమాలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా చోళులు హిందూ ధర్మాభిమానులు. కొన్ని వర్గాల ప్రజలు జైనమతాన్ని కూడా ఆదరించారు. ఈ కాలంలో నాయనార్లు, ఆళ్వార్లు అనే శైవ, వైష్ణవ భక్తులు తమ భావాలను ప్రచారం చేశారు. చోళరాజులలో ఎక్కువమంది శైవులున్నారు. ఈ కారణంగానే రాజ్యంలో శైవానికి ప్రాధాన్యత లభించింది. శైవులలో కాపాలిక, కాలముఖ, పాశుపత వంటి తీవ్రవాద శాఖలుండేవి. వీరు పుర్రెలను ధరించడం, నరబలి, రక్త తర్పణం వంటి క్రూరాచారాలు అనుసరించేవారు.

ఇటువంటి పరిస్థితులల్లో శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వారి శిష్యుల బోధనలు మతంలో నూతనధోరణులు ప్రవేశపెట్టాయి. భగవంతుడ్ని ప్రేమించడం, సాటి మానవులపట్ల దయతో వ్యవహరించడం ప్రధానమని బోధించాయి. కులవ్యవస్థను వ్యతిరేకించారు. జ్ఞానమార్గం ద్వారా మోక్షం సాధించవచ్చని శంకరాచార్యులు. భక్తి మార్గం ద్వారా మోక్షం పొందవచ్చని రామానుజాచార్యులు బోధించారు.

భక్తి ఉద్యమానికి హిందుమత ధర్మశాస్త్రానికి సమన్వయం చేయడానికి మధ్వాచార్యులు కృషిచేశాడు. భక్తి ఉ ద్యమకారణంగా అప్పటికే క్షీణదశలో ఉన్న జైన, బౌద్ధ మతాలు మరింత బలహీనమయ్యా యి. ఈ కాలంలో

తిరుపతి, శ్రీకాళహస్తి, చిదంబరం, కంచి మొదలయిన ప్రదేశాలు గొప్ప పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి కెక్కి దూరప్రాంతాల నుంచి భక్తులను ఆకర్షించసాగాయి.

## 3.5 విద్య:

చోళ చక్రవర్తులు విద్యను ప్రోత్సహించే సంకల్పంతో కళాశాలలను నెలకొల్పినట్లు శాసనాలవల్ల తెలుస్తుంది. ఎన్నాయిరంలో రాజేంద్రచోళుడు క్రీ.శ 1025 పెద్ద కళాశాలను స్థాపించాడు. ఈ కళాశాలలో వేద, వేదాంత, మీమాంస, వ్యాకరణ శాస్త్రాలను బోధించేవారు 350 మంది విద్యార్థులు, 14 మంది అధ్యాపకులు ఈ కళాశాలలో ఉండేవారు. పాండిచ్చేరి సమీపంలోని త్రిభువని కళాశాలలో వేదవేదాంత శాస్త్రాలేకాక ఇతిహాస ధర్మశాస్త్రాలను కూడా బోధించేవారు. చెంగల్పట్టు జిల్లాలోని తరుముక్కుడు లో కూడా ఒక కళాశాలను ఏర్పాటు చేశారు. వ్యాకరణ, వైద్య విద్యలకు వేరు వేరుగా కళాశాలలుండేవి. తంజాపూర్ జిల్లాలోని తిరుకుడుతురైలోని వైద్యకళాశాలలో చరక సంహిత, వాక్పటుని 'అష్టాంగహృదయ సంహిత' లను బోధించే వారని శాసనాల ద్వారా తెలుస్తున్నది.

## 3.6 సాహిత్యం:

చోళుల పోషణలో సంస్కృత, తమిళభాషలు రెండూ అభివృద్ధి చెందాయి.

**3.6.1 తమిళ భాష:** చోళయుగాన్ని తమిళసారస్వత చరిత్రలో స్వర్ణయుగంగా భావించవచ్చు. శైవ, వైష్ణవ మతాచార్యులు తమిళంలో ఎన్నో భక్తి గీతాలు రచించారు. జైన భిక్షువు, కవి అయిన తిరుత్తక్క దేవర 'జీవకచింతామణి' అనే గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథ ప్రభావంతోనే తరవాత కాలంలో కంబన్ తమిళంలో రామాయణాన్ని రచించాడు. కల్లాడనార్ అనే కవి కల్లాడమ్ అనే కావ్యంలో శివుని గురించిన 64 లీలలను వర్ణించాడు. కులోత్తుంగుని ఆస్థానకవి అయిన జయంగొండార్ కులోత్తుంగుని కళింగ దండయాత్రా వివరాలను 'కళింగట్టుప్పరణి' అనే చారిత్రక కథాకావ్యంగా రచించాడు. మూడవ కులోత్తుంగుని కాలంలో కంబన్ కవి రామాయణం, ఎరెళుపట, శటకోపరందాది అనే కావ్యాలను రచించాడు. వీటిలో రామాయణం ఎంతో ప్రసిద్ధిని పొందింది.

క్రీ.శ. 11వ శతాబ్దికి చెందిన నంబి ఆండార్ నంబి శైవ సిద్ధాంతంపై 11 గ్రంథాలు రచించాడు. మూడవ కులోత్తుంగుని కాలానికి చెందిన శెక్కిలార్ రచించిన తిరుత్తొండర్ పురాణం లేదా పెరియపురాణం తమిళశైవ గ్రంథాలలో ప్రముఖమైనది. తమిళ ఛందస్సు గురించి అమితసాగరుడు యాప్పరుంగలమ్ యాప్పరుంగల కారి'' అనే వాటిని గుణసాగరుని కారికల ఆధారంగా రచించాడు.

**3.6.2 సంస్కృత భాష:** చోళుల పాలనలో సంస్కృత భాషకు కూడా విశేషమైన ఆదరణ లభించింది. మొదటి పరాంతకుని కాలంలో వేంకటమాధవుడు ఋగ్వేదానికి భాష్యం రచించాడు. రెండవ రాజరాజు పోషణలో కేశవస్వామి 'నానార్థవసంక్షేమం అనే సంస్కృత నిఘంటువును రూపొందించాడు. రామానుజాచార్యులు భగద్గీత, ఉపనిషత్తులు బ్రహ్మసూత్రాలపై సంస్కృతంలో శ్రీ భాష్యం అనే వ్యాఖ్యానాన్ని రచించాడు. ఇవేకాక భాగవత పురాణం, గీతావ్యాఖ్యానం, ఆశ్చర్య చూడామణి అనే గ్రంథాలు, ఆధ్యాత్మిక జిజ్ఞాసను పెంపొందించే ఎన్నో గ్రంథాలు చోళుల కాలంలో వెలువడ్డాయి.

## 3.7 వాస్తు శిల్ప కళలు:

పల్లవుల వాస్తు శిల్ప శైలిని చోళులు అభివృద్ధి పరచారు. 'చోళుల కాలంలో ద్రావిడ వాస్తు శిల్పం అత్యున్నత ప్రమాణాల నందుకొన్నదని' ఎస్.ఆర్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నాడు.

**3.7.1 వివిధ దశలు:** చోళుల ఆలయ నిర్మాణాలను పరిశీలిస్తే ఆ నిర్మాణాలలో మూడు దశలున్నట్లు తెలుస్తున్నది. క్రీ.శ. 800-1000 సం॥ల మధ్యకాలంలో నిర్మించిన ఆలయాలు మొదటి దశకు చెందినవి. రాజరాజు కాలం నుంచి మొదటి కులోత్తుంగుని కాలం వరకు నిర్మించిన ఆలయాలు రెండవ దశకు చెందినవి. మొదటి కులోత్తుంగుని కాలం తరవాత నిర్మించిన ఆలయాలు మూడవ దశకు చెందినవి.

**3.7.2 తొలి దశ:** నర్తమలైలోని 'విజయాలయ చోళీశ్వరాలయం', కన్ననూర్ లోని 'బాలసుబ్రమణ్య ఆలయం', కుంభకోణంలోని 'నాగేశ్వరాలయం', శ్రీనివాస నల్లూర్ లోని 'కొరంగనాథాలయం' తొండమనాడులోని ఆదిత్యేశ్వరాలయం, లడ్డిగంలోని ఇరుంగోలేశ్వరాలయం కొడంబలూర్ లోని 'ములర్ కోయిల్', పుల్లమంగైలోని బ్రహ్మేశ్వరాలయం', పుంజైలోని 'ఈశ్వరాలయం' తొలి దశక చెందిన చోళుల ఆలయాలు. తొలిదశకు ఆలయాలలో గర్భగృహం, అంతరాళం, మండపం ఉన్నాయి. సాధారణంగా ఈ ఆలయాలకు ఏకతల లేదా ద్వితల విమానాలున్నాయి. త్రితల విమానాలు చాలా అరుదు. ప్రధాన ద్వారం లతాలంకరణతోను, ద్వారపాలకులతో అలంకృతమై ఉంటుంది. గర్భగృహంలో దక్షిణామూర్తి, అర్ధనారీశ్వర, బ్రహ్మ, దుర్గ శిల్పాలు, మండపంలో గణపతి శిల్పమున్నాయి. మండపం కోష్టపంజరాలలో శివనటరాజు ఆనందతాండవ భంగిమలు శిల్పరూపంలో కనిపిస్తాయి. ప్రధాన దేవాలయం చుట్టూ పరివాహ దేవతలకు చిన్న ఆలయాలను నిర్మించారు.

**3.7.3 రెండవ దశ:** రెండవదశ ఆలయాలలో గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, రంగమండపం, గోపురాలతో కూడిన ప్రాకారాలున్నాయి. తిరునల్వేలి జిల్లాలోని బ్రహ్మదేశంలోని తిరువాలేశ్వరాలయం, తంజాపూరులోని రాజరాజేశ్వరమనే పేరున్న బృహదీశ్వరాలయం, గంగైకొండ చోళపురంలో రాజేంద్రదేవుడు నిర్మించిన ఆలయం మొదలయినవి ఈ దశకు చెందిన ఆలయాలు.

**బృహదీశ్వరాలయం:** తంజాపూరులోని బృహదీశ్వరాలయాన్ని క్రీ.శ 1003 లో ప్రారంభించి 1010 నాటికి పూర్తి చేశారు. ఈ ఆలయానికి రెండు ప్రాకారాలున్నాయి. ప్రాకార గోడల పై భాగాన నందులున్నాయి. ప్రవేశ ద్వారం అర్ధచంద్రాకారంగా 40 అడుగుల ఎత్తుతో నిర్మించబడింది. రెండవ ప్రాకారంలో నంది మండపంలోని 12x19.5X9 అడుగుల కొలతల నంది భక్తులను ఆకర్షిస్తుంటుంది. నంది మండపం పెద్దరంగమండపం, స్తంభ మండపం అన్నీ ప్రాకారానికి మధ్యలో ఉన్నాయి. చివరగా పశ్చిమాంతంలో సమున్నతమైన విమానం ప్రత్యేకమైన ఆకర్షణ. విమానం ఎత్తు దాదాపు 200 అడుగులు. విమానం పైన 80 టన్నుల బరువుగల రాతిలో అమలకం ఉన్నది. ఈ విమానానికి 16 అంతస్తులున్నాయి. విమానం పై పురాణగాథలను శిల్పరూపంలో రూపొందించారు.

రెండవ అంతస్తులో 108 రకాల శివతాండవ శిల్పాలున్నాయి. గర్భగృహం సమచతురస్రాకారపు నిలువెత్తు అధిష్టానం పై నిర్మించబడింది. గర్భగృహ కుడ్యాలు అధిష్టానం నుంచి ఊర్ధ్వ భాగం వరకు రెండు అంచెలుగా అలంకరించడం జరిగింది. గర్భగృహంలోపల 9 అడుగుల వెడల్పుతో ప్రదక్షిణాపథం నిర్మించబడింది. గర్భగృహంలోని 23 అడుగుల ఎత్తు, 54 అడుగుల చుట్టు కొలత కలిగిన శివలింగానికి బృహదీశ్వరుడని పేరు. గర్భగృహ ప్రవేశ ద్వార వద్ద గల గూడులలో పెద్ద ద్వారపాలకుల శిల్పాలున్నాయి. మహామండపంలోను, ఆలయ కుడ్య దేవ కోష్టములలో చంద్రశేఖరమూర్తి, లింగోద్భవమూర్తి, హరిహరమూర్తి, భిక్షాటనమూర్తి, విష్ణు అనుగ్రహమూర్తి, సుబ్రమణ్య, వీరభద్ర, త్రిపురాంతక, సరస్వతీ శిల్పాలు.

రెండవ దశకు చెందినదే గంగైకొండ చోళపురంలో రాజేంద్రచోళులు క్రీ.శ 1030లో నిర్మించిన శివాలయం. ఈ ఆలయం తంజాపూరు ఆలయం కంటె పరిమాణంలో చిన్నది. ఈ ఆలయ ప్రత్యేకత 150 స్తంభాల మండపం. ప్రవేశం ద్వారం తూర్పుముఖంగా ఉంటుంది. మహామండపానికి, గర్భగృహానికి మధ్యనున్న అంతరాళానికి ఉత్తర, దక్షిణ దిశలలో రెండు ద్వారాలున్నాయి. ఆలయ విమానం 8 అంతస్తులతో నిర్మించబడింది. ఆలయ కుడ్యాలు, దేవ కోష్టాలు వివిధ రకాల శైవ శిల్ప ప్రతిమలు, లతాలంకరణతో అలంకరించబడ్డాయి.

**3.7.4 మూడవ దశ:** మూడవ దశకు చెందిన చోళ ఆలయాలలో తంజావూరు జిల్లాలోని దారాసురం వద్ద రెండవ రాజరాజు నిర్మించిన ఐరావతేశ్వరాలయం, కుంభకోణం వద్ద గల త్రిభువనంలోని మూడవ కులోత్తుంగుడు నిర్మించిన కంపహరేశ్వరాలయం ముఖ్యమైనవి. ఈ దశలోనే చిదంబరం, శ్రీరంగం ఆలయాలు విస్తరించబడ్డాయి.

చోళుల కాలంలోని శిల్పులు కంచు, పంచలోహ విగ్రహాలను పోతపోయడంలో ఎంతో ప్రసిద్ధి చెందారు. ఈ కాలంలో రూపొందించిన పంచలోహ విగ్రహాలలో నటరాజమూర్తి, పార్వతి, లక్ష్మి, భూదేవి మొదలయినవి ప్రసిద్ధమైనవి. చిదంబరంలోని నాగేశ్వరాలయంలో గల నటరాజు కంచు విగ్రహం మనదేశంలోని కంచు విగ్రహాల కంటే పెద్దది, సుందరమైనది కూడా.

**3.7.5 ముగింపు:** చోళుల పాలనాకాలంలో భారతీయ సంస్కృతి వికాసం జరిగింది. దక్షిణ భారతదేశంలో చోళులరాజ్యం అంత్యంత శక్తివంతమైన రాజ్యంగా రూపొందింది. అవిచ్ఛిన్నంగా సాగిన వ్యాపార వాణిజ్యాలు వర్తకులకే కాక చోళరాజ్యానికి కూడా సంపదను చేకూర్చాయి. చోళుల ఆదరణలో సంస్కృత, తమిళభాషల్లో ఎన్నో కావ్యాలు వెలువడ్డాయి. విశాలమైన ప్రాకార గోపురాలతో ఎన్నో దేవాలయాలు నిర్మించబడ్డాయి. చోళులు ప్రవేశపెట్టిన గ్రామ పరిపాలన విశిష్టమైన వ్యవస్థగా రూపొంది తరవాత కాలంలో కూడా ప్రభావాన్ని చూపింది. భక్తి ఉద్యమం హిందూమతంలో నూతన భావాల్ని ప్రవేశపెట్టింది. ఈ విధంగా చోళుల కాలంలో ఆరంభమైన అనేక అంశాలు, పరిణామాలు దక్షిణ భారతదేశంలోనే కాక యావత్భారత దేశంలోని ప్రాంతాల పై కూడా తమ ప్రగాఢ ప్రభావాన్ని చూపాయి.

## 3.8 సారాంశము:

చోళుల కాలంలో వర్ణాశ్రమ ధర్మాలు పాటించబడ్డాయి. సమాజంలో అసమానతలు కొనసాగాయి. బ్రాహ్మణులు, వర్తకులు సంఘంలో ప్రాధాన్యత పొందడం జరిగింది. శూద్రుల పరిస్థితి దిగజారింది. నిరుపేదలు బానిసలుగా అమ్ముడుపోయే పరిస్థితి ఏర్పడింది. స్త్రీల గౌరవం అడుగంటింది. దేవదాసీలు వేశ్యలుగా మారారు.

ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. చోళులు నీటి పారుదల కల్పించడం తమ బాధ్యతగా గుర్తించారు. విదేశీ వాణిజ్యం పై పాలకులు దృష్టి సారించారు. ఆ కారణంగా విదేశాలతో దౌత్య సంబంధాలేర్పడ్డాయి. చోళ చక్రవర్తులు విద్యను ప్రోత్సహించారు. వీరి పోషణలో సంస్కృత, తమిళ భాషలు అభివృద్ధి చెందాయి. చోళుల కాలంలో వాస్తు, శిల్ప కళలు అభివృద్ధి సాధించాయి. తంజావూరులోని బృహదీశ్వరాలయం చోళుల శిల్ప కళా వైభవానికి తార్కాణం.

## 3.9 మాదిరి ప్రశ్నలు:

1. చోళుల కాలం నాటి సాంఘీక, ఆర్థిక పరిస్థితులను తెలపండి.
2. చోళుల కాలంలో జరిగిన సాహిత్యాభివృద్ధిని పేర్కొనండి.
3. వాస్తు, సిల్ప కళలకు చోళులు చేసిన సేవ ఎట్టిది?
4. తంజావూరులోని బృహదీశ్వారాలయం వాస్తు లక్షణాలను పేర్కొనండి.

**జతపరచండి:**

| | | | |
|---|---|---|---|
| 1. రాజ రాజు | (   ) | ఎ) | శ్రీ భాష్యం |
| 2. రాజేంద్ర చోళుడు | (   ) | బి) | బృహదీశ్వరాలయం |
| 3. కంబన్ | (   ) | సి) | గంగై కొండ చోళ పురం |
| 4. తిరుక్కదేవర్ | (   ) | డి) | జీవక చింతామణి |
| 5. రామానుజాచార్యులు | (   ) | ఇ) | తమిళ రామాయణము |

## 3.10 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - The Cholas.
2. Majundar R.C. (Ed.) - The History and Culture of The Indian People
3. Romila Thapar - History of India
4. Yazdani G. (Ed.) - The Early History of The Deccan



పాఠ్యభాగ రచయిత

డా॥ బాలినేని వాణి

## పాఠం - 4

# కాకతీయులు

### 4.0 లక్ష్యం:

తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలన్నింటిని ఐక్యం చేసి, తెలుగు జాతి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడ్డ కాకతీయుల రాజకీయ చరిత్రను, వారి పరిపాలనా విధానాన్ని తెలియ చేయడమే ఈ పాఠం ప్రధాన లక్ష్యం.

### పాఠ్య నిర్మాణ క్రమం:


4.1 ఉపోద్ఘాతము
4.2 వంశ చరిత్ర
4.3 రాజకీయ చరిత్ర
- 4.3.1 గుండ్యన
- 4.3.2 రుద్ర దేవుడు
- 4.3.3 గణపతి దేవుడు
- 4.3.4 రుద్రమ దేవి
- 4.3.5 రెండో ప్రతాపరుద్రుడు

4.4 కాకతీయుల పరిపాలన
- 4.4.1 రాచరికం
- 4.4.2 రాజు
- 4.4.3 స్త్రీకి రాజ్యాధికారము
- 4.4.4 మంత్రులు
- 4.4.5 సామంతులు
- 4.4.6 స్థానిక పాలన
  - (ఎ) ఆయగార్లు
  - (బి) ఆయగార్ల విధులు
- 4.4.7 న్యాయ నిర్వహణ
- 4.4.8 సైన్యం
  - (ఎ) దుర్గాలు
  - (బి) లెంకలు

4.5 నాయంకర విధానం
4.6 సారాంశము
4.7 మాదిరి ప్రశ్నలు
4.8 ఉపయుక్త గ్రంథాలు

## 4.1 ఉపోద్ఘాతము:

కాకతీయ యుగం ఆంధ్రుల చరిత్రలో ఒక ఉజ్వల ఘట్టం. శాతవాహనుల పాలనానంతరం యావదాంధ్రదేశాన్ని జయించి, దాదాపు మూడు వందల సంవత్సరాలపాటు పాలించి, అనేక ప్రజాహిత కార్యాలను చేపట్టి, సాహిత్య లలితకళలను అభివృద్ధి పరచి, ఆంధ్ర సంస్కృతిని సుసంపన్నం చేసిన పాలకులు కాకతీయులు. తెలుగు వారికి ఒక ప్రత్యేకతను ఏర్పరచి, తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలన్నిటినీ కలిపి ఒకే పాలన కిందికి తీసుకువచ్చి పరిపాలించిన ఘనత కాకతీయులకే దక్కుతుంది.

ఉత్తరభారతదేశంలో రాజపుత్రులలాగా దక్షిణాపథంలో కాకతీయులు హిందూ స్వాతంత్ర్యం, సంస్కృతులను పరిరక్షించడానికి కృషి చేశారు. ఆంధ్రదేశ స్వాతంత్ర్య పరిరక్షణలో, ఆంధ్ర సంస్కృతీ పోషణలో రెడ్డి రాజులకు, విజయనగర పాలకులకు మార్గదర్శకులయ్యారు. కాకతీయులు కొంతకాలం తూర్పుచాళుక్యులకు, మరికొంతకాలం కల్యాణి చాళుక్యులకు సామంతులుగా ఉండి, క్రమంగా స్వతంత్ర రాజ్యం ఏర్పరచుకొన్నారు.

కాకతీయసామ్రాజ్యం క్రీ.శ 1100




**కాకతీయ సామ్రాజ్యం**

## 4.2 వంశచరిత్ర:

కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలను గురించి చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించడం జరిగింది. 'కాకతి' అనే శక్తి దేవతను ఆరాధించడంవల్ల కాకతీయులకు ఆపేరు వచ్చినట్లు విద్యానాథుని 'ప్రతాపరుద్ర యశోభూషణం' పేర్కొన్నది. ఈ వంశంలోని రాజులు 'కాకతిపురవల్లభ' అనే బిరుదును ధరించేవారు. వీరి జన్మస్థలమైన కాకతిపురం వల్ల కాకతీయులకు ఆ పేరు వచ్చిందనే ఒక వాదం కూడా ఉంది. అయితే కాకతిపురం ఏది? అనే ప్రశ్నకు సమాధానం లభించవలసి ఉంది. కాకతీయుల రాజధాని ఓరుగల్లులో కాకతమ్మకు ఆలయం నిర్మించబడి ఉన్నందువల్ల ఆనగరానికి కాకతిపురం అనే నామాంతరం అని భావించవచ్చు. కాకతి అంటే కూష్మాండం లేదా గుమ్మడికాయ అని అర్థం. వివిధ శాసనాలవల్ల కాకతీయ వంశనామం కాకతిపురనామం వల్లనే వచ్చిందని తెలుస్తుంది.

తూర్పు చాళుక్యులకు వీరు సామంతులుగా ఉన్నారని, కాబట్టి కాకతీయులు ఆంధ్రులని కొందరి అభిప్రాయం. మారేమండ రామారావు ఆంధ్రకు పశ్చిమ సరిహద్దులో ఉన్న కాకతి గ్రామం నుంచి వచ్చి, తూర్పు చాళుక్యుల ఆస్థానంలో ఉంటూ వచ్చినందువల్ల కాకతీయులు ఆంధ్రులని అభిప్రాయపడ్డారు.

మల్యాల గుండయ సేనాని వర్ధమానపురశాసనం కాకతీయులు శూద్రులని చెబుతుంది. గణపతిదేవుని సోదరి మైలాంబకు చెందిన బయ్యారం చెరువు శాసనం, కాకతీయులు దుర్జయులని పేర్కొనడం జరిగింది. గణపతి దేవుని పాకాల, మోటుపల్లి శాసనాలు కాకతీయులను క్షత్రియులుగాను సూర్యవంశీయులుగాను తెలియజేస్తున్నాయి.

## 4.3 రాజకీయ చరిత్ర:

**4.3.1 గుండ్యన:** కాకతీయ వంశానికి మూలపురుషుడు కాకర్త్య గుండ్యన (క్రీ.శ. 954-955). ఇతడు మానుకోట ప్రాంతంలో కొరవి భూభాగానికి అధిపతి. గుండ్యన, అమ్మరాజును తొలగించి వేంగిని ఆక్రమించడానికి, దానార్ణవుడికి సహాయం చేశాడు.

కాకర్త్య గుండ్యన నుంచి రెండో ప్రోలరాజు వరకు కాకతీయ పాలకులను సామంతకాకతీయులుగాను, రెండో ప్రోలరాజు నుంచి రెండో ప్రతాపరుద్రుడి వరకు ఉన్న పాలకులను స్వతంత్ర కాకతీయులుగాను పిలవడం జరిగింది.

గుండ్యన కుమారుడు మొదటి బేతరాజు (క్రీ.శ 1000-1052) మిరియాల కామసాని రక్షణ కల్పించగా, బేతరాజు కల్యాణి చాళుక్యులకు సామంతుడిగా ఉండి, కొరవి వద్ద రాజ్యాన్ని నిర్మించాడు. మొదటి బేతరాజు కుమారుడు మొదటి ప్రోలరాజు (క్రీ.శ. 1052-76). ఇతడు కల్యాణి చాళుక్యరాజు సోమేశ్వరుడికి సహాయాన్నందించి, అనుమకొండ విషయాన్ని వంశపారంపర్య హక్కులతో సామంత హోదాలో పొందాడు. ప్రోలరాజు శివభక్తుడు. మొదటి ప్రోలరాజు కుమారుడే రెండో బేతరాజు (క్రీ.శ 1076-1108). ఇతడు బాదామి రాజధానిగా పాలిస్తున్న పశ్చిమ చాళుక్యరాజు ఆరో విక్రమాదిత్యుడిని సామంతుడుగా ఉన్నప్పటికీ అనుమకొండ కాకతీయులకు కేంద్రం అయింది. రెండో బేతరాజు అనుమకొండలో గొప్ప తటాకాన్ని, శివపురమనే గొప్ప శివాలయాన్ని నిర్మించాడు. రెండో బేతరాజు తరవాత దుర్గరాజు, ఆ తరవాత రెండో ప్రోలరాజు (క్రీ.శ. 1116-57) కాకతీయ సింహాసనం అధిష్టించారు. రెండో ప్రోలరాజే స్వతంత్ర కాకతీయ పాలకుడు.

**4.3.2 రుద్రదేవుడు (క్రీ.శ 1158-1195):** రుద్రదేవుడికి, ప్రతాపరుద్రుడు అనే పేరు కూడా ఉంది. ఇతడిని గురించి అనుమకొండ శాసనం వివరిస్తుంది. వెలనాటి పాలకులను ఓడించి, ద్రాక్షారామం, శ్రీశైలం ఆక్రమించి, కాకతీయ సార్వభౌమత్వాన్ని చాటాడు. పలనాడు వారసత్వ యుద్ధంలో నలగామునికి సైన్యాన్ని రక్షణగా పంపాడు. రుద్రదేవుడే ఓరుగల్లు నిర్మాత. అనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం ఇతడి నిర్మాణమే. అనంతరం రుద్రదేవుని సోదరుడు మహాదేవుడు (1195-99) సింహాసనం అధిష్టించాడు. తన అన్న మరణానికి కారకుడైన జైత్రపాలుని పై దండెత్తి, ఓడి మరణించాడు. ఈ దండయాత్రలోనే మహాదేవుని కుమారుడు గణపతి దేవుడు యాదవులకు బందీగా చిక్కాడు. అనంతరం విడుదలయి కాకతీయ సింహాసనాన్ని అధిష్టించాడు.

**4.3.3 గణపతి దేవుడు (క్రీ.శ. 1199-1262):** కాకతీయ పాలకులలో గణపతిదేవుడు అగ్రగణ్యుడు. దేవగిరి పాలకులైన యాదవరాజుల దాడులతో సంక్షోభానికి గురయిన కాకతీయ రాజ్యాన్ని కాపాడి, శాంతి నెలకొల్పాడు. అనేక దండయాత్రలు చేసి తీరాంధ్ర దేశాన్ని దక్షిణ కళింగను, పశ్చిమోత్తర తెలంగాణా ప్రాంతాలను ఆక్రమించాడు. ఇతడి కాలంలోనే మనుమసిద్ధి ఆస్థానకవి తిక్కన సోమయాజి కాకతీయ ఆస్థానాన్ని దర్శించాడు. 1254లో రాజధానిని అనుమకొండ నుంచి ఓరుగల్లుకు మార్చాడు. ప్రధాన రేవుపట్టణమైన మోటుపల్లిలో అభయశాసనాన్ని చెక్కించాడు. అనుమకొండలోని సహస్రలింగాలయం, స్వయంభూదేవాలయం గణపతి దేవుని నిర్మాణాలే. గణపతిదేవుడు దాయగజకేసరి బిరుదాంకితుడు.

**4.3.4 రుద్రమదేవి (క్రీ.శ 1262-1289):** గణపతిదేవుడికి పురుష సంతానం లేనందువల్ల అతడి తరవాత అతని రెండో కుమార్తె రుద్రమదేవి కాకతీయ సింహాసనాన్ని అధిష్ఠించింది. దక్షిణ భారతదేశాన్ని, ముఖ్యంగా ఆంధ్రదేశాన్ని పాలించిన తొలి మహిళా పాలకురాలు రుద్రమదేవి.

ఈమె కాలంలో యాదవులు, చోళులు, పాండ్యులు కాకతీయ రాజ్యం పై దాడులు జరుపగా, స్త్రీ అయినప్పటికీ సమర్థవంతంగా ఎదుర్కొని, ఆదాడులను తిప్పికొట్టి, రాజ్యాన్ని కాపాడగలిగింది. ఉదారమైన పాలనను అందించి, ప్రజాభిమానాన్ని చూరగొంది.

క్రీ.శ. 1293లో వెనిస్ యాత్రికుడు మార్కోపోలో మోటుపల్లిని దర్శించి, రుద్రాంబ సమర్థవంతమైన పరిపాలనను ప్రజలకు అందించిందని పేర్కొన్నాడు. రుద్రమదేవి కూడా పుత్రసంతానం లేనందువల్ల తనకుమార్తె ముమ్మడమ్మ కుమారుడైన ప్రతాపరుద్రున్ని దత్తత చేసుకొని, అతడిని తన వారసుడిగా ప్రకటించింది.

**4.3.5 రెండో ప్రతాపరుద్రుడు (క్రీ.శ 1289-1323):** రెండో ప్రతాపరుద్రుడు చివరి కాకతీయ పాలకుడు. ఇతడు కాయస్థ అంబదేవుణ్ణి ఓడించి, అతడి రాజ్యాన్ని కాకతీయ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. ప్రతాపరుద్రుడి సేనానులైన అడిందమల్లు, సోమయాదుల రుద్రదేవుడు నెల్లూరు రాజ్యం పై దండెత్తి, మనుమగండ గోపాలున్ని ఓడించారు.

ఇదే సమయంలో కాకతీయ రాజ్యం పై ఉత్తర భారతదేశం నుంచి ముస్లిందాడులు ప్రారంభమయ్యాయి. అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫర్ 1300లో ప్రతాపరుద్రుని పై చేసిన దాడిని అతడు తిప్పికొట్టాడు. అయితే 1310లో జరిగిన రెండో దాడిలో ఓడి, సంధికి అంగీకరించి కానుకలు చెల్లించి, తన రాజ్యాన్ని కాపాడుకున్నాడు. అనంతరం ఢిల్లీలో అధికారానికి వచ్చిన తుగ్లక్ వంశానికి చెందిన జునాఖాన్ 1322లో దాడిచేయగా, ప్రతాపరుద్రుడు దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. కానీ 1323లో జునాఖాన్ తిరిగి కాకతీయ రాజ్యం పై దండెత్తి ప్రతాపరుద్రుడ్ని ఓడించి, ఓరుగల్లుని ఆక్రమించాడు. అవమాన భారంతో ప్రతాపరుద్రుడు నర్మదానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడంతో కాకతీయ సామ్రాజ్యం అంతరించింది.

## 4.4 కాకతీయుల పాలన:

తెలుగు ప్రజలందరినీ ఒకే పరిపాలనలోకి తెచ్చి సమైక్యం చేసిన ఘనత కాకతీయుల దక్కుతుంది. ఆంధ్రులందరూ ఒకే ప్రభుత్వం కిందికి రావడంవల్ల, వారిలో జాతీయ భావోదయమై తమ జాతి సర్వతోముఖాభివృద్ధికి ఐకమత్యంతో కృషి చేశారు. మహమ్మదీయుల నుంచి తమ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడానికి కాకతీయులు చూపిన పట్టుదల, కృషి, దీక్ష విజయనగర పాలకులకు మార్గదర్శకం అయింది.

**4.4.1 రాచరికం:** కాకతీయులు ప్రజారంజకులైన పాలకులు. వారిది సంప్రదాయబద్ధ రాజరికం. కాకతీయుల పాలన హిందూ ధర్మశాస్త్రాలననుసరించి జరిగింది. ప్రతాపరుద్రుని నీతిసారం, బద్దెన నీతిశాస్త్రముక్తావళి, మడికి సింగన సకలనీతి సమ్మతం నాటి రాజనీతి గ్రంథాలలో చెప్పుకోదగినవి.

**4.4.2 రాజు:** రాజు నిరంకుశుడైనప్పటికీ, అధికారాలన్నీ కేంద్రకృతమయినప్పటికీ, ధర్మ బద్ధుడిగా వ్యవహరించేవాడు. రాజు దైవాంశ సంభూతుడని ప్రజలు భావించేవారు. రాజ్యానికి, మతానికి సన్నిహిత సంబంధం ఉండేది. దీనివల్ల రాజులు దేవాలయాలు నిర్మించి మత సంస్థలకు దానాలు చేసేవారు. రాజు నీతి, నిజాయితీ, ఉన్నతమైన గుణగణాలు కలిగినవాడై ఉండాలని ధర్మశాస్త్రాలలో ప్రస్తావించడం జరిగింది. వేదాలు, శాస్త్రాలు,

రాజనీతి రాజుకు క్షుణ్ణంగా తెలుసుండాలని కూడా రాజనీతి గ్రంథాలలో చెప్పడం జరిగింది. అంతేకాకుండా రాజు ప్రజలను తనకన్న బిడ్డల లాగా పాలించాలని, రాజాస్థానంలో పనిచేసే ఉద్యోగులను దయతో చూడాలని, మోసగాళ్ళకు, దురాశాపరులకు ఉద్యోగాలు ఇవ్వరాదని పేర్కొన్నాయి.

**4.4.3 స్త్రీకి రాజ్యాధికారం:** రుద్రదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు అన్ని విద్యల్లో తర్ఫీదు పొంది, రాజనీతి సూత్రాలకు అనుగుణంగా పరిపాలించి, ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. పురుషునితో పాటు సమానంగా స్త్రీకి రాజ్యాధిపత్య హక్కు కల్పించడం కాకతీయ రాజ్యపాలనా వ్యవస్థ ముఖ్య లక్షణం. రాజు నిర్ణీత సమయాలలో ప్రజలకు దర్శనమిచ్చి, వారి సమస్యలను తెలుసుకోవాలని ప్రతాపరుద్రుని నీతి సారం చెబుతుంది.

**4.4.4 మంత్రులు:** రాజుకు మంత్రులు, ఉద్యోగులు పాలనా విషయాలలో సహాయకారులుగా ఉండేవారు. యోగ్యత ఉన్నవారినే మంత్రులుగా నియమించేవారు. రాజుకు సలహాలివ్వడానికి మహా ప్రధాని, ప్రధాని, ప్రెగ్గడ, అమాత్య, మంత్రి, సకల సేనాపతి, తంత్రపాలుడు, సంధి విగ్రహకుడు ఉండేవారు. రాచనగరుకు సంబంధించి 72 శాఖల సిబ్బంది పనిని తనిఖీ చేసే అధికారిని బాహత్తరనియోగాధిపతి అని పిలిచేవారు.

**4.4.5 సామంతులు:** రాజుకు పాలనా వ్యవహారాలలో సహాయం చేసే మరొక వర్గమే సామంతులు. కాకతీయ రాజ్య వైభవానికి ఎక్కువగా కృషి చేసింది సామంత ప్రభువులే అని చెప్పవచ్చు. వీరు అనేక యుద్ధాల్లో తమ శూరత్వంతో కాకతీయ రాజులకు విజయాలను చేకూర్చి పెట్టడమే కాకుండా, ప్రజాహిత తత్పరులై గుళ్ళు గోపురాలు నిర్మించి, చెరువులు తవ్వించి, కవులను ఆదరించి, కాకతీయ వైభవానికి ఎంతో కృషి చేశారు. అందుకే రాజులకు సైతం వీరితో మంచి సంబంధాలుండేవి.

**4.4.6 స్థానిక పాలన/పాలనా వికేంద్రీకరణ:** పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయులు తమ రాజ్యాన్ని నాడులుగాను, నాడులను స్థలాలు గాను విభజించారు. నాడులకు మరో పేరు సీమ. వీటితో పాటుగా భూమి, వాడి అనే పాలనా విభాగాలు ఉన్నట్లు తెలుస్తుంది.

**గ్రామం:** పాలనా వ్యవస్థలో చివరి పాలనా విభాగం గ్రామం. ప్రతి స్థలంలో 10 నుంచి 60 వరకు గ్రామాలుండేవి. కొన్ని స్థలాల సముదాయం నాడు. అనుమకొండనాడు, కమ్మనాడు, ములికినాడు, పాకనాడు, వెలనాడు, సబ్బినాడు నాడులలో ప్రధానమైనవి. నాడులకు అమాత్యులు లేదా ప్రెగ్గడలు అధిపతులు. ప్రతి స్థలానికి స్థలకరణంతోపాటు ఇతర ఉద్యోగులుండేవారు.

**(ఎ) ఆయగార్లు:** కాకతీయుల పాలనా కాలంలో గ్రామాలు స్వయం పోషకంగా ఉండి, తన వ్యవహారాలను తానే చక్కబెట్టుకొనేవి. ఆయగార్లు అనే అధికారులు గ్రామపాలన సాగించేవారు. వీరికి వృత్తులుగా భూములనిచ్చేవారు. కొంతధాన్యాన్ని 'మేర' వసూలు చేయడం కూడా జరిగింది. ఆయగార్లు 12 మంది ఉండేవారు. వీరు కరణం, పెద్దకాపు(రెడ్డి), తలారి, పురోహితుడు, కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, చాకలి, మంగలి, సెట్టి, చర్మకారుడు.

**(బి) ఆయగార్ల విధులు:** గ్రామ కరణం గ్రామ ఆదాయవ్యయాలు వ్యవసాయ భూమి, బంజరు భూమి, తోటలు, పచ్చిక బీళ్ళ వివరాలకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసేవాడు. రెడ్డి గ్రామ పెద్ద, పన్నుల వసూలును పర్యవేక్షించేవాడు. తలారి గ్రామ రక్షకభటుడు. పురోహితుడు గ్రామ పూజారి. కమ్మరి, కుమ్మరి వ్యవసాయ పనిముట్లు తయారుచేసేవారు. కరణం, రెడ్డి, తలారి తప్ప మిగిలిన తొమ్మిది మంది ఆయగార్లు గ్రామ సేవకులు, అయితే వీరికి, రాజ్యా నికి ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదు.

**4.4.7 న్యాయ నిర్వహణ:** కాకతీయ పాలకులు న్యాయ నిర్వహణలో అనాదిగా వస్తున్న పద్ధతులనే అవలంబించారు. నేర విచారణలో రాజుకు సలహాలివ్వడానికి ప్రాడ్వివాకులు ఉండేవారు. వీరికి న్యాయ, ధర్మశాస్త్రాలలో మంచి ప్రావీణ్యం ఉండేది. గ్రామాలలో స్థానిక సభల ద్వారా న్యాయనిర్ణయం జరిగేది. ప్రత్యేక నేరాల విచారణ కోసం ధర్మాసనాలు ఏర్పాటు చేయబడ్డాయి. కాకతీయుల కాలంలో శిక్షలు కఠినం. మరణ శిక్షకూడా అమల్లో ఉంది.

**4.4.8 సైన్యం:** కాకతీయ పాలకులు సైనిక శక్తికి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. వారు నిర్మించిన దుర్గాలు, శక్తివంతమైన సైన్యం ఇందుకు నిదర్శనం. యుద్ధంలో శత్రువులను ఓడించడం, చంపడం లేదా వీర మరణం పొందడం గౌరవంగా భావించే వారు. చక్రవర్తి సర్వ సైన్యాధ్యక్షుడు. కాకతీయుల సైన్యంలో గజ, తురగ, పదాతి దళాలుండేవి. సైన్యంలో అశ్వసాహిణులు, గజసాహిణులు ఉండేవారు. అశ్వాలకు, గజాలకు శిక్షణ నిచ్చేవారే సాహిణులు.

**(ఎ) దుర్గాలు:** దేశరక్షణలో దుర్గాలు నిర్వహించిన పాత్ర అద్వితీయం. నాటి కాలంలో స్థల, జల, గిరి, వన దుర్గాలుండేవి.

**(బి) లెంకలు:** కాకతీయుల కాలంలో రాజులు తమ వ్యక్తిగత రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. అందుకోసం వారు ప్రత్యేక అంగరక్షక దళాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఈ అంగరక్షక నాయకులను లెంకలు అని పిలిచేవారు. రాజు రక్షణ వీరి ప్రధాన బాధ్యత. వీరిని పదవులలో నియమించే సమయంలో రాజే తమ సర్వస్వమని, అతడి రక్షణ తమ ప్రధాన కర్తవ్యమని వారి చేత ప్రమాణం చేయించేవారు.

యుద్ధ సమయంలో లెంకలు రాజుతో కలిసి యుద్ధంలో పాల్గొనే వారు. ఒక వేళరాజు యుద్ధంలో మరణించినట్లయితే, వారు కూడా ఆత్మాహుతి చేసుకొని రాజును అనుసరించేవారు. కాబట్టి రాజులు, లెంకలను పుత్రులతో సమానంగా భావించే వారు. లెంకలలో జుట్టయలెంక గొంకారెడ్డి, రుద్రయ లెంక, పిచ్చియలెంక సుప్రసిద్ధులు. ఈ విధమైన అంగరక్షక దళం కాకతీయ పాలకుల ప్రత్యేకతగా చెప్పవచ్చు.

## 4.5 నాయంకర విధానం:

కాకతీయుల సైన్యంలో మూలబలం, నాయంకరుల సైన్యం అనే రెండు విభాగాలుండేవి. నాయంకర విధానాన్ని రుద్రమదేవి ప్రవేశపెట్టగా, రెండో ప్రతాపరుద్రుడు సమర్థవంతంగా అమలు జరిపాడు. సైనిక పోషణ నిమిత్తం కాకతీయ పాలకులు కొంతమంది నాయకులను నియమించి సైనిక సమీకరణ జరిపేవారు. ఈ నాయకులకు జీతానికి బదులుకొన్ని గ్రామాలను ఇచ్చేవారు. నాయకులు పోషించే సైన్యం కాబట్టి దీనికి 'నాయంకర విధానం' అనే పేరు వచ్చింది. నాయంకరులు కాకతీయ రాజుల నుంచి భూములను పొంది, వాటి నుంచి వచ్చే ఆదాయంతో సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయాలలో చక్రవర్తికి సైనిక సహాయం చేసేవారు. నాయకులు పొందిన భూమిని నాయక స్థలం, నాయక స్థల వృత్తి అని పిలిచేవారు. నాయంకరులు కొందరు 'కాకతిరాజ్య స్థాపనాచార్య' అనే బిరుదు పొందడం కూడా గమనించవచ్చు.

కాకతీయులు ఈ నాయంకర విధానం ద్వారానే పెద్ద సైన్యాన్ని సమీకరించేవారు. ప్రతాపరుద్రుని కాలంలో నాలుగోవంతు భూమిని నాయంకరులకు ఇవ్వడం జరిగింది. సామంతులు పోషించే సైన్యం కంటే రాజు ఎక్కువ సైన్యాన్ని సమీకరించాలని, అప్పుడు మాత్రమే సామంతుల తిరుగుబాట్లను అణచివేసే శక్తి రాజుకు ఉంటుందని బద్దెన అభిప్రాయపడ్డాడు. కాకతీయ పాలకులు ఈ సూత్రాన్ని పాటించి, సర్వదా అప్రమత్తంగా వ్యవహరించి,

నాయంకరులను అదుపులో పెట్టడం జరిగింది.

ప్రతాపరుద్రుడి కాలంలో 77 మంది నాయంకరులు ఉన్నట్లుగా నాటి రచనల వల్ల తెలుస్తుంది. ముస్లిం చరిత్రకారుల రచనల ప్రకారం ప్రతాపరుద్రుడి సైన్యంలో 100 ఏనుగులు, 20 వేల గుర్రాలు, 9 లక్షల పదాతి దళం ఉండేదని తెలుస్తుంది. నాయంకరులలో ప్రధానంగా వెలమ, రెడ్డి కులాలవారు ఉన్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి.

నాయంకర విధానం కొన్ని విషయాలలో ఐరోపాలోని మధ్యయుగం నాటి భూస్వామ్య వ్యవస్థను పోలి ఉంది. ఈ పద్ధతి తరవాతి కాలంలో దక్షిణ భారతదేశ పాలనావ్యవస్థలో ఒక ముఖ్య లక్షణంగా మారింది.

## 4.6 సారాంశము:

ఆంధ్రుల చరిత్రలో కాకతీయ యుగం ఒక ఉజ్జ్వల ఘట్టం. ఆంధ్ర దేశాన్నంతటినీ జయించి, దాదాపు మూడు శతాబ్దాల కాలం పాటు పాలించి, ఆంధ్ర జాతి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేసిన పాలకులు కాకతీయులు. కాకతీయ వంశ మూల పురుషుడు గుండ్యన. రెండో ప్రోలరాజు స్వతంత్ర కాకతీయ పాలకుడు. అనంతరం రుద్ర దేవుడు, గణపతి దేవుడు, రుద్రమ దేవి, రెండో ప్రతాపరుద్రుడు వరుసగా పాలించటం జరిగింది. గణపతి దేవుడు కాకతీయ పాలకులలో అగ్రగణ్యుడు కాగా, రెండో ప్రతాపరుద్రుడు చివరి పాలకుడు. రాణి రుద్రమ దేవి పాలనా కాలంలో వెనిస్ యాత్రికుడు మార్కోపోలో ఆంధ్ర దేశాన్ని సందర్శించడం జరిగింది.

పురుషునితో పాటు స్త్రీకి కూడా రాజ్యాధికారాన్ని కల్పించడం కాకతీయ పాలనా వ్యవస్థ ముఖ్య లక్షణం. కాకతీయుల పాలనలో గ్రామాలు స్వయం పోషకాలు. ఆయగార్లు గ్రామ పాలనను నిర్వహించేవారు. దేశ రక్షణలో దుర్గాలు ప్రధాన పాత్ర పోషించాయి. కాకతీయుల కాలంలో ఐరోపాలోని మధ్య యుగం నాటి భూస్వామ్య వ్యవస్థను పోలిన నాయంకర విధానం ప్రవేశ పెట్టబడింది.

## 4.7 మాదిరి ప్రశ్నలు:

1. కాకతీయుల రాజకీయ చరిత్ర పై వ్యాసం వ్రాయండి.
2. కాకతీయుల కాలం నాటి నాయంకర విధానాన్ని వివరించండి.

**ఖాళీలను పూరించండి:**

1. కాకతీయుల మూల పురుషుడు .................
2. ఆంధ్ర దేశాన్ని పాలించిన ఏకైక స్త్రీ ................
3. కాకతీయుల రాజధాని అనుమకొండ నుండి ఓరుగల్లుకు మార్చిన పాలకుడు .......................

**జతపరుచుము:**

| | | |
|---|---|---|
| 1. మైలాంబ | ( ) | ఎ) ముస్లింల దాడులు |
| 2. గణపతి దేవుడు | ( ) | బి) బయ్యారం చెఱువు శాసనం |
| 3. రుద్ర దేవుడు | ( ) | సి) మార్కోపోలో |
| 4. రుద్రమ దేవి | ( ) | డి) వేయి స్తంభాల గుడి |
| 5. రెండో ప్రతాప రుద్రుడు | ( ) | ఇ) మోటుపల్లి అభయ శాసనం |

## 1.7 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - A History of South India
2. Yazdani G. (Ed.) - The Early History of The Deccan
3. Cynthia Talbot - Pre-colonial India in Practice Society, Religion and Identity in Medieval Andhra.
4. Simta V.A. - Early History of India
5. Burton Stein - Peasant State and Society in Medieval South India



పాఠ్యభాగ రచయిత

డా॥ డి. వెంకటేశ్వర రెడ్డి

**పాఠం - 5**

# కాకతీయ యుగ సంస్కృతి

## 5.0 లక్ష్యం:

కాకతీయుల నాటి ఆర్థిక, మత, సాంఘీక మరియు సాంస్కృతిక పరిస్థితులను తెలియ చేయడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## పాఠ్య నిర్మాణ క్రమం:


5.1 ఉపోద్ఘాతము

5.2 ఆర్థిక పరిస్థితులు

5.2.1 వ్యవసాయం

5.2.2 చెఱువుల నిర్మాణం

5.2.3 పంటలు

5.2.4 భూమి శిస్తు

5.2.5 పన్నులు

5.2.6 స్వదేశీ వ్యాపారం

5.2.7 వర్తక కేంద్రాలు

5.2.8 విదేశీ వ్యాపారం

5.2.9 మోటుపల్లి

5.2.10 ఎగుమతి - దిగుమతి

5.3 మత పరిస్థితులు

5.3.1 జైన మతం

5.3.2 బౌద్ధ మతం

5.3.4 శైవ మతం

(ఎ) మఠాలు

5.3.5 వైష్ణవ మతం

5.3.6 మత సామరస్యం

5.4 సాంఘీక పరిస్థితులు

5.4.1 వర్ణ వ్యవస్థ

5.4.2 స్త్రీ స్థానం

5.4.3 వినోదాలు

5.5 సాహిత్యం

5.5.1 సంస్కృతం

5.5.2 తెలుగు

(ఎ) తిక్కన సోమయాజి
(బి) శతక రచన
5.6 వాస్తు శిల్పం
5.6.1 త్రికూట ఆలయాలు
5.6.2 ఏకతల ఆలయాలు
5.6.3 వేయి స్తంభాల గుడి
5.6.4 రామప్ప దేవాలయం
5.7 చిత్ర కళ
5.8 నాట్యం - సంగీతం
5.9 సారాంశము
5.10 మాదిరి ప్రశ్నలు
5.11 ఉపయుక్త గ్రంథాలు

## 5.1 ఉపోద్ఘాతము:

కాకతీయుల పాలనా కాలంలో ఆంధ్రదేశం సిరిసంపదలతో తులతూగినట్లు అనేక మంది విదేశీయులు పేర్కొనడం జరిగింది. వారిలో అమీర్ ఖుస్రూ, అబ్దుల్లాహసన్, మార్కోపోలో ముఖ్యులు. మత సామరస్యం కాకతీయుల కాలంలో చూడవచ్చు. కాకతీయ పాలకులు సాహిత్యం, కళాభివృద్ధికి పాటుపడ్డారు.

## 5.2 ఆర్థిక పరిస్థితులు:

**5.2.1 వ్యవసాయం:** ప్రజల ఆర్థిక జీవనాన్ని పెంపొందించడానికి కాకతీయ పాలకులు అనేక చర్యలు చేపట్టారు. ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం. కాకతీయులు బీడు భూములను సేద్య భూములుగా మార్చి వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంపొందించారు. కర్నూలు ప్రాంతంలో అరణ్యాలను నివాసయోగ్యంగా మలచి, అగ్రహారాలను స్థాపించారు.

అగ్రహారాలకు గాని, దేవాలయాలకు గాని, నాయంకరస్థల వృత్తులకు గాని, ఉద్యోగులకు గానీ, అధికారులకు గానీ చెందని భూములన్నీ రాజుకే చెందేవి. వీటిని 'రాచ పొలం' అనే వారు. కొత్తగా సాగుబడిలోకి వచ్చిన భూములను పోడులని పిలిచేవారు. అటవీ, పచ్చిక భూములను బీడులు అనేవారు. వెలిపొలం, నీరు నేల, తోటభూమి ఉండేవి.

నీటిపారుదల సౌకర్యాలున్న భూమిని నదీమాతృకలని, కేవలం వర్షాలపై ఆధారపడిన భూములను దేవమాతృకలని పిలిచేవారు. బ్రాహ్మణులకు, దేవాలయాలకు భూములను దానంగా ఇచ్చేవారు. అలాంటి భూములకు భూమి శిస్తు నుంచి మినహాయింపు లభించింది.

**5.2.2 చెఱువుల నిర్మాణం:** కాకతీయులు నీటి పారుదల వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, వ్యవసాయాభివృద్ధికి ఇతోధికంగా కృషి సలిపారు. రాజులు, వారి సామంతులు రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో చెరువులు తవ్వించి, జలాశయాలు నిర్మించారు. పుణ్య సముపార్జనకు చేయు కార్యాలలో చెరువు నిర్మాణం ఒకటిగా పాలకులు భావించారు. అంతేగాక తటాక నిర్మాణాన్ని ప్రజలు 'సప్తసంతానాల'లో ఒకటిగా పరిగణించారు. సబ్బిసముద్రం, ఎర్రసముద్రం, విశ్వనాథ సముద్రాలను రేచర్ల వంశం వారు నిర్మించగా,

మాల్యాల గౌండప్ప తన పేరు మీద గౌండ సముద్రాన్ని తవ్వించాడు. బయ్యారం, చౌండ సముద్రం, నామ సముద్రం మున్నగు జలాశయాలు నిర్మించి, నదీ ప్రవాహ మార్గాల నుంచి నీటిని మళ్లించడానికి కాలువలు తవ్వడం చూసినట్లయితే కాకతీయులకు, వారి సామంతులకు ప్రజల ఆర్థిక శ్రేయస్సుల పట్ల ఎలాంటి శ్రద్ధ కలదో తెలుస్తుంది. సాధారణంగా చెరువును తవ్వే ముందు వర్షానికి అధిపతి అయిన వరుణదేవుని విగ్రహం ప్రతిష్టించేవారు. కేసరి సముద్రం, రామప్ప సరస్సు, బయ్యారం చెరువు, కుంద సముద్రం ఆనాటి చెరువులలో ప్రసిద్ధి చెందాయి.

**5.2.3 పంటలు:** వరి ప్రధానమైన పంట. రాగి, సజ్జలు, జొన్నలు, నువ్వులు, గోధుమలను కూడా పండించేవారు. బెల్లం, దేశీయ చక్కెర తయారు చేయబడింది. నీలిమందు తోటలను పెంచారు. ఉల్లి, అల్లం, నూనె దినుసులను కూడా విరివిగా పండించారు.

**5.2.4 భూమి శిస్తు:** రాజ్యానికి ప్రధాన ఆదాయ మార్గం భూమిశిస్తు. పరిశ్రమలు, వర్తకం, వృత్తుల పై శిస్తు విధించి, వసూలు చేసే వారు. పంట భూములను వెలిపొలం, నీరునేల, తోట భూమి అనే మూడు భాగాలుగా వర్గీకరించారు. భూమిని గడతొ కొలిచేవారు. భూమి శిస్తును ధన, ధాన్యరూపాలలో చెల్లించుకొనే అవకాశం ప్రజలకు ఇవ్వబడింది.

**5.2.5 పన్నులు:** పన్నులు వసూలు చేసే అధికారులను సుంకరులు అని పిలిచేవారు. పెరిక ఎడ్ల సుంకం, అమ్మబడి సుంకం, ఉప్పు పెరికె సుంకం, పుల్లరి వసూలు చేయబడ్డాయి.

**5.2.6 స్వదేశీ వ్యాపారం:** కాకతీయుల కాలంలో స్వదేశీ, విదేశీ వ్యాపారాలు బాగా అభివృద్ధి చెందాయి. వర్తకులు తమ కార్యకలాపాలను ఒకే ప్రాంతానికి పరిమితం చేసుకోకుండా వివిధ ప్రాంతాలకు విస్తరించుకొన్నారు. స్వదేశీ వర్తకాభివృద్ధి కోసం ముఖ్య పట్టణాలన్నింటినీ కలుపుతూ రహదారి మార్గాలు నిర్మించబడ్డాయి. బళ్ళారి నుంచి నెల్లూరు, బళ్ళారి నుంచి చిత్తూరు, రాయచూరు నుంచి కొలనుపాక, కళ్యాణి నుంచి అనుమకొండలను కలుపుతూ చక్కని రహదారి మార్గాలు ఏర్పడ్డాయి.

**5.2.7 వర్తక కేంద్రాలు:** ఓరుగల్లు, పానగల్లు, జడ్చర్ల, అలంపూర్, కొచ్చెర్లకోట, మాచర్ల, మోపూరు నాటి ప్రముఖ వర్తక కేంద్రాలు. వ్యాపారాభివృద్ధి వల్ల నగరీకరణ జరిగింది. వర్తక శ్రేణులకు సుంకాలను వసూలు చేసే బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తుంది.

**5.2.8 విదేశీ వ్యాపారం:** విదేశీ వ్యాపారానికి రాజుల ప్రోత్సాహం లభించింది. తుఫానులలో చిక్కుకున్న పడవలను స్వాధీనం చేసుకోమని, సముద్రం మీద జరిగే వ్యాపారం పై సాంప్రదాయికంగా వసూలు చేసే సుంకాలను మాత్రమే వసూలు చేస్తామని మోటుపల్లి అభయ శాసనంలో గణపతిరాజు వాగ్దానం చేశాడు.

**5.2.9 మోటుపల్లి:** ఆ రోజుల్లో కాకతీయ సామ్రాజ్యంలో సముద్రం మీద జరిగే వ్యాపారానికి ముఖ్య కేంద్రం మోటుపల్లి. వెనిస్ యాత్రికుడు మార్కోపోలో, ఆంధ్రదేశంలో సందర్శించిన ప్రదేశం ఇది ఒక్కటే. దాన్ని బట్టి ఆనాటి మోటుపల్లి ప్రాముఖ్యం మనకు తెలుస్తుంది. మోటుపల్లితోపాటు మచిలీపట్నం, ఘంటసాల, చినగంజాం రేవు పట్టణాల నుంచి విదేశీ వ్యాపారం జరిగింది.

**5.2.10 ఎగుమతి - దిగుమతులు:** చైనా, ఇండోనేషియా, సుమత్రా, మలయా, బర్మా దేశాలతో విదేశీ వర్తకం జరిగింది. రాణిరుద్రమదేవి కాలంలో కాకతీయ రాజ్యాన్ని దర్శించిన మార్కోపోలో దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, వజ్రాల పరిశ్రమ అభివృద్ధిలో ఉందని, ప్రజలు ఐశ్వర్యాలతో తులతూగుతుండేవారని తెలిపాడు. ముత్యాలు, శ్రీగంథం, దంతం, లోహం, కంబళ్ళు, రసవెల్లాలు, సుగంధ ద్రవ్యాలు ఎగుమతులుకాగా, పట్టు వస్త్రాలు, గాజు, కర్పూరం, గుర్రాలు దిగుమతులలో ప్రధానమైనవి.

## 5.3 మత పరిస్థితులు:

కాకతీయుల కాలంలో మతసామరస్యం వెల్లివిరిసింది. కాకతీయ రాజులు జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలను ఆదరించడం జరిగింది. రాజులు, వారి సామంతులు ఈ మతాలను ఆదరించి పోషించారు.

**5.3.1 జైన మతం:** కాకతీయ పాలకులు జైనమతాన్ని ఆదరించినట్లు 'సిద్దేశ్వర చరిత్ర' తెలుపుతుంది. మొదటి బేతరాజు, రెండో బేతరాజు జైన ఆలయాలకు బహుమానాలను ఇచ్చినట్లు శాసనాల వల్ల తెలుస్తుంది. రెండో ప్రోలరాజు శివదీక్షా గురువు. అయినా పరమతసహనం కలవాడు. రెండో ప్రోలరాజు మంత్రి చేతన ప్రెగ్గడ భార్య మైలమ అనుమకొండపై కడలాలయబసది నిర్మించి, దానికి అనేక దానాలను ఇచ్చింది. కడలాలయాన్ని కన్నడంలో అంబిక లేదా పద్మావతి అంటారని కృష్ణశాస్త్రి అభిప్రాయం.

జైన మతం పై కాకతీయులకు ఉన్న అభిమానంతోనే వారు పదహారో తీర్థంకరుడైన శాంతినాథుని ఉపాసక చిహ్నమైన గరుడను తమ లాంఛనంగా స్వీకరించడం జరిగింది. గంగాధరుడనే రుద్రదేవుడి మంత్రి, పద్మాక్షికొండపై నిర్మిలపై ఉన్న జైనబసదికీ మరమ్మత్తులు చేసినట్లు అనుమకొండ శాసనం పేర్కొంటుంది. జైన మతస్థుడైన మల్లిరెడ్డి భగవంతుడొక్కడే అనే భావంతో 21 శివాలయాలను నిర్మించినట్లు బెక్కల్లు శాసనంవల్ల తెలుస్తుంది. ఓరుగల్లు, అనుమకొండలలో కాకతీయులు నిర్మించిన దేవాలయాలలో జైనమత ఛాయలు కనిపిస్తాయని పండితులు అభిప్రాయం. దీనివల్ల నాటి సమాజం మతసామరస్యాన్ని కలిగి అన్ని మతాలను సమానంగా ఆదరించినట్లు తెలుస్తుంది.

**5.3.2 బౌద్ధ మతం:** భారతదేశంలో ఎన్నో శతాబ్దాల నుంచి ప్రసిద్ది చెందిన బౌద్ధమతం 10,11 శతాబ్దాల కాలం నాటికి ఆంధ్రదేశంలో పతనావస్థకు చేరుకొంది. అయితే అక్కడక్కడ ఈ మతం ఉన్నట్లు తెలుస్తుంది. బౌద్ధారామాలైన అమరావతి, ద్రాక్షారామం, క్షీరారామం, భీమారామం, కొమరారామంలలో బుద్ధదేవుడికి దీప ప్రతిష్ట చేసినట్లు తెలుస్తుంది. 1171లో కాకతీయ మంత్రి గంగాధరుడు పట్టశాలలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు.

కరీంనగర్ శాసనం శ్రీమహావిష్ణువు బుద్ధుని అవతారం ఎత్తాడని తెలుపుతుంది. అందువల్ల ఇతర మతాలను అవలంబించే వారు కూడా విష్ణువు దశావతారాలలో బుద్ధుడు కూడా ఒకడని భావించేవారు. కాకతీయ రుద్రమదేవి సామంతుడైన మల్లిరెడ్డికి 'సముద్ధరిత సమయ చతుష్టయ' అంటే జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలను ఆదరించినవాడు అనే బిరుదు ఉంది. అయితే కాకతీయుల పాలనాకాలం నాటికి బౌద్ధ మతం ఆంధ్రదేశంలో ప్రాముఖ్యం కోల్పోయినట్లు తెలుస్తుంది.

**5.3.3 శైవ మతం:** కాకతీయ పాలకులు పరమశైవులు. వీరు శైవ మతాన్ని పోషించి, విశేషంగా ఆదరించారు. ఈ కాలం నాటికి శైవమతంలో అనేక శాఖలు ఆవిర్భవించాయి. శైవంలో కాలాముఖ, కాపాలిక, పాశుపత, ఆరాధ్య, వీరశైవ అనే శాఖలు ముఖ్యమైనవి. వీటిలో పాశుపతశైవం కాకతీయుల కాలంలో ప్రసిద్ధి చెందింది.

కాకతీయ రాజులు కాలాముఖ శాఖను ఆదరించి, పోషించడం జరిగింది. అనుమకొండ శాసనంవల్ల రెండో బేతరాజు, కాలాముఖ శాఖకు చెందిన రామేశ్వర పండితుడి శిష్యుడని తెలుస్తుంది. రామేశ్వర పండితుడు మల్లికార్జున మఠానికి అధిపతి. లకులీశ్వరుడు కాలాముఖ శాఖ స్థాపకుడు. దీని ప్రధాన కేంద్ర శ్రీశైలం. తుంగభద్రనదీతీరంలోని అలంపురం, ఆంధ్రదేశంలోని కాలాముఖ శాఖకు మరొక ప్రధాన కేంద్రం. మొదటి ప్రోలరాజు. రెండో బేతరాజు, రెండో ప్రోలుడు పరమమహేశ్వరులు. రుద్రదేవుడు కూడా పరమమహేశ్వరుడే. దీనివల్ల పన్నెండో శతాబ్ది చివరి కాలానికి కాలాముఖశాఖ ఆంధ్రదేశంలోని దేవాలయాలు, మఠాలలోనే కాకుండా, రాజాస్థానాలలోకి కూడా వ్యాప్తి చెందిందని చెప్పవచ్చు.

**(ఎ) మఠాలు:** గణపతిదేవుడి కాలాన్ని శైవచరిత్రలో గుర్తించదగిందిగా పరిగణించడమైంది. ఈ కాలంలో కాలాముఖ శాఖకు బదులుగా, పాశుపతి శాఖ ఆదరణ పొందింది. గోళకి మఠానికి చెందిన సద్భావశంభునితో ఈ శాఖ స్థాపించబడింది. గణపతిదేవుడికి, రుద్రమదేవికి రాజగురువు విశ్వేశ్వర శివాచార్యుడు. 1261లో రుద్రమదేవి మందడ అనే గ్రామాన్ని విశ్వేశ్వరుడికి దానమివ్వగా, అతడు ఆ గ్రామంలో శివాలయాన్ని, శైవ మఠాని, సత్రాన్ని నిర్మింపజేశాడు. అంతేగాక విశ్వేశ్వరుడు అనేక గ్రామాల్లో శివలింగాలను కూడా ప్రతిష్ఠింపజేశాడు.

నాటి ఆంధ్రదేశంలోని గోళకీ మఠాలలో భట్టిప్రోలు, పుష్పగిరి, అలంపురం, ద్రాక్షారామం, త్రిపురాంతకం, శ్రీపర్వతం ప్రసిద్ధి చెందాయి. అయితే కర్నాటకలో ఎంతో ప్రాచుర్యం పొందిన వీరశైవమతం ఆంధ్రదేశం పై తన ప్రభావాన్ని ఏ మాత్రం చూపించలేదని చెప్పవచ్చు.

**5.3.4 వైష్ణవ మతం:** కాకతీయుల పాలనాకాలంలో శైవమతానికి ఎంతో ప్రాధాన్యత లభించినప్పటికీ, వైష్ణవ మతాన్ని వారు వ్యతిరేకించలేదు. రాజముద్రల పైన, నాణేల మీద, త్రికూట ఆలయాల పైన వారు శ్రీహరిని ప్రతిష్టించడాన్ని బట్టి కాకతీయులు వైష్ణవ మతాన్ని కూడా ఆదరించారని చెప్పవచ్చు.

రుద్రదేవుడు అనుమకొండలోని వేయిస్తంభాల గుడిలో వాసుదేవుని ప్రతిష్ఠించాడు. అతడి మంత్రి గంగాధరుడు అనుమకొండలోనే ఒక పెద్ద దేవాలయాన్ని నిర్మించి, అందులో ప్రసన్న కేశవుని ప్రతిష్ఠింపజేశాడు. మైలాంబ ఇనుగుర్తిలో గోపాలకృష్ణుని కోసం ఆలయాన్ని నిర్మించింది.

సింహాచలం, శ్రీకాకుళం, బాపట్ల, మాచర్ల, అహోబిలం, శ్రీ కూర్మం, తిరుపతి నాటి ప్రసిద్ధ వైష్ణవ కేంద్రాలు. ఈ కాలంలోనే వెలమ నాయకులు తెలంగాణాలో వైష్ణవాన్ని, బ్రహ్మనాయుడు పలనాడులో వీర వైష్ణవాన్ని ఆదరించి, పోషించారు.

**5.3.5 మత సామరస్యం:** కాకతీయుల కాలంలో మత సంఘర్షణలు జరగలేదు. రాజులు, వారి సామంతులు మత సామరస్యాన్ని పాటించి, అనేక దేవాలయాలను నిర్మించారు.

అయితే, ఈ కాలంలో మూఢవిశ్వాసాలు, జంతు బలులు ప్రబలాయి. కాకతీయుల కాలంలో దేవాలయాల నిర్మాణాన్ని సప్తసంతానాలలో ఒకటిగా భావించడం జరిగింది. అందువల్ల నాటి ఆంధ్రదేశంలో దేవాలయాలు లేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ దేవాలయాలు మత వ్యాప్తికీ సాంఘిక, సాంస్కృతిక కార్యకలాపాలకు కేంద్రాలై, ప్రజల విశ్వాసాన్ని విశేషంగా చూరగొన్నాయి.

## 5.4 సాంఘిక పరిస్థితులు:

కాకతీయుల పాలనా కాలంలో వర్ణవ్యవస్థ అమల్లో ఉంది. సమాజం కూడా చాతుర్వర్ణ వ్యవస్థ పై ఆధారపడింది. ఈ వ్యవస్థలో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర అనే నాలుగు వర్ణాలుండేవి. వృత్తి ఆధారంగా వర్ణవిభజన జరిగింది.

సమాజంలో బ్రాహ్మణులకు ప్రత్యేక గౌరవం ఉండేది. వారు విద్య, మత విషయాలను నిర్వహించే వారు. బ్రాహ్మణులలో వెలనాడు, వేంగినాడు, కమ్మనాడు, కాసలనాడు, ములికినాడు అనే శాఖలుండేవి. కాలక్రమంలో క్షత్రియ కులం అనేక మార్పులకు గురయ్యింది. విపత్కర సమయాలలో బ్రాహ్మణులతో సహా ఏ కులం వారైనా ఆయుధాలను చేపట్టి, రక్షణ చేయాలని శాస్త్రాలు చెప్పడం జరిగింది. అందువల్ల శూద్రులు కూడా కత్తిని చేపట్టి ధాత్రీ పతిత్వాన్ని పొంది క్షత్రియులుగా చెప్పుకొన్నట్లు తెలుస్తుంది. వైశ్యులు వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. వీరు విదేశీ, స్వదేశీ వాణిజ్యం సాగించారు.

సమాజంలో అత్యధికులు శూద్రులు. వీరు వ్యవసాయ క్షేత్రాలలో కూలీలుగా, సైనికులుగా వృత్తి పనివారుగా ఉండేవారు. శూద్రుల్లో రెడ్డి, వెలమ, కమ్మ, తెలగ అనే ఉపకులాలుండేవి.

పంచమ కులస్థులు గ్రామానికి వెలుపల నివసించే వారు. వీరి పరిస్థితి దయనీయంగా ఉండేది. పంచములలో మాల, మాదిగ తెగలుండేవి. మాలలు వ్యవసాయ కూలీలుగా జీవనాన్ని సాగించగా, మాదిగలు చర్మకార వృత్తిని చేపట్టారు. అగ్రవర్ణాల వాడల్లోకి ప్రవేశించకూడదనే ఆంక్షలు వీరిపై ఉండేవి.

నాటి సమాజంలో కమ్మ, రెడ్డి, వెలమ కులాలు పాలక వర్గాలుగా ఎదిగాయి. ఈ కులాల మధ్య అంతర్వివాహాలు కూడా జరిగేవి. కుల వ్యవస్థకు ప్రాముఖ్యం ఉన్నప్పటికీ, ఆరోజుల్లో ఉపకులాలు ఏర్పడినప్పటికీ సమాజంలో గుర్తింపు హోదా వృత్తి మీద ఆధారపడి ఉండేది.

ఆనాటి సమాజంలో 'అష్టాదశ ప్రజ' అనే 18 శాఖలున్నట్లు ప్రతాపచరిత్ర, క్రీడాభిరామం పేర్కొంటున్నాయి. అవి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, వ్యవహారికులు, పంచాలులు (కంసాలి, కమ్మరి, వడ్రంగి) కుంభరికులు (కుమ్మరి), తంతువాయులు(నేతవారు), వస్త్ర బేధకులు(అద్దకం పనివారు) తిలఘటకులు (గానుగవారు), కురంటకులు (ములవారు), వస్త్రరక్షకులు (దర్జీ) దేవాంగులు(నూలు నేయువారు), పెరికలు (సరుకులు మోసేవారు), గోరక్షకులు (గొల్లలు), కిరాతకులు (వేటగాండ్రు), రజకులు, క్షురకులు. ఈ కులాల వారు అనేక సంఘాలను స్థాపించారు. ఆ సంఘాలకు సమయమనే పేరుంది. ఈ సంఘాలు తమ సభ్యుల సంక్షేమానికి కృషి చేసేవి. ప్రతి వృత్తికీ ఒక శ్రేణి ఉండేది. ఇవి కలిసికట్టుగా సక్రమంగా పనిచేసేవి.

**5.4.1 స్త్రీ స్థానం:** స్త్రీ పరిస్థితి అంతక ముందుకంటే దిగజారింది. ఉన్నత వర్గ స్త్రీలకు స్వేచ్ఛ తక్కువ. సామాన్య కుల స్త్రీల పై ఎక్కువ నిర్బంధాలు లేవు. అన్ని తరగతులకు చెందిన స్త్రీలు అలంకరణలో ఆసక్తి ప్రదర్శించేవారు. నృత్యం, కోలాటం, కందుక క్రీడ (బంతులాట) నాటి స్త్రీల వినోదాలు. విజ్ఞానేశ్వరీయం స్త్రీ ధనాన్ని అయిదు రకాలుగా పేర్కొంది. వారసత్వంగా వచ్చేదిబీ బహుమతిగా తన తల్లిదండ్రులు, సోదరుల నుంచి పొందిన ఆస్తి; వాటాగా వచ్చింది; స్వార్జితంగా సంపాదించుకొన్నదిబీ పెద్దలు తనదిగా నిర్ణయించింది. స్త్రీధనాన్ని ఖర్చు చేయడానికి భర్తకు ఎలాంటి హక్కు లేదని విజ్ఞానేశ్వరీయం పేర్కొంది. స్త్రీలు ముక్కెరలు, నెత్తిబిల్లలు, దండకడియాలు, వంకీలను ఆభరణాలుగా ధరించేవారు.

కాకతీయ యుగంలో స్త్రీలు ముఖ్యంగా రాజవంశాలకు చెందినవారు సమాజంలో అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవాలయాలలో వీరి పాత్ర ప్రముఖంగా ఉండింది. ధర్మశాస్త్రాల ప్రకారం స్త్రీలకు ఆస్తిహక్కు లేనప్పటికీ, ఆరోజుల్లో స్త్రీలు దేవాలయాలకు ఆభరణాలు, పూజా వస్తువులు, ధనమే కాకుండా భూములను కూడా దానం చేసినట్లు ఆనాటి శాసనాలు తెలియజేస్తున్నాయి.

నాటి సమాజంలో వేశ్యలు ఒక కులంగా అవతరించారు. సామాన్య కులస్త్రీలు ఆర్థిక అవసరాల దృష్ట్యా కొన్ని వృత్తులను చేపట్టేవారు.

**5.4.2 వినోదాలు:** నృత్యం, సంగీతం, బొమ్మలాటలు, జంతువులతో పోరాడడం ప్రజల వినోదాలు. వీటితో పాటుగా తోలుబొమ్మలాట కూడా ఉన్నట్లు పాల్కురికి సోమనాథుని రచనలవల్ల తెలుస్తుంది. తోలుబొమ్మలాటల్లో భారత, రామాయణ గాథలు ప్రధాన ఇతివృత్తాలుగా ఉండేవి. రంగుల రాట్నాలు, కోలాటాలు కూడా ప్రజల వినోదాలు. మండలాకార నృత్యం, పేరిణి నృత్యం నాటి సమాజంలో ఆదరణ పొందాయి. బిల్లంగోడి క్రీడ కూడా ఉండేది.

## 5.5 సాహిత్యం:

కాకతీయ పాలకులు సాహిత్యాభిమానులు. వీరు అనేక మంది కవులను పండితులను ఆదరించి పోషించారు.

**5.5.1 సంస్కృతం:** నాడు సంస్కృత భాష రాజభాషగా చెలామణి అయింది. కాకతీ రుద్రుడు స్వయంగా కవి. నీతిసారమనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించాడు. కాకతీయుల కాలంలో సంస్కృత సాహిత్యం రెండు విధాలుగా

వర్ధిల్లింది. వాటిలో శాసనకవిత్వం ఒకటికాగా, రెండోది కావ్యరచన. శాసనకవులు రాజు, సామంత ప్రభువుల వంశాలను శాసనాలలో ప్రస్తావించారు. ఈ కవులలో అచితేంద్రుడు ముఖ్యుడు. ఈశ్వరభట్టోపాధ్యాయుడు శాసనకవుల్లో అగ్రగణ్యుడు. కావ్యకవులలో చెప్పుకోదగినవాడు అగస్త్యకవి. ఇతడు బాలభారతాన్ని రచించాడు.

ఈ యుగం సంస్కృత నాటక కర్తలకు కీర్తి గాంచింది. గంగాధరుడు మహాభారత కథను నాటకంగా రచించాడు. అలంకారశాస్త్ర గ్రంథాలలో విద్యానాధుని ప్రతాపరుద్ర యశోభూషణం ప్రామాణికమైంది. విద్యానాథుడు ప్రతాపరుద్రుని ఆస్థానకవి. జాయప సేనాని నృత్తరత్నావళి, గీత రత్నావళి, వాద్యరత్నావళి అనే నాట్య, సంగీత, వాద్యశాస్త్ర గ్రంథాలు రచించాడు.

**5.5.2 తెలుగు:** కాకతీయుల సామంతులు, ఉద్యోగులు తెలుగు భాషను ఆదరించారు. అందువల్ల తెలుగు భాష ఈ కాలంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది.

**(ఎ) తిక్కన:** కవిత్రయంలో ఒకడైన తిక్కన సోమయాజి తన ప్రజ్ఞతో విరాటపర్వం నుంచి స్వర్గారోహణ వరకు మహాభారతంలోని 15 పర్వాలను తెనిగించాడు. ఇతడు తెలుగు చోడ నెల్లూరు రాజైన రెండోమనుమసిద్ధి ఆస్థానకవి. తిక్కన నిర్వచనోత్తర రామాయణం అనే గ్రంథాన్ని రాసి మనుమసిద్ధికి అంకితమిచ్చాడు.

పాల్కురికి సోమనాథుడు జాను తెలుగులో రచనలు చేశాడు. ప్రబంధమైన సాహిత్య ప్రక్రియకు కాకతీయుల కాలంలోనే అంకురార్పణ జరిగింది. నన్నెచోడుడు రాసిన కుమార సంభవం ఈ కోవకు చెందినదే.

తెలుగు పురాణ చరిత్రకు నాంది పలికిన వాడు తిక్కన సోమయాజి. తిక్కన శిష్యులు మారన, కేతన. మారన రచన మార్కండేయ పురాణం. ఇది తెలుగులో మొదటి పురాణం. కేతన, సంస్కృతంలో దండి రాసిన దశకుమార చరిత్ర' అనే చంపూకావ్యాన్ని తెలుగులోకి అనువదించాడు. ఇతడిని ఆ కారణంగా 'అభినవ దండి' అన్నారు.

ప్రతాపరుద్రుని నీతిసారం, మడికసింగన సకలనీతి సమ్మతం కాకతీయుల నాటి రాజనీతి గ్రంథాలు. వల్లభరాయుడు క్రీడాభిరామం రాశాడు. ఇది ఓరుగల్లు ప్రజల జీవన విధానాన్ని వర్ణిస్తుంది.

**(బి) శతక రచన:** సాహిత్యంలో భక్తిని వెలిబుచ్చేందుకు శతకాలు, స్తుతికావ్యాలు బయలుదేరాయి. మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్వసారం శతక వాఙ్మయానికి శ్రీకారం చుట్టింది. తిక్కన కృష్ణ శతకాన్ని రాశాడని ప్రతీతి. బద్దెన సుమతీ శతకాన్ని రచించాడు.

శివకవులలో అగ్రగణ్యుడు పాల్కురికి సోమనాధుడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర ఇతడి శివభక్తి పూరిత గ్రంథాలు. ప్రతాపరుద్రుని గురువైన శివదేవయ్య పురుషార్థమనే గ్రంథాన్ని రచించాడు. కేతన, తెలుగులో ఆంధ్ర భాషాభూషణం అనే వ్యాకరణాన్ని రాయడం జరిగింది. మంచన కేయూర బాహు చరిత్రను రచించి గుండన మంత్రికి అంకితమిచ్చాడు.

ఈ కాలంలో తెలుగు కవుల దృష్టి మతం మీద నుంచి శృంగారం వైపుకు వెళ్ళసాగింది. ప్రజలను దృష్టిలో ఉంచుకొని దేశీయ భాషల్లో రచన సాగించిన ఘనత కాకతీయ యుగానికి దక్కుతుంది. నాటి కవులు సాంఘిక, మత పరిణామాలకు కారకులైన ఒక పెద్ద ఉద్యమానికి నాయకత్వం వహించడం జరిగింది.

## 5.6 వాస్తు శిల్పం:

కాకతీయ పాలకులు వాస్తు శిల్ప కళాభివృద్ధికి విశిష్టమైన కృషి చేయడం జరిగింది వీరు తమ నిర్మాణాలలో చాళుక్య సంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ, నూతన లక్షణాలను ప్రవేశపెట్టి ఒక విలక్షణమైన సంద్రాయాన్ని సృష్టించారు.

**5.6.1 త్రికూట ఆలయాలు:** వీరు నిర్మించిన ఆలయాలు త్రికూట ఆలయాలనీ, ఏకతల ఆలయాలనీ రెండురకాలు. త్రికూట ఆలయమనగా మూడు శిఖరాలు కలిగిన ఆలయం. త్రికూట ఆలయాలను అనుమకొండ, పానగల్లు, పాలంపేట, పిల్లలమర్రిలలో నిర్మించడం జరిగింది. త్రికూట ఆలయాలలో రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవ మందిరాలు నిర్మించబడ్డాయి.

**5.6.2 ఏకతల ఆలయాలు:** ఏకతల ఆలయాలను కూడా ఈ కాలంలో నిర్మించారు. పాలంపేట వద్ద రేచర్ల రుద్రుడు ఈ తరహా ఆలయాన్ని నిర్మించాడు. కాకతీయుల దేవాలయాలన్నీ ఇసుక పునాదుల పై నిర్మించినవే. ఓరుగల్లు, అనుమకొండ, పాలంపేట, త్రిపురాంతకం, పిల్లలమర్రి, మాచెర్లలోని దేవాలయాలు నాడు ప్రసిద్ధికెక్కిన ఆలయాలు.

'ఓరుగల్లులోని కోట ఆలయ ద్వారాలకు, బౌద్ధ శిల్పంలో చూడామణులన దగ్గ సాంచి ద్వారాలేసాటి'' అని ఫెర్గ్యూసన్ అభిప్రాయపడ్డాడు. ఓరుగల్లు కోటలో వీరభద్ర, మందలమ్మ, రామ, విష్ణు, వెంకటేశ్వర, స్వయంభూ, జంగమేశ్వర అనే పేర్లతో పిలిచే పన్నెండు ఆలయాలున్నాయి.

**5.6.3 వేయి స్తంభాల గుడి:** కాకతి రుద్రదేవుని అద్భుత నిర్మాణం అనుమకొండ వేయిస్తంభాలగుడి. దీనిని 1162లో కాకతి రుద్రుడు నిర్మించాడు. దీనిలో శివ, విష్ణు సూర్యదేవులను ప్రతిష్ఠించారు. ఇక్కడ నందీశ్వర విగ్రహం జీవకళతో సుందరంగా గోచరిస్తుంది. వేయిస్తంభాల గుడిలో రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవ మందిరాలున్నందువల్ల దీనిని త్రికూటాలయమని పిలుస్తారు. వేయిస్తంభాలగుడికే రుద్రేశ్వరాలయం అనే మరో పేరు కూడా ఉంది.



**వేయి స్తంభాల గుడి**

**5.6.4 రామప్ప దేవాలయం:** కాకతీయుల కాలం నాటి శిల్పకళకు పరాకాష్ఠ పాలంపేటలోని రామప్ప దేవాలయం. 1213లో గణపతిదేవుని సేనాని రేచర్ల రుద్రుడు దీనిని నిర్మించాడు. ఈదేవాలయంలోని ప్రతి శిల్పం సుందరమనోహర రూపం. ఈ ఆలయనిర్మాణంలో అతితేలికైన ఇటుకలను ఉపయోగించారు. ఇవి నీళ్ళ పై

తేలుతాయని చెబుతారు. పాలంపేట దేవాలయంలో మలచిన మదనికల శిల్పాలు, నాటి శిల్పుల అద్భుత కళాసృష్టికి, సౌందర్యానికి, లాలిత్యానికి చక్కని తార్కాణాలు. రామప్పదేవాలయ కుడ్యాల మీద, స్తంభాల పైన మదనికలు, సాలభంజికలు, యక్షిణులు, రమ్యరమణులు, నాగినుల శిల్పాలను అత్యంత రమణీయంగా చెక్కారు.



**రామప్ప దేవాలయం**

కాకతీయుల ఆలయాల్లో శైవాలయాలే అధికం. ఓరుగల్లులో గణపతిదేవుడు నిర్మించిన సహస్ర లింగదేవాలయం, స్వయం భూదేవాలయాలు చెప్పుకోదగ్గవి. వీటితో పాటుగా ఇక్కడ కాకతమ్మ, వీరభద్రుడు, కాళిదేవతల పేరిట అనేక దేవాలయాలను నిర్మించడం జరిగింది.

కాకతీయ శిల్పులు స్త్రీ దేహాలను పరిమితంగా అలంకరించినందువల్ల, సహజ సౌందర్యానికి భంగం లేకుండా కనిపిస్తాయి. ప్రోలరాజు అనుమకొండలో నిర్మించిన సిద్దేశ్వర, పద్మాక్షి ఆలయాలు, ఓరుగల్లు కోటలోని బ్రహ్మాండమైన తోరణ ద్వారం కాకతీయుల కాలం నాటి ఆంధ్రశిల్పుల ప్రావీణ్యానికి చిహ్నం.

## 5.7 చిత్ర కళ:

కాకతీయుల వర్ణచిత్రాలను పిల్లమర్రిలో చూడవచ్చు. ఈ కాలంలో నవకాశి అనే చిత్రకళ ఉంది. ఈ నవకాశి చిత్రకారులు కాన్వాసుగుడ్డ పై పురాణ, రామాయణం, మహాభారత గాథలను అత్యంత కళాత్మకంగా చిత్రీకరించేవారు.

## 5.8 నాట్యం - సంగీతం:

అలాగే కాకతీయులు నాట్య సంగీతాలను కూడా ఆదరించడం జరిగింది. సాధారణంగా కళావంతులు ఈ విద్యలను అభ్యసించి వివాహాదిశుభకార్యాలలో, దేవాలయ ఉత్సవాలలో తమ కళను ప్రదర్శించుకొనేవారు. నాటి సమాజంలో వీరికి గౌరవస్థానం ఉండేది. నాటి శిల్పాలలో అనేక నాట్య భంగిమలు, వాద్యాలు కూడా కనిపిస్తాయి.

## 5.9 సారాంశము:

కాకతీయులు ప్రజల ఆర్థిక జీవనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకొనడం జరిగింది. ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగించేవారు. కాకతీయ పాలకులు బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్చేందుకు కృషి చేశారు. అనేక చెఱువులను నిర్మించి, వ్యవసాయాభివృద్ధికి పాటుపడ్డారు. భూమి శిస్తు రాజ్యానికి ప్రధాన ఆదాయ మార్గం. స్వదేశీ, విదేశీ వ్యాపారాలు ప్రోత్సహించబడ్డాయి. మోటుపల్లి నాటి ప్రధాన నావికా కేంద్రం కాకతీయుల కాలంలో మతసామరస్యం వెల్లివిరిసింది. పాలకులు జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలను ఆదరించారు. నాడు సమాజంలో వర్ణ వ్యవస్థ అమల్లో ఉంది. వృత్తి ఆధారంగా వర్ణ విభజన జరిగింది. స్త్రీల పరిస్థితి మరింత దిగజారింది. వేశ్యా వృత్తి కొనసాగింది.

కాకతీయ పాలకులు అనేక మంది కవులను, పండితులను ఆదరించి, పోషించారు. సంస్కృత భాష రాజ భాషగా కొనసాగినప్పటికీ తెలుగు భాష ఆదరింపబడింది. తిక్కన సోమయాజి మహాభారతంలోని 15 పర్వాలను తెనిగించాడు. కాకతీయులు వాస్తు శిల్ప కళలను అభివృద్ధిపరచడం జరిగింది. వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం నాటి ప్రసిద్ధ ఆలయాలు. కాకతీయుల కాలంలో నిర్మించబడ్డ కోటలు, తోరణ ద్వారం నాటి నిర్మాణ కౌశల్యానికి నిదర్శనాలు.

## 5.10 మాదిరి ప్రశ్నలు:

1. కాకతీయుల కాలం నాటి ఆర్థిక, సాంఘీక పరిస్థితులేవి?
2. కాకతీయ కాలం నాటి మతపరిస్థితుల పై వ్యాసం వ్రాయండి.
3. సాహిత్యానికి, శిల్ప కళలకు కాకతీయుల సేవలను తెలపండి.

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు:**

1. వేయి స్తంభాల గుడి
2. రామప్ప దేవాలయం
3. రాణి రుద్రమ దేవి

**బహుళైచ్ఛిక ప్రశ్నలు:**

1. కాకతీయుల రాజ భాష .................. ( )

   ఎ) తెలుగు బి) సంస్కృతం సి) తమిళం డి) ప్రాకృతం

2. రుద్రేశ్వరాలయం నిర్మాత ............ ( )

   ఎ) రుద్రమ దేవి బి) రుద్ర దేవుడు సి) గణపతి దేవుడు డి) రెండో ప్రతాపరుద్రుడు

3. రామప్ప దేవాలయాన్ని నిర్మించింది ................ ( )

   ఎ) కాకతి రుద్రుడు బి) రేచర్ల రుద్రుడు సి) గణపతి దేవుడు డి) రుద్రమ దేవి

4. కాకతీయుల రాజధాని ............. ( )

   ఎ) ఓరుగల్లు బి) కంచి సి) మధురై డి) తంజావూరు

5. మోటుపల్లిలో అభయ శాసనాన్ని వేయించింది? ( )

   ఎ) రుద్రమ దేవి బి) కాకతి రుద్ర దేవుడు

   సి) గణపతి దేవుడు డి) రెండో ప్రతాపరుద్రుడు

**జతపరుచుము:**

1. ప్రతాపరుద్రుడు ( ) ఎ) సుమతీ శతకం
2. బద్దెన ( ) బి) దశ కుమార చరిత్ర
3. దండి ( ) సి) నిర్వచనోత్తర రామాయణం
4. తిక్కన ( ) డి) నీతిసారం
5. జాయప ( ) ఇ) నృత్య రత్నాకరం

**మీకిచ్చిన పటంలో క్రింది ప్రదేశాలను గుర్తించండి.**

1. ఓరుగల్లు 2. తంజావూరు 3. కంటి 4. మధురై

## 5.11 ఉపయుక్త గ్రంథాలు:


1. Nilakanta Sastry K.A. - The Cholas.
2. Majundar R.C. (Ed.) - The History and Culture of The Indian People
3. Romila Thapar - History of India
4. Yazdani G. (Ed.) - The Early History of The Deccan



పాఠ్యభాగ రచయిత
డా॥ డి. వెంకటేశ్వర రెడ్డి